బోయి భీమన్న పీఠికలు

భాగం - 2

డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు

బోయి భీమన్న పీఠికలు

భాగం-2

ప్రధాన సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ఉపాధ్యక్షులు

సంపాదకులు

ఆచార్య కె.సంజీవరావు (శిఖామణి)

కన్వీనర్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

Boyi Bhimanna - Peethikalu-2
Padmabhushan Dr. Boyi Bhimanna Sahitya Peetham
Potti Sreeramulu Telugu University
Hyderabad - 500 004

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

ప్రథమ ముద్రణ	:	19 సెప్టెంబర్ 2015 (భీమన్న 105వ జయంతి)
ప్రతులు	:	1000
మూల్యం	:	రూ. 120/-
ISBN NO	:	**81-86073-194-9**

ముఖచిత్ర రచన : ఆర్. మురళి

ప్రతులకు:
రిజిస్ట్రార్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాద్ - 500 004

ముద్రణ:
ప్లానోగ్రాఫర్స్
హైదరాబాద్.
సెల్: 9440663390

నివేదన

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం, బోయి భీమన్న స్వీయ పీఠికల్ని సేకరించి వెలువరిస్తోంది. ప్రాచీనులు తమ కావ్యావతారికల్లో చరిత్ర పున ర్నిర్మాణానికి కావలసినంత సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. ఆధునిక కావ్యావ తారికలకు సంస్కృతం, కన్నడ సాహిత్యం మూలమంటున్నారు.

పీఠికల్లో గ్రంథ నేపథ్యం, గ్రంథ విషయ పరిచయం, వ్యక్తిగత జీవిత విశే షాలు, గ్రంథం చారిత్రక నేపథ్యం పేర్కొంటారు. క్రిష్టఫర్ మార్స్ తాను రాసే పుస్త కాలకు సమూనా పీఠికల్ని రాయడమే గాక ''పీఠిక లేకుండా పుస్తకం రాయడం కంటే, పుస్తకం లేకుండా పీఠిక రాయడమే నయం'' అని చెప్పి పీఠికకున్న ప్రాము ఖ్యాన్ని తెలియజేశారు.

బోయి భీమన్నగారు తమ గ్రంథాలకు చాలా పెద్ద పీఠికల్ని రచించారు. ఇవి కావ్యాల కంటే పెద్దవి. నార్ల వెంకటేశ్వరరావు కూడా **30** పుటల 'జాబాలి' నాటికకు **67** పుటల పీఠిక రాశారు. తద్వారా పాఠకులకు, నాటికా కర్తకు కూడ పెద్ద లాభం చేకూరినట్లు నార్ల చెప్పుకొంటారు. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు హేతువాద ప్రచారం కోసం తమ కావ్యాలను, పీఠికల్ని ఉపయోగించుకొన్నారు. ధర్మవరం రామకృ ష్ణమాచార్యులు, వేదం వేంకటరాయశాస్త్రి, త్రిపురనేని రామస్వామి చౌదరి, నార్ల వెంక టేశ్వరరావు, ముద్దు కృష్ణలు తమ కావ్యాలకు తామే పీఠికలు రాసుకొన్నారు.

సర్వ సాధారణంగా రచయిత కాక ఇతరులచేత పీఠిక రాయిస్తే అందులో ఎక్కువ భాగం పొగడ్తలకే ప్రాధాన్యత ఉంటుంది. కాని రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

గారు ఆరుద్రగారి సమగ్రాంధ్ర సాహిత్యానికి పీఠిక రాస్తూ రచయితతో తానెక్కడ భేదిస్తున్నానో చెప్పుకున్నారు. కొందరికి తమ కావ్యాలకు లేదా పరిశోధనాత్మక గ్రంథాలకు ఇతరులచేత పీఠికలు లేదా అభిప్రాయాలు లేదా ముందుమాట రాయించడం ఇష్టం ఉండదు. బోయి భీమన్నగారు కూడ ఆ కోవలోకే వస్తారు. భీమన్న తమ పీఠికల్లో వెలువరించిన అంశాల్లో విషయ వివేచన, చక్కని శైలి ఉన్నాయి.

బోయి భీమన్న పీఠికలపై విస్తృత అధ్యయనం చేయడానికి అవకాశం ఉంది. అందువల్ల వారి పీఠికల్ని మాత్రం సేకరించి ప్రచురిస్తే పరిశోధకులకు ఉపయోగకరంగా ఉంటుందని బోయి భీమన్న పీఠికల్ని రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాం. మొదటి సంపుటంలో భీమన్న పద్యకావ్యాలు, వచన కవిత్వం, గేయానికి సంబంధించిన పీఠికలు, రెండో సంపుటంలో భీమన్న నాటకాలు, సైద్ధాంతిక గ్రంథాలు, జీవిత చరిత్ర పీఠికలున్నాయి. పాఠకులు మా ప్రయత్నాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను.

9-9-2015 **డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం**

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ఆచార్య కె.సంజీవరావు (శిఖామణి)
కన్వీనర్

పీఠికా పరమేశ్వరుడు బోయి భీమన్న

పీఠికలు తెలుగులో పరిచయం, ముందుమాట, ఉపోద్ఘాతం, అవతారిక, భూమిక, ప్రస్తావన మొదలైన పేర్లతో వ్యవహారంలో ఉన్నాయి. దీనినే ఆంగ్లంలో ఎక్సోర్డియం, ఇంట్రడక్షన్, ప్రిఫేస్, ప్రిల్యూడ్, ప్రియాంబుల్, ప్రాలోగ్ అంటారు. పీఠికలు సాహిత్యంలో నూతనాంశాల్ని ప్రతిపాదిస్తూ, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక దృక్పథాల్ని వెలువరిస్తూ ఉంటాయి. వీటిలో రచయిత తన స్వవిషయాల్ని పొందుపరుస్తూ, రచనపట్ల తనకుగల అభిప్రాయాల్ని, రచనోద్దేన్ని, రచనా ధోరణిని, తన సిద్ధాంతాల్ని, విశ్వాసాలను తెలుపుతూ ఉంటాడు. పీఠికల్ని రచయిత తమ గ్రంథాలకు రాసుకోవడం, ఇతరులచేత రాయించడం, ప్రచురణ కర్తలు రాయడం, సంపాదకులు లేదా పరిష్కర్త రాయడం కన్పిస్తుంది.

పీఠికలకు నిడివి ఇదమిత్థంగా ఉండాలని లేదు. తెలుగులో వెలువడిన పీఠికల్లో పండితారాధ్య చరిత్రకు చిలుకూరు నారాయణరావు గారు రాసిన **348** పుటల విపులమైన పీఠికే చాల పెద్దదిగా చెప్పుకోవచ్చు. ప్రాచీన కావ్యాలలో అవతారికలు ఉండేవి. ఇవే పీఠికలుగా పరిణామం చెందాయని చెప్పవచ్చు. అవతారికలు స్వయంగా కవులే రాసుకోవడం కన్పిస్తుంది. ఈ అవతారికలో కవులు తమ స్వవిషయాల్నే గాక కృతిభర్త విషయాల్ని, తమకు పూర్వం, తమ సమకాలికుల్ని గూర్చిన అంశాల్ని, కావ్యరచనా ప్రణాళికను, రచనా పద్ధతిని గూర్చిన అనేక అంశాల్ని పొందుపరచడం జరిగింది.

తమ కావ్యాలకు స్వీయ పీఠికలు రాసుకొన్న వారిలో గుర్రం జాషువా, బోయి భీమన్న, వింజమూరి వేంకటలక్ష్మి నరసింహారావు, నీలా జంగయ్య, కరుణశ్రీ, త్రిపుర నేని రామస్వామి చౌదరి, నార్ల వెంకటేశ్వరరావు, గుంటూరు శేషేంద్రశర్మ లాంటి వారు పేర్కొనదగిన వారు.

బోయి భీమన్న తమ పీఠికలకు రకరకాల పేర్లు పెట్టారు. తమ కావ్య పీఠికల శీర్షికలు చాలా వైవిధ్యభరితంగా ఉన్నాయి. వసద్వారం (అశోకవనిలో రాముడు), ఉన్మీలన (భీమన్నరాభీలు), దండోరా (గుడిసెలు కాలిపోతున్నాయ్), దర్పణం (బమ్మ), పరిష్కారం (జన్మాంతరవైరం), వసంత వేదిక (భీమన్న ఉగాదులు), ఉషస్సు (అంబేడ్కర్ సుప్రభాతం), స్పందన (పాటలతోట), దళితజన శ్రుతి (పాటలలో అంబేడ్కరు), విరుగుడు (డ్రగ్ ఎడిక్టులు), పండోరా (నా ఊహలలో వాల్మీకి), మధుకోశం (పంచమస్వరం), పాంచజన్యం (భీమన్న శంఖారావం), బాణాకర్ర (పాలేరు), సర్వోదయ సోషలిజం (కూలిరాజు), ఈ నాటకం బయోడేటా (రాగవాసిష్ఠం), రాగవీచిక (రాగవైశాఖి), క్రొత్తప్రయోగం (రాజకీయవీరుడు డాక్టరు ఖాను), ఆముఖం (శివాలకులు), ప్రగతి పథం (ప్రగతి), భావప్రవంతి (అంబేడ్కరిజం), ఉపనయనం (మోక్షం నా జన్మహక్కు), ముఖచిత్రం (ఇదిగో ఇదీ భగవద్గీత), ఆదిమూలం (జనమనీషులు), స్మృతి (నాకు తెలిసిన జాషువా), ధర్మపీఠం (ధర్మవ్యాధుడు), జ్ఞానం నుంచి జన్మకు (వేదవ్యాసుడు), నాటకం గురించి (బాలయోగి). ఇవిగాక ప్రవేశిక, ఒకమాట, లఘుపీఠిక, ముందుమాట వంటివి కూడ ఉన్నాయి.

తెలుగులో ఇంతటి వైవిధ్యభరింతంగా పీఠికలు రాసిన వారు భీమన్నగారేనని చెప్పవచ్చు. భీమన్న తమ కావ్యాలకు తామే సుదీర్ఘ పీఠికలు రాసుకొన్న అరుదైన కవివరేణ్యులు. తమ కావ్యాలకు ఇతరులచేత కూడ పీఠికలు రాయించుకొన్న అరుదైన సంఘటనలు కూడ ఉన్నాయి. దీనిని గూర్చి భీమన్నగారే ఇలా అంటారు. ''నా గ్రంథాలకు పీఠికలు నేనే వ్రాసుకోవడం నాకు అలవాటు. దీపసభకు నిడదవోలు, కావ్యకుసుమాలకు కప్పగంతుల వారు, కురుగంటివారు పూర్వం పీఠికలు వ్రాసి ఉన్నారు. వారు

నా కత్యంత పూజ్యపాదులు''. వీరుగాక తిరుమల రామచంద్ర, దేవులపల్లి రామాను జాచార్యులు కూడ భీమన్న కావ్యాలకు పీఠికలు రాశారు.

భీమన్నగార్లు తమ పీఠికల్ని గూర్చి ''ఇప్పుడు నేనే పీఠికలు వ్రాసుకొంటూ ఉండ డంవల్ల ఆ పీఠికలలో నా లక్ష్యాలను, సిద్ధాంతాలను, భావాలను వ్యక్తంచేయగలుగుతు న్నాననే తప్ప నా గురించి ఇతరుల అభిప్రాయాలేమిటో ఇవ్వలేకపోతున్నాను' అన్నారు. అది అక్షరసత్యం. ఇతరులు తమ కావ్యాన్ని బేరీజు వేయడానికి తానే తన కావ్యాలకు వ్యాఖ్యానం, లేదా వివరణ ఇవ్వడం కొంత మేలు, కొంత కీడు జరగడానికి అవకాశం ఉంటుంది. అదీగాక భీమన్నగారి పీఠికల్లో ద్వైదీభావాలు ప్రస్ఫుటంగా కన్పిస్తుంటాయి. ఒక పీఠికలో ఏ విషయాన్ని ఖండిస్తారో, మరో పీఠికలో దాన్ని సమర్థిస్తుంటారు. తమ పీఠికల్ని గూర్చి తామే ఇలా విడమరిచి చెప్పుకొన్నారు – ''ఈ పీఠిక ఒక అరణ్యంలా వున్నట్టుంది కదూ? భావం ఎలావస్తే అలా అక్షరగతం చేశాను. ఇది ఒకరకమైన చింతనా ప్రవంతి. దీన్ని ఒక క్రమంలో ఎడిట్ చెయ్యాలంటే వ్యాసుడంతటి వాడు కావలసిందే'' అని మరోచోట అన్నారు.

కవితా గ్రంథానికి రాజకీయ పీఠిక వ్రాశాను. గ్రంథంలోని వివిధ రచనలలో నేను వెలిబుచ్చిన భావాలకు ఇది కొంత వివరణ'' అంటారు (గుడిసెలు కాలిపోతున్నాయ్).

భీమన్న తమ కావ్యపీఠికలకు పేర్లు పెట్టడంలోని ఆంతర్యాన్ని కూడ వివరించారు. నా ఊహలలో వాల్మీకి కావ్యానికి 'పండోరా' అన్న పీఠిక రాశారు. దీన్ని వివరిస్తూ ''గుడి సెలు కాలిపోతున్నై'' కావ్య సంపుటికి నేను వ్రాసుకొన్న పీఠిక పేరు 'దండోరా'. ఆ తర్వాత ఏ కావ్య పీఠికకైనా 'పండోరా' అనే పేరు పెడదామని అనుకొంటూ వచ్చాను. దండోరాకు సమఉజ్జీ పండోరా!

'దండోరా' అంటే ప్రకటన చెయ్యడం. 'పండోరా' అంటే ఒక మిగిలిన ఆశ.

ఏదో ఒక విషయాన్ని ప్రజలకు తెలియచెప్పేది మాత్రమే కాక, సవాలు చేసేది, కయ్యానికి కాలుదువ్వేది కూడ కావచ్చు దండోరా.

కష్టాలు, నష్టాలు అన్నీ తొలగిపోయిన మీద, ఎప్పటికైనా సుఖ సంతోషాలు దొర క్కపోతాయా అనే ఆశ 'పండోరా' అంటారు.

'గుడిసెలు కాలిపోతున్నాయ్' కావ్యపీఠికలో భీమన్నగారు పంచముల తరత రాల వారసత్వం ఎలా దోపిడీకి గురి అయ్యిందో తెలియజెపుతూ, దళితుల్ని మేల్కలు పుతూ, సవాలు విసురుతూ దండోరా వేయడం కన్పిస్తుంది.

అదే విధంగా 'నా ఊహలలో వాల్మీకి'కి బాధా సర్పదష్టుల కష్టాలు కలకాలం ఉండవని వారికెప్పటికైనా మంచిరోజులు వస్తాయన్న ఆశతో 'పండోరా' అంటూ పీఠిక రాశారు..

పాలేరు నాటకం పీఠికకు 'బాణాకర్ర' అని పేరు పెట్టారు. భీమన్నగారు దీన్ని గూర్చి చెబుతూ ''భారతీయ గ్రామాలలో రైతులకు, కూలీలకు కూడ ఆయుధాలు చేతి కర్రలే. నిలువెత్తు పొడవున ఉండే వెదురు కర్రలవి. వాటినే బాణాకర్ర లంటారు. ఈ పీఠికకు బాణాకర్ర అని పేరు పెడుతున్నాను. ఎందుకంటే గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా పాలేళ్ళకు ఆత్మ రక్షణ సాధనం అదే కనుక.''

భీమన్నగారు తమ కావ్యాల్లో ఏ విషయాన్ని ప్రతిపాదించాలని అనుకొంటూ ఉన్నారో వాటి నిరూపణ కోసం చక్కని పరిశోధనాత్మక విషయాల్ని ఉపపత్తులతో రూఢి పరచడం కనిపిస్తుంది. పంచములు ఆర్యులే అని నిరూపించడానికి వేదాలు, నిరుద్ధ భారతం, హరిశ్చంద్రోపాఖ్యానం, అమరకోశం, మనుస్మృతి, భగవద్గీత, విజ్ఞాన సర్వ స్వాలు, ఉపనిషత్తులు మొదలైన ఆకరాల్నే గాక, కాళిదాసు, శంకరాచార్యులు, వేమన, బి.హెచ్.సత్యనారాయణ లాంటి మహామహుల అభిప్రాయాల్ని తెలియజేశారు. ఇంతటి పరిశోధనాత్మక పీఠికలు తెలుగులో రాసినవారిని వేళ్లపై లెక్కపెట్టవచ్చు.

భీమన్నగారు తమ కావ్యాల్లో, పీఠికల్లో రసాద్వైతం, శివసోషలిజం లాంటి సైద్ధాంతి కాంశాల్ని పొందుపరిచి వాటికి వివరణ కూడ ఇచ్చారు.

''నాకు ప్రకృతి ప్రియురాలయింది. ఈ ప్రియురాలి ద్వారా నేను రసానుభూతిని పొంది, తదానంద పారవశ్యంలో మూలబ్రహ్మనే అవుతున్నాను కనుక, ఈ మార్గం నాకు రసాద్వైతమయింది... ఒక స్త్రీని పురుషుడో, పురుషుణ్ణి స్త్రీయో అకారణంగా, అవ్యాజంగా, ఎందుకో తెలియకుండా, ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా గాఢంగా ప్రేమించి ఆత్మార్పణ చేసుకొంటే చాలు. అదే రసాద్వైతం'' - రాభీలు.''

''శివుడంటే నా కిష్టం. అతణ్ణి నేను గుర్తించేది దేవుడుగా కాదు. ఆదర్శపురుషుడుగా . పరస్పర వైరుధ్యాల సమన్వయ మూర్తిగా. సనాతనుడైన సోషలిస్టుగా'' అంటూ ప్రాచీన సామాజిక వ్యవస్థలు అవలంబించిన జీవిత విధానాల్ని శివసోషలిజం అన్నాడు.

సర్వసాధారణంగా ఉత్తమ కవి విమర్శచేయకపోవచ్చు. విమర్శకులు కవితా వ్యవసాయంలో అడుగిడగక పోవచ్చు. పద్య కవి చక్కని వచన రచన చేయక పోవచ్చు. కాని భీమన్నగారు పద్యాన్ని ఎంత చక్కగా హాయలలికించగలరో, వచన రచనను అలతి అలతి పదాలతో, చిన్న చిన్న వాక్యాలతో అంత చక్కగా నడిపించగలరు.

భీమన్నగారు రాసుకొన్న కొన్ని అంశాలపై అందరూ ఏకీభవించరని, కొన్ని అంశాలు వాస్తవ విరుద్ధాలని కూడ భీమన్నగారే పరోక్షంగా చెప్పుకోవడం కన్పిస్తుంది. త్రిపదల్ని మొదట తానే సృష్టించినట్లు చెప్పుకొన్నారు. 'ఈ త్రిపదలలోని కొన్ని భావాలతో కొందరు ఏకీభవించరని నాకు తెలుసు' అని కూడ అంటారు.

భీమన్నగారి కావ్యాలలో వైరుధ్యాంశాలు ఉన్నా హారంలోని దారంలా ఒక జిజ్ఞాసను, జ్ఞానపిపాసను, విశ్వజనైక దృష్టిని, తరతరాలుగా దళితులపై జరిగిన దురన్యాయానికి దురపిల్లుతూ, వారిని మేల్కలపడానికి, ప్రజ్వలింపజెయ్యడానికి తన కావ్యాల్ని ఉపయోగించుకొన్నట్లు తెలుస్తుంది. తన కావ్యాల్ని ఏ దృక్పథంతో చదవాలో కూడ భీమన్నగారు తమ పీఠికల్లో చెప్పుకొన్నారు. జన్మాంతర వైరం పీఠికలో ''నీకు కర్మసిద్ధాంతం మీద నమ్మకం వున్నదా? దీన్ని సాక్షాత్తు యజ్ఞకాలంలోని వేదంలా స్వీకరించు. నీవు కర్మ సిద్ధాంతాన్ని నమ్మని ఆధునిక విజ్ఞానివా? దీన్ని సెటైరుగా, హేళన రచనగా స్వీక

రించు. నీవు సహృదయుడవైన ఆనందార్ధివైన మానవుడవా? దీన్ని కాంతా సమ్మిత మైన సరస కావ్యంగా ప్రక్కనుంచుకో'' అని నన్నయ పద్యాన్ని గుర్తుకు తెస్తారు. తాను ఒక్కో దృక్పథానికి ఒక్కో రూపంలో కనిపిస్తానని చెబుతూ ''ప్రకృతి లాంటి నా అనేక త్వంలో పరమచైతన్యం లాంటి ఏకత్వాన్ని సహృదయులు గుర్తించగలరు'' అంటారు.

బోయి భీమన్నగారు కావ్యాలలో కొన్నింటికి పీఠిక రాసి, అందులోనే అంకిత చరిత్ర రాసుకోవడం, అంకితమిస్తున్న వ్యక్తి జీవిత విశేషాల్ని కొన్నింటిని పేర్కొనడంవల్ల ఆయా వ్యక్తుల్ని గూర్చి పరిశోధించాలన్న పరిశోధకులకు, లేదా జిజ్ఞాసువులకు భీమన్న అందించే సమాచారం విలువైనదిగా ఉంటుంది. అందుకే పీఠికలతో పాటు అంకిత చరిత్రను కూడ ఈ గ్రంథంలో పొందుపరచడం జరిగింది.

'గుడిసెలు కాలిపోతున్నాయ్' కావ్యాన్ని గుడిసెల వెంకటస్వామి గారికి అంకితమిచ్చారు. వెంకటస్వామిగారు పుట్టినప్పటి నుంచి ఇంతింతై వటుడింతయై చందాన వారి అభివృద్ధిని గూర్చి ఎక్కువగా రాశారు. దీనివల్ల వెంకటస్వామి గారిని గూర్చి అనేకాంశాలు మనకు తెలుస్తాయి. అలాగే బాలయోగీయం కావ్యాన్ని టి.వి.నారాయణగారికి అంకితమిచ్చారు. వీరిని గూర్చి అనేకాభిప్రాయాలు ఇందులో ఉన్నాయి.

ఈ పీఠికల్లో భీమన్నగారు కృతజ్ఞతల్ని కూడ చేర్చారు. వాటిలో అనవసరమైన వాటిని కొన్నింటిని తొలగించవలసి వచ్చింది. అయితే అక్కడక్కడ కావ్యం వెలువడడానికి ఆ వ్యక్తులు కారకులైనపుడు, దానికి సంబంధించిన నూతనాంశాల్ని తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి వాటికి సంబంధించిన కృతజ్ఞతల్ని యధాతథంగా ఉంచడమయింది.

ఉదాహరణకు భీమన్న కావ్యాలకు మొదట అంకిత పద్యాలు, లేదా చరిత్ర రాసి, తర్వాత పీఠిక రాయడం, కావ్యానికి పీఠిక రాసి తర్వాత కావ్యం రాయడం, ముందు కావ్యం రాసి తర్వాత పీఠిక రాయడం కూడ కనిపిస్తుంది. జన్మాంతరవైరం కావ్యంలో ఇంతవరకు మీరు జన్మాంతర వైరం కావ్యం చదివారు అని చెప్పి తర్వాత ఆ కావ్యానికి సుదీర్ఘమైన పీఠిక రాశారు.

బోయి భీమన్నగారు తమ పీఠికల్లో స్పృశించని అంశం లేదు. పద్యకళ, వచనం, వచన కవిత్వం, గేయం మొదలైన ప్రక్రియలపై తన అభిప్రాయాల్ని చాల నిర్మొహమాటంగా చెబుతారు. భారతజాతి కుల వ్యవస్థ కారణంగా బలహీన పడిందని, పంచములు సవర్ణకులాలతో సమానస్థాయికి చేరడానికి కావలసిన చికిత్స జరగాలని ఆకాంక్షిస్తూ కష్ట , నష్టాలు అన్నీ తొలగి సమాజం సుఖసంతోషాలతో విరాజిల్లాలన్న సంకల్పంతో భీమన్నగారు 'పండోరా' వేశారు తన కావ్యాల్లో, కావ్య పీఠికల్లో.

బోయి భీమన్నగారి పీఠికల్ని సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతీ భీమన్నగారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మా మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్ అందించారు. ఇవిగాక బోయి భీమన్నగారి పుత్రులు డా॥ బోయి నాగవర్మగారు కొన్ని గ్రంథాల్ని అందించారు. ఈ పీఠికలు ఇంత సమగ్రంగా, ఇంత త్వరలో రావడానికి సహకరించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారు ఈ గ్రంథాలను డి.టి.పి. చేయించి ముద్రణకు అనువుగా ప్రెస్ కాపీ సిద్ధంచేయించారు. వీరికి కృతజ్ఞతలు. ప్రూఫులు దిద్ది సహకరించిన డా॥ మాదిరాజు కనకదుర్గ గారికి, శ్రీమతి కంచర్ల మాధవిగారికి, అందంగా ముద్రించిన ప్లానోగ్రాఫర్స్ ప్రింటర్స్ వారికి ఇంకెందరో....

అందరికీ కృతజ్ఞతలు.

10 సెప్టెంబర్, 2015
హైదరాబాద్

కె.సంజీవరావు
సంపాదకులు

విషయ సూచిక

1.	పాలేరు	1
2.	కూలిరాజు	25
3.	పడిపోతున్న అడ్డుగోడలు	33
4.	మానవుని మరొక మజిలీ	37
5.	పైరు పాట	39
6.	రాగవాసిష్ఠం	45
7.	చిత్రకళా ప్రదర్శన	76
8.	బాలయోగి	79
9.	ఆదికవి వాల్మీకి	85
10.	ప్రగతి	94
11.	ధర్మ వ్యాధుడు	115
12.	వేదవ్యాసుడు	141
13.	రాగవైశాఖి	177
14.	ధర్మంకోసం పోరాటం	187
15.	రాజకీయ వీరుడు డాక్టరు ఖాను	198
16.	అంబేడ్కరిజం	202
17.	భగవద్గీత	223
18.	అంబేడ్కర మతం	260
19.	ఎన్ని దీపాలు!!	266
20.	పురాణాలలో హరి గిరి జన మనీషులు	272
21.	నాకు తెలిసిన జాషువా	279
22.	Paramaatama	290
23.	The Seventh Season	298
24.	God The Drug	305

పాలేరు

బాణాకర్ర

ప్రపంచ శాంతికి మార్గం – ఒక
పౌరుష జీవితమే నోయ్!
కర్ర చేతిలో లేకుంటే
గొర్రె కూడ కరిచే నోయ్! (రాఖీలు)

భారతీయ గ్రామాలలో రైతులకు, కూలీలకు కూడ ఆయుధాలు చేతి కర్రలే. నిలువెత్తు పొడవున వుండే వెదురు కర్రలవి. వాటినే బాణాకర్రలంటారు.

ఈ పీఠికకు బాణాకర్ర అని పేరు పెడుతున్నాను. ఎందుకంటె గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా పాలేళ్ళకు ఆత్మరక్షణ సాధనం అదే కనుక.

పాలేరు నాటకం నేను వ్రాసి ఏభైయేళ్లకు పైనే అయింది. స్వర్ణోత్సవం జరుపు కోవలసింది! ''పాలేరు'' కనుక, అంతటి అదృష్టం పట్టలేదు. పాలేళ్ల వర్గం ఇంకా అంత సంస్కార సంపన్నం కాలేదు.

ఈ నాటకం వ్రాత ప్రతిగా వున్నప్పుడే అనేక చోట్ల ప్రదర్శించబడింది. ప్రతి ప్రదర్శనకూ ఒక్కొక్క చరిత్ర వుంది. సామాజిక, విద్యా రంగాలలో, వ్యవసాయ కూలీ వర్గాలలో ఈ నాటకం సాధించిన మార్పు ఒక మహత్తర విప్లవ చరిత్రే! ఇందుకు సంబంధించిన కొన్ని ముఖ్య వివరాలు ''పాలేరు నుంచి పద్మశ్రీ వరకు'' అనే గ్రంథంలో చూడవచ్చు.

దీని ప్రథమ ముద్రణ బెజవాడలోని బొందలపాటి శకుంతలాదేవి, శివరామ కృష్ణగార్ల దేశి కవితా మండలి నుంచి వెలువడింది. వారిది సొంత ప్రెస్సు. అక్కడి నుంచే అది ఎన్నో పునర్ముద్రణలు పొందింది. ఎన్నో వేల ప్రతులు అమ్ముడు పోయాయి.

పుస్తక వ్యాపారంలో తాము ఎంతో నష్టపోయామనీ, పాలేరు నాటకమే చాల వరకు తమను నిలబెట్టిందనీ శివరామకృష్ణగారు తరచు చెపుతూ వుండే వారు. ఈ

నాటకం ఒక క్లాసిక్‌గా నిలిచిపోయిందని ఆయన అన్నప్పుడల్లా నేను ఆనందంతో పొంగిపోయేవాణ్ని!

నా రచన ఒకటి, ముఖ్యంగా పాలేరు వంటిది, ముద్రించబడి ప్రజల చేతుల్లోకి పోవడమే ఒక గొప్ప అదృష్టం. డబ్బు దేముందిలే అనుకొనేవాణ్ని నేను. నేను బెజవాడ వెళ్ళినప్పుడల్లా కూర్మయ్యగారింట్లో కాకపోతే, బొందలపాటి వారింట్లో దిగేవాణ్ని. ఆయన మంచి భోజనం పెట్టి, రైలెక్కించి పంపిస్తుండే వాడు. అంతకంటె నాకింకేం కావాలి? ఆ రోజులు కూడ అలాంటివి! నేనొక అరటాకును. మరో దిక్కులేదు.

వ్యాపార దృష్ట్యా పాలేరు నాటకం ఒక కామధేనువు లాంటిదనీ, అప్పటికే లక్ష కాపీలకు పైగా అమ్ముడుపోయాయనీ పుస్తకాల దుకాణాలలో పుట్టిన పుకార్లను కొందరు పబ్లిషర్లు నా వరకు తేవడం, పాలేరును తమ కివ్వవలసిందిగా వారు నన్ను కోరడం జరుగుతూ వచ్చింది. నా ''రాగోదయం'', ''మధుబాల'' కావ్యాల ముద్రణ వ్యవహారంలో మాకు భిన్నాభిప్రాయాలు కలిగివున్న సమయంలో, ఒక దుర్ముహూర్తంలో దేశి కవితా మండలి నుంచి పాలేరు బైటపడడమూ జరిగింది.

దుర్ముహూర్తం అని ఎందుకంటున్నా నంటే – దేశి కవితా మండలితో ఒక పాతికేళ్ళ పాటు కొనసాగిన స్నేహానుబంధం తెగిపోయిన క్షణం అది. అంతే కాదు. అంతకుముందు పాలేరు పుస్తకాలు షాపుల్లో కనిపించేవి. ఆ తర్వాత – ఈ పాతికేళ్లుగా నేను మళ్లీ పాలేరు పుస్తకం చూడలేదంటే అతిశయోక్తి కాదు.

రాశి, వాసి

ఈ మధ్య భాషా నిలయంలో జరిగిన ఒక యువకవుల కావ్యావిష్కరణ సభకు వెళ్లి ఆడియన్సులో కూర్చున్నాను. ఆ యువకవులు రామానుజాచార్యులు, సుందర దేశికులు నాకు మిత్రులు.

కవులు యువకులైనా, వేదిక మీది వారంతా పెద్దలే. అందులో నాకు బాగా తెలిసిన సభాధ్యక్షులు నండూరి రామకృష్ణమాచార్యులుగారు, వక్తలు ఇరివెంటి

కృష్ణమూర్తిగారు, కులశేఖరరావుగారు, సుధామ గారు – అందరూ లబ్ధ ప్రతిష్ఠులే. ఉన్నత విద్యా సంపన్నులే.

అయితే, సభ పలచగా వుంది. ఆడియన్సు ఎక్కువ మంది లేరు!

సభాధ్యక్షులు ఈ లోపాన్ని నిరుత్సాహక పదజాలంతో ఎత్తి చూపి, ''అయినా, ఈ కాలంలో సాహిత్య సభలకు ఎక్కువ మంది రావడం లేదు. ఈ మధ్య జరిగిన అనేక సభల కంటె ఈ సభ చాల మెరుగు. రాశి కంటె వాసి మేలనే సత్యాన్ని మనం గుర్తిస్తే, సభలో ఎక్కువ మంది లేరనే విచారం మనకుండదు'' అన్నారు.

ఆయన ఒక కథ చెప్పారు:

''ధర్మరాజు రాజసూయం చేసిన సందర్భంలో అన్న సంతర్పణ చేశాడు. ఎంత మంది భోజనం చేశారో లెక్క తెలుసుకోవాలనుకొన్నాడు. అందుకు నారద మహర్షిని ఉపాయం అడిగాడు. నారదుడు ఒక గంటను ధర్మరాజు కిచ్చి, లక్ష మంది భోజనం చేసిన తర్వాత ఒకసారి చొప్పున ఆ గంట మోగుతుందనీ, అది ఎన్నిసార్లు మోగితే అన్ని లక్షల మంది భోజనాలు చేసినట్టు లెక్కగట్టుకోమనీ అన్నాడు.

భోజనాలు ప్రారంభమయ్యాయి. గంట క్రమంగా మోగుతూ వుంది. ఒక దశలో అది అదే పనిగా విడవకుండా మోగసాగింది. ధర్మరాజు కంగారు పడ్డాడు. గంట పాడయిందను కొన్నాడు.

గంట మంచిగానే వున్నదనీ, ఎన్నో లక్షల మందితో సమానుడైన ఎవరో మహానుభావుడు పంక్తిలో కూర్చున్నాడనీ, ఆయన భోజనం ముగించి లేచేవరకు గంట అలా మోగుతూనే వుంటుందనీ నారదుడు వివరించాడు. ఆ మహానుభావుడెవరో తెలిసింది. ఆయన వ్యాసుడు!

అలాంటి వ్యాసుడంతటి బోయి భీమన్నగారు ఆడియన్సులో వుండగా, రాశిని గురించిన బెంగ దేనికి? అన్నారాయన!

అంతవరకు ఆసక్తితో వింటున్న కథ నా మీదికి మళ్ళడంతో, ఆనందాశ్చర్య సంభ్రమాలు ముప్పిరిగొనగా, నండూరి వారి ఔదార్య ప్రతిభాప్రాభవాలకు చేతులు మోడ్చాను నేను. తక్కిన సదస్యులు ఎలా ఫీలయ్యారో మరి!

పాలేరు నాటకం వ్రాసిన తర్వాత, ఈ యాభై యేళ్ళలోను ఒక్కసారి కూడ ముద్రిత ప్రతి తెరిచి చూడని నేను, ఇప్పుడు దానిని చేతిలోకి తీసుకొన్నానంటే – అందుకు కారణం ఆ సభలో సాగిన ప్రసంగాలే. అందుకే ఆ సభను గూర్చిన ఈ ప్రస్తావన.

ఆ ప్రసంగాలలో మొత్తం మీద వక్తలు వెల్లడించిన అభిప్రాయం తెలుగు సాహిత్యంలో రాశి తప్ప వాసిలేదన్నది. అనుకరణ తప్ప మౌలికత లేదన్నది.

తెలుగు సాహిత్యంలో మౌలికత లేదా?

నిజంగానే లేదేమో! వుంటే, ఏదీ? ఎక్కడా కనిపించదేం? ఎక్కడ దాక్కుంది?

నన్నయగారి ఐతిహాసిక యుగం నుంచి పెద్దనగారి ప్రబంధయుగం వరకు అన్నీ తత్సమాలు. కృష్ణశాస్త్రిగారి భావకవితాయుగం నుంచి శ్రీశ్రీ గారి అభ్యుదయ కవితాయుగం వరకు ఆంగ్ల తద్భవాలు, అన్యదేశ్యాలు. మరి మనదని మురిసిపోగల మౌలిక సాహిత్యం ఏదీ? ఎక్కడుంది?

''కన్యాశుల్కం'' లేదా అంటే, అది ఒక కులానికీ, ఒక మాండలికానికీ పరిమితమైన స్థానికం. సాహిత్యానికి ప్రధాన గుణమైన సర్వ జనీనత కన్యాశుల్కంలో లేదు, మరి?

బ్రహ్మంగారు, వేమన, కవిరాజు, జాషువా వంటి పేర్లు సాహితీరంగ రింగు మాస్టర్లకు పనికిరావు. ఆ పేర్ల వాళ్లు పంక్తి బాహ్యులైన శూద్రులూ, వర్ణ బాహ్యులైన హరిజనులూను! మరి? చెప్పండి!

ఎంకి పాటలున్నై. అవును. అయితే, అవి నాయుడు బావతో ముడిపడి వున్నై! నాయుడు పంక్తి బాహ్యుడు కదా?

(1) కందం వ్రాసినవాడే కవి (2) తినుచున్న అన్నమే తినుచుంటి మిన్నాళ్ళు (3) వయస్సు మళ్ళిన సోమరులారా చావండి (4) తాజమహలును కట్టించిన షాజహాను కంటె, ఆయనకు తన భార్యపట్ల గల ప్రేమానురాగాల కంటె, ప్లాను చేసిన ఇంజనీరు కంటె, కట్టిన మేస్త్రీ కంటె రాళ్ళు మోసిన కూలీలే గొప్పవాళ్ళు!

ఇటువంటి పాక్షిక, ప్రగతి నిరోధక, మత్తు మందు మాత్రలను ప్రజలకు తినిపించడం వల్లనే మౌలిక సాహిత్యం ముందుకు రాలేకపోతున్నదన్న వాస్తవాన్ని ఎవరైనా గుర్తించారా?

కూలీలు గొప్పవాళ్ళే. వాళ్ళ శ్రమ శక్తి విలువ లేనిదే. అయితే కూలీలు శాశ్వతంగా కూలీలుగానే వుండిపోవాలనే దురుద్దేశం భూఖామందుల హృదయాలలో వున్నట్టే అభ్యుదయ కవుల రచనలలోనూ వుంది. పరిశీలించండి!

ఏ పనీ చెయ్యని నిరర్థకుడి పేదరికంపట్ల సానుభూతి దేనికి? కష్టపడి సంపాదించుకొన్న వాడి కలిమిపట్ల ద్వేషం దేనికి?

కోటీశ్వరుడైనా వ్యాపారం దెబ్బతింటే పేదవాడైపోతాడు. పేదవాడైనా ఏదో ఒక నిధి దొరికితే కోటీశ్వరుడైపోతాడు. కవిత్వానికి మానవుడే కవితా వస్తువు కావాలి. అతడి కలిమిలేములు కాదు.

కుల, రాజకీయ, వ్యాపార వైఖరిని వదులుకొని, విశ్వజనీన దృష్టితో పరిశీలిస్తే, తెలుగులో అపూర్వ ప్రతిభా ప్రాభవాలు గల మౌలిక రచనలెన్నో కనిపించక మానవు. అయితే, అలాంటి నిరామయ నిష్పాక్షిక దృష్టిగల పండితులేరి? స్వపర విభేద విష దృక్కులు తప్ప, విద్యా వినయ సంపన్ను లెక్కడ? వుంటే, బైటికి రండి! ప్రపంచ సాహిత్యంలోని ఉత్తమ రచనలను మించే ఉత్తమోత్తమ రచనలెన్నో తెలుగులో కనిపిస్తై!

కలత చెందిన మనస్సుతో ఆ సభ నుంచి ఇంటికి వచ్చాను. నా ఒక్కొక్క రచనను తెరచి చదువుకోసాగాను!

పునరుద్ధరణ

మా ఇంట్లో ఒకేఒక పాలేరు పుస్తకం వుంది. అది 1970లోని ముద్రణకు చెందినట్టిది. కాగితం న్యూస్ ప్రింటు కాబోలు, ముట్టుకుంటే విరిగి ముక్కలైపోతున్నది!

''నిన్ను నేను ఆప్యాయంగా చేతిలోకి తీసుకొని ఏభై యేళ్ళయిందా తల్లీ!'' నిజంగా కళ్ళు చెమ్మగిల్లాయి. దాన్ని తెరిచి చూచినప్పుడు ఏడుపే వచ్చింది.

ఇన్ని తప్పులతో నా పుస్తకాలు వేస్తున్నారు పబ్లిషర్లు? తెలుగు ప్రెస్సుల్లో తెలుగు తెలిసిన ప్రూఫురీడర్లు వుండరా?

వెంటనే కలం తీసుకొని, ఆ రాత్రంతా కూర్చుని పరిష్కరించాను:

నా గ్రంథాలన్నీ నా చేతి మీదుగా, నేను ప్రూఫులు దిద్దుకొని, ప్రకటించు కొంటున్నట్టివి. ఒక్క పాలేరుకే అట్టి ప్రత్యేకత లభించలేదు. ఆది నుంచీ ఇది పరాశితంగానే వుంటూ వచ్చింది. ఎప్పటికప్పుడు కొత్త కావ్యాలను ప్రకటించుకోవడంతోనే సతమతమయ్యే నేను, పాతదైపోయిన పాలేరు పైకి దృష్టి మరల్చలేకపోయాను.

నాది సాహిత్య సృష్టి. వ్యాపారం కాదు. నా గ్రంథాలు మార్కెట్లో దొరకవు. నా దగ్గర దొరుకుతాయి ఉచితంగా. ఎంతో కష్టపడి ఒకసారి ముద్రించి, వాటిని ఉచితంగా పంచిపెట్టేస్తే, పునర్ముద్రణకు పైస లెలావస్తై? వాటిని ఉచితంగా పుచ్చుకొన్నవాళ్లైనా, ధనవంతులై వుండి కూడ, సహాయం చెయ్యరు!

ఇక్కడొక విశేషం చెప్పాలి–

పాలేరు నాటకం పుస్తకాలు మార్కెట్లో ధారాళంగా దొరుకుతున్నంత కాలం, వాటి ఉత్పత్తి గురించి ఎవరూ పట్టించుకోలేదు. అది సహజమే. అదీగాక, ఈ నాటకాన్ని ప్రదర్శించిన వాళ్లంతా పల్లెల వాళ్లు, పేటలవాళ్లు, వ్యవసాయ కార్మికులు, వెనకబడిన వర్గాలు. పట్టించుకొని మాత్రం వాళ్ళు చెయ్యగలిగిందేముంది? నేను ఆశించింది వాళ్ళలో మార్పు. అది వచ్చింది, ఇంకా వస్తున్నది. నాకు కావలసిందంతవరకే.

అయితే, ఇటీవల ఈ పుస్తకాలు మార్కెట్లో దొరకడం లేదు. ఎవరినడగాలి? ఎవరికి వ్రాయాలి? నా అడ్రసు లోక ప్రసిద్ధం కనుక, నన్నడగడం సాగించారందరూ.

ఇక్కడే మరొక విశేషం–

నాకు ప్రతిరోజూ ఎక్కడో అక్కడ తారసపడే పెద్దలలో చాల మంది ''మీ పాలేరు నాటకంలో పాత్రధారులం'' అంటూ పరిచయం చేసుకొంటూ వుంటారు. పాలేరు నాటకం చూచి, పాలేరు తనాలు మానేసి, స్కూళ్ళలో చేరి, పెద్ద చదువులు చదివి, పాలేరు కావ్య నాయకుడివలెనే ఆఫీసర్లయిన వాళ్లు, ప్రొఫెసర్లయిన వాళ్ళు, రాజకీయ

పదవులందుకొన్న వాళ్ళు వందల మంది నాకు తెలిసిన వాళ్ళలోనే వున్నారు. వాళ్లంతా ఆర్థికంగా స్థితిమంతులే. పరపతి కల వాళ్ళే. అయితే, వారిలో ఒక్కరు కూడ ఈ నాటకం ప్రతులు ఎందుకు దొరకడం లేదో వాకబు చెయ్యరు!

తమను అంతగా ప్రభావితం చేసిన ఒక గ్రంథం నిత్య ప్రచారంలో వుండేటట్టు చూడవలసిన బాధ్యత వారికి లేదా? పైకి వచ్చిన వాళ్ళు క్రిందపడి వున్న వాళ్ళకు చేయూత నివ్వవలసి లేదా? ఇతర ఉన్నత వర్గాల వారిని చూచి అయినా నేర్చుకోవద్దా? ఇక బడుగు వర్గాలు బాగుపడేదెట్లా?

ఇదంతా నా ఏకపాత్ర ఘోష! సోలో! సొలిలోఖీ!

ఏది ఏమైనా, ఇప్పుడు పాలేరును కొంచెం పరిష్కరించి సొంతంగా ముద్రిస్తున్నాను. ఇది నా చేతిమీదుగా ప్రథమ ముద్రణ. క్రమ సాంఖ్యంగా ఎన్నో ముద్రణో! సుమారుగా వూహించి అంటున్నాను 19వ ముద్రణ అని.

సమకాలీనత

మౌలిక సాహిత్యానికి ఉండవలసిన ప్రధాన గుణం సమకాలీనత. సమకాలీనత లేని రచన ఎంత గొప్పదైనా, అది సాహిత్యమనిపించుకోదు.

కవి ఏ కాలంలో జీవించాడో, ఆ కాలానికి చెందిన సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విషయాలన్నీ అతడి రచనల్లో ప్రతిఫలించాలి. అట్టి గుణం వుండడంవల్లనే వేద, పురాణ, రామాయణ, భారతాదులు క్లాసిక్సు అయాయి. సజీవ సాహిత్యమయాయి.

వాస్తవ వస్తు చిత్రణ ఫోటోగ్రాఫ్ అవుతుంది. డాక్యుమెంటరీ అవుతుంది. ఆ చిత్రణ రసభావ సమేతమై, కళాత్మకమై అభివ్యక్తమైనప్పుడే అది సాహిత్యమవుతుంది. సమకాలీన సాహిత్యానికి సర్వజనీనత తోడైనప్పుడు దానికి సజీవ సుస్థిరత్వం సిద్ధిస్తుంది.

వేద పురాణాలు, రామాయణ మహాభారతాలు ఆనాటి జీవిత సరళికి కళాత్మక చిత్రణలు. అందుకే వాటికి కాలదోషం లేదు. మొదట ఏ కాలంలో, ఏ భాషలో వెలువడినప్పటికీ – అవి అన్ని కాలాలకూ, అన్ని దేశాలకూ, అన్ని భాషలకూ చెందినవే అవుతాయి.

అట్టి విశ్వ సాహిత్యాన్ని ఎవరైనా, ఎప్పుడైనా తమ భాషలోకి అనువదించుకోవచ్చు. అనువదించుకోవాలి కూడ. అయితే, అట్టి అనువాదాలు మౌలిక సాహిత్యం కావు.

తెలుగులో ఎన్నో భారత రామాయణాలు, కావ్య ప్రబంధాలు వున్నై. అవన్నీ అనువాదాలో, అనుకరణలో అవుతై. తెలుగులో ఇంతవరకు మౌలిక సాహిత్యం జానపద సాహిత్యమే. కాదంటే కొన్ని శతకాలు, వేమన పద్యాలు, ఎంకి పాటలు వంటి కొన్నిటిని కూడ చెప్పుకోవచ్చు.

''పాలేరుతనం పూర్వమున్నంత ఇప్పుడు లేదు. మరికొంత కాలానికి పూర్తిగా పోవచ్చు. అప్పుడు పాలేరు నాటకానికి ప్రయోజనమేమిటి?'' అంటారు కొందరు.

గయోపాఖ్యానం, శ్రీకృష్ణతులాభారం, హరిశ్చంద్ర వంటి నాటకాలకున్న ప్రయోజనమే పాలేరు నాటకానికీ వుంటుంది. అవి పౌరాణికాలు కదా అంటే, అప్పటికిదీ పౌరాణికమే అవుతుంది.

పాలేరు అంటే ఎవరు? యజమాని క్రింద బానిసలా పనిచేసే ప్రతి అస్వతంత్రుడూ పాలేరే. అట్టి ప్రతివాడూ తన బానిసతనాన్ని తొలగించుకోడానికి నిరంతరం కృషి చెయ్యవలసే వుంది. ఇదొక ఎడతెగని సమస్య. దీనికి ముగింపు లేదు. అయినా, పోరాటం కొనసాగక తప్పదు. ఈ నాటకం ప్రారంభగేయంలోని ఉద్బోధ ఇదే, ''బానిస తనమును బాపుమురా'' అనేది.

వాల్మీకికి రాముడు సమకాలీనుడు. వ్యాసుడికి ధర్మరాజు సమకాలీనుడు. నాకు పాలేరు వెంకన్న సమకాలీనుడు.

ఇతి వృత్తంలో సమకాలీనత, కావ్య నాయకుడిలో విశ్వమానవత, రచనా శిల్పంలో రసభావ రమణీయత వుంటే అది క్లాసిక్. పట్టాభి రాముడి కంటె పాలేరు వెంకన్న ఏ విధంగానూ తక్కువ వాడు కాదు.

రాముడు విభీషణుడికి అభయ మివ్వడంలో స్వప్రయోజన ముంది. వెంకన్న తనకు అపకారం చేసిన ఖామందును శిక్ష నుంచి తప్పించి ఎంతో ఉపకారం చేశాడు.

ఇందులో అనాసక్తమైన విశ్వకారుణ్య ముంది. సీత రాముడికి వలె వెంకన్నకు వనబాల ప్రగతికారకశక్తి. వర్ణాంతర వివాహం ద్వారా కుల రహిత సమాజ నిర్మాణం సాధించబడింది.

సాహిత్య దర్శనం

సమకాలీన పాత్రను ప్రేమ రసంతో నింపినప్పుడే అది విశ్వసాహిత్యమవుతుంది. ప్రేమ ఉగాది పచ్చడి లాంటిది. దానికి నవరసాలూ తోడైనప్పుడే అమృత రసానుభూతి. ''శృంగారం భగ్నమైతే కరుణ రసం. నిరోధించబడితే వీర రసం'' అన్నానొకచోట.

రామాయణం లాంటి మహాకావ్యాలలో మాత్రమే సాధ్యంకాగల అట్టి రసపోషణ పాలేరు వంటి చిన్న దృశ్య కావ్యంలో ఆశించగలమా?

నిరభ్యంతరంగా ఆశించవచ్చు. నిండుగా ఆస్వాదించవచ్చు కూడ. ''వాక్యం రసాత్మకం కావ్యం'' అన్న నిర్వచనంలోని దర్శనం ఇదే. అనుభవించడానికి సుముఖత్వం వుండాలి. అంతే.

పాలేరును నిష్పాక్షిక దృష్టితో చూచే వారికి అది ఎంతో రసవంతంగా, రమణీయంగా కనిపిస్తుంది. అలా కనిపించబట్టే లక్షలాది జనం దాన్ని అభిమానించారు. వేలకొలది ప్రదర్శన లిచ్చారు. ప్రతి గ్రామంలోను పోటీ బృందాలేర్పడి ఆడారు. 1953లో గుంటూరులో ఒక బృందం వంద ప్రదర్శనలిచ్చిన సందర్భంగా చెరుకుపల్లిలో నాకు అప్పటి మంత్రి సంజీవయ్య గారి అధ్యక్షత క్రింద సన్మానం చేసి, పగటి దివిటీలతో బ్రహ్మ రథం పట్టి, పది వేల మంది సభలో గండపెండేరం తొడిగారు. అదీ పాలేరులోని ప్రజారంజకత్వం.

అయితే, ఈ నాటకానికి పండిత లోక సన్మానాలెందుకు జరగలేదంటే, పండితులు దళిత వర్గాలలోని ప్రతిభను గుర్తించరు కనుక.

పండితులు శాబ్దికులు. కొందరు స్వార్థపరులు. వారిలో అసూయాద్వేషాలు, స్పర్థలు, పచ్చోర్చనితనాలు ఎక్కువ. ఆ పచ్చదనం క్రింది వర్గాలలో దైతే మరీ ఉడికిపోతారు. అటువంటి మలిన మనస్కులు పత్రికలు. ఆకాశవాణి, దూరదర్శని వంటి ప్రచారక సంస్థలలో కీలక పదవులలో చేరితే, బడుగు కులాల రచయితలు, కళాకారులు

చాల క్రూరంగా సప్రెస్ చేయబడతారు. వారి రచనలు ఎంతటి ప్రతిభావంతాలైనా సమీక్షలకు కూడ నోచుకోవు! ప్రైజులు, అవార్డులు పైవారే పంచుకుంటారు.

పాలేరు విజయవంత మయిందంటే అందుకు కారణం సామాన్య ప్రజలలోని కళాభిజ్ఞతే.

సంగీత, సాహిత్య, నృత్య, చిత్ర శిల్పకళల సమగ్ర సమన్వయ రూపమే నాటకం. విద్యావంతుల మనుకొనేవాళ్ళు వచన నాటకాలతో సతమతమవుతుంటే, గ్రామీణ ప్రజలు పద్యాలూ, పాటలూ కల సమగ్రనాటకాలను అభిమానిస్తున్నారు. నేను పాటలు, పద్యాలు లేకుండా నాటకాలు వ్రాయను.

నాటకం జీవితానికి దగ్గరగా వుండాలి. నకలుగా వుండగూడదు. పగలంతా కష్టపడి వచ్చిన కార్మికుడికి మళ్ళీ అదే కష్టజీవితాన్ని రంగం మీద చూపడం వ్యర్థం. కష్టాన్ని మరిచి, ఉపశమనం పొంది, మరునాడు శ్రమపడడానికి తగిన శక్తిని ఇచ్చేదిగా వుండాలి కార్మికుడికి చూపబడే నాటకం. వాస్తవాన్ని అందంగా తీర్చిదిద్దేది కళ. నాటకం సమస్త కళా సమామ్నాయం.

పాలేరును ఆ విధంగా తీర్చిదిద్దాను నేను.

''పద్యాలలో ఏడుస్తారా?'' అనేది లోకజ్ఞత లేని విమర్శ. గాఢమైన ఆవేశాలను, రసాలను, ఫీలింగ్సును వ్యక్తం చెయ్యడానికి పద్యాలు, పాటలు, నృత్యాలు వంటి కళాప్రక్రియలే సాధనాలు. నా నాటకాలన్నీ పద్య గేయ సంయుతాలే.

నా దృష్టిలో కేవలం వచన నాటకాలు నాటకాలు కావు. అవి డాక్యుమెంటరీలు మాత్రమే.

క్రమాభివృద్ధి

''కావ్యేషు నాటకం రమ్యం'' అన్నారు. ''నాటకాంతం కవిత్వం'' అన్నారు. అలా ఎందుకన్నారు?

కవిత్వం ఏ ప్రక్రియలో చెప్పబడినా, అది ఆలోచనకు అందేది మాత్రమే. నాటకం అలా కాదు. అది తక్కిన అన్ని కళలనూ సాధనాలుగా ఉపయోగించుకొని, జీవిత క్రమ

వికాసాన్ని, క్రమోన్నతిని రమణీయంగా, సర్వేంద్రియాలకూ తృప్తినిచ్చే విధంగా ప్రదర్శించి చూపుతుంది.

ప్రతి మనిషీ తానున్న స్థానం నుంచి ముందుకు పోవాలనుకొంటాడు. అట్టి ప్రస్థానాన్ని ప్రత్యక్షంగా చూపేది నాటకం. ఇతి వృత్తంగా ఏ వ్యక్తి జీవితాన్నైనా తీసుకోవచ్చు. ఆ జీవితం, సుఖదుఃఖాల వెలుగు చీకట్లగుండా ప్రయాణిస్తూ ఎలా క్రమ వికాసం చెందిందో సహృదయుల మనస్సులకు హత్తుకొనేలా చూపాలి. అట్టి జీవిత లక్ష్యం అందరూ సాధించగలిగి నట్టిదిగా వుండాలి.

సత్యహరిశ్చంద్ర నాటకం చూచి ఎందరు సత్యవ్రతులయ్యారో తెలియదు కాని, పాలేరు నాటకం చూచి వేల మంది పాలేళ్ళు పాలేరుతనాలు వదిలేసి పాఠశాలల్లో చేరడం మాత్రం వాస్తవంగా జరిగింది.

నాటకం ప్రయోజనం, అది ఏ లక్ష్యాన్ని సాధించదలచిందో ఆ లక్ష్యం సాధించబడినప్పుడే సిద్ధించినట్టు. లక్ష్యం ఏదైనా కావచ్చు. వినోదమో, ఆనందమో కావచ్చు. పాలేరు నాటక లక్ష్యం సాంఘిక విప్లవం. అది సాధించబడింది.

లక్ష్యాన్ని సాధించిన ఏ రచన అయినా సరే, ఆ తర్వాత అజరామరంగా నిలిచి పోతుంది, ఆనందాన్ని ఇచ్చుకొంటూ. ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు ఎంత ఆడంబరంగా కనిపించినా, ఎండమావులే.

''కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నము''లనడం వట్టి జడవాదం. కేవల కల్పన అనేది ఎక్కడా వుండదు. ప్రతి ఊహా, ప్రతి శిల్పమూ, ప్రతి కల్పనా ఏదో ఒక వాస్తవాన్ని ఆశ్రయించుకొని జరిగేదే.

ప్రకృతి ధర్మాన్ని అనుసరించి జరిగే ప్రతి కల్పనా వాస్తవం కాగలిగినట్టిదే. పాలేరు నాటక కథ కేవల కల్పితమే. అయితే, అది ఎన్నో వాస్తవ జీవితాలకు మార్గదర్శకమయింది. ఒక సాహితీ కల్పన ఒక మహత్తరమైన సాంఘిక విప్లవానికి కారణమయింది. విప్లవం రావలసింది మొదట సాంఘిక రంగంలో. ఆర్థిక రాజకీయ రంగాలు దానిని అనుసరించి తీరతాయి. వాస్తవమైన, ప్రయోజనకరమైన విప్లవాన్ని సాధించడంలో ఎంతటి

హింసాయుత టెర్రరిస్టు కార్యకలాపాలూ చెయ్యలేని పనిని ఒక్క పాలేరు నాటకం చెయ్యగలిగింది.

టెర్రరిజం, ఉగ్రవాదం వంటి హింసోద్యమాలు, విప్లవ నిరోధకాలు. బాగా బలిసిన వాళ్ళు చేసే పనులవి. ప్రజల్ని భయపెట్టడం, వ్యక్తుల్ని చంపడం, ఆస్తుల్ని నాశనం చెయ్యడం వంటి దౌర్జన్య చర్యలవల్ల మానవ పురోగమనం దెబ్బతింటుంది. పాలేరు సాధించిందే సరైన విప్లవం.

ఇతివృత్తం

పాలేరు నాటకంలోని కథ చాల చిన్నది.

గోదావరి తీరంలో, కాకినాడ బస్ రూట్‌లో రైతువాడ ఒక గ్రామం. కుబేరయ్య ఒక చిన్న సవర్ణ భూస్వామి. పాలేళ్ల సహాయంతో సొంతంగా వ్యవసాయం చేసుకుంటాడు. అతడి పాలేళ్లలో పుల్లయ్య ముఖ్యుడు. అతడి కొడుకు వెంకన్న. వీరేశు మరొక పాలేరు. ఈ ముగ్గురూ అవర్ణులే. వెంకన్నను కూడ పాలేరుతనం పెడతాడు పుల్లయ్య. వెంకన్నకు చదువు కోవాలని వుంది. ఆ వూరి బడిలోని ఉపాధ్యాయుడు ఉపకారి, విద్యార్థిని వనబాల అతణ్ని ప్రోత్సహిస్తారు. కామందు కుబేరయ్య, పుల్లయ్య వ్యతిరేకిస్తారు. ఈ ఇద్దరూ వెంకన్నను చాల బాధలు పెడతారు.

రైతువాడ గ్రామం చుట్టూ విశాలమైన పంట పొలాలు. పొలాల మధ్యలో అక్కడక్కడ చెట్లు, తోటలు. అలాంటి ఒక తోటలో వుంది పాఠశాల. అంటే – గ్రామానికీ, పాఠశాలకు మధ్య పొలాలున్నాయన్నమాట. ఆ పొలాలలోని పచ్చిక బయళ్లలోనే వెంకన్న కుబేరయ్యగారి పశువుల్ని మేపేది. ఆ పొలాలలోని చెట్ల క్రిందనే ఉపకారి మాష్టార్నీ, బాలనూ తరచు కలుసు కునేది. అతడు ఖామందు చేత దెబ్బలు తినేది కూడ ఆ పొలాలలోనే.

అవర్ణులైన వ్యవసాయ కూలీల, పాలేళ్ల పేటలు పొలాలకు ఆనుకొనే వుంటాయి. అవన్నీ ఖామందుల భూములే. కూలీలకు సొంత ఇళ్లు లేవు. అప్పటికింకా దేశానికి స్వాతంత్ర్యం రాలేదు.

రైతు వాడ గ్రామంలో కుబేరయ్యగారి లోగిలికి దగ్గరలోనే మరొక సంపన్న కుటుంబం వుంది. వాళ్లూ సవర్ణులే అయినా, కుబేరయ్య వలె సంకుచిత మూర్ఖ కులతత్వవాదులు కారు. ఆ సంపన్న కుటుంబానికి చెందినదే వనబాల. ఆమె అన్నగారు సుందరం. కాకినాడ కాలేజీలో చదువుతున్నాడు. అక్కడి అనాథ శరణాలయం సూపర్నెంటుగారి అబ్బాయి రామం సుందరం మిత్రుడు.

ఖామందూ, తన తండ్రీ పెట్టే హింసలను భరించలేక, కాకినాడకు పారిపోయిన వెంకన్న శరణాలయంలో చేరి, వెంకటేశ్వర్రావై, ప్రైవేటుగా పరీక్షలు ప్యాసై, ప్రభుత్వాధికారి, డిప్యూటి కలక్టరు అవుతాడు.

ఈలోగా సీత – వీరేశు, దొంగ రామన్న – రౌడీ రంగడు, కుబేరయ్య – పుల్లయ్య, సుందరం – రామం సంఘటనలు కొన్ని జరుగుతై. బాలను రామానికిచ్చి వివాహం చెయ్యడానికి సుందరం ప్రయత్నించడం, బాల దుఃఖం, వెంకటేశ్వర్రావు నిర్వేదం, తుదకు కష్టాలన్నీ తొలగి, అందరూ కలుసుకోవడం, కుబేరయ్యకు వెంకటేశ్వర్రావు మేలు చెయ్యడం జరిగి, బాల వెంకటేశ్వర్రావుల వివాహంతో కథ సుఖాంతమవుతుంది.

అధికారి – నాయకుడు

నిజానికి అంటరాని వాళ్ళు కూడ మానవులే అని గుర్తించిన వాళ్ళు ఆంగ్లేయులు. ఈ దేశానికి పాలకులుగా ఆంగ్లేయులు, వారితోపాటు క్రైస్తవ మిషనరీలు రావడం వల్లనే హరిజన గిరిజన ప్రజల గుడ్డి బతుకుల్లోకి వెలుగూ, విజ్ఞానమూ ప్రవేశించాయనవచ్చు.

అంతకు పూర్వం ఈ దేశాన్ని పాలించిన హిందూ, బౌద్ధ, ముస్లిం రాజులందరూ స్వప్రయోజనాల కోసం కొట్టుకొన్న వాళ్ళే. ఆ కాలంలో దేశం లేదు. రాజ్యాలు వున్నై. ప్రజలంటే రాజులూ, వాళ్ళ కుటుంబాలూ మాత్రమే.

అట్టి దుస్థితిని తొలగించి, దేశానికి ఏకరూపం కల్పించి, ఏక భాష (ఇంగ్లీషు) ద్వారా జాతీయతను ప్రసాదించిన వాళ్ళు ఆంగ్లేయులే. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా దేశ సమగ్రాభివృద్ధికి కృషిచేసిన వాళ్ళూ వాళ్ళే.

ఆర్తత్రాణ పరాయణుడైన భగవంతుడు అందుకోసం అప్పుడప్పుడు అవతారా లెత్తుతూ వుంటాడనే భావనలో ఏ కొంచెమైనా నిజముంటే, ఈ దేశంలో అట్టి ఆర్తులైన హరిజన గిరిజన దీనుల్ని ఉద్ధరించడానికి ఆంగ్లేయుల్ని తెచ్చాడేమో అనిపిస్తుంది నాకు చరిత్రను పరిశీలిస్తే.

అందుకే, మన స్వాతంత్ర్యోద్యమ నాయకులు కూడ తెల్లదొరతనం వద్దన్నారే కాని, తెల్లవాళ్ళని ద్వేషించలేదు.

ఒక్కసారి చైతన్యవంతులైన హరిజనుల్ని ఇకమీదట ఎవరూ అణచిపెట్టలేరు. విదేశీ పాలన కింద ఎంతోకాలం వుండలేం. ఎప్పటికైనా ఆధునిక భారతంలో కులతత్వం నశించక తప్పదు. హరిజనులు ప్రధాన సమాజంలో కలిసిపోయి, హైందవ జాతీయత ఏక ప్రవాహం కాక తప్పదు.

వేముల కూర్మయ్య, బి.ఎస్.మూర్తి, మునిసామి పిళ్ళై, జగజ్జీవనరాం వంటి విద్యాధికులు కాంగ్రెస్‌లో వుండిపోవడం వెనక, డాక్టర్ అంబేడ్కర్‌గారు పూనా ఒడంబడికకు అంగీకరించటం వెనక ఇంత ఆలోచన వుంది!

ఆంగ్లేయులు దేశాన్ని విడిచిపోతే, పరిపాలన వచ్చేది కాంగ్రెస్ చేతికే కదా? కాంగ్రెస్‌లో కాని, మరే పార్టీలో కాని వుండే మెజారిటీ జనం హిందువులే కదా?

హిందువులు రెండు భాగాలు. అవర్ణులు, సవర్ణులు. హిందూ ధర్మానికి పునాది రాళ్ళు అవర్ణులైన హరిజనులే. అవర్ణ, సవర్ణ జనం అంతా కలిసి ఏక హిందూ జాతి కావలసి వుంది. అలా అయినప్పుడు పరిపాలనా నిర్వహణలో హరిజనులు తమ వంతు బాధ్యతను తాము స్వీకరించవలసి వుంది. అందుకు తగు విధమైన శిక్షణను హరిజన విద్యావంతులు ఇప్పటి నుంచే పొందవలసి వుంది.

ఆనాడు ప్రజాశక్తి పత్రిక సంపాదకులు కంభంపాటి సత్యనారాయణ గారితో నేను చేసిన వాదం ఇది. విద్యావంతుడైన వెంకన్నను ప్రజా నాయకుడుగా గాక, ఆఫీసరుగా ఎందుకు చేశానంటే, కారణం ఇది.

కనకాభిషేకం

ఈ మధ్య నాకు బెజవాడలో కనకాభిషేకం జరిగింది.

''భీమన్న గారికి ఇప్పుడు మేం చేస్తున్న ఈ కనకాభిషేకం చాలా చిన్నది. ఆయనకు గండపెండేరం వేసి ఘనంగా సన్మానించవలసి వుంది.'' అని డా. పోలవరపు వెంకట సుబ్బా రావు గారన్నప్పుడు నేను–

నాకు జరిగిన సన్మానాలన్నిటికీ ఈ కనకాభిషేకం కిరీటం వంటిదనీ, తక్కువదేం కాదనీ, పాలేరు నాటకం నాకు 1953లోనే గండపెండేరం వేయించిందనీ ప్రకటిస్తూ, ఈ పద్యం చెప్పాను. ఇందులో ఏడు సన్మానాలు మాత్రం పేర్కొనబడ్డాయి–

బ్రహ్మ రథము పట్టి, పగటి దివిటీలతో
వేయించితివి గండపెండెరమును,
అందించితివి భారతాధ్యక్ష గిరి చేత
మహనీయమైన పద్మ అవార్డు,
కలిగించితివి గుడిసెల కావ్యమునకు జా
తీయ పురస్కార ధీయశస్సు,
ఆంధ్ర కాశీ విద్యా పీఠముల నుండి
గారవించితివి డాక్టర్ బిరుదుల,
శాసన పరిషత్తు సభ్యత్వ మొసగి తీ
ర్చితివి నాలోని రాజరిక తృష్ణ,

ఇంతగా నన్ను భూషించి, ఇపుడు దీని
కంతకు కిరీట మన, కనకాభిషేక
ధన్యతను గూర్చినావు నా తల్లి! బ్రాహ్మి!
బాపురే, పోలవరపు సుబ్రావుగారి

హృదయ పద్మాసనము నుండి! ఎంత కరుణ!

ఆ మహోత్సవానికి అధ్యక్షత వహించిన డా. జె.బాపురెడ్డిగారికి, అందుపాల్గొన్న నగర మేయర్ జంధ్యాల శంకర్, తుర్లపాటి కుటుంబరావు, ఎన్.సి.కృష్ణమాచార్యులు, డా. కుందుర్తి సత్యనారాయణమూర్తి, శ్రీ ఎమ్.పి.జాన్ కవిగార్లకు, ఈడ్పుగంటి లక్ష్మణరావు గారికి కూడ ప్రత్యేక అభినందనలు చెప్పవలసి వుంది.

Heredity was not highly valued. Kavasa, the son of a slave girl, could become a sage. It is therefore clear that classes existed in Rigvedic society, but they had not yet developed into castes.

(The cultural heritage of India, Page 226)

ఋగ్వేద కాలంలో భారతీయ సమాజంలో వర్గాలున్నాయని, వాళ్ళ వాళ్ళ ప్రతిభను బట్టి ఒక వర్గం వ్యక్తి మరొక వర్గానికి మారడం జరుగుతూనే వుండిందని, వర్గాలు వర్ణాలు (కులాలు)గా మారడం అప్పటికింకా జరగలేదని పరిశోధకులంటున్నారు.

పుట్టుకను బట్టి కులం ఏర్పడటం అనే ఈనాటి దుష్ట వ్యవస్థ స్మృతుల కాలం నుంచి వచ్చింది. శ్రుతుల కాలంలో లేదు.

పుట్టుకను బట్టి వర్గాన్ని నిర్ణయిస్తూ, అట్టి వివిధ వర్గాల మధ్య వివాహ సంబంధాన్ని నిషేధించడంతోనే వర్ణ సాంకర్యమూ, అంటరాని తనమూ ఏర్పడడం మొదలైంది.

''భారతీయ సమాజమా! వేదాలకేసి మళ్ళు! 'Go back to Vedas' అంటూ ఏభై ఏండ్ల క్రితమే పిలుపిచ్చాను నేను. అందుకు కారణం ఇదే – వేద కాలంలో పుట్టు కులమూ, అస్పృశ్యతా లేకపోవడం.

ఈనాటి పుట్టు కులం వర్గం ఎలా అవుద్ది? హరిజనులందరూ లేబరే అనే భారత కమ్యూనిస్టులతో కోనాడకు పడకపోవడానికి అదే కారణం.

కోనాడ – కార్మికోద్యమం

భారత్‌లోని సాంఘిక వ్యవస్థ వేరు, ఇతర దేశాలలోని సాంఘిక వ్యవస్థ వేరు. భారత్ లోని కార్మిక వర్గం వేరు, ఇతర దేశాలలోని కార్మిక వర్గం వేరు. సాంఘిక, రాజకీయ రంగాలలో పనిచేసే వాళ్ళెవరైనా సరే ఈ తేడాలను గుర్తించవలసి వుంది.

విదేశాలలోని ఎలాంటి కార్మికుడైనా అదృష్టం కలిసివస్తే యజమాని కాగలడు. కోటీశ్వరుడు కాగలడు, ప్రధాన మంత్రే కాగలడు. భారత్‌లోని కార్మిక వర్గం అలాంటిది కాదు. ఇక్కడ కుల వ్యవస్థ వుంది. ఏ కులంలో పుట్టిన వాడు ఆ కుల వృత్తినే తప్ప మరొక వృత్తిని చేబట్టరాదనే నిషేధం ఇక్కడ వుంది. ఇక్కడ కార్మిక వర్గం అంటే ఒకటి రెండు కులాలకు సంబంధించిన జనం. ఆ కులాల వాళ్ళు అస్పృశ్యులు. అంటే మాల మాదిగలు, మామూలు.

ఇక్కడ కార్మికుడికి పుట్టినవాడు శాశ్వతంగా కార్మికుడే. యజమాని కాలేడు. మరొక వృత్తిని చేబట్టే అవకాశమే లేదు. చదువు, సంస్కారం, ఇతర కులాల వాళ్ళతో స్నేహ సంబంధాలు, వస్తు వాహనాలు, కొంచెం బాగా బ్రతకడానికి అవసరమైన అన్నీ నిషేధించబడి, ఊరికి దూరంగా మురికి పేటల్లో, పూరి గుడిసెల్లో, నిత్య దరిద్రంలో, తక్కిన కులాల వాళ్ళకు నిత్య గులాములుగా బ్రతకవలసిన దుర్గతికి బలిచేయబడ్డ వాళ్ళు. ఈ దేశంలో బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పడేవరకు ఇదే దుస్థితి. లేబర్ అంటే మామాలే!

''ప్రపంచ కార్మికులారా! ఏకం కండి'' అనే నినాదాన్ని దొరకబుచ్చుకొని, అంతర్జాతీయ స్థాయిలో కార్మికోద్యమాన్ని నడపదలచుకొన్న వాళ్ళు గుర్తించవలసిన పరమ సత్యం ఇది. ఇతర దేశాలలోని కార్మికులకు కాయకష్టాన్ని వదిలేసి, తమ ఇష్టం వచ్చిన వృత్తిని చేబట్టే స్వేచ్ఛ వుంది. భారత్‌లోని కార్మికులకు అట్టి స్వేచ్ఛ లేదు. కాయకష్టం తప్ప మరో గత్యంతరం లేదు. తరతరాలుగా, వంశ పారంపర్యంగా పేద కార్మికులుగా బ్రతకవలసిందే.

విదేశీయమైన కార్మిక నిర్వచనాలనూ, సిద్ధాంతాలనూ పట్టుకొని భారత్‌లో కార్మికోద్య మాన్ని నడపడానికి పూనుకొన్న యువ నాయకులకు ఈ అవగాహన లేకపోయింది. అందుకే అట్టివాళ్ళు ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీని తొలిసారిగా నెలకొల్పినప్పుడు, ఆ పార్టీలో కార్మికులు బహుకొద్ది మంది మాత్రమే చేరడం జరిగింది. నాయకులందరూ ధనిక కులాల వాళ్ళే. అట్టి వాళ్ళ అధీనంలో పని చేసుకు బ్రతుకుతున్న కూలీలే ఆ పార్టీ అనుయాయులుగా తయారయ్యారు. మాల మాదిగ పేటలు లేబర్

పేటలుగా వ్యవహరించబడసాగాయి. ఆ ప్రాంతపు భూస్వాముల బిడ్డలు ఆ లేబరు జనానికి నాయకులై నిలిచారు. మిత్రులు కోనాడ సూర్య ప్రకాశరావుగారు సాంఘిక సేవా రంగంలో అడుగుపెట్టిన నాటికి దేశంలో వున్న పరిస్థితి అది. నాయకులు ధనికులైన సవర్ణ విద్యావంతులు, అనుచరులు వాళ్ళ పాలాలలో పనిచేసుకు బ్రతుకుతున్న అవర్ణులు, అస్పృశ్యులు.

1941లో కృష్ణా జిల్లా వ్యవసాయ కూలీ సంఘానికి శ్రీ కోనాడ అధ్యక్షుడుగా వేదిక మీద నిలబడినపుడు, ఆయనకు ఎదురు నిల్చిన వాస్తవాలు రెండు. వ్యవసాయ కూలీలంతా అంటరాని కులం వాళ్ళు. నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టిమాత్రమే కలిగిన ధనిక సవర్ణులు.

భారత్‌లో వర్గ పద్ధతి (class) లేదు. వర్ణ వ్యవస్థ అంటే కుల వ్యవస్థ (caste system) వుంది. ఇక్కడ కూలీలు అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి. వాళ్ళు తదితర ప్రజలతో కలిసి పోయేటట్టు చూడాలి. కుల భేదాలను తొల గించాలి. తమ ఇష్టమైన వృత్తిని చేబట్టే అవకాశాలు కలిగించాలి. వృత్తికి కులం ప్రాతిపదిక కాకూడదు. ఏ కులం వాళ్ళైనా సరే, వృత్తిని బట్టి వర్గం ఏర్పడే స్థాయికి భారతీయ సమాజం ఎదగాలి.

అందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ, ప్రత్యేక విధానాలు అవలంబించాలనీ కోనాడ ఉద్దేశం. అక్కడ పెత్తనం చేసే నాయకులు అందుకు వ్యతిరేకం. అప్పుడు స్పష్టపడింది కోనాడకు – కమ్యూనిస్టు పార్టీ ద్వారా హరిజనులకు, ప్రధానంగా వ్యవసాయ కూలీలకు జరిగే మేలేదీ లేదని. ఆ తరువాత జరిగిన అనేక సంఘటనల ద్వారా ఆయన ఒక నిశ్చయానికి వచ్చి, ఒక నిర్ణయాన్ని తీసుకొని, కమ్యూనిస్టు పార్టీని వదిలేసి, అంబేడ్కరుగారి షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్‌లో చేరాడు – 1944 ప్రాంతంలో. అంతకు ముందు వ్యక్తిగతంగానూ, ఆ తర్వాత కమ్యూనిస్టు అభిమానిగానూ హరిజనులకు సాంఘికన్యాయం కోసం పోరాటాలు జరుపుతూ వచ్చిన కోనాడ 1944 నుంచి ఫెడరేషన్ పతాక క్రింద సేవా నాయకుడైనాడు.

మా పరిచయం

ఇంతకూ, ఈ కోనాడ సూర్యప్రకాశరావు ఎవరు?

కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకా, పెదపాలపర్రు గ్రామంలో 1910 ఫిబ్రవరి 15వ తేదీన హరిజన కార్మిక వంశంలో జన్మించాడు కోనాడ. తండ్రి ఎరకయ్యగారు, తల్లి శాంతమ్మగారు. గుడివాడ బోర్డు హైస్కూలులో చదివి 1930లో 10వ తరగతి పాసయినాడు. 1930 నుంచి 32 వరకూ ఖాళీ. సంగీత సాహిత్యాలతో కాలక్షేపం. 1932లో కాకినాడ పిఠాపురం రాజావారి కాలేజీలో ఇంటర్‌లో ప్రవేశించినాడు. అప్పటి నుంచి శ్రీ కోనాడతో నా పరిచయం.

కాలేజీలో వున్నప్పుడు మేము రామమోహన లాడ్జిలో వుండేవాళ్లం. అది పి.ఆర్. కాలేజీలోను, కాకినాడ పట్టణంలోని ఇతర హైస్కూళ్లలోను చదివే హరిజన విద్యార్థుల కోసం విద్యార్థులమే ఏర్పాటు చేసుకొన్న హాస్టలు. దానికి నేను ప్రెసిడెంటుగా వుండేవాణ్ణి. ఆ కాలంలో ప్రెసిడెంటు అంటే నేనే. అంతగా రూఢి పదమయింది నా విషయంలో అది. రెండు సంవత్సరాలపాటు మేమే స్వంతంగా నడుపుకొన్న తర్వాత, కాలేజీ అధికారులు ఇంటి అద్దెను తాము భరిస్తామని చెప్పి మాతో సంబంధం పెట్టుకొన్నారు. తక్కిన ఖర్చులన్నీ మేమే పెట్టుకొనే వాళ్ళం. ఇష్టం వచ్చినట్టుగా లాడ్జిని నడుపుకొనే వాళ్ళం. చాలమందికి స్కాలర్‌షిప్పులు వచ్చేవి. అవి మేము తింటూ ఇతరులకు కూడా పెట్టగలిగేటంత సమృద్ధిగా వుండేవి. అందువల్ల స్కాలర్‌షిప్పులు రాని వాళ్ళకు ఉచిత వసతి, ఇతర పేద విద్యార్థులకు వారాల ఏర్పాట్లు కూడ చెయ్యగలిగాం. నేను లాడ్జిని వదిలిపెట్టే వరకు అంటే 1935 వరకు రామమోహన లాడ్జి వైభవోపేతంగా కొనసాగింది. స్కాలర్‌షిప్పులు రాని విద్యార్థులలో ఆనాడు కోనాడ ఒకడు.

కోనాడతో నా స్నేహం అతి సన్నిహితంగా ఆర్ద్రంగా హార్దికమైనట్టిదిగా వుండేది. కోనాడ చనువుగా చొరవగా వుండేవాడు. చదువు ఎలా వుండేదో నాకిప్పుడు జ్ఞాపకం లేదుగాని, సాంఘిక సేవా విషయాలలో మాత్రం చాలా చురుగ్గా వుండేవాడు.

· హాస్టలును వదిలిన తర్వాత ఒక పదేళ్ళ వరకు మా ఇద్దరి మధ్య సంబంధాలు వున్నట్టు లేదు. ఆ తరువాత మేం కలుసుకొన్నది 1945లో అనుకొంటాను – జనరల్ ఎన్నికల సందర్భంలో. నేను కాంగ్రెసు, కోనాడ ఫెడరేషను. రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా నేను కూర్మయ్యగారిని బలపరుస్తూ కృష్ణా జిల్లాలో పర్యటించినపుడు ఎక్కువ కాలం బెజవాడ లోనే వుండేవాణ్ణి. పగలంతా ఎక్కడ తిరిగి వచ్చినా, సాయం సమయాలలో మాత్రం మేం కలుసుకొని కబుర్లు చెప్పుకొంటూ వుండేవాళ్ళం. పార్టీ భేదాలు మా స్నేహానికి ఏనాడూ ఆటంకం కాలేదు. అప్పుడే అర్థమయింది నాకు కోనాడలోని సాహస ప్రవృత్తీ, స్థిత ప్రజ్ఞత్వమూ, నిమ్న జాతుల సముద్ధరణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడ్డ నిర్భీతీ, నిత్య పోరాట శక్తీ.

ఆలోగా ఆయన కొన్ని ఉద్యోగాలు చేశాడు. సరిపడక వదిలేశాడు. కులతత్వానికి, అంటరానితనానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీల అభ్యుదయం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించాడు. ''కాకిచేత కబురు'' కూడ అక్కడ లేకుండానే, ఎక్కడ ఈ దీన జనం చిక్కుల్లో పడితే అక్కడ రెక్కలు కట్టుకుని వాలేవాడు. భూస్వాములతోను, మూర్ఖ ఛాందసులతోను పోరాడడం మాత్రమే కాదు. కార్మికోద్యమ నాయకుల మంటూ బురఖాలు వేసుకొన్న నిరోధక శక్తులతో కూడ ఆయన పోరాడవలసి వచ్చేది. ఆ విధంగా దీనజన సేవకే అంకితమైపోయాడు. పేదరికంతో ధైర్యంగా కాపరం చెయ్యగలిగాడు. సేవా రంగంలో స్థిత ప్రజ్ఞుడై నిలిచాడు.

షెడ్యూల్డు కులాల ఫెడరేషను నాయకత్వాన్ని వరించిన తర్వాత ఆ వుద్యమాన్ని ఆయన చాల మందుకు తీసుకుపోయాడు. ఫెడరేషను స్థాపకుడైన డా. అంబేడ్కర్ గారిని అనేక సందర్భాలలో స్వయంగా కలుసుకొని సంప్రదింపులు జరిపాడు. ఆ కాలంలో అంబేడ్కరుగారి ప్రియమైన సన్నిహితులలో కోనాడ ఒకరు.

అంబేడ్కరుగారు గాంధీజీ సూచన మేరకు కాంగ్రెసు మంత్రి వర్గంలో చేరినప్పుడు షెడ్యూల్డు కులాల యువ లోకంలో కలిగిన అలజడినీ, నిస్పృహనూ తొలగించి, అంబేడ్కరు గారి చర్యను సమర్థవంతంగా బలపరిచిన భవిష్యద్దర్శి కోనాడ.

ఆ కాలంలో ఫెడరేషను పోరాట రంగంలో ఈలి వాడపల్లి, నందనారు హరి, పాము రామమూర్తి, అరుణకుమార్, బొజ్జా అప్పలస్వామి, రావూరి ఏకాంబరనాథ్, నక్కా చిన వెంకయ్య వంటి నాయకులెందరో పనిచేస్తూ వుండేవారు. ఆ రోజుల్లోనే కాబోలు ఏకాంబర నాథ్ కోనాడను గురించి–

"సూదిమొన పసలాంటి సునిశిత మేధావి
పేదోళ్ల దొక్కటే ఫెడరేష నంటాడు,
ప్రాణ లక్ష్యం లేని బండ – మొండీ – త్యాగి,
కోనాడ కుర్రోడు నీ కంగరక్షకుడు,
ఆది హిందూ లక్ష్మి! స్తవమో!
కార్మిక మాతరో! జయమో!"

అంటూ గానం చేశాడు.

ఫెడరేషను తరఫున ఎన్నికలలో కూడ పోటీ చేశాడీయన. ఫెడరేషను రద్దయిన తర్వాత భారత రిపబ్లికన్ పార్టీ కార్యక్రమాలను చేపట్టాడు.

కోనాడ చేపట్టిన జీవిత విధానం పేదరికంతో కూడుకొన్నదీ, ప్రమాద భరితమైనట్టిదీను. అటువంటి జీవితంలో భాగస్వామ్యం కలిగి వుండాలంటే ఎంతటి ధైర్యమూ, త్యాగశీలతా వుండాలో – వూహించవచ్చు. అంతటి మహనీయ గుణశీలాలు కలిగిన మహిళ ఆయన అర్ధాంగి కమలాబాయి. కుమార్తెలు రమాదేవి, శాంతాదేవి, కుమారులు వివేకానంద, అశోక్, రాంబాబు (ఈయన ఇప్పుడు లేడు), శ్రీహరిరావు – ఈ అందరూ కూడ తల్లిదండ్రులకు అనుకూలంగా తమ తమ కర్తవ్యాలను గుర్తించి వర్తిస్తున్న వాళ్లే. కోనాడ మామగారు ఏకుల జార్జిగారు గొప్ప ఆర్టిస్టు. అంబేడ్కరుగారి త్రివర్ణ చిత్రాలు ఎన్నో చిత్రించి ప్రజల కందిచ్చిన వాడు. కోనాడ రెండవ కుమారుడు

డా. అశోక్ కోనాడ గొప్ప గాయకుడు. రాష్ట్రంలో అనేకచోట్ల లలిత గాన కచేరీలు నిర్వహిస్తున్న సుప్రసిద్ధుడు.

కోనాడ వారిని గురించి, గ్రామ సీమలలో ఆయన నిర్వహించిన ఉద్యమాలను గురించి విపులంగా ఒక ఉద్గ్రంథమే వ్రాయవచ్చు. అంతటి త్యాగధనుడికి, సాహితీ ప్రియుడికి, ఆదర్శ ప్రాయుడైన ఉత్తమ భారతీయుడికి ఇప్పుడు ఈ పాలేరు దృశ్యకావ్యాన్ని అంకితం ఇస్తున్నానంటే ఇది నిజంగా నా అంకితాల చరిత్రలో అద్భుతమూ, అపూర్వమూను. యాభై ఏళ్ళుగా ఇది ఎవరికీ అంకితం కాకుండా వుండిపోయిందంటే నిజంగా ఆశ్చర్యకరమే మరి. ఈయన కోసమే అలా వుండిపోయిందనుకోవచ్చు.

-భీమన్న

❀ ❀ ❀

అంకితం

స్థితప్రజ్ఞ కోనాడకు

వర్కరుగా పుట్టి
వారాలపై చదువుకొన్న దీక్షాపరుడు,
ఏ చిన్న ఉద్యోగంలో కొనసాగినా
ఓ పెద్ద లక్షాధికారి కాగల్గిన ప్రజ్ఞావంతుడు,
మా కోనాడ సూర్యప్రకాశరావు! కాని–
నిరుద్ధ జన సముద్ధరణ కోసం
ఆయన చెయ్యని త్యాగాలు లేవు
పడని కష్టాలూ లేవు!

చదువుకొన్న ప్రతి దళితుడూ
సర్కారు కొలువులో చేరిపోతున్నప్పుడు,
కొలువెక్కిన ప్రతి ఉద్యోగీ
కుక్షింభరుడై జారిపోతున్నప్పుడు,
పిరికివాడై పారిపోతున్నప్పుడు–

అంబరాని ఒంటరి జనానికి
ఆసరాగా నిల్చినవాడు
అంబేడ్కరు ఉద్యమానికి
అభయ హస్తం పట్టినవాడు
అధర్మ అన్యాయ అమానుష కుల వ్యవస్థను
అదరగొట్టి గెల్చినవాడు
మా కోనాడ!
మానవతకు నీడ!

నిస్స్వార్థ ప్రజాసేవకు లభించే ప్రతిఫలం
నిరుపేద తనం! అయినా-
కుటుంబ పోషణకోసం ప్రియజనం
కూలి పనులకు పోతుంటే
అందరూ కూలీలకూ అన్నం పెట్టేటందుకు
అసిధారా ప్రతం నిర్వహించిన
ధీరోదాత్తుడు కోనాడ!
అట్టి స్థితప్రజ్ఞ కోనాడకు
ఈ పాలేరు దృశ్య కావ్యం నవోధ!

-భీమన్న

❀ ❀ ❀

కూలిరాజు

అంకితం

శ్రీ వేముల కూర్మయ్యగారికి
(ఆనాటి మద్రాసు రాష్ట్ర మంత్రి)

శ్రీ రమకు తండ్రి వారధి; తండ్రి
శీతగిరి; లోకపాలన చేయునట్టి
ఉభయులకు తండ్రి కూర్మయ్య విభవ మదిర!
దయకు వార్ధి; ధైర్యముకు శీతగిరి యితడు!

దున్నేవాడిదె భూమి, సోమరులు రై
తుల్ కారు; సర్వ ప్రజల్
అన్నం బట్టకు హక్కు దార్లె; సములే
యౌ నందరున్; లేమియే
కన్నీరంతకు కారణమ్ము అనుచు
పక్కాణించి, రాజ్యమ్ములే
కున్నన్‌గాని ప్రభుత్వమున్ నడుపు మా
కూర్మయ్య సామాన్యుడే!

చదువు చెప్పని సమాజమున జన్మించి, వి
ద్యామేరు శిఖరమ్ము లందినాడు;
పాలేరు కులమున ప్రభవించి, రాష్ట్ర చ
క్రము త్రిప్పు మంత్రియై ప్రబలినాడు;
హరిజనులను జూడ ఆత్రము పడుచున్న
హరికోసమై గుడుల్ తెరచినాడు;

విద్యకోసము వసతులు, వేతనములు,
బ్రతుకు కోసము బంజర్లు గ్రాంటుచేసి
శిష్టరక్షణ కవతరించిన రమా ధ
వుండు కూర్మయ్య గురుదేవుడండి ప్రజకు!

బ్రహ్మ విష్ణు మహేశ్వర ప్రాణరక్తి
అవతరించిన గాంధీ మహాత్ము శక్తి
ప్రోచు గావుత సంతతము వ్యవసాయ
కూలి నాయకుడైన మా కూర్మయార్యు!

కలవారు, లేనివారని
కులములు దేశమున రెండె; కూలీలంతా
కలిసిననే సుఖ శాంతులు
కల వను కూర్మయ్య మంత్రి కర్పింతు కృతిన్!

-బోయి భీమన్న

సర్వోదయ సోషలిజం

మొదట్లో కేవలం వ్యవసాయ కూలీల సాంఘిక, ఆర్థిక సమస్యలను మాత్రమే తీసుకొని ''కష్టజీవి'' అనే పేరుతో వ్రాసిన నాటకం ఇది.

అందులో సమ్మె ప్రధాన సాధనం కావడం వల్లనూ, అది ఆగస్టు విప్లవ సమయం కావడం వల్లనూ, అదే సమయంలో కమ్యూనిస్టుల కార్యకలాపాలు ఉధృతంగా వుండడం వల్లనూ ''కష్టజీవి'' తొలి ప్రదర్శనతోనే కష్టాల పాలు కావలసి వచ్చింది.

ఆ తరువాత పేరు మార్చుకొని ''కష్టజీవి'' ''ధన్యజీవి'' అయి, రాష్ట్రంలో చాలా చోట్ల ప్రదర్శించబడింది. దీనిని ఎక్కువగా ప్రదర్శించిన వాళ్ళు కాంగ్రెస్ సోషలిస్టు భావాలూ, కమ్యూనిస్టు సంస్కరణ భావాలూ గల విద్యావంతులైన కాపూ, కమ్మా, బ్రాహ్మణ యువకులే.

ఆ తరువాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, కాంగ్రెసు ప్రభుత్వాలు ఏర్పడి, కాంగ్రెసు వాదిగా నాకు ప్రభుత్వ నాయకులలో కొంత పలుకుబడి వున్న కారణంగా నాటకంలో కొన్ని సిద్ధాంత పరమైన మార్పులు చేసి ''కూలిరాజు''గా పేరు మార్చి 1948లో మద్రాసు నుంచి దీనిని పుస్తక రూపంలో ప్రకటించడం జరిగింది.

అప్పుడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం కాంగ్రెసు ప్రభుత్వంలో వేముల కూర్మయ్యగారు మంత్రిగా వున్నారు. అప్పటికి ఆయన వ్యవసాయ కూలీ ఉద్యమాన్ని బహుముఖంగా నడిపిస్తున్నారు. గ్రామాలలోని ప్రముఖులైన హరిజన కార్యకర్తలు ఈ ఉద్యమాన్ని నడిపిస్తూ కాంగ్రెస్ పార్టీకీ, కూర్మయ్య గారికీ అనుచరులై వున్నారు. అయితే వ్యవసాయ కూలీలలో అధిక సంఖ్యాకులైన హరిజనులు కమ్యూనిస్టు నాయకుల ప్రభావానికి లోనై వుండేవాళ్లు. కమ్యూనిస్టులలో నాయకులు అగ్ర కులాల యువకులే. వాళ్ల అండర్ గ్రౌండు స్థావరాలు హరిజన పేటలుగా వుండేవి. తత్కారణంగా ప్రభుత్వ ఆగ్రహానికి గురి అవుతూ వుండేవి.

అట్టి పరిస్థితిలో హరిజనోద్యమానికి అండగా వుంటూ వచ్చిన గాంధీజీ ఒక

సవర్ణ కులతత్వవాది చేతిలో మరణించడం జరిగింది. కాంగ్రెస్ అగ్ర నాయకులలో తదితర ప్రముఖులు చాలా వరకూ ధనిక భూస్వామిక వర్గాలకు చెందిన వాళ్లే. కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చే సూచనలు లేవు. ఒక వేళ వచ్చినా కాంగ్రెసు లాగే అది కూడా అగ్రకులాల ప్రభుత్వమే అవుతుంది. రష్యా కూడా ఈ దేశపు కమ్యూనిస్టులను వదిలేసి కాంగ్రెసు జాతీయ ప్రభుత్వాన్నే అభిమానించసాగింది. కులం పేరుతో రాజకీయ పార్టీని నడపడం ఎలాగూ ప్రయోజనకరం కాదు. అలాంటప్పుడు ఈ దేశపు, కనీసం ఈ రాష్ట్రపు, హరిజనుల్ని, ముఖ్యంగా వ్యవసాయ కూలీలను ఉద్ధరించడం ఎలా? ఏం చెయ్యాలి?

ఈ సమస్యతో మంత్రిగా వున్న కూర్మయ్యగారు, అక్కడే అసిస్టెంటు పబ్లిసిటీ ఆఫీసరుగా వున్న నేను, జిల్లాల నుంచి వచ్చిన నక్కా చిన వెంకయ్య, ఆళ్ల చలమయ్య, కమతం షణ్ముఖం, సాకేటి గురువులు, రెడ్డి కామయ్య వంటి కొందరు వ్యవసాయ కూలీ నాయకులు కలిసి కొన్ని రాత్రులు నిద్ర మానుకొని చర్చించడం జరిగింది. అప్పుడే రాష్ట్ర వ్యవసాయ కూలీ సంఘం ఏర్పాటు చేయబడింది. దానికి అధ్యక్షుడిగా కూర్మయ్యగారే నిర్ణయించబడ్డారు. షణ్ముఖం గారి సంపాదకత్వంలో ''వ్యవసాయ కూలీ'' పత్రిక ప్రారంభించబడింది. ఆయన అప్పటికి కాంగ్రెస్ శాసన సభ్యుడు. ఎడిటరు ఆయనే అయినా పత్రికను నడిపింది నేనే.

కాంగ్రెసుకు అనుబంధ సంస్థగా ఏర్పాటు చెయ్యబడిన ఈ వ్యవసాయ కూలీ యూనియన్‌ను ప్రజలలో ప్రచారం చెయ్యడం కోసం కొన్ని వ్యవసాయ కూలీ పాటలు వ్రాసి, సేకరించి ఒక పుస్తక రూపంలో ప్రకటించాం. కష్టజీవి నాటకంలో కొన్ని మార్పులు చేసి 'కూలి రాజు'ను తయారుచేశాం. ఆ మార్పులలో ముఖ్యమైనవి – ''సమ్మె'' అనే మాటను తీసివేసి దాని స్థానంలో 'సత్యాగ్రహం' అనే మాటను పెట్టడం ఒకటి. అప్పటికి కాంగ్రెసు లక్ష్యంగా వున్న ''సోషలిస్టు తరహా ప్రజాస్వామికం''ను ''సర్వోదయ సోషలిజం''గా స్వీకరించడం రెండు. స్వతంత్ర భారత్‌కు తొలి అధ్యక్ష స్థానంలో ఒక హరిజన మహిళ ఎన్నుకోబడాలనీ, ఆమెకు జవహర్‌లాల్ నెహ్రూ గారు సెక్రటరీగా

వుండాలనీ 'హరిజన' పత్రికలో గాంధీజీ చేసిన సూచనను కార్య రూపంలో చూపాలనేది మూడు. ఈ చివరి మార్పుకోసమే నాటకంలో అదనంగా ఎన్నికల రంగం చేర్చడం జరిగింది. కూర్మయ్యగారూ, నేనూ నాటకం వ్రాత ప్రతిని ఎన్నో సార్లు చదివి సమగ్రంగా వున్నదని సంతృప్తి పడిన తర్వాతనే దీనిని పుస్తక రూపంలో ముద్రించాం. ముద్రణ ఖర్చు కూర్మయ్యగారే భరించారు. ఆయనకే దీనిని అంకితమిచ్చాను.

ప్రజాసేవకు, ముఖ్యంగా హరిజన సేవకు, అందులోనూ వ్యవసాయ కూలీలను ఒక బలమైన రాజకీయ వర్గంగా సంఘటిత పరచాలనే దీక్షకు అంకితమైన వాడు వేముల కూర్మయ్యగారు. నా విషయంలోనూ, సాహిత్యం విషయంలోనూ శ్రద్ధ వహించి కూలి రాజు ద్వారా నా ఉద్యమ సాహిత్యం వెలుగు చూడడానికి ఆర్థికంగా సహాయపడ్డవాడు కూడా కూర్మయ్య గారే. ఆయన మంత్రిగా వుండగానే ఈ నాటకాన్ని మద్రాసు ప్రభుత్వ సెక్రటేరియట్ తెలుగు సాంస్కృతిక సంఘం వారు ప్రదర్శించడం జరిగింది. అందుకు శ్రద్ధ తీసుకొన్న ఆఫీసర్లలో మంత్రి కూర్మయ్యగారి దగ్గర పర్సనల్ సెక్రటరీగా వున్న జనార్దన్ రావు నాయుడు గారు ముఖ్యులు. ఆయన సంగీత సాహిత్యాలలో అందె వేసిన చెయ్యి. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజమన్నార్‌గారి అధ్యక్షతలో మ్యూజియం థియేటర్‌లో జరిగిన తొలి ప్రదర్శన అత్యద్భుతంగా రక్తి కట్టింది. అందరి ప్రశంసలనూ అందుకొంది.

పద్యాలకూ, పాటలకూ, సర్వోదయ సోషలిస్టు వ్యవస్థకూ ప్రాధాన్యం ఇవ్వబడిన నాటకం ఇది. ఆనాడు ఈ నాటకానికి సంగీత దర్శకుడు సుప్రసిద్ధ సినీ, సంగీత దర్శకుడైన టి.వి. రాజు గారు.

ఈ నాటకాన్ని ఎవరైనా ఏ రూపంలో అయినా ప్రదర్శించుకోవచ్చు. తగు విధంగా ఎడిట్ చేసుకోవచ్చు. ఎన్నికల రంగం అక్కరలేదనుకొంటే మినహాయించు కోవచ్చు. ప్రధాన ఇతి వృత్తానికి భంగం కలిగించకుండా వుంటే చాలు.

ఈ కూలి రాజు ఇప్పుడు ఈ నాలుగో ముద్రణకు నోచుకొన్నదంటే అందుకు ప్రోత్సాహం ఇచ్చిన వాడు ముఖ్యంగా మిత్రుడు గనుమల జ్ఞానేశ్వర్. ఆయనకు నేనెంతో

కృతజ్ఞుడ్ని. ఈనాడు దళిత సాహిత్యం పేరుతో ఒక కొత్త శాఖ ప్రచారంలోకి వస్తూ వుంది. దానితో నాకు సంబంధం లేక పోయినా నా పేరునూ, నా రచనలనూ అక్కడక్కడ ఉదాహ రించడం జరుగుతూ వుంది. అట్టి వారిలో ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు శాఖ అధిపతి ఆచార్య ఆపదరావుగారు ముఖ్యులు. శివసాగర్ (సత్యమూర్తిగారు) మరొకరు. వారందరికీ, పాలేరు, కూలిరాజు నాటకాలపై నా సాహితీ షష్టి పూర్తి సంచికలో ఒక సమగ్ర విమర్శను ప్రకటించిన బొజ్జా తారకం గారికీ నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసి వుంది. ఇప్పుడు ఈ మాటలు వ్రాస్తూ 'జమీన్ రైతు' పత్రికలో చూసిన ఒక విషాద వార్తను బట్టి, నాకు సాంఘిక, రాజకీయ, ఆర్థిక, తాత్విక విషయాలలో అన్నగారి వంటి స్వర్ణవేమయ్య గారికి కూడా కృతజ్ఞతలు చెపుతున్నాను. వేమయ్యగారు నాకంటే సుమారు తొమ్మిది నెలలు పెద్ద. ఆయన 1-1-1911లో పుట్టి, 16-6-1995న కీర్తి శేషులయ్యారు. నాకు చిరకాల మిత్రులు. వ్యవసాయ కూలీ ఉద్యమకారులు. హరిజన నాయకులు. కమ్యూనిస్టు పార్టీ విశిష్ట కార్యకర్తలు. నాలుగుసార్లు శాసన సభ్యులైన వారు. అన్నిటికంటే ముఖ్యం వేదాంత తత్వవేత్తలు.

ఈ నాటకం ద్వారా వ్యవసాయకూలీ యూనియన్‌ను అఖిలభారత జాతీయ పార్టీగా ఎన్నికలలో గెలిపించడం జరిగింది. లక్ష్యం సోషలిస్టు వ్యవస్థ. అందుకే ఈ యూనియనును సర్వ భారత జనామోదకరమైన పేరుతో పిలవమచ్చు. ఆ పేరు సర్వోదయ సోషలిస్టు పార్టీ.

హైదరాబాద్ – భీమన్న

జూలై 1995.

మొదటి ముద్రణకు వ్రాసిన పరిచయం

''చేతికీ నోటికీ మధ్య వున్నదే అనంత మానవ చరిత్ర''

సామ్రాజ్యవాదంతో కాంగ్రెసు చివరి పోరాటాన్ని జరిపిన 1942లో ఈ నాటకం మొదట వ్రాయబడింది. ''కష్టజీవి' అనే పేరుతో ప్రదర్శింపబడింది. తర్వాత కొన్ని మార్పులు పొంది ''ధన్యజీవి'' అయింది. 1947లో 'నవజీవన' పత్రికలో సీరియల్‌గా ప్రకటించబడింది. మరికొన్ని మార్పులు చేసి 1948లో ఈ నాటకాన్ని ''కూలిరాజు'' అను పేర ప్రజలకు అందించాను. వ్యవసాయ కూలీ ఉద్యమాన్ని బలపరచడమే ఈ మార్పుల ఉద్దేశ్యం.

మన దేశంలో నూటికి 80 మంది వ్యవసాయం మీద బ్రతికేవారే. అందులో భూస్వాములు బహుకొద్దిమంది. వారిని తీసివేస్తే తక్కిన మెజారిటీ ప్రజలంతా పేదలే. ఎన్ని రాజకీయ పార్టీలైనా ఈ మెజారిటీ ప్రజలమీద ఆధారపడి బ్రతుకవలసినవే. కాగా ఎవరో ఒక భూస్వామి నాయకత్వం క్రింద, గొల్లవాడి క్రింద గొర్రెల్లాగ, ఈ పేద ప్రజలంతా నడవడంవల్ల ఏమీ లాభం లేదని, తమలో నుంచే ఒక నాయకుణ్ణి ఎన్నుకొని, తామంతా ఒక్క త్రాటిమీద నడిస్తే ఈ పేదలంతా తామే ప్రభుత్వ అధికారాన్ని చేబట్టగలరని ఈ నాటకం సూచిస్తుంది.

జగత్తు పరిణామ శీలం. ఎల్లప్పుడూ పురోగమిస్తూనే వుంటుంది. ఆ పురోగమనంలో ప్రాత శిథిలమై పోతూ క్రొత్త ఆవిర్భవిస్తూ వుంటుంది. అదే విప్లవం. విప్లవం ప్రకృతిసిద్ధం.

నేను ఈ నాటకంలో నిరుత్సాహ పరచింది. సాయుధ దౌర్జన్య విప్లవం మాత్రమే. కేవలం ఎన్నికల ద్వారానే సర్వోదయ సమాజాన్ని నిర్మించే అవకాశంగల నేడు దౌర్జన్య విప్లవం అనవసరం. సత్యం, అహింస, విశ్వమానవప్రేమ వీటి ద్వారా సర్వోదయ సమాజాన్ని రూపొందించడం గాంధీయిజం. అది వయోజన వోటింగుతో కూలీలు అధికారంలోకి రావడం ద్వారా సాధ్యం.

కులమత వర్గ రహితమైన స్వామ్య సమాజాన్ని గాంధేయ కార్యక్రమం ద్వారా సాధించడాన్ని ఇది చిత్రిస్తుంది.

ఇందులో అవసరమైన మార్పులు చెయ్యడంలోను, ఇది ప్రజల హస్తాల నలంకరించడంలోను, అనుక్షణమూ అమూల్యమైన సలహా సహాయాలతో నాకు గురువుగా, నాయకుడుగా ఎంతగానో తోడ్పడ్డ శ్రీ కూర్మయ్యగారి అపార వాత్సల్యానికి భక్తితో ఈ నాటకాన్ని అంకితం చేశాను. దీన ప్రజావనతకు, దరిద్రనారాయణ సేవకు జీవితాన్ని అంకితం చేసిన వ్యవసాయ కూలీ నాయకుడు కూర్మయ్యగారు.

రాజకీయాన్ని ఇతివృత్తంగా తీసుకుని రసవంతంగా నాటకం వ్రాయడం ఇసక నుండి నూనెను పిండడం వంటిది. ఈ సాహసంలో నేను ఎంతవరకు కృతకృత్యుణ్ణయ్యానో నిర్ణయించే బాధ్యత పాఠకులదీ, ప్రదర్శకులదీ, రసజ్ఞులదీను.

1948

మద్రాసు

–భీమన్న

పడిపోతున్న అడ్డుగోడలు

(ఏకాంకిక)

వర్ణాంతర వివాహాలు : కులతత్వము

వర్ణ వ్యవస్థ దుష్ఫలితాలకు, అస్పృశ్యతా వ్యాధికి మందు ఒక్క వర్ణాంతర వివాహాలు మాత్రమేనని నా ఆబాల్యోద్దేశం. అదే వుద్దేశంతో వ్రాసినట్టివే పాలేరు, కూలిరాజు మొదలైన నాటకాలు, తదితర కథలూను. అందులో ఈ నాటిక ఒకటి.

వర్ణ వ్యవస్థ ఏర్పడి, అంటరానితనం అమలులోకి వచ్చి ఎన్నో వేల సంవత్సరాలు గడిచాయి. ఆనాటి కాలానికి, అప్పటి సాంఘిక పరిస్థితులకు అటువంటి కట్టుబాట్లు, ''మనుస్మృతి'' లాంటి చట్ట నిబంధనలు అవసరమై వుండి వుంటాయి. ఈ కాలానికి అవి ఖిలమెక్కి విషతుల్యమైనాయే గాని, ఆ కాలానికి అవి పాతచింతకాయ పచ్చడి వలె అనేక సాంఘిక అవినీతులకు పథ్యంగా ఉపయోగపడి వుండి వుంటాయి. ఆ కాలంలో సమయానికి తగిన, అవసరమైన ఆర్డినెన్సులుగా, చట్టాలుగా ''మనుస్మృతి'' లాంటివి పనికివచ్చి వుండి వుంటాయి.

''హిందు'' అనే పేరు ఎవరో అప్రాచ్యులు పెట్టినట్టిది. అందుచేత, ఎప్పుడైనా పొరపాటున తప్ప నేను ఆ పేరు వాడను. నేను ''ఆర్ష'' పదాన్నే వాడతాను. మనది ఆర్షమతం. ఆర్ష ధర్మం. మన సంస్కృతి, సంప్రదాయం అంతా ఋషిప్రోక్తమే. వాల్మీకి, పరాశరుడు, వ్యాసుడు మొదలైనవారంతా ఋషులు. వారంతా నేటి లెక్క ప్రకారం శుద్ధ హరిజనులు, వెనుకబడిన జాతులవారున్ను. ఆనాడు వారు కులీనులే. మాన్యులే. మహనీయులే.

దేశంలో ప్రగతిగాములైన ఋషులు తగ్గిపోయి, సంఘ ప్రవాహం నిలిచిపోయి, ఎక్కడిదక్కడే పేరుకుపోయినందువల్ల వర్ణ వ్యవస్థ, కులభేదాలు, అస్పృశ్యత వగైరా పాచి, నాచు సంఘంలో ప్రవేశించాయి. దానితో అవినీతిని, అక్రమ ప్రవర్తనలను అరికట్టడం

కోసం ''చండాలస్య జనితో బ్రాహ్మణ్యాం వృషలేసయ'' వంటి నిర్వచనాలు బైలుదేరాయి. అనేకమైన ఆర్డినెన్సులు, చట్టాలు చేయబడ్డాయి. ఆ కాలానికి అది సరియైన విధానమే అయివుంటుంది.

అయితే, అది జరిగి ఎన్నో వేల యేండ్లు గడిచినవి గదా? ఇప్పుడు కాలం, పరిస్థితులు అన్నీ తారుమారుగా మారిపోయినవి గదా! ఇప్పటికీ అవే శాసనాలను అమలుపరచడం వివేకవంతమేనా? ఆర్డినెన్సులు ఆరు నెలలలో రద్దవుతాయి. చట్టాలను, సంవిధానాలను కూడ ఎప్పటికప్పుడు సవరించుకొంటూ వుంటాము. మరి ఎన్నో వేల సంవత్సరాల క్రితం చేయబడిన మనుస్మృతి లాంటి శాసనాలు ఎన్నడో రద్దుకావలసి వుండగా, వాటిని సవరణలైనా లేకుండా ఈనాటికీ అమలుపరచ జూడడం శుద్ధ అవివేకం కాదా?

ఈనాటికైనా అవన్నీ రద్దు అయి; వర్ణ వ్యవస్థ, కులతత్వం, అస్పృశ్యత వగైరా ముళ్ల పాదలు నరికివేయబడి; భారతజాతి, ఆర్ష సమాజం నవనవోన్మేషంగా ముందుకు పురోగ మించాలంటే తక్షణ కర్తవ్యం ఒక్క వర్ణాంతర వివాహాలేనని నేను గాఢంగా విశ్వసించాను.

మొన్న ఈ మధ్య, మాటల సందర్భంలో, శ్రీ నార్లవారు ఒక ప్రశ్న అడిగారు: ''సవర్ణ యువతులను వివాహం చేసుకొన్న హరిజన యువకులు ఇప్పుడు చాల మంది వున్నారు గదా, వారి వైవాహిక జీవితాలు అంత సుఖంగా వుండడంలేదని వింటున్నాను. నిజమేనా? నిజమైతే, అందుకు కారణమేమైవుంటుంది?'' అని.

కొంతవరకు నిజమే. విద్యావంతులైన హరిజన యువకులు కొందరు బ్రాహ్మణ యువతులను, బ్రాహ్మణేతర అమ్మాయిలను వివాహాలు చేసుకొన్నారు. వారి వైవాహిక జీవితాలు చాల వరకు సుఖంగానే వున్నాయని నేను అనుకుంటాను. అయితే, సాంఘిక రంగంలో కొన్ని చిక్కులు వస్తున్నాయి. అబ్బాయి తరపు బంధువులు అనాదరణకు లోనవు తున్నారు. ఆమెకు కొంత ఆధిక్యతా దృష్టి, అతనికి కొంత న్యూనతా భావం వుండక మానడం లేదు. ఆమె, ఆమె బంధువులు ఏమనుకొంటారోనన్న భయంతో

అతడు తన బంధువులను దూరంగా వుంచుతున్నాడు. తక్కిన హరిజన కుటుంబాలతో అన్యోన్యంగా కలవలేకపోతు న్నాడు. నిజానికి ఆమె ఏమీ అనుకోదు. అనుకొంటుం దేమోనని భయం. అతని భయాన్ని ఆమె లోకువగా తీసుకొంటుంది. ఆ పరిస్థితి అశాంతికి దారితీస్తుంది.

వర్ణాంతర వివాహాలు చేసుకునే హరిజన యువతీ యువకులు సుఖంగా వుండాలంటే వారిలో న్యూనతా భావం పూర్తిగా పోవాలి. అందుకు సంస్కారం కావాలి. వట్టి పోజు పెట్టడం చాలదు. ఆర్ష సంస్కృతిని అర్థం చేసుకోవాలి. కావ్య పురాణాది పూర్వ గ్రంథాలను చదివి, వాటి రహస్యాలను గ్రహించాలి. వట్టి పరీక్షలు ప్యాసు కావడం చాలదు. లలితకళలతో కొంచె మైనా పరిచయం సంపాదించాలి. మన మతాన్ని, మన వేదాంతాన్ని, మన ఆచార సంప్రదా యాలను శూన్యదృష్టితోగాక, ద్వేషబుద్ధితోగాక, విమర్శనా దృష్టితో, రహస్యాన్వేషణ జిజ్ఞాసతో, సహృదయతతో పరిశీలించాలి.

హరిజన యువకులు, తాము, తమ ఆచార వ్యవహారాలు, తమ పూర్వుల పద్ధతులు, ఆహార విహారాలు, సంప్రదాయాలు – ఏవీ కూడ న్యూనమైనవి కాదని, బాగా ఆలోచిస్తే – చాల ఉత్తమమైనట్టివని గుర్తించాలి. ''వాతాపిజీర్ణం'' వంటి వాక్యాలకు అర్థాలు మరచిపోయిన వారిచేత వాటిని గుర్తింపజెయ్యాలి. ఇదొక్కటే పరిష్కార మార్గం.

శ్రీ నార్లవారు ఒక సూచన చేశారు:

''ఒకే రకమైన ఆచార వ్యవహారాలు, ఆహార విహారాలు, సాంఘిక మర్యాదలు, ఆర్థిక స్థాయి గల కాపు, కమ్మ, రెడ్డి, రాజు కులాలవారిలో ముందు వర్ణాంతర వివాహాలు జరిగితే అవి జయప్రదమై, బలమైన ఈ నాలుగు కులాలు ఒకటిగా కలిసిపోగలవు. ఆ తరువాత ఆ చివర బ్రాహ్మణులను, ఈ చివర హరిజనులను సులువుగా కలుపుకోవచ్చును'' అని.

చక్కని సూచన. ఇది ఒక ఉద్యమంగా ప్రారంభం కావలసి వుంది.

ఒక హరిజన బాలిక ఒక బ్రాహ్మణ గృహంలో బ్రాహ్మణ బాలికగానే చెలామణీ అయి, ఛాందసుల ప్రశంసకు కూడ పాత్రమై, ఆ యింటి కోడలుగా గ్రహింపబడ్డ కథ

ఈ నాటికకు ఇతి వృత్తం. అరుంధతీ చరిత్ర లాంటివి పూర్వం కూడ ఎన్నో వున్నాయి. ''మాతంగీ'' అని పార్వతీదేవి కీర్తింపబడింది. కులతత్వ వ్యాధి సోకని సత్యకాల మది. అస్పృశ్యతకు ఆస్కారమే లేదప్పుడు, ఇప్పుడున్నదంతా పాతిత్యమే గదా.

ఈ నాటికను నేను వ్రాయడానికి కారకులైన శ్రీ బుచ్చిబాబు గారికిని, దీనిని ప్రచురించిన హరిజన సేవక సంఘం వారికిని నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. సాంస్కృతిక అభివృద్ధే నిజమైన అభివృద్ధిగా గుర్తించి హరిజన సేవచేస్తున్న తజ్ఞులందరికీ నా వందనాలు.

-భీమన్న

❀ ❀ ❀

మానవుని మరొక మజిలీ

(సంగీత నృత్య నాటకం)

ఒక మాట

ఆనందములో పుట్టి, అడుగడుగునా ఆనందమే దర్శకత్వం వహించి నడుపుతుండగా, ఆనందమే లక్ష్యంగా మానవుడెలా ముందుకు సాగుతున్నాడో – ఒక ఆనందమయ రీతిలో చూపడం ఈ దృశ్యకావ్యం వుద్దేశం.

ప్రకృతి విజ్ఞానం ఎంత పెరిగినా, అదేమిటో తెలుసుకోగలడే గాని, ఎందుకో తెలుసుకోలేడు మానవుడు! ప్రకృతి గర్భంలో ఒక అంశగా పుట్టి పెరుగుతున్న వాడు, ప్రకృతి మూలాన్నే తెలుసుకోదలచడం, తనను తాను తినేసి, ఇంకా రూపంతో మిగిలి వుండదలచడమే!

రెండు సర్పాలు ఒకదాని తోక నొకటి గ్రహించి మ్రింగుతూ, ఒకదానొక్కటి పూర్తిగా మ్రింగివేయడం ఎంత సాధ్యమో – ప్రకృతి తత్త్వాన్ని తెలుసుకోవడం కూడ మానవుడి కంతే సాధ్యం. మనిషి కడుపులోని నులి పురుగు మానవ స్వరూప స్వభావ నిర్ణయం కోసం పరిశోధన చెయ్యడం వంటిదే, విశ్వ గర్భంలోని మానవుడు చేసే విశ్వపరిశోధన.

మానవుని తాత్కాలిక దైనందిన అవసరాలకు, సౌకర్యాలకు, వినోదాలకు ప్రకృతి శక్తుల్ని వాడుకోవడం వరకే శాస్త్ర విజ్ఞానం ఉపయోగపడేది. అంతకు మించి అదెంత పెరిగితే, అంత భారం మానవ జాతి మనుగడ కది!

ఒక్క పరమాణువును పగలగొట్ట గలిగినందుకే వొళ్లు తెలియని గర్వంతో పైశాచిక నృత్యం చేస్తున్నాడు మానవుడు. క్షణానికి ఎన్ని కోట్ల పరమాణువులు పగిలితే ఒక్క స్వయం చోదిత జీవాణువు ఉద్భవిస్తున్నదో, క్షణానికి అలాంటి ఎన్ని కోట్ల జీవాణువులు పగిలితే తన హృదయం స్పందించి, బుద్ధి పనిచేస్తున్నదో వూహించనైనా కలడా?

ఇంత మహా విశ్వం, ఇన్ని కోట్ల జీవరాశులు, మానవ కోట్లు పుట్టి, పెరిగి, పని చెయ్యడానికి నిత్యం ఎంత పరమాణు శక్తి వినియోగించబడుతున్నదో! అట్టి మహాశక్త్యుత్పాదక పరమ కేంద్రం ఎక్కడ వున్నదో! దాని డైరెక్టరు ఎవరో! ఎంతటి వాడో!

ప్రకృతి పుట్టుకను గురించి, మానవుని అవతరణను గురించి, ఈ నాటకంలో నేను చేసిన వూహ సత్యానికి, ధర్మానికీ అనుగుణమైనట్టిదే; కేవల కల్పనా చమత్కృతి మాత్రమే కాదు. సత్యం ఎంత సుందరమో, ధర్మం ఎంత ఆనందకరమో చూడడానికి ప్రగాఢమైన అంతర్దృష్టి అవసరం. జిజ్ఞాస, నిరంతర పరిశీలన, ఏకాగ్ర భావన వున్నప్పుడే సాధ్యం.

ఈ గేయ నాటకంలో, ఒక్క స్వయం ప్రభ పాత్రను ఈ దృష్టితో చూస్తే చాలు. తక్కినదంతా సులభ గ్రాహ్యమే.

సంగీత నృత్య రూపకంగా ప్రదర్శించడానికి వీలుగా, ఏ రంగానికారంగం భావసమగ్రంగా వుండేటట్టు కొంత శ్రద్ధ వహించాను. పూర్వాపరాల వివరణతో, ఏ ఒక్క రంగాన్నైనా విడిగా ప్రదర్శించవచ్చు – సంగీత నృత్యరూపకంగా. అందుకే, పాడుకోడానికి వీలైన సాధారణ గేయ ఛందస్సులనే వాడాను ఇందులో.

నలభై ఏండ్ల క్రితం ప్రారంభించి, ఐదేండ్ల క్రితం వరకు, తోచినప్పుడెల్లా మార్పులు చేసుకొంటూ వచ్చిన నాటకం ఇది. సంగీత సాహిత్యాలకు సమానమైన ప్రాధాన్యం ఇచ్చా నిందులో. సృష్టి జరిగిన తీరును ఊహించి, మానవుని క్రమ వికాసాన్ని వైజ్ఞానిక దృష్టితో అణుయుగం వరకు వర్ణించి చెప్పాను – నేను దర్శించిన విధంగా.

ఈ గేయ దృశ్య కావ్యాన్ని పూజ్యపాదులైన మాన్య శ్రీ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారికి అంకితం ఇస్తున్నాను – భక్త్యభివందనాలతో.

దీన్ని రమారమి సంవత్సరమున్నర పాటు సీరియలుగా ప్రకటించిన ప్రవంతి పత్రికా సంపాదకులకు – ముఖ్యంగా – శ్రీ లక్ష్మీనారాయణ శర్మ, శ్రీ సి.నారాయణరెడ్డి, శ్రీ గిడుగు రామమూర్తిగార్లకు, సులేఖా నికేతనం వారికి, కృతజ్ఞుణ్ని.

– రచయిత

పైరు పాట

ప్రస్తావన:

ఇది ''పైరు పాట''. పైరు చేలు, పచ్చికబీళ్లూ, అచ్చటి గడ్డి పిల్లలూ, కుర్రవాళ్ల షికార్లూ, ఈ పాటకు ఆలంబన. సంగీతరూపకంగా ప్రదర్శించవచ్చు దీన్ని. నృత్యాన్ని జోడించనూ వచ్చు. ఒకప్పుడు ఆకాశవాణిలో ఇది ప్రసారిత మయింది కూడ.

దీన్ని వ్రాసి కూడ పాతికేళ్ళయిందంటే కొందరు విమర్శకులు ''టూ లేట్'' అని పెదవి విరవవచ్చు. నా దృష్టిలో సాహిత్యానికి లేటు అనేది లేదు. ఉన్నదనుకొన్నా, చేసేది కూడ ఏమి లేదు. ఎందుకంటే ఇలాంటివే (నేను పాతికేళ్ళ క్రితం వ్రాసినవే) రకరకాల కావ్యాలు ఇంకా ఒక డజను వరకూ నా దగ్గర అముద్రితాలుగా పడి వున్నాయి కాబట్టి.

బహుశా పన్నెండేళ్ళ క్రితం, ఇది ''స్నేహ సుందరి'' అనే పేరుతో ఒకవారపత్రికలో సీరియలుగా ప్రకటించబడి, కొన్ని రీపింట్లు కూడ తీయబడింది. ఇప్పుడు దీన్ని పెంచి, పరిష్కరించి ప్రకటిస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ సంజీవయ్య గారికి ఈ ''పైరుపాట''ను కృతి ఇస్తున్నాను. వారు సహృదయులు. సంగీత సాహిత్యాలలో మంచి ప్రవేశమున్నవారు. ఎనిమిదేళ్ళ క్రితం ''మధుబాల''ను కృతి ఇచ్చానువారికి. ఇప్పుడీ పేద పిల్లను స్వీకరిస్తున్నందుకు వారికి నేనెంతో కృతజ్ఞుణ్ని.

సంస్కృతీ సంవర్ధక సమితిని చాలకాలం తమతోపాటు గజ్జగట్టి ఆడించిన శ్రీ నంబూరి శ్రీనివాసరావుగారు, మూడేండ్లుగా దానికొక స్థిర రూపం కల్పించి నడుపుతున్నారు. ఈ సమితి తరపున ''రాగవాసిష్ఠం'' వలెనే దీనిని కూడ వారు ప్రకటించి పెట్టడం చాల సంతోషం.

తెలుగుకు పరభాషా సాహిత్యం తప్ప, సొంత సాహిత్యం ఎంతో లేదు. అందువల్లనే సొంతంగా ఆలోచించే విమర్శకులు కూడ బహుతక్కువ. లేరన్నా అతిశయోక్తికాదు.

రాతియుగం నాటి విమర్శనా ప్రమాణాలతోనే అణుయుగం నాటి నవసాహిత్యాన్ని కూడ కొలవడం మన దేశానికే చెల్లింది. కాలంతోపాటు సమాజమూ, సమాజంతోపాటు సాహిత్యరీతీ, దానితోపాటు విమర్శనా పద్ధతీ పురోగమించాలి. అందుకు దేశం సోచుకోలేదు.

ఏది ఏమైనా, ఇది నా స్వీయ సృష్టిలో మరొకమూర్తి. సహృదయుల చేతుల్లో పెడుతున్నాను. ముళ్లు గుచ్చుకొన్నా తీగలొత్తిగించి చూడగలవారికి ఆకులమాటున అరుణకాంతులు వెదజల్లే పుష్పాలు లభించకపోవు.

దీన్ని నృత్య సంగీత రూపకంగా ప్రదర్శించవచ్చు. రంగాలు కాలగమనాన్ని సూచించేవి మాత్రమే. మొదటి ఆరు రంగాలకూ దృశ్యం ఒకటే. ఏడవ రంగంలో మార్పు కుటీరం మాత్రమే. ఇది చిన్న రంగం. ఒక్క చిన్న అమ్మాయితో ఏ పెండ్లి సందర్భంలోనైనా ఈ రంగం ప్రదర్శించవచ్చు. పాడగల ఒక అమ్మాయి శీలగా నటిస్తే చాలు. వధూవరులే తక్కిన రెండు పాత్రలు కాగలరు.

–భీమన్న

* * *

అంకితము

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

మాన్యశ్రీ సంజీవయ్యగారికి

శ్రీ దామోదర వంశ వర్ధనుడు
సంజీవయ్య సంజీవనీ
స్వాదుత్వమ్మున ముఖ్యమంత్రియయి ని
ల్వన్ నిల్చె దేశమ్ము ల
క్ష్మీ ధృజ్మోద, ముమామనోహరము, భ్రా
హ్మీ రంజకమ్మౌచు; వే
దా దర్శమ్ముల పంట పండినవి నే
డాంధ్రాళి చిత్ క్షేత్రముల్!

వేదవిభజన చేసి, వేదాంతమును చెప్పి,
భరతవంశము నిల్పి, భగవానుడైన వే
దవ్యాస ఋషి గొల్చి-తత్పరంపరలోని
సంపూర్ణ మూర్తియౌ సంజీవయ నుతింతు.

కుడు మరచిన జీవకరణి సంజీవ నీ
మంత్రమ్ము, ఉద్ధరింపగ దీనమానవుల,
తుంగభద్రా ప్రతీరాంగణములోన సం
జీవయాఖ్య జనించి జీవామృతము పంచె!

మున్నయార్యుని ఎన్ని యెన్ని కోర్కెల ఫలమొ
సుంకలాంబా గర్భశుక్తి ముక్తాఫలము!
కాంతికై ఎంత చీకటి యెట్లు వేగెనో
పట్టపగలైన దొక ప్రాభాత సమయమే!

పుణ్యనారాయణీ బుచ్చయార్యుల పుత్రి
కృష్ణవేణీ సాధ్వి కేలువట్టిన నాడె
ఆంధ్ర-తెలంగాణ మాంధ్రప్రదేశ మయె!
ఆంధ్రప్రదేశ మిపు డవనికే వెలుగయ్యె!

పాలకడలి నడిబొడ్డున
పద్మము వికసించె,
అవ్యవస్థ కడుపు నుండి
హరి-జనుడై జనించె!

సాగులేని నేల విరిసి
శాలి యెన్ను మేసె,
అలమటించు ఆశాతతి
కదే విందుచేసె!

రాయలతో ఏగిన సా
రస్వత రవిచంద్రిక
ఉదయించెను ప్రతియాంధ్రుని
హృదయాబ్జము మురియగ!

అవైదికము, అభారతీ
యము నౌ వర్గ భేదము
సమసి, నేడు వెలసె సర్వ
జన శ్రేయోరాజ్యము.

బాపూజీ కలలు నేడు
రూపముగొని నిలిచె,
శక్తిని గుర్తింప త్యాగ
శక్తుల నిటు మలిచె.

భారత మేకైక జాతి
ప్రబలమైన హేతి,
ప్రపంచమున మెరిసె నేడు
పాశుపతము రీతి.

అడుగు నుండి మెట్టు మెట్టు
అధిరోహించిన రవికి
ఆకాశములో తారల
ఆక్షేపణ దేనికి?

వదనముపై చిరునవ్వు,
ఎదలో కరుణారసము,
కరమున చక్రము, దామో
దర వరాంశ నీది!

చాతుర్యమే సర్వజనశక్తి నేడు,
విజ్ఞానమే విశ్వవిజయమ్ము నేడు,
సర్వశక్తులు సరస్వతి చేత కలవు,
సారస్వతుడ వీవు, సంజీవి విలకు.

''మధుబాల'' నొసగి సమ్మానించితిని నాడు,
మంత్రి వప్పుడు; ముఖ్యమంత్రి వీప్పుడు; ''పైరు
పాట'' నిత్తును నేడు పట్టంపురాణిగా,
ముద్దుగా స్వీకరింపుమయ! సంజీవయా!

ఇది నృత్యగాన సాహితి,
బ్రదుకున సుఖమిచ్చు పదసరస్వతి, ప్రేమా
స్పద; దీని నేలుకొను, మ
భ్యుదయ మ్మగు మీకు మాకు, ముఖ్యామాత్యా!

-భీమన్న

రాగవాసిష్ఠం

ఈ నాటకం బయోడేటా

''అరుంధతి''ని గురించిన రకరకాల కథలు నా చిన్నప్పుడే విన్నాను. మొత్తం మానవ చరిత్రలోనే అతి గొప్ప మహిళ అరుంధతి. అంతటి మహితాత్మ మా ఇంటి ఆడపడుచు అయివున్నందుకు గర్వపడ్డాను.

అరుంధతిని గురించి ఏదో వ్రాయాలనుకుంటూ ఉండేవాణ్ణి. పద్యాలూ, పాటలూ వ్రాస్తూ, చింపేస్తూ వుండేవాడిని. చివరకు అరుంధతీ కల్యాణం నాటకంగా వ్రాయాలనే సంకల్పం నేను కాలేజీలో చేరినప్పుడు, 1931లో కలిగింది. ఆమె గురించిన సాహిత్యం ఎక్కడ కనిపించినా చదువుతూ, వివిధ ఉదంతాలను సమన్వయపరచుకుంటూ ఒక కథ తయారుచేసుకుని నాటకంగా వ్రాశాను.

నా రచనలలో అత్యధిక భాగం నా విద్యార్థి దశలో వ్రాసినవే. నచ్చని వాటిని చింపి పారవేసినా, నచ్చిన వాటిని అలా వుంచేసుకుంటూ వచ్చాను. తోచినప్పుడెల్లా ఒక్కొక్క రచనను తీసి అప్పటి మనస్తత్వాన్ని బట్టి మార్పులూ, చేర్పులూ చేసుకొంటూ వచ్చాను. వాటిలో ఈ అరుంధతీ కల్యాణం ఒకటి.

1941లో, నేను రాజోలు హైస్కూలులో టీచరుగా వున్నప్పుడు, అక్కడి గొల్ల చంద్రయ్య గారి హాస్టలు విద్యార్థుల చేత ఈ నాటకాన్ని ప్రదర్శింపచేసి ప్రశంసలు అందుకొన్నాను.

తరువాత 1951 ప్రాంతంలో నేను మద్రాసులో ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో వున్నప్పుడు, దీని వ్రాత ప్రతిని ఎడిటరు నార్ల వెంకటేశ్వర రావు గారికి ఇచ్చాను. నా ఉద్దేశం ఆయనకు నచ్చితే ఆంధ్రప్రభలో సీరియలుగా ప్రకటించవచ్చునని. అయితే రెండు రోజుల తర్వాత ఆయన వ్రాత ప్రతిని తిరిగి ఇచ్చివేశారు. రచన బాగున్నదనీ, కానీ భావాలలో కాంప్రమైజింగ్ వైఖరి మంచిది కాదనీ, ఒక హరిజనుడి కలం నుంచి వెలువడే రచన ఏదైనా నరికినట్టుండాలనీ అని, గ్రంథం ప్రింటయిన తరువాత తనకొక ప్రతిని ఇమ్మన్నారు.

నార్ల వారి గది నుంచి నేను బయటికి రాగానే, ఫలితం కోసం ఎదురుచూస్తున్న సహచర మిత్రులు, ముఖ్యంగా తిరుమల రామచంద్రగారు, నా ముఖంకేసి ప్రశ్నార్థకాలు విసిరినప్పుడు, ''నరికినట్టుండాలని అన్నారు'' అని జవాబిచ్చాను.

''ఎవరిని?'' అన్నారెవరో. నవ్వుకొన్నాం.

ఇలాంటి సందర్భాలు అంతకు ముందు, ఆ తరువాత కూడా ఏర్పడి వున్నాయి. ఎవర్ని నరకాలో నాకర్థం కాకనే ఆర్యద్రావిడులు, దేవ దానవులు, సురులు, అసురులు, అవర్ణులు, సవర్ణులు – ఇలాంటి వైర సమాజాలన్నీ జాతిపరంగా వేరు వేరు కాదనీ, అందరూ రక్త సంబంధీకులేననీ, ఒకరినొకరు నరుక్కోవలసిన అవసరం లేదనీ, కలిసి బ్రతకవచ్చుననీ నేను నా రచనలో సమయం దొరికినప్పుడెల్లా ప్రబోధించుకుంటూ వస్తున్నాను. నా సమన్వయ ధోరణిని, కాంప్రమైజింగ్‌వైఖరిని నేను స్థిత ప్రజ్ఞతో నమ్మిన వాణ్ణి. ఎంత ఒత్తిడి కింద కూడా మార్చుకోదలిచిన వాణ్ణి కాదు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, మేము హైదరాబాదుకు చేరుకున్న తరువాత, మంత్రి దామోదరం సంజీవయ్య గారితో సాహిత్యపరంగానూ, సంఘ సేవా పరంగానూ నేను చాలా సన్నిహితంగా వుండే వాణ్ణి. తరచు ఆయన అధికార పర్యటనలలో నేను కూడా వెళ్ళి సభలలో ప్రసంగించేవాణ్ణి. నా ప్రసంగాలలోని వస్తువు సాధారణంగా అరుంధతి చుట్టూ తిరుగుతూ వుండేది. హరిజనుల పుట్టు పూర్వోత్తరాలను గురించి ప్రాచీన సాహిత్య ఆశ్రమాలలో నేను జరిపిన పరిశోధనలకు సంబంధించి వుండేది. స్పృశ్య కులాలు, అస్పృశ్యకులాలు కూడా ఒకే రక్త సంబంధ జాతికి చెందిన వాళ్ళనే నా సిద్ధాంతాన్ని బలవత్తరం చేసేదిగా వుండేది.

బహుశా 1958లో అనుకుంటాను, హరిజన సేవా సంఘ రాష్ట్ర సభలు నెల్లూరులో జరిగినప్పుడు సంజీవయ్యగారు, నేను ఆయన కారులో బయలుదేరి, దారి పొడుగునా సంగీత, సాహిత్య సమారాధన జరుపుకొంటూ నెల్లూరు వెళ్ళాం. ఆ సభలలో నా ప్రసంగం చాలా మంది పెద్దలను ఆకర్షించింది. సంజీవయ్యగారు, వేముల కూర్మయ్యగారు, చెరకువాడ నరసింహంగారు వంటి ప్రముఖులు ఆ నా ప్రసంగాన్ని గ్రంథ రూపంలో వెలువరించ వలసిందిగా గట్టిగాకోరడం జరిగింది.

ఆ తరువాత దాని గురించి ఎవరూ అంతగా పట్టించుకోకపోయినా మిత్రులు సాక పేములు గారు నన్ను వదిలి పెట్టలేదు.

''వ్రాయడం పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి భావాలే వున్న నా రచనలు చాలానే వున్నై ప్రింటు కాకుండా'' అని నేనన్నప్పుడు, ''నేను ప్రింటు చేయిస్తాను. మీరు వ్రాయండి'' అన్నాడాయన.

పేములు గారు నెల్లూరు సభలో నా ప్రసంగం విన్నవాడే. అప్పటికి ఆయన సోషల్ వెల్ఫేర్ శాఖ డైరెక్టరుకు పర్సనల్ సెక్రటరీ అనుకొంటాను. ఆ విధంగా, హరిజనుల పుట్టు పూర్వోత్తరాలను గురించిన నా పరిశోధన ''హరిజనులు ఆర్యులే'' అనే వ్యాసంగా తయారై అరుంధతీ కళ్యాణం నాటకంకి పీఠికగా చేరి అచ్చయింది.

యోగవాసిష్ఠం, జ్ఞానవాసిష్ఠం అనే పేర్లతో అదివరకే వసిష్ఠుడి గురించిన గ్రంథాలున్నై. అందువల్ల ఈ అరుంధతీ కళ్యాణానికి రాగవాసిష్ఠం అని పేరు పెట్టాను. రాగవాసిష్ఠం అంటే వసిష్ఠుడి యొక్క రాగం, అనురాగం, ప్రేమ, పెళ్ళి అని అర్థం.

పేములుగారు అన్నమాట ప్రకారం ఈ గ్రంథం ముద్రణ ఖర్చులను భరించడమే కాక, దీనిని ప్రజలకు అందజేయడంలో కూడా చాల తోడ్పడ్డారు. అటు తర్వాత ఆయన ఐఎఎస్ ఆఫీసరుగా వివిధ పదవులలో పనిచేస్తున్నప్పుడు కూడా నా సాహిత్యానికి పోషకులుగా వుంటూనే వచ్చారు. అంతటి ఉన్నత సంస్కారులూ, ఉదారులూ, కళాపోషకులూ హరిజన విద్యాధికులలో చాల అరుదు.

పేములు గారిది వసిష్ఠ గోదావరికి కుడిపైపు. నాది ఎడమపైపు. అంకిత పద్యంలోని ''ఇద్దరి అద్దరి'' అంటే అవే.

ఇక్కడ తమాషా ఏమిటంటే – నేను ఏ అస్పృశ్యులనబడే వాళ్ళకు ఆత్మవిశ్వాసం, సుపీరియారిటీ మనస్తత్వం కలిగించడానికి ఈ గ్రంథాన్ని వ్రాసి ప్రకటించానో వాళ్ళలో ఎంతో మంది దీన్ని చదవనే లేదు.

కాని, సవర్ణ హిందువులలో మాత్రం ఎక్కువ మంది చదివారు. పండితులూ, మేధావులూ మెచ్చుకొన్నారు. హరిజనుల వారసత్వం గురించి నేను ప్రతిపాదించిన

సిద్ధాంతం సరైనదేనని అంగీకరించారు. అందుకు తార్కాణం ఈ నాటకాన్ని 1961-70 మధ్య ఉస్మానియా యూనివర్సిటీ బిఎ, బిఎస్సీ, బికామ్ క్లాసులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించడం.

అప్పటి యూనివర్సిటీలోని తెలుగు శాఖాధిపతి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు మా ఇంటికిమనిషిని పంపి ఈ పుస్తకాన్ని తెప్పించుకుని పాఠ్యగ్రంథంగా నిర్ణయించటం జరిగింది. ఈ విషయంలో ఆయనకు సహకరించిన ఆచార్య నిడదవోలు వెంకటరావుగారికీ, డా. దివాకర్ల వెంకటావధాని గారికీ, డా. బి.రామరాజుగారికీ నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. ఈ నాటకాన్ని విద్యార్థులకు అందించే బాధ్యతను స్వీకరించి, నాకు ఆర్థికంగా ఎంతో తోడ్పడిన శ్రీరామా అండ్ కో అధినేతలు పబ్బా శంకరయ్యగారి ఔదార్యం విస్మరించరానిది.

ఈ నాటకాన్ని చాలా చోట్ల ప్రదర్శించారు కానీ, రచనా పాకం కొంచెం ఎక్కువ చిక్కగా వుండడంవల్ల పాలేరు నాటకం వలే ప్రజలలోకి చొచ్చుకు వెళ్ళలేకపోయింది.

1971లో మా స్వగ్రామం మామిడికుదురులో ఆనాటి జిల్లా కలెక్టరు లింగం మాలకొండయ్యగారి ప్రోత్సాహంతో, ఎంతో వైభవంగా నా షష్టిపూర్తి జరిగినప్పుడు - కాకినాడకు చెందిన ఒక నాటక సమాజం వారు ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అప్పుడు ఆ ఉత్సవంలో పాల్గొని, నాటక ప్రదర్శనను దర్శించిన డా. సి.నారాయణ రెడ్డి, జె.బాపురెడ్డి, జె.యం.గిర్‌గ్లాని, లింగం మాలకొండయ్య, పోతుకూచి సాంబశివరావు మున్నగు అగ్ర సాహితీ వేత్తలు ప్రదర్శనను బహుధా మెచ్చుకొన్నారు.

ఈ రచనపై భారతిలో గొప్ప రివ్యూ వచ్చింది. చుక్కాని పత్రికలో సంధ్య పాత్రపై వచ్చిన విమర్శకు జవాబుగా బొజ్జా తారకం గారిచ్చిన జవాబు ప్రతిభా ప్రపుల్లంగా వుంది. ఇది పాఠ్యగ్రంథమైనప్పుడు, దీనిని గురించి పండిత త్రయం వారు తమ గైడులో వ్రాసిన వ్యాఖ్యానం బహు విశిష్టంగా వుంది. సంధ్య పాత్ర చిత్రణ నభూతో నభవిష్యతి అంటూ డా. కేతవరపు రామకోటి శాస్త్రిగారు చేసిన ప్రశంస నాకు గర్వకారణమే అయింది.

సవర్ణ హిందువుల కులవ్యవస్థను ఖండిస్తూ చేసిన విమర్శ చాలా సూటిగానూ, వాస్తవంగానూ, ఫ్రాంక్‌గానూ ఉన్నదనీ, అయితే అందులో బిట్టర్‌నెస్ (Bitterness)

లేకపోవడం విమర్శకు ఉదాత్తత చేకూర్చిందనీ అప్పటి స్వతంత్ర పత్రిక సంపాదకులు గోరాశాస్త్రి గారు, మిత్రులు గోపాల చక్రవర్తిగారు చాలా మెచ్చుకున్నారు. వీరందరికీ, ఇంకా అనేక మంది సహృదయ మిత్రులకూ సదా నేను కృతజ్ఞుణ్ణి.

ఇక్కడ కొత్తగా ఒక్కమాట-

జాతీయ సమైక్యానికీ, ముఖ్యంగా హైందవ సమాజ సమైక్యానికీ, కుల విద్వేషాల నిర్మూలనకీ దోహదం చేసే ఈ నాటకం గురించి - భాషా, సాహిత్యాలను, సనాతన ధర్మ ప్రవర్తనను ఎంతో ఉన్నత స్థాయిలో ప్రదర్శించి చూపిన ఈ నాటకం గురించి - ఆంధ్ర కవి పండిత మేధావులచే యూనివర్శిటీ డిగ్రీ క్లాసులకు రెండు టర్ములపాటు పాఠాలు చెప్పబడి ప్రశంసల నందుకొన్న ఈ నాటకం గురించి - 1970 తరువాత ఇంతవరకూ ఎవరూ పట్టించుకోలేదంటే ఏమనుకోవాలి? ఈ జాతి స్తబ్ధతకు చికిత్స ఏమిటి?

మరొక్కమాట-

''అరుంధతిపై ఫిల్మ్ తీయాలనుకొంటున్నాం మేము, అందుకు మీ సలహా సహకారాలు అవసర''మని ఎవరో కొందరు పెద్ద మనుషులు నా వద్దకు వచ్చి, ఈ నాటకం ప్రతులు రెండు తీసుకొని, మళ్ళీ వస్తామని చెప్పి వెళ్ళారు. కానీ మళ్ళీ రాలేదు. కొంతకాలానికి అరుంధతి పిక్చరు విడుదలైంది. అది నా కథకు పూర్తిగా భిన్నంగా వుంది. అరుంధతి ఒక హరిజనేతర మహిళగా చిత్రించబడింది.

అందుకు నిరసనగా ఆనాటి హరిజన శాసన సభ్యులు, తదితర యువకులు ఆందోళన చేసి ఆ పిక్చరును నిషేధింపచేశారు. ఆ ఆందోళన వెనుక నేనున్నాననే ప్రచారం కూడా చేశారు దాని ప్రొడ్యూసర్లు. అవి కాసు బ్రహ్మానందరెడ్డి గారు ముఖ్యమంత్రిగా వున్న రోజులు. రెడ్డిగారు నా ఎదరనే ఆ ప్రొడ్యూసర్లను తీవ్రంగా మందలించారు కూడా.

సినీమా రంగంలో నా పేరు కనిపించకుండా సవర్ణ హిందూ శూద్ర దొరలు తీసుకొన్న జాగ్రత్తలలో ఇది రెండోది. మొదటిది నా పాలేరు సందర్భంలో. మూడోది ఈ మధ్య అంబేద్కరు పిక్చరు తీయబడిన సందర్భంలో. హిందూ సమాజంలోని ఈ అజ్ఞాన అమానుషత్వం ఇక మారదా?

ఇప్పుడు మళ్ళీ ఈ నాటకాన్ని పునర్ముద్రిస్తున్నాను. ఇది అయిదవ ముద్రణ – స్వీకరించండి.

భారత సమాజం మొత్తం అంతా ఒకే జాతి, కుల, వర్ణ, మత భేదాలు కృత్రిమ మైనట్టివి. ఈ ఏకత్వాన్ని సాధించడానికే నా ఈ పౌరాణిక పరిశోధనలు, నా ఈ పీఠికలూ, ప్రస్తావనలూ.

జూన్, 1993 –భీమన్న

1949 మొదటి ముద్రణ పీఠిక – ప్రస్తావన

హరిజనులు ఆర్యులే:

ఘనశాస్త్ర చర్చతో, హరి
జను లార్య లటంచు చూపి, జాతి సమైక్య
మ్మును తెల్పిన మహితాత్మ్యుని,
వినుతింతును మంగిపూడి వేంకట శర్మన్!

''హరిజనులు ఆర్యులే'' అనే నా సిద్ధాంతానికి త్రోవ చూపినవారు శ్రీ మంగిపూడి వేంకటశర్మగారు. ఆయన మహాకవి, మహాఋషి. ఆయన వ్రాసిన ''నిరుద్ధ భారతం'' ఆధునిక సాహిత్యంలో మకుటాయమానం. అది ఒక్క హరిజనులకే కాక, భారత జాతి సమైక్యాన్ని నిజంగా కాంక్షించే ప్రతివ్యక్తికీ పారాయణ గ్రంథం, నోబులు ప్రైజుకే అర్హమైన రచన.

''వ్యాస మునిచంద్రు గన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షి యయ్యె,
వేశ్యకును పుట్టి, మాలెత బెండ్లియాడి,
ఆ వసిష్ఠ మహర్షి బ్రహ్మర్షి యయ్యె.''

– నిరుద్ధ భారతం

చాలా కాలం క్రితమే, అనగా నా విద్యార్థి రోజుల్లోనే, ఈ పద్యం నన్ను ఆకర్షించి, నాలో ఆలోచనలను రేకెత్తించింది. హరిజనులు ఆర్యులే నన్న భావం నాకు కలగడానికి ఈ పద్యం ఆధారం. అదే నన్ను ఈ ''రాగవాసిష్ఠ'' నాటకాన్ని వ్రాయడానికి పురికొల్పింది. అందుకే శ్రీ శర్మగారికి ప్రారంభంలోనే భక్త్యంజలి సమర్పించుకొంటున్నాను.

హరిజనులు ఆర్యులే అని ఋజువు చేసే ముందు, హరిజను లెవరో చెప్పాలిగదా. ఆంధ్రప్రదేశంలో ముఖ్యంగా మాల, మాదిగ, రెల్లి వగైరా కులాలను ''హరిజనులు'' అని అంటున్నాం. అంటరానివారనబడే వారందరికీ కలిపి మహాత్ముడు పెట్టిన పేరిది. నేను కూడ ఈ వ్యాసంలో సౌకర్యం కోసం ఈ హరిజన శబ్దాన్నే వాడుతున్నాను.

మారన కృతమైన హరిశ్చంద్రోపాఖ్యానంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుణ్ణి వీరబాహుడికి అమ్మజూపినప్పుడు, తనను చండాలుడికి అమ్మవద్దని హరిశ్చంద్రుడు ప్రతిమాలాడు:

''కరుణిన్ జూడుము, కావు మిప్పుడు త్రిలో
క స్తుత్య! చండాల సం
కర దోషమ్మును పొందకుండగ నసున్
గైకొమ్ము నీ బంటుగా...''

ఇలా ప్రతిమాలగా, విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడితో–

''... నను గొల్చు బంటువై
దక్కితి గాన, మాలనికి
దక్కగ నమ్మితి నేను నిన్ను...''

అంటాడు. అని – అలానే అమ్మేసి ధనం తీసుకుపోతాడు.

(ఆ కాలంలో చక్రవర్తిని కొనగలిగిన సామర్థ్యం ఒక్క చండాలుడికే ఉన్నదన్న మాట!)

ఇక్కడ చండాల, మాల శబ్దాలు రెండూ పర్యాయ పదాలుగానే వాడబడ్డాయి. మన పూర్వ గ్రంథాలన్నిటిలోను – మాల, మాదిగ, మాతంగ, శ్వపాక, చండాల పదాలన్నీ పర్యాయ పదాలే.

ఇందులో మరీ ఎక్కువగా వాడబడిన శబ్దం ''చండాల'' శబ్దం. ఈ చండాల శబ్దానికి అర్థం ఏమిటి? అమరకోశంలో దీని నిర్వచనం ఇలా వుంది:

''చండాలస్తు జనితో
బ్రాహ్మణ్యాం వృషలే న యః''

అనగా – బ్రాహ్మణ స్త్రీకి, శూద్రపురుషునికి పుట్టినవాడు చండాలుడు అని.

మనుస్మృతి కూడ ఇదే అర్థాన్ని రూఢిపరుస్తున్నది:

''శూద్రా దాయోగవః క్షత్తా
చండాల శ్చాధమో నృణాం
వైశ్య రాజన్య విప్రాసు
జాయంతే వర్ణసంకరాః''

అనగా – శూద్రునివలన వైశ్య స్త్రీకి పుట్టినవాడు అయోగవుడు, క్షతియ స్త్రీకి పుట్టిన వాడు క్షత్త, బ్రాహ్మణ స్త్రీకి పుట్టినవాడు చండాలుడు. వీరంతా వర్ణ సంకరులు – అని!

వర్ణసంకరులంతా వర్ణబాహ్యులు! అవర్ణులు! అంటే, హిందూ సమాజ వ్యవస్థలోని నాలుగు వర్ణాలలోను ఏ వర్ణానికీ చెందని వారన్నమాట.

అయోగవుడు, క్షత్త మొదలైన అవర్ణుల సంగతి ఏమైనదీ మనకు తెలియదు. వారంతా వెనుకబడిన జాతులుగా వుండివుండవచ్చు. కాని, చండాలుడు మాత్రం చరిత్ర ప్రసిద్ధిని పొంది, ఒక్క దేశం దృష్టినేకాక, ప్రపంచ దృష్టినే ఆకర్షించగలిగాడు. అందుకు కారణం అతడికి హిందూ సమాజం విధించిన తీవ్ర నిషేధమే. సంఘ బహిష్కారం, వెలి, అంటరాని తనం, చూడరానితనం వగైరా అమానుష నిషేధాలు అతడిపట్ల అమలు జరుపబడ్డాయి. అంతటి కఠిన శిక్షలకు అతడు గురికావడానికి కారణం తల్లి మరీ అగ్ర (శాసక) వర్ణానికి, తండ్రి మరీ అంత్య (సేవక) వర్ణానికీ చెంది వుండడమే కావచ్చు.

న్యాయంగా బిడ్డ తల్లికో, తండ్రికో చెందాలి. తల్లికి చెందితే బ్రాహ్మణుడు, తండ్రికి చెందితే శూద్రుడు కావలసిన బిడ్డ – మధ్య ఎవరికీ చెందని అవర్ణుడు, అస్పృశ్యుడు

అయి పోవడం ఏమి న్యాయం? ఇది న్యాయం కాదని వాదించి పోరాడినందుకే అతణ్ణి ''చండాలుడు'' అన్నారు. చండాలుడు అనే శబ్దానికి అర్థం ''కోపం కలవాడు'' అని. ''చడీ కోపే'' అని లింగాభట్టీయం చండాల శబ్దానికి అర్థం చెపుతున్నది. కోపం కలవాడు చండాలుడే అయినప్పటికీ, ఈ శబ్దం – ఈ విధంగా పుట్టిన సంకరార్యుడికే రూఢి అయింది.

ఈ విధంగా పుట్టి, తమపై కఠిన నిషేధాలు అమలు జరపబడగా, అది అన్యాయమని వాదించి, గత్యంతరం లేక తిరుగబడిన తొలి చండాలురందరికీ ''మతంగుడు'' నాయకత్వం వహించినట్టు కనిపిస్తుంది.

''అల్ల మతంగ మహాముని
తల్లజు సంతానమేగదా మాతంగుల్?
తెల్లమగు తెనుగునుడి సం
పల్లాలసులార! వారె మాదిగలు సుండీ.''

– నిరుద్ధ భారతం

''... మతంగుడు తాను వర్ణబాహ్యుడనని తెలుసుకొని, తపస్సుచే దానిని మాన్పుకొన గొప్ప ప్రయత్నము జేసియు, వ్యర్థ మనోరథుడై, ఆర్యావర్తమును వదలి, దక్షిణా పథమును ప్రవేశించెను. ఆర్యావర్తమున బ్రాహ్మణులతో సరిపడక నర్మదా తీరమునకు వచ్చెను. పిమ్మట మతంగుడు వాలి సుగ్రీవాద్యనార్య నివాసమగు ఋష్యమూకము జేరెను... శూద్రునకును, బ్రాహ్మణ స్త్రీకిని జన్మించి, వర్ణబాహ్యుడుగా పరిగణింపబడి, ఇంద్రునంతటివాని మాటను తిరస్కరించి, పిమ్మట (నర్మద యొద్ద) గంధర్వులతో చేరియు, వారితోడను గ్రుద్దులాడి, తరువాత వాలి సుగ్రీవులను జేరియు వీరితోడను పోరాడిన మతంగునికి మన ఆర్యులు – కోపము కలవాడు కాన చండాలుడనియు, ఏ వర్ణమునకు చెందని వాడు కాన వర్ణ బాహ్యుడనియు, అవర్ణుడనియు, ఏ గ్రామమునకు చేరనివాడు గాన అంతేవాసియనియు పేర్లిడిరి... (ఇతడు) పిమ్మట మహాతపస్వియై చండదేవుడనిపించు కొనెను.''

–నిరుద్ధ భారతం

ఈ మతంగ మహర్షి వృత్తాంతం వివరాలకోసం భారతం అనుశాసనిక పర్వాన్ని; రఘువంశం 5వ సర్గని; వాల్మీకి రామాయణం కిష్కింధాకాండని చూడవచ్చును.

మతంగ మహర్షి సంతతివారే మాతంగులు, నేటి మాల మాదిగలు. మాతంగ శబ్దానికి లింగాభట్టీయం ఇచ్చిన అర్థం ''మతంగాజ్జాతాః మాతంగాః'' అని.

మహా తపశ్శాలి మతంగమహర్షి. ఆనాటి సాంఘిక నీతిసూత్రాలపై తిరుగుబాటు చేసినవాడు. ప్రపంచంలో తొలి విప్లవకారుడితడే కావచ్చు కూడ! ఇది బహుశా స్మృతుల కాలంనాడు జరిగి వుంటుంది. మతంగ మహర్షి తరువాత, సమకాలీన హైందవ సాంఘిక దురాచారాలపై తిరుగుబాటు చేసిన మహాపురుషుడు బహుశా బుద్ధ భగవానుడే కావచ్చును.

ఆర్యావర్తం నుంచి, దారి పొడుగునా హిందూ సమాజంతో పోరాటం పెట్టుకుంటూ, దక్షిణాదికి వచ్చిన అట్టి మహా పురుషుని సంతతి వారైనందువల్లనే మాల మాదిగలు ఆసేతు హిమాచలం, దేశమంతటా, ప్రతి గ్రామంలోను వ్యాపించినవారై వున్నారు.

మాతంగులలో పుట్టింది అరుంధతి.

''ముని చంద్రుండగు నవ్వసిష్ఠ సతియై
ముల్లోకముల్ మెచ్చు రీ
తిని వర్తించి, లసద్గుణాఢ్యయయి, పా
తివ్రత్య మాహాత్మ్యమున్
తనరారన్ వరతారయై పొలిచి మిం
టన్ దంపతీలోక పం
దనముల్ గాంచు నరుంధతీ సతియు చం
డాలాంగనా రత్నమే.''

– నిరుద్ధ భారతం

"అక్షమాలా (అరుంధతి) వసిష్ఠేన
సంయుక్తాధమ యోనిజా
సారంగీ మందపాలేన
జగా మభ్యర్చనీయతాం"

– మనుస్మృతి

"మందపాలుడనెడు మౌనీంద్ర చంద్రుండు
కడు నికృష్టజాతి కన్యయయ్యు
సాధుశీలయైన సారంగి బెండ్లాడి
అల వసిష్ఠ లీల నలరలేదె?"

– నిరుద్ధ భారతం

"తల్లి ఊర్వశి లంజ, తనయాలు మాదిగ,
తాను బ్రాహ్మడయ్యె తగ వసిష్ఠ (డు)"

– వేమన

"Tradition traces her (Arundhati's) birth and Parentage to a family of outcastes; but, by her Pativratya, she came to be respected as the greatest woman that Vedic India ever produced" అని శ్రీ బి.హెచ్.సత్యనారాయణ ఎమ్.ఏ. గారు, భవభూతి ఉత్తర రామచరితలోని అరుంధతి పాత్ర పోషణను పరామర్శిస్తూ త్రివేణి పత్రికలో పేర్కొన్నారు.

ఈ విధంగా అరుంధతి మాతంగ కన్య అని పూర్వగ్రంథాల నుంచి ఇంకా ఎన్నో ఉదాహరణలు ఈయవచ్చును.

అరుంధతి పుట్టుకను గురించి ఒకటి రెండు పాఠాంతరాలు ఉన్నాయి.

బ్రహ్మపుత్రిక అయిన సంధ్యాదేవి మేధాతిథి యజ్ఞంలో ప్రాతస్సంధ్య, అరుంధతి, సాయంసంధ్య అనే ముగ్గురు మూర్తులుగా పుట్టినట్టు ఒక గాథ కలదు. కర్దమ ప్రజాపతి

తొమ్మండుగురు కుమార్తెలలో అరుంధతి ఒకతె అనే మరో గాథ కలదు. కర్దముడు ప్రజాపతి అయితే సృష్టికి కారకులైన ఆది పురుషులలో అతడొకడవుతాడు. ప్రజాపతుల కాలంలో వర్ణభేదమే లేదు. లేక కర్దముడు తరువాతి వాడైతే, అతడు మతంగ వంశీయుడే కావచ్చు. అప్పుడు అరుంధతి అక్కచెల్లెండ్రు (అనసూయ మొదలగు మహా పతివ్రతలు), ఆమె తమ్ముడు కపిల మహర్షి కూడ మాతంగులే (అనగా మాల మాదిగలే) అవుతారు గదా?

కపిల మహర్షి మాతంగుడనడానికి ఆధారం వుంది. ''... ధరణీ సురునకును, మాలెతకు నందనుడై పరగిన కపిలుడు పావన పురుషుండై ఋషులలోన పూజ్యత కనడే?'' అని నిరుద్ధ భారతం చెబుతున్నది. కపిల మహర్షి మాతంగుడైనప్పుడు అతని తండ్రి, అక్కలు మాతంగు లేల కారు? రామాయణ కాలం నాటికే మతంగ మహర్షి దక్షిణాదికి వచ్చి వున్నాడు. కనుక, ఉత్తరాదిని కర్దముడు మతంగ వంశీయుడే అయివుండాలి.

ఆర్యమత ప్రచారకుడైన వసిష్ఠుడు అనుకూలవతియైన భార్య కోసం వెతుకుతూ ఒక మాలపల్లెకు వచ్చాడనీ, అక్కడ ఒక ఇంటి చావడిలో వడ్లు దంచుతున్న ఒక పిల్లను చూశాడనీ – అంతలో తల్లి పిలవగా ఆమె ఎత్తిన రోకలిని అలానే వదిలేసి వెళ్ళిందనీ, ఆమె తిరిగి వచ్చే వరకు ఆ రోకలి అలానే గాలిలో నిల్చివున్నదనీ – ఈ వింతను, ఆమె ఆజ్ఞాపాలనా తత్వాన్నీ, ఆత్మ శక్తిని చూచి, ముగ్ధుడై అతడు ఆమెను పెండ్లాడాడనీ – ఆమె అరుంధతి అనీ వేరొక గాథ కలదు.

అన్ని గాథలను పరిశీలించి, నా రచనకు ఏదీ అనుకూలంగా లేనందువల్ల, నాకు కావలసిన కథను నేను వీటి నుంచి కల్పించుకున్నాను.

ఏ విధంగా చూచినా, అరుంధతి మాతంగ కన్యే. ఆమెను వసిష్ఠుడు వివాహం చేసుకున్నాడు. ఆ పుణ్య దంపతులకు శక్తిమహర్షి పుట్టాడు. అతడు కూడ ఒక మాలెతను, అదృశ్యంతి అనే ఆమెను, పెండ్లాడి పరాశరుణ్ణి కన్నాడు. పరాశరుడికి వ్యాస మహర్షి పుట్టాడు.

''వ్యాస మునిచంద్రు గన్న పరాశరుండు
మాలదానికి పుట్టి బ్రహ్మర్షి యయ్యె''

– నిరుద్ధ భారతం

''వేద విభాగమున్ జరిపె
విశ్వము సర్వము ప్రస్తుతింప, అ
ష్టాదశ సత్పురాణములు
శస్తమతిన్ విరచించె; సర్వలో
కాదరణీయమైన ఇతి
హాసము భారతమున్ రచించె; అ
బ్జోదరు వంశ సంభవము
నొందెను వ్యాసుడు నిమ్నజాతుడే''

– నిరుద్ధ భారతం

''జాతో వ్యాసస్తు కైవర్త్యాం
శ్వపాక్యాస్తు పరాశరః.''

– భారతము ఆ.ప.

కాగా, వ్యాస భగవానుడు మాదిగ వనిత అయిన అరుంధతికి ముని మనుమడు. మాలపిల్లకు మనుమడు. జాలరి అయిన మత్స్యగంధికి, మాదిగవాడైన పరాశరుడికి కుమారుడు. ఇదంతా అధికభాగం మాదిగ వంశమే కదా? ఇట్టిది ''పెద్ద కులం'' కాక మరేమవుతుంది?

ఇట్టి వ్యాస మహర్షి కదా వేద విభజన చేసినవాడు? అష్టాదశ పురాణాలను, పంచమ వేదమైన మహాభారతాన్ని రచించినవాడు? అసలు భారతీయులకు భారతీయ సంస్కృతిని, సాహిత్యాన్ని, వేదాంతాన్ని ఇచ్చిన వాడు ఈ పెద్ద మాదిగవాడే కదా?

ఇంకా విశేషమేమంటే, వేదవ్యాసుని సంతానమే ధృతరాష్ట్రుడు, పాండురాజు,

విదురుడున్ను. పాండవులు, కౌరవులు, వ్యాసుని వంశీకులే కద? కాగా, మాదిగలే కద? అప్పుడు వారి బంధువులైన యాదవులు, శ్రీకృష్ణాదులు ఎవరవుతారు? మరీ తమాషా ఏమిటంటే – పంచమునిచే వ్రాయబడిన పంచముల చరిత్ర కాబట్టే మహాభారతానికి ''పంచమ వేదం'' అనే పేరు వచ్చిందనడానికి వీలుండడం. ''గొంతమ్మ'' పండగలను మాల మాదిగలు మాత్రమే చెయ్యడం కూడ మరొక విశేషం. మాల మాదిగలకు కుంతి, పాండవులు ఇలవేల్పులు.

ఈ చర్చవల్ల ఇంతవరకు తేలిందేమిటంటే, హరిజనులు తల్లివైపున ఖచ్చితంగా ఆర్యులేనని, పైగా, ఆర్యమతానికి మూల ఋషులు కూడా నని. ఇక తండ్రివైపున ''శూద్రులు'' కూడ ఆర్యులేనని నిర్ధారణ అయితే, ఇప్పుడున్న సాంకర్య దోషంపోయి హరిజనులు స్వచ్ఛమైన ఆర్యులే కాగలరు.

అందువల్ల, ఇప్పుడు శూద్రులనబడే వారెవరో విచారిద్దాం.

''జన్మనా జాయతే శూద్రః
కర్మణా జాయతే ద్విజః
వేద పాఠంతు విప్రాణాం
బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణాః''

అనే ఆర్యోక్తి మనకొకటున్నది. దీనివల్ల ప్రతి హిందువుడు జన్మతో శూద్రుడేనని, కర్మవల్ల ద్విజుడౌతున్నాడని, వేదం చదవడంవల్ల విప్రుడు, బ్రహ్మజ్ఞానాన్ని సాధించడంవల్ల బ్రాహ్మణుడు అవుతున్నాడని స్పష్టమవుతూ వుంది. పుట్టుకతోనే కులం ఏర్పడే నేటి ఆచారాన్ని ఈ సూత్రం స్పష్టంగా ఖండిస్తున్నది కదా?

ఒకే వ్యక్తి జన్మతో శూద్రుడు, కర్మతో ద్విజుడు అవుతున్నప్పుడు ద్విజుడు ఆర్యుడు, శూద్రుడు అనార్యుడు ఎలా అవుతారు? అందరూ ఆర్యులే కారా?

కాగా, శూద్రుడు, ద్విజుడు, విప్రుడు, బ్రాహ్మణుడు మొదలైన తేడాలు గుణకర్మ విభాగంలో వచ్చాయేకాని, అసలు భారత జాతి ఒక్కటే అని దీనినిబట్టి తేలుతున్నది. శూద్ర బ్రాహ్మణత్వాలు ఒకే వ్యక్తిలో అతని విజ్ఞాన స్థాయిని బట్టి ఏర్పడే రెండు దశలు.

శూద్రుడు సంస్కారంవల్ల బ్రాహ్మణుడవుతాడు. ఈ విషయం మహాభారతంలో స్పష్టంగా చెప్పబడి వుంది.

''న జాతిః పూజ్యతే రాజన్
గుణాః కల్యాణ కారకాః
చండాల మపి వృత్తస్థం
తం దేవా బ్రాహ్మణం విదుః''

– భారతం

''జననంబు చేత చూచిన
జనులెల్లరు కూడ ఏక జాతియె అనుచున్
మన శాస్త్రములు సమస్తము
పెనురొద మినుముల్బ ఘోష పెట్టుట లేదే!''

– నిరుద్ధ భారతం

ఈ విషయాన్ని భగవద్గీత మరీ స్పష్టంగా వివరించింది!

''చాతుర్వర్ణం మయాసృష్టం
గుణకర్మ విభాగశః''

– భగవద్గీత

ఈ గీతావాక్యానికి కొందరు అపార్థాన్ని తీసి, తమకు అనుకూలంగా వాడుకొంటున్నారు. ''వారి వారి గుణాలను, పనులను అనుసరించి మనుష్యులను నాలుగు వర్ణాలుగా విభజించాను.'' అని కృష్ణభగవానుడు చెప్పాడు. (కృష్ణభగవానుడు ప్రపంచానికంతటికీ భగవానుడు గాని, వర్ణభేదం గల హిందువులకు మాత్రమే కాడన్న ఇంగితాన్ని మనం ఇక్కడ గుర్తించాలి.) ఈ భగవద్వాక్యానికి విపరీతార్థం తీసి, ప్రారబ్ధాన్నిబట్టే ఆయా వర్ణాలలో పుడతారని అజ్ఞానంలో వున్న ప్రజలకు బోధించడం జరిగింది. పాపం చేసి చండాలుడై పుడతాడనిన్నీ ప్రచారం చేశారు. అలా ప్రచారం చేసేవారు అటువంటి – అంతకన్న ఘోరమైన పాపాలను చెయ్యడానికి జంకడం లేదు. పునర్జన్మ మీద నమ్మకం

వున్న హిందూ జాతి నేడు, అటువంటి నమ్మకాలు లేని ప్రపంచంలోని ఇతర జాతులకంటె, ఎక్కువ పాపాలను చేస్తున్న దంటే – అంతకన్న ఘోరం మరేముంటుంది?

ఈనాడు హిందూ సమాజంలో వేదందారి వేదానిది. విస్సన్న దారి విస్సన్నది. ధర్మం దారి ధర్మానిది. ఆచారం దారి ఆచారానిది. మత గ్రంథాలు చెప్పేదానికీ, మనం ఆచరించే దానికీ ఏ మాత్రమూ సంబంధం లేదు!

''పోరాడు, పురోగమించు, గెలిస్తే భూలోకరాజ్యం, చస్తే వీర స్వర్గం'' అని, యుద్ధ రంగంలో సింహనాదం చేసి ఆవిర్భవించిన వీరగీత భగవద్గీత. అట్టి మహాతత్త్వం మూలమతంగా గల భారత సమాజం బానిసతనంలో కూరుకుపోవడం, ''ఒకచెంపకొడితే రెండవచెంప ఇయ్యి'' అని కేవలం అహింసను బోధించిన ఇతర దేశాలు ''అణోరణీయాన్, మహతో మహీయాన్'' నినాదాలతో నవగ్రహాల మీదికీ, నక్షత్రాల మీదికీ దండెత్తి పోతూ వుండడం ఎంత విపరీతం! ఇట్టి వైపరీత్యానికి కారణమేమిటి? నాకు ఒక్కటే కారణం కనిపిస్తున్నది. అది ఇది : వర్ణ వ్యవస్థ ముదిరి, కఠిన కులాలుగా చీలి, జాతీయత ఛిన్నాభిన్నమై పోవడం, జ్ఞానం దాచి పెట్టబడి, ప్రజాసమూహం అజ్ఞానంలో ముంచి వుంచబడడం, ప్రతిభా వికాసానికి అవకాశమే లేక, మహాఋషుల అవతరణకు ఆటంకాలేర్పడడం, క్రమంగా మన మత విజ్ఞాన ధనం మాసిపోయి, మూఢ స్మృతులు మాత్రం మిగిలి వుండడం.

ఆనాడు ''శూద్ర'' శబ్దం జాతిని తెలిపే పదం కాదని, అది మనిషి లోని ఒక అవస్థను – అనగా అతని గుణాన్ని, పనిని తెలిపే శబ్దం అని మనం తెలుసుకున్నాం. ఆనాడు ఈనాటి కులాల వంటివి లేనే లేవు. పురాణ కాలం నాటికి వర్ణాలు ఏర్పడ్డాయి. అందులో ద్విజులు మూడు వర్ణాలు. శూద్రులు ఒక వర్ణం. ఐదవ వర్ణం లేదు.

''బ్రాహ్మణ క్షత్రియో వైశ్యః
త్రయో వర్ణా ద్విజాతయః,
చతుర్థ ఏక జాతి స్తు
శూద్రో, నాస్తితు పంచమః''

– మనుస్మృతి

ఈ చతుర్వర్ణాల చరిత్ర కోసం ఇంకా మనం కొంతవరకు చరిత్రను - కొంత వరకు మన పురాణేతిహాసాలను పరికించి చూద్దాం.

చరిత్రను, మహాపురుషుల రచనలను పరికించి చూస్తే, ఆర్యుల జన్మస్థానం ఉత్తరధ్రువ ప్రాంతమే అనవచ్చు. శ్రీ లోకమాన్య తిలక్ మహాశయుని ''ఆర్యుల ఉత్తర ధ్రువ నిలయం'' (The Arctic Home of Aryans) అనే మహాగ్రంథం ఈ విషయంలో మనకు చాల ఉపకరిస్తుంది. ధ్రువ ప్రాంతం సమశీతోష్ణంగాను, భారత భూభాగం మానవ వికాసానికి అయోగ్యంగాను వున్న కాలం అది. క్రమంగా శీతోష్ణ పరిస్థితులు మారడం, ధ్రువ ప్రాంతంలో హిమప్రళయం రావడం జరిగి, అక్కడి ఆర్యులు పలు ముఖాలుగా చెదిరి పోయారు. అందులో ఒక జట్టు దక్షిణ ముఖంగా బైలుదేరారు.

ఈ జట్టుకు తరువాత స్థిర నివాసం కాస్పియను సముద్ర ప్రాంతంగా కనిపిస్తుంది. వేదాల అవతరణ ఉత్తర ధ్రువ ప్రాంతంలోను, పురాణాల అవతరణ కాస్పియను సముద్ర ప్రాంతంలోను అయివుండవచ్చు కూడ. ఇందుకు బలమైన ఆధారాలున్ను వున్నాయి. కశ్యప ప్రజాపతి ఉనికి ఈ కాస్పియను తీరప్రాంతమేనని, అతని పేరే ఆ సముద్రానికి వచ్చిందనీ కూడ చెపుతున్నారు.

అసీరియనులకు, సిరియనులకు చారిత్రకంగా జరిగిన యుద్ధాలే మన పురాణాలలో దేవాసుర యుద్ధాలుగా వర్ణించబడినట్టు కనిపిస్తున్నది. అసీరియనులు ''అసురలు''గాను, సిరియనులు ''సురలు''గాను వర్ణించబడ్డారు. చారిత్రకంగా సిరియనులు, అసీరియనులు ఒకే జాతికి చెందినవారు. పొరుగు దేశాల వారు, పౌరాణికంగా సురలు, అసురలు దాయాదులు. ఒకే తండ్రికి పుట్టినవారు. దితి, అదితుల బిడ్డలు. కశ్యప ప్రజాపతి సంతానం.

ఆ కాలంలో తరచుగా అసీరియనులు సిరియాపై దండెత్తి, వారిని ఓడించడం, పీడించడం జరుగుతుండేది. దేవాసుర యుద్ధాలలో ఇదే తరచు జరుగుతుండేది. అసురలే సురలను తరచు ఓడించి పీడిస్తూ వుండేవారు. ఈ విషయం ''బ్రాహ్మణుల యూదు జాతీయత (The Hebrew Origin of the Brahmins)'' అనే గ్రంథంలో విపులంగా

చర్చించబడింది. కాస్పియను ప్రాంతమే మేరుపర్వత ప్రాంతమని కూడ భావించబడుతున్నది.

''... మన ఆర్యులకు, ఇరాన్ వారికి (పారసీకులకు) చాల దగ్గర సంబంధము కలదు. కాని వారికి అసురులైన వారు మనకు సురలుగాను మన అసురులు వారికి సురలుగాను మారిరి.''

– తెలుగు విజ్ఞాన సర్వస్వము – పుట – 313

మారడం కాదు. అసలు అదే సత్యం కదా? అసీరియనుల (అసురుల) దేశంలో వారి శత్రువులైన సురలు రాక్షసులు కావడంలో చిత్రం ఏముంది?

కాగా, ఉత్తర ధ్రువ ప్రాంత వాసులైన ఆర్యులు, కాస్పియను తీర భూములలో స్థిర నివాసులై, అక్కడ అంతఃకలహాలకు లోనై, అందులో ఒక తెగ (అసీరియనులు) ఆగ్నేయంగా తరలి, కొండలను దాటి, భారతదేశంలో ప్రవేశించారు. అప్పటికి భారతదేశం శీతోష్ణ పరిస్థితి మానవ వాస యోగ్యంగా మారివుండవచ్చు. వారు సింధునదీ తీరంలో స్థిర నివాసులై, వ్యవసాయ జాతియై, నాగరికులైనారు. నేడు హరప్పా, మొహంజోదారో ప్రాంతాలలో వెలువడిన నాగరికత వారిదే. వారే ద్రవిణులు (ద్రావిడులు).

''హిరణ్యం, ద్రవిణం'' అని అమరం నిర్వచనం. ద్రవిణం అనగా ధనం. వ్యవసాయ జాతిగా స్థిరపడి, నాగరికులై, పాడిపంటలతో ధన ధాన్యాలతో తులతూగుతూ వున్నవారు కాబట్టి ద్రవిణులు (ధనవంతులు) అని పిలువబడ్డారు.

ఆ తరువాత ఎన్నో వేల సంవత్సరాలకు కాస్పియను ప్రాంతాల నుంచే మరొక ఆర్య తెగ (అక్కడ అసీరియనుల చేతిలో ఓడిపోయిన సిరియనులు) అదే దారిని భారతదేశంలో ప్రవేశించారు. వీరు క్రొత్తగా వచ్చిన ఆర్యులు. వీరిని ఉత్తరార్యులు అనవచ్చు. అంతకు ముందే అక్కడికి వచ్చి స్థిరపడి వున్న నాగరికార్యులను వీరు ద్రావిడులు అన్నారు. మళ్ళీ ఈ ఆర్య ద్రావిడుల మధ్య పాత పోరాటాలు పునర్విజృంభించాయి. ఆ విరోధ భావంతో ఉత్తరార్యులు తమ దాయాదులగు పూర్వార్యులను దస్యులని, రాక్షసులని, ఇంకా అనేకమైన చెడ్డపేర్లతో దూషించారు. రాక్షసులకు ''పూర్వ దేవతలు''

''తొలి వేల్పులు'' ''పుణ్యజనులు'' అనే పేర్లు రావడానికి కారణం. వారు నేడు ఆర్యులని చారిత్రకంగా పిలువబడుతున్న వారి కంటె చాల ముందుగా వచ్చిన ఆర్యులై వుండడమే.

కాగా, నేడు ఇక్కడ ఆర్యులుగా వ్యవహరించబడుతున్నవారు, ద్రావిడులు, ఇంకా మధ్య ఆసియా, ఐరోపా ప్రాంతాలలోని వివిధ జాతులూ కూడ ఆదిలో ఒకే ఒక మూలజాతి కుటుంబానికి చెందిన ఆర్యులే. మనకు కావలసినంతవరకు మాత్రమే తీసుకుంటే - ద్రావిడులు ఆర్యులే, ఆర్య ద్రావిడులు ఒకే జాతికి చెందినవారు. ఈ విషయాన్ని హిందూపురాణాలు, మానవజాతి చరిత్ర - శాస్త్రాలు ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి.

ఆ విధంగా రెండవ జట్టు ఉత్తరార్యులు, మొదటి జట్టు ద్రవిణార్యులతో పోరాటాలకు దిగి, వారిని ఓడించి, దక్షిణాదికి నెట్టారు. చిక్కిన వారిని బానిసలుగా చేసుకొన్నారు. వారి స్త్రీలను పెండ్లాడారు. క్రమంగా వారిలో కలిసి పోయారు. ఆ విధంగా ఏర్పడిన మిశ్రమజాతే భారతజాతి.

ఆర్య ద్రావిడ పోరాటాలలో ఉత్తరార్యులకు బానిసలుగా చిక్కినవారే ''శూద్రులు.''

''....సాంఘిక విభేదములు క్రమముగా కుల భేదములుగా మారి స్థిరపడినవి... ఆర్యులచేత జయింపబడి, ఆర్యులు అధమ వృత్తులుగా పరిగణించిన వైద్యము, జ్యోతిషము, నేతపని, కుమ్మరిపని, కమ్మరిపని, తోళ్ళు, కుట్టుపని మొదలైన వృత్తుల వలన జీవించు ద్రావిడులు మొదలుగాగల దేశీయ జాతుల వారిని శూద్రులు అను పేర నాల్గవ వర్ణముగా ఆర్యులు తమ సంఘములో చేర్చుకొనిరి.... రాజుల ఆగ్రహానుగ్రహముల వలనను, తత్తద్గుణ కర్మల వలనను ఒక కులము వారు మరొక కులమునకు మారుచుండుట కూడ మొదట పరిపాటిగా నుండెను. క్రమముగా ఏ కులము వారు ఆ కులము వృత్తులతోనే జీవింపవలెనను కట్టడి అమలులోని వచ్చినది.''

-తెలుగు విజ్ఞాన సర్వస్వము - పుట 315

ఉత్తరార్యులు భారతదేశంలో ప్రవేశించేటప్పటికే మూడు వర్గాలుగా వచ్చినారు. బ్రహ్మ, క్షత్రియ, వైశ్యవర్ణాలు అవి. ఇప్పుడు పూర్వార్యులైన ఈ శూద్రులను నాలుగవ వర్ణంగా ప్రకటించి, తమ సామాజిక వ్యవస్థలో ఒక భాగంగా చేసుకొన్నారు.

ఉత్తరాదిని ఆర్య ద్రావిడ సామరస్యం కుదిరి ఒక సామాజిక వ్యవస్థగా మారి, ప్రశాంతత ఏర్పడేటప్పటికి దక్షిణాదిని కూడా ప్రశాంతత ఏర్పడింది. దక్షిణాదికి నెట్టివేయబడి, ఇక్కడ రాజ్యాలు ఏర్పరచుకొన్న ద్రావిడులు క్రమంగా ఉత్తరార్య సామాజిక విధానాన్ని అవలంబించి, గుణకర్మ విభాగ పద్ధతిలో వర్ణాలను ఏర్పరచుకొన్నారు.

ఆపస్తంభుడికి పూర్వం దక్షిణ భారతంలో వర్ణ విభజన లేదు. అతడే తొలిసారిగా దక్షిణాదిలో ఉత్తరార్యుల వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టినవాడు. అతడు క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దికి చెందినవాడు. ఇది నా వాదనకు పోషకమైన చరిత్రాంశం.

ఉత్తరార్యులు వచ్చి, అంతకు పూర్వం ఏనాడో వచ్చి స్థిరపడి వున్న పూర్వార్యులతో కలిసిపోయి, తమతో తెచ్చిన వైదిక మతాన్ని వ్యాపింపజేసినారు. ఆధునిక శాస్త్ర పరిశోధనల దృష్ట్యా కూడ ఇది సత్యమే. ప్రస్తుతం భారతదేశంలోవున్న ప్రజలంతా – ఉత్తరార్యులు, ద్రావిడులు అనబడే పూర్వార్యులు, వర్ణాంతర వివాహజనితులైన వేలకొలది ఉపకులాల వారు, సవర్ణులు, అవర్ణులు అందరూ ఒకే ఒక ''కాకేషియను'' జాతి కుటుంబానికి చెందిన వారే. మూల మానవ జాతులు ఐదింటిలోను కాకేషియను జాతి ఒకటి. అసలు నేడు ప్రపంచంలోని ఏ ఒక్క మానవుడు కూడా స్వచ్ఛంగా ఏదో ఒక్క మూల జాతికి చెందినవాడుగా లేడని, ఇప్పుడు అందరు మానవులూ మిశ్రమ జాతి వారుగానే వున్నారని మానవజాతి శాస్త్ర పరిశోధకులు అంటున్నారు.

కాగా, వేదసమ్మతం కానట్టి, పైగా వేదవిరుద్ధమైనట్టి, మొన్న మొన్నటి వరకు లేనట్టి వర్ణ వ్యవస్థను పట్టుకొని వ్రేలాడడం కేవలం అజ్ఞత కాదా?

వాతావరణ పరిస్థితులు, జీవిత స్థితిగతులు, కలిమి లేములు, కాయకష్టాలు, జ్ఞానార్జనావకాశాలు, వృత్తుల మంచి చెడ్డలు మానవునిలో కాలక్రమేణా శారీరకంగాను, మానసికంగాను అనేక మార్పులు తెస్తాయి. ''నల్ల బ్రాహ్మణుడు, ఎర్ర మాదిగాడు'' వగైరా సామెతలు కేవలం అజ్ఞానాన్ని సూచించేవి మాత్రమే.

ఇక్కడ రెండు ముఖ్య విషయాలను గుర్తించవలసి వుంది. (1) ''ఆర్య'' శబ్దం జాతిని సూచించేది కాదు. అది ఒక జీవిత విధానం. (2) ''వర్ణం'' రంగును సూచించేది కాదు. అది గుణాన్ని, తద్వారా వృత్తినీ సూచించేది.

ఆర్యత్వం ఒక జీవిత విధానం. ధర్మార్థ కామ మోక్షాలైన పురుషార్థాలను నాలుగింటిని క్రమంగా సాధించడం ఆర్యమత లక్ష్యం. ధర్మం, అర్థం, కామం, మోక్షం – ఈ నాల్గు అర్థాలలోను ఒక్కొక్క అర్థాన్ని సాధించిన వాళ్ళు ఒక్కొక్క ''వర్ణం''గా వర్ణించబడ్డారు. వర్ణం అంటే ఇక్కడ గుణం. ధర్మం గుణంగా కలవారు శూద్రులు. అర్థం గుణంగా కలవారు వైశ్యులు. కామం గుణంగా గలవారు క్షతియులు. మోక్షం గుణంగా కలవారు బ్రాహ్మణులు. అంటే – బ్రహ్మ, క్షతియ, వైశ్య, శూద్రులు క్రమంగా మోక్షార్థులు, కామార్థులు, అర్థార్థులు, ధర్మార్థులు. ఈ గుణాలను బట్టే వారి పనులున్ను ఉన్నాయి. గుణాలు మారినప్పుడు పనులున్ను మారతాయి. ఈ మార్పును సాధించి, శూద్రత్వం నుంచి బ్రాహ్మణత్వానికి పురుషుని వికసింపజేసేదే ఆర్యమతం.

శూద్రత్వం పురుషుడికి బాల్యావస్థ అనుకుంటే, వైశ్యత్వం యౌవనావస్థ, క్షతియత్వం కౌమారావస్థ, బ్రాహ్మణత్వం వృద్ధాప్యావస్థ అని చెప్పవచ్చు. పురుషుడు శారీరకంగా బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు పెరుగునట్లే, ప్రపంచంలోని మానవుడైన ప్రతివాడు గుణాత్మకంగా శూద్రత్వం నుండి బ్రాహ్మణత్వం వరకు వికసిస్తాడు. అట్టి క్రమ వికాసానికి శాస్త్రీయంగా తోడ్పడేదే ఆర్యమతం.

విశ్వశ్రేయమే ఆదర్శంగా ''సర్వేజనా స్సుఖినో భవంతు'' నినాదంతో, ''కృణ్వంతో విశ్వమార్యం'' అని ఎలుగెత్తి చాటుతూ, ప్రపంచ మానవుల నందరినీ ఆర్యులుగా చెయ్యడంకోసం జైత్రయాత్ర కదలిన విశ్వజనీనమతం ఆర్యమతం!

''జన్మనా జాయతే శూద్రః'' కనుక, పురుషుని శూద్రత్వం నుంచి క్రమంగా బ్రాహ్మణత్వం వరకు వికసింపజేసి, చివరకు బ్రహ్మైక్యాన్ని సాధించడం ఆర్యమతం. ఈ ఆర్యమతాన్ని, దాని జీవిత ధర్మాన్ని అనుసరించే ప్రతివాడు ఆర్యుడే.

''కృణ్వంతో విశ్వమార్యం'' (విశ్వంలోని మానవులందరినీ ఆర్యులుగా నొనర్చుడు) అనేది ఆర్యమత నినాదం. ఈ నినాదాన్ని అనుసరించే ఆ కాలంలో ఉత్తర ధ్రువం మొదలు దక్షిణ సముద్రపు దీవుల వరకు గల మానవులలో అనేకులు ఆర్యులైనారు.

''గణికాగర్భ సంభూతో
వశిష్ఠ మహాముని:
తపసా బ్రాహ్మణో జాత:
సంస్కార: తత్ర కారణం''

''జాతో వ్యాసస్తు కైవర్త్యాం
శ్వపాక్యాస్తు పరాశర:
మహావోన్యేపి విప్రత్వం
ప్రాప్తాయే పూర్వ మద్విజా:''

''ఇట్లు పూర్వము అద్విజులై, పిమ్మట సంస్కారము ననుసరించి ఎందరో బ్రాహ్మణులైరి.''

-పూర్వగాథాలహరి

''బ్రాహ్మణ శ్రేష్ఠుడైన భార్గవుడు తొల్లి
ద్విజులు లేని ఒకానొక దేశమందు
సర్వసముడౌచు, కైవర్త్య జా జనుల
జందెములు వైచి విప్రుల సలుపలేదె?''

- నిరుద్ధ భారతం

''తొల్లి కణ్వమునీంద్ర చంద్రుండు మ్లేచ్ఛ
దేశమైన ఐగుప్తకేతెంచి, అచట
వేలకొలది మనుష్యుల వేదమతము
నందు చేర్పడె? వారు పూజ్యతను గనరె?''

-నిరుద్ధ భారతం

ఈ విధంగా అద్విజులైన ఇతర జాతీయులెందరో వైదిక మతంలోకి చేర్చుకోబడ్డ ఉదాహరణలు మన హిందూ శాస్త్రాల నిండా వున్నాయి.

దేశ దేశాలు తిరిగి, వేద మతాన్ని వ్యాపింపజేసిన మహాఋషుల దేశం మనది. ఇట్టి దేశంలో శూద్రుడు వేదం వినగూడదన్న శాసనం పుట్టడం, ఒకే జాతిలోని రెండు వృత్తి వర్గాల స్త్రీ పురుషులకు పుట్టిన బిడ్డ అస్పృశ్యుడుగా బహిష్కరింపబడడం నిజంగా దుర దృష్టకరం.

ఇట్టి దురదృష్టకర శాసనాలు ఎప్పుడు ఎందుకు పుట్టినవో ఎవరూ స్పష్టంగా చెప్పలేరు. ఆ సంకుచిత శాసనాలే వేద విజ్ఞానానికి సంకెళ్లు తగిలించి కులతత్వపు ఖైదు కొట్టులో పడవేసినవి. ఆనాటి నుంచే వేదమాత కృశించిపోయి, ఆర్యధర్మం నశించిపోయింది.

మరీ దురదృష్టకరమైన విషయమేమిటంటే, స్మృతియుగం నాటి ఏతత్ సాంఘిక శాసనాలను, ఆర్డినెన్సులను కాలపరిస్థితులకు అనుగుణంగా సవరించుకోవడమో, రద్దుచేసికోవడమో చేయకుండా, వాటిని ఈనాటికీ అమలుజరపడానికి ప్రయత్నిస్తూ వుండడం! వేదకాలపు ఔన్నత్యాల నుండి ఆర్య మతము ఎటువంటి చీకటి లోయలలోకి పతనమైపోయిందో, ఎంతటి అమానుషమైన పెర్రి తలలు వేసిందో, ఆర్యధర్మ జీవనస్రవంతి ఎంతగా ఎండిపోయిందో వీనివల్ల స్పష్టమవుతున్నది. వేదహృదయం తెలిసిన ఆర్యధర్మ నాయకత్వం లోపించడంతో భారత ప్రజలు కోట్లకొలది మంది పరమతాల పాలైపోయారు కూడ.

ప్రపంచమంతా ఆర్యమతంగా మార్చవలసిందిగా మన వేద ఋషులు ఇచ్చిన పిలుపును ఇతర మతాలవారు అందుకొని అమల్లో పెట్టుకున్నారు. తమ మతాలను విశ్వవ్యాప్తం చేసుకున్నారు. అసలు పిలుపు ఇచ్చిన వేద మతం, తర్వాత మడిగట్టుకొని తన చుట్టూ ముళ్ళకంచెలు నాటుకొని క్షీణించి పోయింది.

ఇక ''వర్ణం'' గురించి ఒక్కమాట. ఆర్యుల సామాజిక వ్యవస్థలోని వర్ణ విభజన ఆయా వర్ణాల రంగుపై ఆధారపడి జరిగినట్టిది కాదు. రంగే ఇక్కడ ప్రధానమైతే,

భారతదేశానికి వచ్చిన వైదికార్యులు మూడు వర్ణాలు. మూడు వేరు వేరు రంగు జాతుల కూటంగా గ్రహించవలసి వస్తుంది. ఈ వాదాన్ని ''బ్రాహ్మణుల యూదుజాతీయత'' గ్రంథం సమర్థిస్తున్నది కూడ. కాని నాకు ఈ వాదం సమ్మతంగా కనిపించడం లేదు.

భారతదేశంతో కలుపుకొని, మధ్యప్రాచ్య – ఐరోపా ప్రాంతంలోని ప్రజలంతా మొత్తం మీద నల్లటి పొడవైన శిరోజాలు, నల్లటి వెడల్పైన కళ్ళు, బూడిదరంగు శరీరాలు కలిగిన ఒకే ''కాకేషియను'' జాతికి చెందిన మానవులు. ప్రపంచంలోని మూల మానవ జాతులు ఐదు అని మానవజాతి శాస్త్ర పరిశోధకులు చెపుతున్నారు. (1) కాకేషియను జాతి (ఐరోపా, ఉత్తరాఫ్రికా, నైఋతి ఆసియా ప్రాంతాలు), (2) మంగోలియను జాతి (చైనా, జపాను ప్రాంతాలు), (3) ఇథోపియను జాతి (ఆఫ్రికా, ఆస్ట్రేలియా ప్రాంతాలు – నీగ్రోలు వగైరా), (4) అమెరికను జాతి (ఉత్తర, దక్షిణ అమెరికాలో ఆదివాసులు), (5) మలయను జాతి (ఆగ్నేయాసియా ప్రాంతాలు). భారతదేశంలోని వారంతా మొత్తం మీద కాకేషియను మూలజాతివారే. వీరు అనేక వర్ణాలుగా చీలిపోక తప్పనప్పుడు అట్టి చీలిక దేశ కాలపరిస్థితు లను అనుసరించిన జీవిత విధానాలనుబట్టి జరుగుతుందేగాని, వారి రంగునుబట్టి జరగడానికి వీలులేదు.

అందువల్ల, ఇక్కడ వర్ణం కేవలం గుణాన్నీ, అభిరుచినీ, వృత్తినీ సూచించే శబ్దం మాత్రమే. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు నాలుగు వృత్తులను చేసుకుంటూ నాలుగు వర్ణాలకు చెందివుండవచ్చు. ఒకడికి చదువు బాగా అంటుతుంది. ఒకడు వ్యాపారం బాగా చేస్తాడు. ఒకడు మంచి వస్తాదు అవుతాడు. మరొకడు వ్యవసాయం పనిలో నిపుణుడుగా వుంటాడు. ఈ నలుగురూ ఉమ్మడి కుటుంబంలో కలిసి వున్నప్పుడు ఒక పంక్తినే భోజనం చేస్తారు. కాని వారు విడిపోయిన తరువాత ఏ వృత్తివాడు ఆ వృత్తివాళ్ళతోనే సంబంధ బాంధవ్యాలు కలిగివుంటూ, కాలక్రమాన ప్రత్యేకవర్ణంవాడైపోతాడు.

రామాయణ కాలం నాటికి వర్ణభేదం లేదు. గుణకర్మలను బట్టి భారత జాతి అప్పటికే నాలుగు వర్ణాలుగా విభజించబడివున్నా, వర్ణాలు, వృత్తి పరంగానే వున్నాయిగాని, ఇప్పటివలె కులాలుగా పతనం చెందలేదు. ప్రపంచంలో ఏ మానవుడైనా తన శూద్రత్వం

నుంచి బ్రాహ్మణత్వానికి వికసించగల కాలమది. ఆ విధంగా బ్రాహ్మణత్వాన్ని సాధించినవాడే వసిష్ఠుడు.

అయితే, రామాయణంలోని శంభూక వృత్తాంతం మాట ఏమిటని ఎవరైనా ప్రశ్నించ వచ్చు, ఆ వృత్తాంతాన్ని ఎవరో కులతత్త్వవాదులు ఇటీవల రామాయణంలో చేర్చివుంటారని, అది కేవలం ప్రక్షిప్తం మాత్రమేనని నా ఉద్దేశం. శబరి వృత్తాంతాన్ని, శంభుకుని వృత్తాంతాన్ని ఒకే గ్రంథంలో, ఒకే కవి ఎలా వ్రాయగలడు?

ఇప్పుడు శూద్రులుగాను, ద్రావిడులుగాను వ్యవహరించబడుతున్న వారు కూడ ఆర్యులేనని స్పష్టమయింది గదా! ఇక మాల మాదిగలు, అనగా హరిజనులు, పూర్తిగా ఆర్యులేననడంలో అసంబద్ధత ఏముంది? కాగా హరిజనులు ఖచ్చితంగా ఆర్యులే.

హరిజనుల పూర్వులలో మతంగ మహర్షి, ఆదికవి వాల్మీకి, వేద వ్యాస మహర్షి, శక్తి మహర్షి, పరాశర మహర్షి, శుక మహర్షి, భక్త నామ దేవుడు, తిరుప్పాణి యాళ్వారు, శ్రీ రామానుజులవారి ఆది గురువైన తిరుకచ్చినంబి, రోహిదాసుడు, భక్త నందనారు, సాంఖ్య దర్శన ప్రవక్త కపిల మహర్షి, ధర్మ వ్యాధుడు, శ్రీహర్షుని ఆస్థానంలోని దివాకర మహాకవి, కనక మహాకవి, పల్నాటి యోధుడు కన్నమనీడు, జమదగ్ని మహర్షి – ఇలా ఎంతమందినైనా పేర్కొనవచ్చు.

"..... పంచములే
నెలకొని యేలరె? రాజ్యము
నెలకొల్పరె మున్ను? శౌర్యనిరతులు కారే?"

–నిరుద్ధ భారతం.

"నందుడను నతడు ప్రజలా
నందము నందంగ పాలనము సేయడె? ఆ
నందవరమ్మున నాతని
మందిర చిహ్నమ్ము లిపుడు మాత్రము లేవే?"

–నిరుద్ధ భారతం

ఈనాడు ఆసేతుహిమాచలం వ్యాపించి, ప్రతి గ్రామంలోను, నివసిస్తున్న కోట్ల కొలది మంది మాల మాదిగలలో - ధర్మన్నలు, మూర్తులు, కూర్మయ్యలు, సంజీవయ్యలు, బాలయోగులు, జాషువాలు, జ్ఞానానందలు, నీలకంఠలు, వెంకట్రావులు, భాగ్యరెడ్డి వర్మలు, అంబేద్కరులు, జగజ్జీవనరాంలు, సదాలక్ష్ములు, బుల్లయ్యలు - వేలకొలది మంది వున్నప్పుడు, ఆనాడు హైందవ మూల పురుషులలో వందలకొలది మంది మహనీయులు మాల మాదిగలై వున్నారంటే అందులో విశేషం ఏముంది?

నేడు ఆర్య ధర్మం పునరుజ్జీవనాన్ని, పునర్వికాసాన్ని పొందాలంటే మళ్ళీ హరిజనుల నుంచే మహర్షులు, బ్రహ్మర్షులు అవతరించవలసి వున్నదేమో! చరిత్ర పునరావర్తన శీలం కదా?

నేటి మాల మాదిగలను గురించి కూడ ఇక్కడ ఒక మాట చెప్పవలసి వుంది. ఈ రెండు వర్ణాలు కూడ మతంగ మహర్షి వంశస్థులే; మాతంగులే. వీరు వర్ణ బాహ్యులుగా, అవర్ణులుగా చేయబడ్డారు కదా? అవర్ణులుగా చేయబడడం అంటే, వృత్తి రహితులుగా చేయబడడమే కదా? ఉత్తమ వృత్తులకు వీరు దూరం చేయబడడంతో, వెలి వేయబడి ఊరికి అవతల ఉంచబడడంతో, గత్యంతరం లేక ఒక చర్మకార వృత్తినే అవలంబించవలసి వచ్చింది. రాను రాను అందులో కొందరు వస్త్ర పరిశ్రమను స్వీకరించారు. జన సంఖ్య పెరిగే కొలదీ వీరిలో కూడా గుణకర్మ విభాగం జరిగింది. క్రమంగా ''తోలు-నూలు'' పరిశ్రమలను స్వీకరించి మాదిగ, మాల కులాలుగా పరిణమించారు. ఈ మాల మాదిగ కులం ఒకే కులం. హైందవ గ్రంథాలలో మాల, మాదిగ, చండాల, శ్వపచ, మాతంగ, పుల్కస వగైరా పదాలన్నీ పర్యాయ పదాలుగానే వాడబడ్డాయి.

అయితే ద్రావిడార్య, వైదికార్య తెగల రాకకు పూర్వం మన భారత దేశంలో ఆదివాసులే లేరా, అంటే - సరిగా చెప్పలేం. ఇప్పుడు ఆదివాసులు (Tribes)గా పేర్కొనబడుతున్న వారు అసలు అదివాసులయితే అయి వుండవచ్చునేమో.

''...ఆర్యులు వర్ణించిన ఆ ఆదివాసులకును, ఈనాడు అడవులలోను, కొండలలోను నివసించు అనాగరక జాతుల వారికిని ఆకారములోను, ఆచార వ్యవహారములలోను చాల పోలికలున్నవి...'' -తెలుగు విజ్ఞాన సర్వస్వం పుట 212

''విద్యా వినయ సంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకేచ
పండితా స్సమదర్శినః''

బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు, కుక్క, చండాలుడు అనే భేదం లేకుండా అందరి యందు పండితులు సమదర్శనులై వుంటారని గీత చెపుతున్నది. అట్టి పండితులు కొరవడడం వల్లనే ఈ మధ్య కాలంలో హిందూ ధర్మం మాసిపోయి, హిందూమతం గిడసబారిపోయింది.

ఆధునిక యుగంలో అట్టి పండితులు తిరిగి ఉద్భవించడం ఆరంభమయింది. రాజా రామమోహనరాయలు, స్వామీ దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, గాంధీమహాత్ముడు, పిఠాపురం మహారాజా, అభినవ మనువు అంబేద్కరు, మహాకవి మంగిపూడి వేంకట శర్మ, 'మాలపల్లి' రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ, బ్రహ్మర్షి వేంకట రత్నం నాయుడు, ''మాలపిల్ల'' చిత్ర నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం, కందుకూరి వీరేశలింగం పంతులు మున్నగు ఎంతో మంది తిరిగి ఆర్యమతోద్ధరణకు కంకణం కట్టుకొని పనిచేశారు. ప్రస్తుతం ఎంతో మంది పనిచేస్తున్నారు. వేదాత్మ నెరుగని కొద్దిమంది సంకుచిత చిత్తులు, తామే సనాతనుల మనుకుంటూ, ఆర్యధర్మ పునర్వికాసానికి దెబ్బకొట్టే విధంగా చేస్తూ, వ్రాస్తూవున్నా – అనేక మంది వైదికాచార ధర్మపరులైన యువకులు ముందుకు వచ్చి ఈనాడు ''కృణ్వంతో విశ్వమార్యం'' నినాదాన్ని తిరిగి చేపట్టారు. వారందరికీ నా జోహారులు.

హరిజనులు ఆర్యులేనని, ఆర్యద్రావిడ భేదం కూడ కృతకమైందేగాని నిజమైంది కాదని, ద్రావిడులు కూడ ఆర్యులేనని నిరూపించడం కోసమే నేను ఇదంతా వ్రాశాను. ''అసలు జాతి భేదమే లేకుండా, వసుధైక మానవ కుటుంబం, సమ సమాజం ఏర్పడుతున్న ఈ రోజుల్లో ఈ గోల అంతా దేనికి?'' అని ప్రశ్నిస్తారేమో, అట్టివారికి నా జవాబు – ఒక నమస్కారం.

ఇంతవరకు యోగవాసిష్ఠం, జ్ఞానవాసిష్ఠం గ్రంథాలు ఉన్నాయి. అందువల్ల ఈ పవిత్ర కల్యాణ గాథకు ''రాగ వాసిష్ఠం'' అని పేరు పెట్టాను. ఇతివృత్త మూలబీజం పౌరాణికం. నాటక కథాపథకం నా కల్పన.

హైందవ సామాజిక వ్యవస్థలో బ్రహ్మర్షి వసిష్ఠుడు ఒక కొస, మాతంగ కన్య అరుంధతి రెండవ కొస. ఈ రెండు కొసలూ కలిసి ఆర్య ధర్మ చక్రాన్ని పరిపూర్ణం చేసినై. ఈ కళ్యాణం జగత్కళ్యాణ కారకం. ముఖ్యంగా ఆర్యులందరికీ ఆరాధ్యం. అరుంధతీ వసిష్ఠుల లక్ష్యంలో నడిచి పోయిన నా తల్లిదండ్రులను స్మరిస్తూ ఈ నాటకాన్ని నా బాల్యమిత్రులు శ్రీ పేములు గార్కి కృతి ఇస్తున్నాను.

రంగు వెలుగుల ఏర్పాట్లు, మైకు వుంటే ఈ నాటక ప్రదర్శన ఆనందకరంగా వుంటుంది. ప్రతి రంగంలోను బ్రాకెట్లలో ఇవ్వబడ్డ సూచనలు సందర్భాన్నిబట్టి మైకులో తెరవెనుక నుంచి చెప్పబడుతూ వుంటే, ప్రేక్షకులకు కథ వివరణ జరుగుతూ వుంటుంది.

''ఎల్ల హిందువులను ఉపాసించు దేవ
గణములోపల మాతంగకన్య లేదె''

–నిరుద్ధ భారతం

''మాణిక్య వీణాం ఉపలాలయంతీం
మదాలసాం మంజుల వాగ్విలాసాం
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసా స్మరామి.''

''మాతా, మరకత శ్యామా,
మాతంగీ, మధుశాలినీ,
కుర్యాత్ కటాక్షం కల్యాణీ,
కదంబ వనవాసినీ?''

"జయ మాతంగ తనయే!
జయ నీలోత్పలద్యుతే!
జయ సంగీత రసికే!
జయ లీలాశుక ప్రియే!"

-కాళిదాసు

"మాతంగముని కన్యకాం
మధురభాషిణీం ఆశ్రయే"

-శంకరాచార్యులు

"జయమాతర్విశాలాక్షి!
జయ సంగీత మాతృకే!
జయ మాతంగి! చండాలి!
గృహీత మధుపాత్రకే!"

-శ్యామలస్తోత్రం

ఈ విధంగా మాతంగ కన్య పరమేశ్వరి అవతారంగా, ఆదికాలం నుంచీ అనూచానంగా స్తుతింపబడుతున్నది.

"మనసై వేదమాప్తవ్యం
నేహ నానాస్తి కించన
మృత్యోః స మృత్యుం గచ్ఛతి
య ఇహ నా నేవ పశ్యతి"

-కఠోపనిషత్తు

(మనస్సుచే మాత్రమే ఆ బ్రహ్మను పొందగల్గుచున్నాము. అప్పుడీ నానాత్వమే లేదు. ఎవరు ఈ ప్రపంచమందు నానాత్వమును చూచుచున్నాడో, వాడు జనన మరణ రూప సంసార దుఃఖములో పడిపోవుచున్నాడు.)

''ఈశావాస్యం ఇదం సర్వం
యత్కించ జగత్యాం జగత్,
తేన త్యక్తేన భుంజీథా!
మా కృధః కస్య స్విద్ధనం.''

(సమస్త విశ్వమునందును ఏ కొలది చరాచర వస్తుజాలము కలదో, అది అంతయు భగవంతునిచే ఆచ్ఛాదితము. కనుక, భగవత్ప్రసాదితమైన దానిని త్యాగ బుద్ధితో అనుభవింపుము. ఎవ్వని ధనము కొరకును ఆశింపకుము.)

–ఈశావాస్యోపనిషత్తు.

విద్యా ప్రదాన సమయే శరదిందు శుభ్రాం
లక్ష్మి ప్రదాన సమయే నవ విద్రు మాభాం
విజయ ప్రదాన సమయే తమాల నీలాం
దేవీం త్రిలోక జననీం శరణం ప్రపద్యే!
''కృణ్వంతో విశ్వమార్యం''

–బోయి భీమన్న

అంకితం

ఆత్మీయులు, అమృత హృదయులు

శ్రీ సాక పేములు గారికి

ముద్దుగ మూడు కాలముల

మ్రొక్కులు గైకొను నా వసిష్ఠకున్

ఇద్దరి నీవు, అద్దరిని

నేను; మనిద్దర మొక్క సారపుం

బద్దెము రీతి; కాన, కృతి

బాలను దీని గ్రహింపు మయ్య, సం

పద్ఘృఢ మైత్రి: మీ కగు శు

భమ్ములు; పేములు వర్య! ప్రేమమై!

– భీమన్న

❀ ❀ ❀

చిత్రకళా ప్రదర్శన

మా విషయం

మా సుఖేలానికేతనం కేవలం సాహిత్యాభిరుచితో పెంచుకొంటున్న సారస్వతో ద్యానంలో వికసించిన నాలుగవ కుసుమం ఈ 'చిత్రకళా ప్రదర్శన'. ఇంతవరకు వెలువడినట్టివి 'త్రిపదలు', 'మానవుని మరొక మజిలీ', 'ప్రకృతిలో మానవ ప్రకృతి'. ఇప్పటి ఈ చిత్రకళా ప్రదర్శన గురించి చెప్పే ముందు మా సంస్థ గురించి నాలుగు మాటలు చెప్పడం అవసరమని భావిస్తున్నాం.

మా సుఖేలా నికేతనం స్థాపించబడి అయిదారేళ్ళయినప్పటికీ అది వ్యవస్థీకరించ బడత 1960లో. శ్రీ బోయి భీమన్నగారి గేయ కావ్యం ''పైరుపాట'' సంగీత నృత్య నాటికగా ప్రదర్శించబడడంతో ఈ సంస్థ వెలుగులోకి వచ్చింది.

1960 సెప్టెంబరు మాసంలో, స్వర్గీయ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షత క్రింద జరిగిందా ప్రదర్శనం. అదే సమయంలో ఏ తత్కాల్వకర్త అయిన శ్రీ బోయి భీమన్నగారికి సన్మానం జరిపి, ఒక సన్మాన సంచికను కూడ వెలువరించి సమర్పించిందా యనకు. డా. దివాకర్ల వెంకటావధాని గారి ప్రధాన సాహిత్యోపన్యాసంతో, విధాన సభాధ్యక్షులు శ్రీ కాళేశ్వర రావుగారి శుభాకాంక్షలతో, తదనంతర ప్రదర్శనా సమంచితాలైన రమణీయ నృత్య సంగీతాలతో ఆనాటి కార్యక్రమం సహృదయ హృదయ రంజకమై, సమస్త సదస్య సమాహ్లాదకమై ఒప్పారిందన్నది జనవాక్యం.

ఆనాటి నుంచి, ఆనాటి విజయంనుంచి లభించిన ప్రోత్సాహ ప్రేరణల బలంతో, మా సంస్థ నృత్య సంగీత కార్యక్రమాలలో ఇతోధికమైన శ్రద్ధాసక్తులను ప్రదర్శించసాగింది. 'పైరుపాట'ను అప్పుడప్పుడు అక్కడక్కడా ప్రదర్శించుకుంటూ, రవీంద్రుని శత జయంతి ఉత్సవాల నాటికి 'చాండాలిక'ను నృత్య నాటికగా రూపొందించింది. ఆ తరువాత గురజాడ శతజయంతి సందర్భంలో 'కన్యక' సంగీత నృత్య రూపకంగానే నిర్మించబడింది. ఎగ్జిబిషను థియేటరులో 'చాండాలిక' ప్రదర్శన, రవీంద్ర భారతిలో 'కన్యక' ప్రదర్శన అపారంగా ప్రేక్షకుల మన్ననలను పొందినాయి.

సంగీత నృత్య నాటక ప్రదర్శనల ద్వారా కేవలం ఒకే రంగానికి కట్టుబడి వుండడం కంటె, వాస్తవ సాహిత్య రంగానికి కూడ కొంత సేవచేయాలన్న నిర్ణయానికి వచ్చి, సాహిత్య గ్రంథ ప్రచురణకు కూడ ఈ సంస్థ పూనుకొన్నది. సంగీత, సాహిత్య, నృత్య, చిత్రకళా రంగాలన్నిటికీ తన కార్యక్రమాన్ని విస్తరింపచేయాలన్నది యీ సంస్థ ఆకాంక్ష. ఏతత్కళా స్రష్టలను ప్రోత్సహించాలని, సృజనాత్మక సాహిత్యాన్ని వెలయింప చేయాలని, సార్వజనిక శ్రేయానికి మూలభూతమైన సాహితీ సంస్కృతుల ద్వారా భరత మాతను సేవించాలని మా చిరంతనాభిలాష. ఈ మా లక్ష్యసిద్ధి ప్రజల ఆదరాభిమానాలపై ఆధారపడి వున్నది.

ఈ ప్రస్తుత నాటికా సంపుటిలో పది నాటికలున్నాయి. అవన్నీ నృత్య సంగీత రూపకాలుగా నిర్మించడానికి అనువైనట్టివే. రంగ స్థలాన్ని, ప్రేక్షక జనాన్ని దృష్టిలో వుంచుకుని వ్రాయబడినట్టివే. ఇవన్నీ శ్రీ బోయి భీమన్నగారి స్వతంత్ర రచనలే. ఇందులో రెండు నాటికల యితి వృత్తాలు మాత్రం పూర్వ చరిత్రల నుంచి చేకొనబడినట్టివి. అందులో 'దేవయాని' కథ మహా భారతము నుంచి తీసుకొనబడగా, 'చాండాలిక' కథ రవీంద్రుని రచన నుంచి స్వీకరించబడింది. 'అంధకారంపై విజయం' కూడ నరకాసుర వధను అనుసరించిందే అయినా, అది ప్రస్తుత భారతోత్తర సీమారేఖపై దురాక్రమణకు, ఏతత్ప్రతిఘటనలో భారత యువజనతా దిగ్విజయానికి కేవలం ప్రతీక.

ఈ నాటికల సంపుటి తమ సోదరీ ప్రాయ అయిన స్వర్గీయ శ్రీమతి ఆదిలక్ష్మి ఎం.ఏ., ఎం.లిట్ గారికి అంకితమివ్వబడింది. రష్యాలోని లెనిన్‌గ్రాడు యూనివర్సిటీలో ప్రాచ్య భాషా (తెలుగు, తమిళము) ప్రొఫెసరుగా వుంటూ, ఆంధ్ర భారతి ప్రతిభా ప్రాభవాలను విదేశాల నిండా వెదజల్లుతూ, అక్కడే బాలెంత జబ్బుతో స్వర్గస్థురాలైన ఆంధ్ర విదుషీమణి శ్రీమతి ఆదిలక్ష్మి. ఈ సందర్భంలో కృతికర్త ప్రదర్శించిన ఉదాత్త సౌదర్యభావం ఆదర్శప్రాయమైనది, అభినందనీయమైనది.

శోభకృత్ ఉగాది
హైదరాబాదు

నమస్సులతో
సుఖేలా నికేతనం

అంకితం

సోదరి ఆదిలక్ష్మికి

స్టెల్లామేరీస్ కాలేజీలో బి.ఏ. క్లాసుకు ''మధుబాల'' కావ్యం పాఠం చెబుతూ, నన్ను మీ అన్నయ్యగా దత్తత చేసుకొన్న చెల్లీ!

''మాల వాళ్లంటే ఏమిటో అనుకునేదాన్ని! మీలా వుంటారని వూహించ లేదన్నయ్యా! నిజానికి మా బ్రాహ్మణ స్త్రీలు అంత కన్సర్వేటివుగా వుండటానికి కారణం వాస్తవ లోకజ్ఞానం లేకపోవడమే'' అంటూ, విశ్వమానవ ప్రగతి శీలకమైన పవిత్ర వాక్యాన్ని వేదవాక్యం వలె పలికిన తల్లీ!

''అన్నయ్యా'' అన్న మూడక్షరాలలో మూడు లోకాల సౌభ్రాత్రాన్ని నింపి, ''వదినా'' అన్న అక్షరత్రయంలో త్రిలోకాల సౌహార్దాన్ని ప్రపంచిస్తూ – వంట గదిలో చేరి, వదినెతో గంటల తరబడి కబుర్లు చెప్పే స్నేహరూపిణీ! ఆదిలక్ష్మీ!

మాతృదేశ కీర్తి ప్రతిష్ఠలు విశ్వంనిండా వెన్నెల కాయడం కోసం విదేశాలకు వెళ్ళిన ఆంధ్ర భారతి గారాబు బిడ్డవు – ఇక తిరిగి రావా, ఇక మాకు లేవా, అమ్మా!

చంద్ర లోకాలకూ, సూర్యలోకాలకూ తిరుగు ప్రయాణం టికెట్లను అచ్చు కొడుతున్న భౌతిక మానవుడు, బాలెంత అయిన మా తల్లిని మాకు తిరిగి ఇవ్వలేని నిస్సహాయుడేనా, విదుషీమణీ!

''మనం ముగ్గురం'' అనుకొంటూ ఆనాడు నీవూ, వదినా, నేనూ తీయించుకొన్న ఈ ఫోటో ఇక శాశ్వతస్మృతి చిహ్నమేనా, సోదరీ!

గురువు విద్యారత్న, తల్లి రుక్మిణమ్మ, భర్త ఆంజనేయులు, మైథిలి, భారతి, జోగా, వదిన, నేను – అందరం గోడలమీద ఫ్రేములలో ఫోటోలమై నీ చుట్టూ వున్నా – మేం వున్నామనీ, నీవు లేవనీ అనిపిస్తున్నదేమిటి, ''పంచామృత'' వాగ్దేవీ?

నీ – నా వాగ్దేవీ సౌదర్య తత్త్వానికి ఈ సంగీత నృత్య నాటికా గుచ్ఛం పూజాకదంబంగా స్వీకరించి, మన్నించమ్మా జనప్రియా!

రసాలిని

భాగ్యనగరం

–బోయి భీమన్న

బాలయోగి

(ఏడంకాల నాటకం)

నాటకం గురించి

కవి వలెనే, యోగి పుడతాడు.

కళ, రాజకీయం, వ్యాపారం, జ్ఞానం, యోగం -- ఏ రంగంలోనైనా సరే, మానవుడు విజయం సాధించాలంటే, అందుకు సంబంధించిన గుణం అతడి బీజంలోనే వుండక తప్పదు. మామిడి టెంక నుంచి మందార వృక్షం మొలవదు.

తన జీవ లక్షణానికి, మనోవైఖరికి అనుగుణమైన వృత్తిని ఎంచుకోగల ప్రజ్ఞావంతుడే -- తన శక్తికి తగిన విజయాన్ని సాధించగలుగుతాడు జీవితంలో.

పులిని చూచి నక్క వాతలు పెట్టుకోవడం -- నక్కను చూచి పులి కుక్కకు కూడ పారిపోవడం – ఈ రకం మనోవైఖరులు కల వాళ్ళే మానవులలో మెజారిటీ! తాను పులో, నక్కో -- గుర్తించుకోగల వాడు నూటి కొక్కడు కూడా లేడు! విధిని నిందించి, కర్మను తిట్టుకొని ఏం లాభం?

సాధారణ వృత్తిరంగాల విషయంలో అసాధారణత అంత కొట్టవచ్చినట్టుగా కనిపించదు.

సంగీతం, సాహిత్యం, చిత్రశిల్పం, ప్రవక్తృత, నియంతృత, భక్తి, యోగం -- బహుశా, ఈఏడు విషయాలలోనూ, మానవుని మహేశ్వరత్వం -- వైశాఖ మధ్యాహ్నంలా -- ప్రపంచాన్నే పాదాక్రాంతం చేసుకోగలదని విశ్వాసం.

ఈ ఏడు విషయాలలోను – బ్రహ్మానందాన్ని, బ్రహ్మానంద సబ్రహ్మచారిత్వాన్ని మానవుడికి ప్రసాదించగలవి రెండే -- యోగం, కవిత.

యోగం బ్రహ్మానంద ప్రదాయిని. అది సాక్షాత్తు పరబ్రహ్మ -- జీవ బ్రహ్మైక్య పారమ్యం!

కవిత కూడ అంతే!

యోగి, కవి -- ఈ ఇద్దరూ కారణ జన్ములు. అందుకోసం పుడతారు. సాధన ద్వారా ఏ మనిషైనా పొందగల లక్ష్యాలు కావు ఈ రెండూ!

ఇందుకు సాక్ష్యం మన చరిత్రే!
బాలయోగి కారణజన్ముడు.
అతడు పుట్టుకతోనే యోగి.

కుండలిని మేల్కల్పడం కోసం నానా తంటాలుపడి, తీరా అది మేల్కని కన్ను మన్నప్పుడు, ఏం చెయ్యాలో తెలియక, దాని కాటుకు ఆహుతైపోయిన అనేక మందిని గురించి నాకు తెలుసు. కవిని చూచి, వ్యామోహపడి, తాను కూడ కవిత్వం చెప్పి, సన్మానాలు పొందడానికి పూనుకునే పండితులవంటి వారు వాళ్ళు!

బాలయోగి మహాయోగి. అతని కుండలిని – బాల శివుణ్ణి చూచిన బాలవలె – దానంత అదే లేచి, తక్కిన ఏ మజిలీలోనూ ఆగకుండా, సరాసరి సహస్రారం చేరి, చిర వియోగ జనిత సమావేశంతో, పరమ శివుణ్ణి కౌగిలించుకొన్న చరిత్ర ముమ్మిడివరం బాలయోగిది.

రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రను మించిన చరిత్ర ఇది!

ఈ పరమ సత్యాన్ని గుర్తించగలవాళ్ళు ఇద్దరే – ఇటు పామరుడనబడే పశులకాపరి, అటు పండితుడనబడే ఐన్‌స్టీన్ మహావిజ్ఞాని!

అపర చాణక్య బిరుదాంకితులైన శ్రీ కళా వెంకటరావుగారు 1948 ప్రాంతంలో ఒకసారి నాతో ఇలా అన్నారు:

''ముమ్మిడివరం బాలయోగి గురించి నేను ఎన్నో పరిశీలనలు జరిపించాను. నాకు నమ్మకమైన వాళ్ళను నిఘావుంచాను. ఇటు నా మిత్రులు, అటు ప్రభుత్వపు సిఐడీలు కూడా అతనిలో ఏ లోపాన్నీ కనిపెట్టలేకపోయారు. అతడి (బాలయోగి)లో ఏదో అతిలోక మహాత్మ్యం వుంది. హి ఈజ్ నాట్ ఎ హోక్స్ (He is not a hoax).

అటువంటి -- పరమేశ్వర స్వరూపుడైన -- బాలయోగి చుట్టూ నేను అల్లిన కథ ఈ నాటకం!

కట్టెదుట ఉన్న వాస్తవానికి దెబ్బతగలకుండా, ఆధ్యాత్మిక సత్యాన్ని, నాటకీకరించి, పాత్రపోషణ చేసి చూపడం సులభం కాదు. అతి కష్టం కూడ! ఈ నాటకంలోని నా ప్రతి

కల్పనా -- భగవంతుడైన బాలయోగి నాచే చేయించిందే! నేను కేవలం అతడి చేతిలో ఒక నిండు కలాన్ని మాత్రమే.

బ్రాకెట్లలో ఇచ్చిన వర్ణన అంతా పాత్రధారులకు డైరెక్షను మాత్రమే. రంగాలంక రణలో, నటనలో చూపలేని అంశాలను మైకు ద్వారా సదస్యులకు చెపుతూ పోవచ్చు. స్వప్నదృశ్యంకోసం జెండాలు, పంట తల్లి వగైరాలను ఉపయోగించుకోవచ్చు. అవును రంగంలో ప్రవేశపెట్టడం సాధ్యం కాకపోతే -- ఆవు బమ్మతో (బమ్మలో మనిషితో) ఫలితం సాధించవచ్చు. చివరి రంగంలో మరో బాలయోగి పాత్రను వాడుకోవచ్చు. నాగు పాత్రకు మంచి గుడ్డ బమ్మనో, రబ్బరు బమ్మనో వాడుకోవచ్చు.

బాలయోగి ఈ కాలానికే ఒక భగవత్ ప్రతీక. ఒక శివ దీక్షాత్కృతి.

పుట్టుక నుంచీ మానవ సేవా కార్యక్రమాన్ని చేపట్టి, అదే లక్ష్యంగా పురోగమి స్తున్న హరిజన నాయకుడు శ్రీ ఈలి వాడపల్లిగారు. ఈయన ఎంతటి పేదవాడో అంతటి దాత, బలిచక్రవర్తి ఉండి ఇచ్చాడు. లేకుండా కూడా ఇస్తాడీయన, వదాన్యుడు, త్యాగి, నిత్య సేవాతత్పరుడు. ప్రజాహృదయుడు. ప్రేమ సామ్రాట్టు. యోగనిష్టుడైన సుబ్బా రావు బాలయోగి పేరిచ్చిన మహర్షి. ఇంతటి మహాత్ముడైన శ్రీ వాడపల్లి గారికి ఈ నాటకం అంకితం ఇస్తున్న నేను కూడ ధన్యుణ్ణి. భాగ్యవంతుణ్ణి!

ఈ నాటకం నేను వ్రాయడానికి కారణమైన ప్రఖ్యాత సినీవేత్త శ్రీ అనుమకొండ వారికీ, అడిగిన వెంటనే ముద్రించి పెట్టిన శ్రీ పబ్బా వారికీ కృతజ్ఞుణ్ణి.

మహాయోగులను ప్రపంచానికవతరింప జేసిన బాలయోగి చిన బాలయోగుల తల్లిదండ్రులు సాక్షాత్తు జగత్పితృమూర్తులు. వారికి, వారి కుటుంబానికి నా నమస్సులు.

– రచయిత

అంకితం

మహర్షి శ్రీ ఈలి వాడపల్లిగారికి

శ్రీ యీలి వాడపల్లి సుధీ!
మానవ
శ్రేయో మహా పయోధీ
వాల్మీకి ఊహలో
వ్యాసర్షి గీతలో
మెరిసిన మెరుపు నీవు!
విరిసిన మనిషి నీవు! "శ్రీ"

శ్రీ యీలి వాడపల్లి సుధీ!
మానవ
శ్రేయో మహా పయోధీ
సర్వం సహా చక్ర
చక్రవర్తినె కొన్న
వీరబాహుని వంశ
వీరాధి వీరుడా: "శ్రీ"

శ్రీరామ దాపు సు
గ్రీవునికి ప్రాపైన
అలమతంగుని తపః
పలమైన గుణనిధీ! "శ్రీ"

హరిజనుడవై పుట్టి
హరిపథకము పట్టి
నిరుపేద జనుల పె
న్నిధి వైన వరదుడా! "శ్రీ"

బలి, శిబి, దధీచి ము
ఖ్యుల వదాన్యత యెల్ల
వాసనాగతి విరియు
వర పారిజాతమా! "శ్రీ"

చిన్న పైసా యైన
చేత లేకుండినను
లక్షమందికి మహా
లక్ష్మి రూపము చూపు! "శ్రీ"

స్వీయ కష్టముతో -- ప
రాయి సుఖములు పెంచు
నవ్య దీప జ్యోతి!
దివ్య భావ విభూతి! "శ్రీ"

బాల బాలికలె నీ
బంగారుపంట!
అమృత విజ్ఞానమే
అతిథి నీ యింట! "శ్రీ"

శివుడె మా బాలయో
గి వరేణ్యుడని చెప్పి,
శివరాత్రి ఫలమెల్ల
క్షితి కిచ్చిన మహర్షి! "శ్రీ"

శంఖమే భార్యగా
జన్మ నందిన హరీ!
ప్రేమయే బిడ్డలుగ
పృధివి బుట్టిన సిరీ! "శ్రీ"

బాలయోగి చరిత్ర
భవ్య నాటక మిదే,
కృతి పతివి కమ్ము! నా
కును కృతార్థత నిమ్ము!
శ్రీ యాలి వాడపల్లి సుధీ!
మానవ
శ్రేయో మహోపయోధీ!

రసాలిని – బోయి భీమన్న

❀ ❀ ❀

ఆదికవి

వాల్మీకి

(ఆరంకాల నాటకం)

ఆముఖం

భారత జాతికి జాతీయ కవులు ముగ్గురు – వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు.

కృతయుగం శ్రుతి ప్రధానం, కవితకు శ్రుతులే బీజక్షేత్రాలు.

త్రేతాయుగానికి వాల్మీకి, ద్వాపరయుగానికి వ్యాసుడు, కలియుగానికి కాళిదాసు కవి బ్రహ్మలు. వేద క్షేత్రంలో పుట్టి, పెరిగి, వికసించి, ఫలించి, మానవచేతనను ఆనంద రసప్లావితం చేసిన రస బ్రహ్మలు వారు.

రసో వైసః

ఈ ముగ్గురు కవిబ్రహ్మలూ ఎవరు?

అర్థంలేని ప్రశ్న! కదూ?

అయితే – ఈనాడు అర్థం దేనికుంది?

ఈనాడు మాటకు అర్థంలేదు. అర్థానికి విలువ లేదు, విలువకు పరిగణన లేదు. అందుకే ఈ ప్రశ్న అడుగుతున్నాను. ఈ ముగ్గురు కవి బ్రహ్మలూ ఎవరు?

ఈ ముగ్గురూ గిరిజన, హరిజన, బహుజన కులాలకు చెందినవారే కాదా?

ఋషి మూలం, నది మూలం వెతకవద్దన్నారు పెద్దలు. సరే, వెతికితే ఏమవుతుంది?

ఏమవుతుంది? ఈనాటి ఛాందసుల, పండితుల, కులతత్వవాదుల కుతర్కంలోని కౌటిల్యం బైటపడుతుంది!

అంటరాని వాడుగా అవమానించబడుతున్న ఒక హరిజన యువ రచయిత – ఈనాడు – ఈ 1970వ సంవత్సరంలో – ఈ భాగ్యనగరంలో నిలబడి, వెనక్కి తిరిగి ద్వాపరంలోకి, త్రేతాయుగంలోకి తన వంశవృక్షాన్ని అవరోహిస్తూపోతే, ఎక్కడికి చేరతాడు? మూలం ఏది? బీజం ఎక్కడ?

బీజం ఆర్షం, మూలం వాల్మీకం, కాండం వ్యాసం, శాఖలు కాళిదాసం కాదా? కాదనగలవాడెవడైనా ఉన్నాడా?

ఈ విషయాన్ని కూలంకషంగా పరిశోధించే – హరిజనులు ఆర్యులే అన్నాను. హరిజనులది ఋషుల వంశమే అన్నాను. ఈ దేశంలో హరిజనులకూ, హరిజనేతరులకూ జాతిభేదం లేనేలేదన్నాను.

రాగవాసిష్ఠం (అరుంధతీ కల్యాణం), ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మవ్యాధుడు ఈ నాలుగు నాటకాలనూ నేను వ్రాయటం హరిజనులు ఆర్యులే అని ఋజువు చెయ్యడానికే. అందుకు బాహ్య (చారిత్రక) సాక్ష్యాలనూ, ఆంతరంగిక (పురాణగత) సాక్ష్యాలనూ కూడ విశేషంగా చూపాను. ఇంకా పరిశోధించేకొలదీ అందుకు సాక్ష్యాలు కుప్పతెప్పలుగా లభించగలవు. ఆత్మవంచన విడిచిపెట్టి, అభిజ్ఞులైన పండితులు ప్రయత్నించండి!

2

1931–32 ప్రాంతంలో కాబోలు – బి.ఎస్.మూర్తిగారు ''ఆరు కోట్ల తిరుగుబాటు'' అనే పద్యకావ్యాన్ని వ్రాశారు. దాన్ని ఉండ్రు సుబ్బారావుగారు అచ్చువేశారు.

ఆరుకోట్ల మంది (1931 సెన్ససు లెక్కల ప్రకారం) హరిజనులు తమ హక్కుల కోసం పోరాడడం ఆ కావ్యంలోని ఇతివృత్తం.

అయితే – ఆ పద్యాలనుగాని, ఆ అచ్చు పుస్తకాలనుగాని చూచిన వారెవరూ లేరు. వ్రాశామని మూర్తిగారు చెప్పేవారు. అచ్చువేశామని సుబ్బారావుగారు చెప్పేవారు. అంతే.

ఒకప్రక్క గాంధీజీ, మరోప్రక్క అంబేద్కర్‌జీ హరిజనోద్యమ రంగంలో పోరాడుకొంటున్న రోజులవి. స్థానికంగా ఉండ్రు సుబ్బారావు, చినవెంకటరెడ్డి, జన్నుల మోహనరావు, బళ్ళ పురుషోత్తం, పాముల ప్రకాశరావు, నరసింహారావు మొదలైన వాళ్ళం ఆ రోజుల్లో ఒక జట్టుగా బైలుదేరి హరిజన పేటల్లో ప్రచారం చేస్తుండేవాళ్ళం.

అప్పటికి నేను ఇంటర్ చదువుతుండే వాణ్ని.

హరిజనులెవరు? అంటరానితనం ఎందుకు వచ్చింది? మొదలైన విషయాలను గురించి మా ప్రచారం కోసం వివరాలు కావలసి వచ్చి, అవి ఎక్కడా దొరక్క, నేనే సొంతంగా ఒక సిద్ధాంతాన్ని రూపొందించాను. దాని ప్రకారమే మేము ఉపన్యాసాలు దంచుతూ ఉండే వాళ్ళం.

ఆ సిద్ధాంతం ఇది.

1. ఆది భారతీయులు హరిజనులే. హరిజనులే భారతదేశపు తొలి రాజులు.

2. హరిజనులే అసలైన ద్రావిడులు.

3. ఆ తర్వాత ఆర్యులువచ్చి, ద్రావిడుల్ని ఓడించారు.

4. ఓడిన ద్రావిడులలో ఆర్యులకు లంగిపోయి, వారి ఆజ్ఞలకు తలగ్గిన వారు శూద్రులైనారు.

5. శూద్రులు కావడానికి ఇష్టంలేనివారు పారిపోయారు. అలా పారిపోయిన వారిలో కొందరు గ్రామం వెలుపలనే ఉండిపోయారు. వారే అస్పృశ్యులుగా చూడబడిన నేటి హరిజనులు.

6. మరికొందరు అడవులలోకి పారిపోయారు. వారే నేటి గిరిజనులు.

7. కాగా – భారతదేశానికి నిజమైన హక్కుదారులు గిరిజనులూ, హరిజనులూను.

ఈ సిద్ధాంతం అప్పట్లో చాల ప్రచారం పొందింది.

అయితే – నేను ఆ తర్వాత చరిత్రను, పురాణాలను, దేవాసుర సంబంధాలను పరిశోధించడం మొదలుపెట్టిన తర్వాత – చిన్నప్పటి ఆ నా సిద్ధాంతాన్ని మార్చుకున్నాను. ఆర్యులూ, ద్రావిడులూ – ఉభయులూ కూడ ఒకే జాతికి చెందిన వారనేది ఇప్పటి నా సిద్ధాంతం.

గిరిజనుడుగా, బోయకులస్థుడుగా ప్రసిద్ధి పొందిన వాల్మీకి మహాకవి మొదట్లో హరిజనుడే అన్న నా సిద్ధాంతానికి ఉపబలంగా మాత్రమే ఈ పై వివరాలను ఇక్కడ పేర్కొన్నారు.

గిరిజనులలో వాల్మీకులు మాలలనీ, అస్పృశ్యులనీ షెడ్యూల్డు తరగతులను గురించి పరిశోధనలు జరిపిన శ్రీ తులాబందుల నాగేశ్వర రావుగారు చెపుతున్నారు. ఈ సత్యం కూడా నా సిద్ధాంతాన్ని బలపరిచేదే.

3

సృష్టిస్థితి ప్రణాళికలో – పురాణాల ప్రకారం 14 మన్వంతరాలున్నై. అందులో ఏడోది వైవస్వత మన్వంతరం. ఈ వైవస్వత మన్వంతరం ప్రారంభమయ్యేదాకా – అంటే, ప్రణాళికలో సగం గడిచే దాకా – మానవుడికి గోపోషణ కాని, కృషి కాని, సత్య అసత్య విచక్షణ కాని, లోభమాత్సర్యాలు కాని లేవు. అంటే – అంత సహజంగా, దివ్యంగా మానవుడు జీవిస్తూ ఉండేవాడన్నమాట! బహుశా, ఆనాటి సమాజ వ్యవస్థనే ఆదిమ సమ సమాజం (Primitive Communism) అనవచ్చునేమో.

అదితీ కశ్యపుల కొడుకు వివస్వతుడు. అతడు సూర్యుడు. అతడి భార్య సంజ్ఞ. ఈ ఇద్దరికీ పుట్టినవాడు వైవస్వతుడు. ఇతడు మనువై మానవ సమాజాన్ని శాసించడానికి పూనుకొన్న నాటి నుంచే, సమాజంలోకి దుష్టస్వార్థం ప్రవేశించిందనవచ్చు.

వైవస్వత మన్వంతరంలో, ముఖ్యమైన ఋషివంశాలలో అత్రి వంశం ఒకటి. ఆ వంశంలో పుట్టినవాడు వేనరాజు.

స్వార్థపరుల చేతిలోపడి సమాజం నాశనం కాకుండా కాపాడడంకోసం వేనుడు ప్రయత్నించడం, హత్య కావించబడడం లోక ప్రసిద్ధమైన విషయమే కదా?

వేనరాజుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు నిషాదుడు. చిన్నవాడు పృథువు.

నిషాదుడు తండ్రి విధానాలనే అనుసరించడంవల్ల – స్వార్థపరులైన అమాత్యులూ, పురోహితులూ అతణ్ని దేశం నుంచి వెళ్ళగొట్టి, సాధువైన పృథువును సింహాసనం ఎక్కించారు.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే – దేశ బహిష్కృతుడై, అడవులకు పారిపోయిన ఆ నిషాదుడే పల్లె, బోయ, ఎరుకల వంటి ఆటవిక తెగలకు మూలపురుషుడని బ్రహ్మపురాణం చెపుతున్నది కనుక!

సాంప్రదాయకంగా చెప్పుకోవడాన్ని బట్టి - వాల్మీకి బోయ, నిషాదుడు కదా? అత్రి మహర్షి వంశం వాడే కదా?

కాగా - ఈనాడు ఆదివాసులుగా, గిరిజనులుగా చెప్పబడుతున్న వాళ్లు ఆర్య ఋషుల వంశస్థులే అనడానికి ఇంతకంటె పౌరాణిక నిదర్శనం మరేం కావాలి?

4

అత్రి భార్య అనసూయ. ఆమె అరుంధతి అక్క! అనసూయ, అరుంధతి మొదలైన ఏడుగురు అక్కల తర్వాత పుట్టినవాడు కపిల మహర్షి. వేదాంతంలో సాంఖ్య సిద్ధాంతాన్ని ప్రవర్తింపజేసిన వాడు ఈ కపిలుడే.

వీరంతా ఈనాటి హరిజనులకు పితరులే కాదా?

ఆదిమ భాషయై భవన
మంతట రంజిలు దేశభాష యం
దాది మహా కవీంద్రుడయి
ఆది మహా కృతి కర్తయై మహేం
ద్రాది సురార్చితుండగు మ
హా మునిచంద్రుడునైన అమ్మహా
వేద విదుండు వాల్మీకి ప
విత్రుడు మున్ను నిషాదుడే కదా?

(నిరుద్ధ భారతం, పద్యం 12)

నిషాదులు హరిజనులే అనీ, కపిల మహర్షి మాలమాదిగవాడేననీ నిరుద్ధ భారతం 96వ పద్యం నిరూపిస్తున్నది.

ఎందరు కపిల మునీంద్రులీ మాలల
యం దుద్భవించి పెంపొందువారో!
.....
.....

ఎంద రెంద రరుంధతు లీ నిషాదు
లం దవతరించి సత్కీర్తి నొందువారొ!
ఏపు గననీక మాలల హిందుజాతి
స్వార్థరతి నాత్మనాశంబు సల్పుకొనియె!

అదే విధంగా వాల్మీకి, పరాశరుడు, వేదవ్యాసుడు, శ్రీశుకుడు, సత్యవతి, రోహిదాసుడు, మతంగుడు, కుంతి, రేణుక, పరశురాముడు ఇలా ఎందరెందరో పురాణ పురుషులు, స్త్రీలు హరిజనులని ఎంతో పరిశోధించి స్వర్గీయ మంగిపూడి వేంకటశర్మ గారు నిరుద్ధ భారతంలో నిరూపించి ఉన్నారు. ఈ విషయంలో ఇంకా ఎంతో పరిశోధన జరగవలసి ఉంది కూడ.

పురాణాలన్నీ అనుష్టుప్ ఛందస్సులో వ్రాయబడ్డాయి. అనుష్టుప్ శూద్ర ఛందస్సట. స్త్రీలకోసమూ, శూద్రులకోసమూ, ద్విజ బంధువులకోసమూ, వేదాలు పురాణీకరించబడ్డాయట! కావచ్చు. వేదాలు విభజించిన వ్యాసమహర్షి హరిజనుడు కనుక – తన ప్రజల కోసం వేదసారాన్ని పురాణ కథలుగా వ్రాసి ఉండవచ్చు. చరిత్రలో మొట్ట మొదటి ప్రజాకవి వ్యాసుడే కదా? అప్పుడు ద్విజబంధువులు అంటే హరిజనులే అవుతారు. ''చండాలస్తుజనితో బ్రాహ్మణ్యాం వృషలే నయ'' అనే నిర్వచనాన్ని బట్టి హరజనులు బ్రాహ్మణబంధువులే.

5

స్వర్గంలో అప్సరసల దర్శనంవల్ల బ్రహ్మ మనస్సు వికలమై, అందుండి వాల్మీకి పుట్టాడనీ, అన్యాయంగా బ్రహ్మచే శపించబడి చండాలుడైనాడనీ, తర్వాత ఆటవికులలో కలిశాడనీ పురాణగాథ. ఈ గాధనే ఈ నాటక రచనకు పునాదిగా తీసుకున్నాను నేను. అప్సరసలలో ఊర్వశి ఎక్కువ హృదయం కలది కనుక, వాల్మీకి పుట్టుకకు ఆమెనే ప్రధాన హేతువుగా నిర్ణయించాను.

ఎప్పుడు ఏది ఎందుకు జరుగుతుందో ఎవరికీ తెలియదు. సృష్టి అనేక విధాలుగా జరిగింది. పురాణ పురుషులలోను, మహా ఋషులలోను ఎక్కువ భాగం

వివాహిత దంపతులకు పుట్టిన వాళ్లు కాదు. ఋషులలో బ్రహ్మలలో అనేకులు మొత్తం మీద హరిజనులే!

''సత్యయుగంబున నొకనాడు బ్రహ్మ స్వర్గమును జూడ వెళ్లెను. వాని కింద్రు డును రంభాది అప్సరసలను ఎదురుగా వెళ్ళిరి. వారిని జూడగా బ్రహ్మకు రేతఃపత నమయ్యె. అది కొంత పంకముతో గలిసెను. అందుండియే వాల్మీకి జన్మించెను. అట్లు జన్మించిన వాల్మీకి బ్రహ్మకెదురుగ బోయి, నీ రేతస్సు పంకముతో గలియుటచే నేబుట్టి తిని, నా కాహారము సమకూర్చుము అని యడిగెను. తన రహస్యము బైట బెట్టుటచే బ్రహ్మకు కోపము వచ్చి, నీవు పతితుడవు కమ్మని శపించెను... ఆ శాపము వలన వాల్మీకి చండాలురను గలిసి తిరుగుచు, ఒక బోయ కాంతను వివాహమాడెను....''

(పూర్వగాథా లహరి, పేజి 308, 406)

పురాణ ప్రసిద్ధమైన గాథనే తీసుకొని, అనుగుణమైన మార్పులు చేసి, ఈ నాట కాన్ని వ్రాశాను.

ర, మ అనేవి రెండు బీజాక్షరాలు. అవి రెండూ కలిసిందే పూర్ణ చైతన్యధార. అగ్ని బీజాన్ని ద్విగుణీకరించి, 'రామ' శబ్దాన్ని సంపుటీకరించి, ఒక పూర్ణ పురుషమూ ర్తిని సృష్టిం చాడు బ్రహ్మ. దానికి వాల్మీకి రూపకల్పన చేశాడు. రామ అనేది ఒక మంత్రం. అది హృదయ పద్మానికి రవి వంటిది. ''కవీంద్రాణాం చేతఃకమల వనబాలా తపరుచిం'' అని శంకరాచార్యుడు ఏ శక్తిని సంభావించి పలికాడో, అది ఈ ''రామ'' మంత్రస్థమైన శక్తే. రామ మంత్రమే రామాయణంగా వికసించింది.

(అలానే కామ బీజాన్ని ద్విగుణీకరిస్తే ''రమా'' అవుతుంది. అదే శక్తి.)

సార్వజనిక శ్రేయోజీవన పథకానికి విరుద్ధమైన దేదీ రామాయణంలో ఉండదు. ఉంటే అట్టిది ప్రక్షిప్తమై ఉంటుందే కాని, వాల్మీకిది కావడానికి వీలు లేదు. తాను నిషా దుడై ఉండి కూడ, ఒక నిషాదుడి క్రూర కృత్యాన్ని సహించలేక శపించగలిగిన పరమర్షి వాల్మీకి. అతని రచనలో జాతి, కుల, వర్గ, పక్షపాతం ఉండబోదు.

మన ఆర్యమహర్షుల పుట్టుపూర్వోత్తరాలను ఈ విధంగా నేను ఎత్తి చూపడానికి కారణం, నేటి హిందూ సమాజం నుంచి కులతత్వాన్ని నిర్మూలించాలన్న నా ఆకాంక్ష. భారతీయ సంస్కృతికే మూలపురుషులైన ఋషులంతా ఒక మాదిరిగా హరిజనులే అయినప్పుడు అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ పట్టుకొని వ్రేలాడడం పాపం కాదా? ఆత్మ ద్రోహం కాదా?

జాతి సమైక్యంకోసం, కులతత్వ నిర్మూలన కోసం నేనీ పరిశోధన అంతా చేస్తున్నాను. దీనివల్ల ఒక్క ప్రజ్ఞావంతుడు ప్రాభావితుడైనా, నేను ధన్యుణ్నే.

గిరిజనుల కోసం, హరిజనులకోసం వెనుకబడిన వర్గాల కోసం చిన్నప్పటి నుంచీ ఎంతో సేవచేస్తూ వస్తున్న మిత్రులు, శాసన సభ్యులు, ప్రజాబంధు శ్రీ తులాబందుల నాగేశ్వర రావుగారికి ఈ దృశ్య కావ్యాన్ని అంకితమిస్తూన్నాను.

దీని రచన, ముద్రణ విషయాలలో నాకు తోడ్పడిన వారందరికీ, సన్మాన సంఘ కార్యకర్తలకూ వందనా లర్పిస్తున్నాను.

-భీమన్న

అంకితం

ప్రజాబంధు శ్రీ తులాబందుల
నాగేశ్వరరావుగారికి

శ్రీ రమ్యమైన గుంటూరు మండల మంచు
సౌభాగ్య మూర్తిగా జనన మొంది,
తరతరాల్ యుగయుగాల్ తల వంచి మనుచున్న
కూలి వృత్తి కులాల కూడ గట్టి,
అరి భయంకరుని రాయల వంటి కొమరుని
భరతోర్వి యొడిని సౌభద్రు జేసి,
బహుజన సేవ జీవన పరమార్థమై
ఘన సముద్ర గభీర ఘనత గాంచి,

వరలు శ్రీ తులా బందుల వంశ మణికి
ఇద్ధమతి ప్రజాబంధు నాగేశ్వరునికి
మత్కృతి నొసంగు వాడ సంత త్వరంప
రాభి వృద్ధిని కోరి సభ్యానుదీప్తి.

– భీమన్న

❀ ❀ ❀

ప్రగతి

ఆరు దృశ్యాల వ్యంగ్య నాటకం

ప్రగతి పథం

సత్య మద్వైత మని పల్కె శంకరుండు,
అగును నిజము రసాద్వైత మందు నేను!
నిజమె సత్యము, సత్యమె నిజము తెలిపి
అమృత పదవిని సమకూర్చునదియె ప్రగతి!

ప్రగతిని గురించిన నా దర్శనం ఇది.

'ఎవరి దర్శనం వారిది. నీ దర్శనం నీకే వుంచుకో. ఏ వ్యక్తి దర్శనం ఆ వ్యక్తి వ్యక్తిత్వం తోటిది. మా అందరికీ ఏకకాలంలో దర్శనీయమయిందేదైనా వుంటే చూపు. మమ్మల్ని విసిగించకు. నీకు పుణ్యముంటుంది'' అన్నాడు మిత్రుడు – నేను ''లక్కీ కుమారి'' అనే పేరుతో పదహారేళ్ళ క్రితం వ్రాసి, పాత ఫైళ్ళలో కట్టిపారేసి వుంచిన ఒక నాటకం వ్రాతప్రతిని ఫైకితీసి, దుమ్ముదులిపి, దానిని ప్రగతిగా మారుస్తుండడం చూస్తూ!

ఆ మిత్రుడే నేను ఆ నాటకాన్ని పరిష్కరించుకొంటూ తిరిగి ఈ రూపంలోకి తేవ డానికి నాకు మార్గమిత్రుడైనాడు. ఈ నాటకంలో ఒక పాత్రకూడా అయినాడు.

మిత్రుడు అని నేనంటున్న ఈ పాత్ర ఒక వ్యక్తి కాడు. ముగ్గురు వ్యక్తులు. ఒకరు బజ్జా తారకం, రెండవ వారు వారా వేణు, మూడవ వారు నా అర్ధాంగి హైమవతి. ఈ హైమవతి మరీనూ!

నిజమే.

సాంప్రదాయక బలహీనతలను, రాగద్వేషాలను, సాంఘిక ప్రతిష్ఠలను, అన్నిరకాల ప్రిజిడిస్సులను వదిలేసి మౌలికంగా ఆలోచించి చూస్తే మిత్రుడు చెప్పింది నిజమే!

అవును.

నీ మతం, నీ భక్తి బోధ, నీ వేదాంత వైభవం, అవన్నీ ఎవడిక్కావాలి? నీవు దర్శించిన ఆ దేవుణ్ని, ఆ పరమాత్మను, ఆ ప్రగతిని మాకు కూడ చూపు!

ఈ సవాలుకు జవాబు చెప్పగలవాడెవడు?

సర్వసమత, దారిద్ర్య నిర్మూలన, అవిద్యాతొలగింపు, అందరికీ తిండి, ఎల్లరకూ పని, సర్వులకూ విద్య, సర్వేజనా స్సుఖినోభవంతు వంటి మాటలను అర్థం తెలిసే అంటున్నారా రాజకీయ నాయకులంతా? మరి ప్రజలంతా ఎందుకు నమ్ముతున్నారు?

''నీ పొరుగువాడి సంపదకోసం నీవు ఆశించకు'' అంటూ రెండు వేల సంవత్సరాల క్రితం ఏసుక్రీస్తు చెప్పినమాట ఎంతమంది కర్థమయింది? ఆ మాటల్లో క్లిష్టత ఏమున్నది? ఆనాటి నుంచీ ఎన్నికోట్ల కోట్ల మంది ఆ మాటను బోధించారు? విన్నారు? చదివారు? మరి ఆచరించారా? ఎందుకు ఆచరించలేదు? అర్థంగాకనే కదా?

గతి – ప్రగతి

''ఏది గతి? ఏది ప్రగతి?'' అనే పాట వుంది నాటకంలో. అది కొంచెం చదవండి.

భూమి తిరుగుతున్నంతకాలం గతి వుంటుంది. మనిషే కాదు, తదితర జీవ రాశి కూడ జడమై పడివున్నప్పటికీ సూర్యోదయం అవుతూనే వుంటుంది. సూర్యాస్తమయం అవుతూనే వుంటుంది. వాటితోపాటు శారీరక వృద్ధి క్షయాలు, అందుకు అనుబంధితాలైన పనిపాటులు, సత్వర సంపాదనలో పోటీలు, పోరాటాలు అన్నీ జరుగుతూనె వుంటై. అవన్నీ 'గతి'లోని భాగాలు. ప్రగతికి సంబంధించినవి కావు.

మరి ప్రగతి అంటే ఏమిటి?

ప్రగతి అంటే ప్రకృతి సిద్ధమైన గమనం కాదు. అదొక విలక్షణమైన మానవ మేధస్సు మాత్రమే సాధించగల ఒక శ్రేయస్సుందర కళాత్మక పురోగమనం.

తన మేధస్సు వికసించేకొలదీ మానవుడు తన సహజగతిని తేజోవంతం చేసుకొంటూ, అందుకు తగినట్టుగా ప్రకృతిని, పరిసరాలను మలుచుకొంటూ, తనతోపాటు తన సమాజాన్నీ జాతినీ శ్రేయోమార్గంలో నడిపించుకుపోవటానికి చేసే కృషియొక్క సంపూర్ణ సత్ఫలితమే ప్రగతి.

అంత భేదం వుంది గతికీ, ప్రగతికీ!

కళా సౌందర్య సమాలంకృతమైన గతే ప్రగతి.

ఆహార, నిద్రా, మైథున, భయ సంయుతమైన సహజ చతుష్పాత్తు గతి.

ఈ చతుష్పాత్తును (నాలుగు కాళ్ళ జంతువును) పరోపకార, స్వార్థ త్యాగ ద్విపాత్తుగా (రెండు కాళ్ళ మనిషిగా) కూర్చడానికి అనాదిగా మేధావులు ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. బాధలు పడుతూనే వున్నారు. విఫలులవుతూనే వున్నారు. సామాన్యజనం మాత్రం ఆ నాలుగు కాళ్ళ జంతువుగానే వుంటూ వస్తున్నది. విసిగిపోయిన ఋషులు దానికి ''ధర్మదేవత'' అనే మంచి పేరు పెట్టగా, స్వార్థపరులైన మతాధిపతులు దాని కాళ్ళు కట్టేసి, దాని శ్రమ ఫలితాన్ని పిండుకు తాగేస్తున్నారు.

నేటి పరిస్థితి కూడా ఇదే.

సూత్ర గ్రంథం

భారతదేశంలో చారిత్రకంగా మనకు తెలిసిన అతి పురాతన నాగరికత సింధు నదీ లోయలోని హరప్పా మెహంజదారో శిధిలాలది.

ఒక మహా ప్రళయంలోనో, పోరాటంలోనో నాశనమైపోయిన మానవ నాగరికత అది. అదొక దశాంతం – యుగాంతం.

అక్కడ నుంచి ఇక్కడి దాకా, మన దాకా జరిగిన పురోగతినే సూత్రప్రాయంగా చిత్రించాను ఈ చిన్ని నాటకంలో.

ఇదొక సూత్ర గ్రంథం. ప్రతి అక్షరాన్నీ, పదాన్నీ, వాక్యాన్నీ కూడ పట్టి పట్టి చూడవలసి నట్టిది. ప్రతి పాత్రనూ ఒక మానవ స్వభావంగా పరిశీలించి సరిదిద్దుకోవలసి నట్టిది. ప్రతి సంఘటనా ఒక చారిత్రక పరిణామం అవుతుంది.

సృష్టిలో మానవుడొక జీవి. మన పూర్వుల అంచనా ప్రకారం ఎనభై నాలుగు లక్షల జీవ జాతులలో మానవ జాతి ఒకటి. పూర్వుల అంచనా అని ఎందుకంటున్నానంటే – ఆధునికుల అంచనా ఏదీ లేదు కనుక!

సృష్టిలో ఎన్ని జాతుల జీవుల (Species) ఉన్నాయో ఆధునిక సైన్సు లెక్క కట్టలేదు. (ఏమో, నాకు మాత్రం తెలీదు).

అన్ని జీవ జాతుల వంటిదే మానవ జాతి కూడ. ఒక్కొక్క జీవ జాతిలో ఒక్కొక్క గుణం అంకురిస్తే – అన్ని గుణాలు మానవుడిలో వికసించినై.

అంటే – మానవుడు సర్వగుణ సంపన్నుడే కాని, కేవల సద్గుణ సంపూర్ణుడు మాత్రం కాడు.

సింహ క్రౌర్యం, శునక విశ్వాసం, నక్క జిత్తులు, తోడేలు ప్రేమ, కోకిల గానం, నెమలి నాట్యం, పాము పగ, ఏనుగు బలం, నదుల వేగం, నవల త్యాగం, కీట భ్రమర పరిణామం, కొంగ జపం, దొంగ వ్యాపారం – అన్నీ మానవుడిలో వున్నై కూడ.

ఈ పరస్పర విరుద్ధమైన గుణాలు ఘర్షించేటప్పుడు కలిగే ఫలితమే జాతి మొత్తానికి ఆత్మహత్య. అదే కురుక్షేత్రం. అదే యాదవ కుల ముసలం, అదే ప్రళయం – అదే హరప్పా శైధిల్యం!

కాగా – అన్ని ఇతర జీవుల వంటివాడే మానవుడు కూడ. కేవల స్వార్థపరుడు. ''శరీర మాంద్యం'' తర్వాతనే ''అత్మవత్ సర్వ భూతాని''.

ఈ జాతిని ''సర్వే జనాః సుఖినో భవంతు'' అనే ధర్మం కేసి మళ్ళించడానికి యుగ యుగాలుగా, దేశ దేశాలలో వందలకొలది ప్రవక్తలు త్యాగలు చేశారు. కాని, ఏం సాధించారు? యుగ యుగాలుగా దశావతారా లెత్తుతున్న మన విష్ణువు కూడ ఏం చెయ్యగలిగాడు? ఎవరో ఒక దుష్టుడ్ని చంపితే చాలా! ఒక ఆశ్రితుణ్ని రక్షిస్తే చాలా?

అందుకే నేను హెచ్చరించే దిది – మతమూ వద్దు, దేవుడూ వద్దు, నీతి బోధలూ వద్దు. మానవుణ్ని మానవుడుగా గుర్తిద్దాం. అందరికీ సుఖవంతమైన మార్గంలో ముందుకు సాగుదాం. సాముదాయక మానవ శ్రేయస్సునే దైవంగా ఆరాధిద్దాం!

స్త్రీలకు అన్నిటా సమాన హక్కులుండాలనే ఉద్యమంలో నుంచి – శారీరక బల ప్రదర్శనలో కూడ స్త్రీలు పురుషుణ్ని ఎదిరించి జయించగల శక్తి యుక్తులు సంపాదించు కోవాలనే ఒక్క అంశాన్నే నేను ఈ నాటకానికి వస్తువుగా తీసుకున్నా – సర్వతోముఖ ప్రగతి సాధనకు కొన్ని సూచనలను కూడ ఇక్కడ చేస్తున్నాను. ఇది అప్రస్తుతం కాదనుకుంటున్నాను.

భూమిని జాతీయం చెయ్యాలి

మానవజాతి నిజంగానే ప్రగతి పథంలో పయనించాలంటే, ప్రగతిని సాధించడానికి మనస్ఫూర్తిగా కంకణం కట్టుకొన్న ప్రజాప్రతినిధుల ప్రభుత్వం నిర్భయంగా, నిర్మొగమాటంగా, స్వపర భేదాలను విడిచిపెట్టి –

(1) వ్యవసాయ భూమిని జాతీయం చెయ్యాలి.

(2) నిత్య వాడకం వస్తువుల పరిశ్రమలను

(3) సేవలను కూడ జాతీయం చెయ్యాలి.

(4) వేల కొలదిగా వున్న చిన్న చిన్న గ్రామాలను రద్దుచేసి, వాటిని సమీపంలోని పెద్ద గ్రామాలతోను, పట్టణాలతోను చేర్చి వెయ్యాలి. అప్పుడు వాటికి ఆధునిక నాగరిక సౌకర్యాలను సులువుగా కల్పించవచ్చు.

చిన్న చిన్న గ్రామాల రద్దువల్ల, విశాలమైన భూభాగాలు వ్యవసాయ క్షేత్రాల క్రిందకు రాగలవు. యాంత్రిక సేద్యం సాధ్యం కాగలదు.

(5) మైనారిటీ తీరిన ప్రతి వ్యక్తికి ఒక ఇళ్ల స్థలం లభించాలి. దానిపై ఆ వ్యక్తికి సర్వాధికారాలూ వుండాలి – అమ్ముకునే హక్కు తప్ప. గృహాలను ఎవరి అభిరుచికి తగ్గట్టు వారు నిర్మించుకోవాలి. అందుకు ప్రభుత్వం సహాయపడాలి.

(6) విద్య, వైద్యం ఉచితంగా లభించాలి. విద్యను నేటి ప్రభుత్వ పద్ధతిలోకాక, పూర్వపు గురుకుల పద్ధతిలోనేర్పాలి. నేటి మిషనరీ విద్యా సంస్థలను అందుకు ఆదర్శంగా తీసుకోవచ్చు. క్రమశిక్షణ, అభ్యాసాసక్తి సమగ్రంగా వుండాలి.

(7) వృద్ధాప్యంలో నిశ్చింతగా గడపడానికి ఆశ్రమాలు ఏర్పాటుచెయ్యబడాలి. భోజన వసతి వినోద సౌకర్యాలన్నీ ఉచితంగానే కల్పించబడాలి.

పిల్లలను గురించిన బెంగలు లేకపోతే, మానవజాతి సమస్యలు 90 శాతం వాటంత టవే పరిష్కారమైపోతై.

(8) ''పనికి తిండి'' పథకాన్ని సమగ్రపరచి, ప్రతి రంగంలోను వాడుకోవచ్చు. దీనివల్ల భిక్షాటన అదృశ్యమైపోతుంది. నిరుద్యోగం నశిస్తుంది. ప్రజా సాకర్యపు పనులన్నీ చురుకుగా, చవకగా జరుగుతై.

(9) పిల్లల విద్య ఆరోగ్యం, ఉద్యోగం, తిండి, తీరిక, ముసలి తనంలో పోషణ – ఇవే కదా సమస్యలు? వీటి కోసమే కదా మానవుడు స్వార్థపరుడు, దుష్టుడు, లంచగొండి, దొంగ అవుతున్నది? వీటిని పరిష్కరించడం అంత దుష్కరమా? ముమ్మాటికీ కాదు. మరి?

ఇప్పుడున్న పెద్ద స్వాములు తమకు భూమీ, ధనమూ తెచ్చి పెడుతున్న ప్రత్యేక సౌకర్యాలను, అధికారాలను వదులు కోవడానికి ఇష్టపడడం లేదు. అదే మానవ దుస్థితి కంతకూ ప్రధాన కారణం. ఇప్పుడే కాదు, ఎప్పుడూ ఇదే దుస్థితి. దీన్ని తొలగించడానికి పూర్వం భగవంతుడు అవతారాలెత్తాడు. ఇప్పుడు పై వాళ్ళు తమంతట తాముగా త్యాగాలకైనా సిద్ధపడాలి. క్రింది వాళ్ళు వీర భద్రావతారాలైనా ఎత్తాలి.

వీరభద్రావతారా లెత్తడమంటే, నా వుద్దేశం – మానవులంతా సమైక్య శక్తిగా ఏర్పడి, విజృంభించి, అసమానత్వం మీదా, అన్యాయం మీదా, దోపిడీ మీదా, దురహంకారం మీదా, తిరగబడి ఓడించి, ధర్మ సంస్థాపన చెయ్యడం. ఒక నిరంకుశ దుష్ట జాత్యహంకార నియంతృత్వాన్ని ఎదిర్చి నాశనం చేసిన దళిత జన సమైక్య శక్తే వీరభద్రుడు. శివుడు హరిజనుడనే సత్యాన్ని నేను నా కవితలలో అనేకచోట్ల చర్చించి వున్నాను.

ఇక్కడొక వాస్తవాన్ని సహృదయులు గుర్తించాలి. నేను అవసరాన్నిబట్టి, వస్తు వివరణ కోసం హైందవ పురాణ నామాలను ఉదహరించినా, వాటిని మతాతీత సార్వత్రిక పదాలుగానే తీసుకోవాలి. వీరభద్రుడంటే ఒక అగ్రహోదగ్రుడైన విప్లవకారుడు. దళిత జన సేనాధిపతి. అలా.

కులం మార్పిడి

మానవజాతిలో యుగ యుగాలుగా అభివృద్ధి జరగలేదనే నా వుద్దేశ్యం. సంఖ్యలో అభివృద్ధి జరిగింది. ఆలోచనా శక్తిలో, సృజనాత్మక పరిధిలో, అభివృద్ధి జరిగింది.

దానితోపాటు పోటీ పోరాటం కూడ పెరిగింది. తాను బ్రతకడమెలా అనేది తీవ్రరూపం దాల్చింది. Struggle for existence, survival of the fittest, అనే సిద్ధాంతాలు మరీ క్రూర రూపం ధరించి, మానవత కుంచించుకు పోయింది.

ఈనాడు ప్రతివాడూ ''తాను బ్రతికితే చాలు'' అనుకునే స్థితికి వచ్చాడు.

మానవజాతి నిజంగానే అభ్యుదయం సాధించాలంటే, మానవుడు మరో మెట్టు పెరగాలంటే చెయ్యవలసిందేమిటో నా కావ్యాలనిండా సమగ్రంగా చెప్పే వున్నాను.

మతం మార్చుకోవడానికి వీలున్నట్టే, కులం మార్చుకోవడానికి కూడ వీలుండాలి. అట్టి వీలును కలిగిస్తూ ప్రభుత్వం చట్టం చెయ్యాలి.

వేద యుగం నుంచి పురాణ కాలం దాకా, మహాభారత కాలం దాకా కూడ కుల వ్యవస్థ లేదు. గుణ కర్మలను బట్టి అంటే స్వభావాన్ని వృత్తినీ బట్టి కుటుంబ వర్గాలు ఏర్పడుతూ వచ్చాయి. పూర్వ ఋషుల, రాజుల చరిత్రలన్నీ ఇందుకు ఉదాహరణలే.

శూద్రుడైన కర్ణుడు అప్పటి కప్పుడు, అక్కడి కక్కడ అంగ రాజ్యాభిషిక్తుడై, క్షతియు డైనాడు.

నేను హిందువుణ్ణి. నా బావ మరిది ముస్లిం, భార్య క్రిస్టియను, అల్లుడు బౌద్ధుడు. కొడుకు నాస్తికుడు కావచ్చు. అలానే రాజకీయాలు కూడా.

అలానే – స్వభావాన్ని బట్టి, వృత్తిని బట్టి తండ్రి టీచరు, కొడుకు రైతు, అల్లుడు పోలీసు, భార్య మంత్రి, బావమరిది జర్నలిస్టు కావచ్చు. పూర్వం అలానే వుండేది. ఆనాడు నాలుగు వృత్తులే ప్రధానంగా వుండేవి. సమాజం నాలుగు కుటుంబ వర్గాలుగా వుండేది. జనాభా పెరిగే కొలదీ వృత్తుల సంఖ్యా పెరిగింది. ఏ వృత్తి వాళ్ళు ఆ వృత్తి కుటుంబాలతోనే సంబంధాలు పెట్టుకుంటారు కనుక, వృత్తులతోపాటు వృత్తి వర్గాలూ పెరిగాయి. అవే ఆనాటి వర్ణాలూ, ఈనాటి కులాలూ.

నేను అనేక చోట్ల వ్రాశాను, అనేక సభల్లో చెప్పాను – కులం వేద విరుద్ధంగా, పుట్టుకతో ఏర్పడడం మొదలైన దుర్ముహూర్తం నుంచే ఆర్షజాతి పతనం ప్రారంభ మయిందని.

మనం తిరిగి గత వైభవాన్ని అంటే – ఉపనిషత్కాల వైభవాన్ని సంతరించు కోవాలంటే – ఈనాడు అమలులోవున్న పుట్టుకులం పద్ధతి రద్దు కావాలి. గుణ కర్మలను బట్టి కులం పరిగణించబడాలి. అంటే – కులం మార్పు చట్ట సమ్మతం కావాలి. ఎవరైనా సరే చట్ట రీత్యా కులాన్ని మార్చుకునే వీలుండాలి. అందుకు ఒక చట్టాన్ని, తగు నియమాలను, ప్రత్యేక డైరక్టరేటును రూపొందించాలి.

దీనివల్ల జరిగే తుది మేలు – కుల నిర్మూలన. ఏక జాతి ఆవిర్భావం.

మగవాడు తన భుజబలంతో స్త్రీని లంగదీసుకొని, న్యాయంగా ఆమెకు చెందిన కుటుంబ పెత్తనాన్ని స్వాధీనం చేసుకొని, ఆమెను తన సొంత సామానులో ఒక శాల్తీనిగా చేసుకొని, సమాజ పాలనకు పూనుకొన్న నాటి నుంచీ కూడ అతడు నిరంకుశంగా ప్రవర్తిస్తూనే వస్తున్నాడు. పురుషుడికి కాంతా కనకా లంటే ప్రాణం. మేరు గిరులు, వెండి కొండలు, అప్సరసలు, స్వర్గ సౌఖ్యాలు వగైరా అన్నీ అతడి ఊహాసృష్టే. బ్రతికినంత కాలం వేటి కోసం తాపత్రయ పడతాడో, చచ్చిన తర్వాత కూడ వాటికోసమే ఆశపడతాడు. అతడి ఊహలకు పాలుపోసి పెంచుతారు మతాధిపతులు, స్వప్రయోజక వంచకులు.

తన కలానికి ఎంత స్వాతంత్ర్యం వుందో, తన స్త్రీకి కూడ అంతే స్వాతంత్ర్యం వుంది. ఒకటి తాను యోచించినట్టు వ్రాస్తుంది. రెండోది తాను చెప్పినట్టు చేస్తుంది.

తల్లిదండ్రుల ఆస్తిపై కొడుకులతో పాటు కూతుళ్ళకు కూడ సమాన వాటాలు వచ్చినప్పుడు మాత్రమే స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు ఏర్పడతై.

అవి రెండు విధాలుగా వస్తై. (1) ఎవరైనా యివ్వాలి. (2) వాళ్ళు పోరాడి సంపాదించుకోవాలి.

స్త్రీలు వాస్తవంగా పోరాడి, తమ హక్కుల్ని గెల్చుకోవడమనేది చాల క్లిష్టమైన సమస్య. చూపుమేర దూరంలో కనిపించే లక్ష్యం కాదది.

సమాజ వ్యవస్థ ఆదిలో తల్లి పెత్తనం నుంచి క్రమంగా తండ్రి పెత్తనంలోకి మారడానికి ఏవి కారణాలో, దీనికీ అవే కారణాలు. (1) స్త్రీలకి ప్రకృతి కల్పించిన కొన్ని బలహీనతలు (2) ఆ బలహీనతలే పురుషుణ్ని కట్టి వుంచగల సౌందర్యాలు కనుక, అవి

తన స్వాధీనం నుంచి పోతాయేమో అనే పురుషుని నిరంతర భయాందోళనలు (3) ప్రకృతి పురుషుని పట్ల కనబరచిన ప్రత్యేకాభిమానంవల్ల అతడికి లభించిన వివిధ శక్తులు, సౌకర్యాలు!

ఎవరేమనుకొన్నా, సత్యం చెపుతున్నాను – పురుషుడు ఇవ్వకుండా స్త్రీకి ఏ హక్కులూ లభించవు.

పురుషుడు స్వార్థపరుడు కనుక, స్త్రీ విషయంలో ఇన్‌ఫీరియారిటీ మనస్తత్వం కలవాడు కనుక, స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఇవ్వడానికి అంగీకరించడు.

''వరకట్న దురాచారం పోవాలంటే, తండ్రి ఆస్తిలో కొడుకులతోపాటు కూతుళ్ళకు కూడ సమాన వాటా ఇవ్వబడాలి. వట్టి నీతులవల్ల, నినాదాలవల్ల లాభం లేదు.'' అంటూ నేను దశాబ్దాలుగా చెపుతూ వస్తున్నాను. వినిపించు కొన్న వాళ్ళే లేకపోయారు.

ఈనాడు జరుగుతున్న సంఘటనలను పరిశీలించి చూస్తుంటే – చరిత్ర పునరావృతమవుతూ వుంది. సామాన్యుడు పెరగడం లేదు. అతణ్ని మతాధిపుడు పెరగనివ్వడం లేదు! కాదా?

స్త్రీలకు, ప్రభుత్వోద్యోగాలలో వుంటున్న స్త్రీలకు కూడ ఆపాదమస్తకం బురఖాలు తొడుగు మంటున్నారు కొందరు మతోన్మాదులు!

మతం ఒక మెదడు జబ్బు. దానికి ఉన్మాదం తోడైతే కోతి కల్లు తాగినట్టే కదా?

మగవాడికి స్త్రీ అంటే అంత భయం ఎందుకో?

లేత మొగ్గ కాదు

నీవు నవ నవేక్షు రస దేవతవు
నేను చిన్న చిరువేప పూమొగ్గను''

మొన్న సిద్ధార్థి ఉగాది నాడు, గ్రీన్ లాండ్సులో, ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారు జరిపిన ఉగాది పండుగ కవి సమ్మేళనలో పాల్గని నేను చదివిన కవితలోని చివరి పంక్తులవి.

ఈ పంక్తులు చదివిన వెంటనే, రెడ్డిగారు లేచి వచ్చి, నాకు సన్మానం అందజేస్తూ, చిరునవ్వుతో అన్నారు ''మీరు లేత పూమొగ్గకాదు. విరిసిన పువ్వే'' అని!

ఆ తర్వాత సాగిన తమ ఉపన్యాసంలో నా కవిత నుంచి కొన్ని పంక్తుల్ని ఉదాహరించ డమే కాకుండా, విధాన పరిషత్తులో నేను నిర్వహిస్తున్న పాత్రను గురించి కూడ ప్రశంసలు విసిరా రాయన!

అంటే – కౌన్సిలులో నేను చేస్తున్న విమర్శలను, సూచనలను ఆయన నిశితంగా పరిశీలిస్తున్నారన్నమాట! అదీ నా ఆనందం.

శరీరాలు, వాటి స్థితిగతులు కాదు ముఖ్యం. వయస్సూ, అది తెచ్చే పరిణామాలూ కూడ కాదు. నిత్య నిరంతర నవోదయం కవిత. చిగురు, మొగ్గ, పువ్వు, కాయ, పండు – ఈ పంచతన్మాత్రలకూ అంతర్వాహిని రసం. ఆ రసకలశంలో నేనొక లేత మొగ్గనే. పూర్ణ ఫలాన్నని ఎవరైనా అనుకుంటే – అది వారి సౌహార్ధం, మన్నన.

రాజకీయంగా నాకు వ్యక్తిత్వం కలుగజేసిన చెన్నారెడ్డిగారికి నేను కృతజ్ఞుణ్ని. గవర్నరు నామినీగా ప్రభుత్వాన్ని బలపరచవలసిన వాణ్ని. ఈ రెండూ నాకు నైతిక ధర్మాలు.

కవిగా నేను సర్వ స్వతంత్రుణ్ని.

శాసన సభ్యుడు భీమన్న వేరు. కవి భీమన్న వేరు.

నేను కౌన్సిలు హాలులోకి ప్రవేశించే ముందు నా కవితా సరస్వతిని పారోద్యానంలో వదిలేస్తాను. తిరిగి వచ్చేటప్పుడు కూడా తెచ్చుకుంటాను. రాజకీయాలు వేరు, రాగోదయాలు వేరు. రాజకీయ రణగొణలు నా రసానంద సారస్వత మూర్తికి కిట్టవు.

నాకు లభించిన ప్రత్యేక అదృష్టం ఒకటుంది. అధికారపక్ష సభ్యులతోపాటు, ప్రతిపక్షాల సభ్యులు కూడ – కుల మత వర్గ వయో విభేదాలకు అతీతంగా – నన్ను ప్రేమగా చూడటం. వాత్సల్యంతో సహించడం. (నన్ను నిజంగా సీరియస్‌గా తీసుకోక పోవడం అనే ప్రమాదం కూడ ఇందులో వుంది. అది సహజమే మరి.)

తెలుగు రాజధాని

నాకు కొన్ని లక్ష్యాలున్నై. నేను ఎల్లప్పుడూ, ఎక్కడబడితే అక్కడ ఏకరువు పెడుతూ ఉండేవే ఇవి.

భారతదేశ అధికార భాష తెలుగు కావలసింది. జర్మానిక్ భాషా కుటుంబంలో ఇంగ్లీషు వలెనే, సంస్కృత ద్రావిడ భాషా సమాఖ్యలో తెలుగు సర్వ సమర్థమైన భాష. అధ్యక్షులవారి కాస్టింగు వోటుతో హిందీ అధికార భాష అయింది. అది ఉత్తరాదిది. పోనీ, దక్షిణాది నుంచి రెండవ స్థానంలోకైనా తెలుగు వెళ్ళవద్దా? ఈ విషయంలో తెలుగు పెద్దలూ, తెలుగు ప్రభుత్వమూ ఇంత వరకూ తీసుకొన్న చర్యలేమిటి?

తెలుగు రాజ్య రాజధానికి తెలుగు పేరు పెట్టాలని పాతికేళ్లుగా గొంతు చించుకొంటున్నాను. పాళీలు విరగ్గొట్టుకొంటున్నాను. ఇంతవరకు ఫలితం లేదు. బెజవాడను విజయవాడగామార్చిన తెలుగు వీరులు హైదరాబాదును భాగ్యనగరం చెయ్యలేక పోతున్నారేం? పోనీ – గోలకొండ రామదాసు, పాట్టి శ్రీరాములు పేర్లతో ''శ్రీరామనగర్'' అనవచ్చుగా?

మామాలకు (హరిజనులకు) ప్రత్యేక పేటలు వద్దనీ, ఉమ్మడి కాలనీలు, ఉమ్మడి గ్రామాలు, ఉమ్మడి హాస్టళ్లు ప్రారంభించాలనీ, వాళ్లకు వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం ఇవ్వా లనీ, పట్టణాలలో స్లంలను తీసేసి, వాటి స్థానంలో బహు అంతస్తుల భవనాలను నిర్మించాలనీ, మామాపేటల వరకు భారతీయ సంస్కృతిని తీసుకువెళ్ళాలనీ, చట్టరీత్యా కులాలను రద్దు చెయ్యాలనీ – వగైరా ఎన్నో సూచనలున్నై నా గ్రంథాల నిండా.

ఆధునిక జాతీయ విద్య

చతుష్షష్టి కళలంటే వృత్తి విద్యలే కదా? చోరకళ కూడా ఒక కళే. ఆనాడు వృత్తులు అరవై నాలుగన్నమాట. మరి ఈనాడు?

వృత్తినిబట్టి కులం ఏర్పడుతున్నదన్న భగవద్గీతను ప్రమాణంగా తీసుకుంటే – ఈనాడు కులం అనే దెక్కడుంది?

పుట్టుకతో కులం ఏర్పడడమనేది అశాస్త్రీయమూ, అవైదికమూ కదా?

ఈనాటి సాంకేతిక విద్యనే చూడండి. శక్తిని బట్టి ఏ కులం కుర్రవాడైనా, ఏ వృత్తి విద్యనైనా అభ్యసించే వీలు నేడుంది. ఇదే వీలు వేదకాలంలో కూడా వుండేది. అందుకే ఆనాడు ప్రతి విద్యా రాణించింది.

ఆనాడు కులం లేదు. వాస్తవంలో ఈనాడూ కులం లేదు. ఈనాడు కులం వున్నదను కోవడం హిపోక్రసీ. భ్రమ. కులం మార్పిడిని చట్టబద్ధం చేస్తే, ఈ పీడ తొలగిపోతుంది.

స్వతంత్రంగా బ్రతకగల శక్తిని మానవుడి కిచ్చేది విద్య.

అట్టి విద్య బుద్ధి బలాన్నీ, హస్తకౌశలాన్ని వికసింపజేసేదిగానే కాక, శరీర బలాన్నీ, సాహసాన్నీ, ధైర్యాన్నీ కూడ కలిగించేదిగా వుండాలి, శరీర బలాన్ని బుద్ధి కౌశలంతో ఓడించ వచ్చు. అట్టి విద్యనే ఈ నాటకంలోని నాయిక, ప్రగతి ప్రదర్శిస్తుంది.

ఈ నాటకానికి సంబంధించినంతవరకు స్త్రీ పురుషుల మధ్య వుండే ప్రేమ, కామ సంబంధాలతో నాకు ప్రమేయం లేదు. స్త్రీ తన ఇష్టానికి వ్యతిరేకంగా బలవంతం చెయ్యబడ గూడదు. పురుషుని శారీరక పశు బలానికి స్త్రీ లంగిపోగూడదు. అట్టి శక్తిని స్త్రీకివ్వాలి.

అన్ని రంగాలలోను స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కలిగించాలి. వాటిని రక్షించుకోడానికి అవసరమైన విద్యలన్నిటినీ నేర్పాలి. కుస్తీ, కరాటే, సాము వంటి విద్యలను కూడ అలవరచాలి.

ఈ నాటకంలో ప్రగతి అన్ని విద్యలను, కళలను నేర్చిన నాయిక. ధనస్వామికం, పారిశ్రామికం, వ్యాపారికం వంటి వ్యవస్థలు ప్రగతిని ఎన్ని అవస్థలు పెడుతూ వస్తున్నాయో సూత్రప్రాయంగా ఈ చిన్న ఇతి వృత్తంలో సూచించబడింది. అన్ని అవస్థలనూ దాటుకొంటూ ఆమె ముందుకు పోతూవుంది.

''కవి – ప్రగతి – పోలీసు''

''కవికి ప్రగతి, ప్రగతికి కవి'' అనేది నా సిద్ధాంతం. కవి అంటే కేవలం కవిత్వం వ్రాసేవాడే కాదు. భావనాశక్తి, సృజనాత్మక శక్తికల ప్రతివాడు కవే నా దృష్టిలో. అట్టి శక్తే మనిషిని ముందుకు కదిలిస్తుంది. కదలిక ఒక క్రమంలో జరగడం ప్రగతి.

అంటే–

కవి ఊహ కార్యరూపం దాల్చడం ప్రగతి. అట్టి రూపం నుంచి మళ్ళీ ఊహ ప్రారంభమవుతుంది. అందుకే కవినీ, ప్రగతినీ కార్యకారణాలుగా అవినాభావ ద్వంద్వంగా, ప్రేయసీ ప్రియులుగా చిత్రించాను ఇందులో.

ఊహగల ప్రతి ఉత్తమ మానవుడూ పురుషోత్తముడే. మానవ ప్రథమ లక్ష్యం ప్రగతే. నిత్యపురోగామిని అయిన ప్రగతికి సాఖ్య శ్రేయో భావనా స్రష్ట అయిన కవి నాయకుడు. ఇది ఆద్యంత రహితమైన మానవతా పురోగమనం. ఈ మధ్య వచ్చే స్వార్థపరులంతా అల్పా యుష్క మృణ్మయ పాత్రలు. పుడుతూ, పగిలిపోతూ వుంటై. ప్రగతీ, దానిని ఊహిస్తున్న కవీ నిత్యం సాగిపోయే అమృత పాత్రలు.

చివరలో పోలీసు అధికారిని ప్రవేశపెట్టడం కేవల లౌకికం.

ఎంతటి మతైక, మతాతీత, దక్షిణ, వామ, నియంతృత్వ, ప్రజాస్వామిక, ఆటవిక, నాగరిక రాజ్యాలనైనా తీసుకోండి. ఎన్ని నీతులైనా చెప్పండి. ఎందరు దేవుళ్ళనైనా నెలకొల్పండి. పోలీసు, మిలిటరీ బలం లేకుండా పరిపాలన జరపగలుగుతున్నారా? శాంతి భద్రతలను కాపాడగలుగుతున్నారా?

అధికారం లేకపోతే ఎవడూ ఎవడిమాటా వినడు. అధికారం అంటే పోలీసు బలమే.

నైతిక, దైవిక విశ్వాసాలు మనిషిని క్రమశిక్షణకు కట్టుపరచి వుంచలేవు. నైతిక దైవిక విశ్వాసాల వాస్తవ రూపమే సైనిక బలం. అందుకే పోలీసు అధికారిని ఒక మహాసత్త్వుడైన ఉత్తమ గుణశీల శక్తి సంపన్నుడుగా చూపించాను. ధర్మరక్షకుడుగా తీర్చిదిద్దాను.

ఒక యుగం అంతమైపోయిన శిథిలాల నుంచి ఉద్భవించి, మళ్ళీ అదే అదే వక్ర మార్గంలో పెరుగుతున్న మానవ సమాజాన్ని సరిదిద్దడం ఈ నాటకం లక్ష్యం. దుష్ట శిక్షణతో సమాజం క్షాళితమై, మానవత ఒక ఔన్నత్యాన్ని చేరుకోవడంతో ముగుస్తుంది. ఔన్నత్యం ఇలా కొనసాగి, మానవుడు మహాత్ముడే అవుతాడో, మళ్ళీ మహెంజదారోలా తిరోగమించి, కాలగర్భంలో కలిసి పోతాడో చెప్పలేం.

మనిషి ఇక తిరోగమించకుండా వుండాలనీ, సర్వజన సమాన సాఖ్యమే లక్ష్యంగా పురోగమిస్తూ పరమోన్నతుడు కావాలనీ నా ఆకాంక్ష. అందుకే ఎన్నో నూత్న సూచనలు చేస్తూ వుంటాను నా రచనలలో. ఇప్పుడిక్కడ కూడా చేశాను.

చెన్నారెడ్డిగారి సాహిత్య హృదయం

20-9-78 సాయంత్రం కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో శ్రీమతి హైమవతి వ్రాసిన ''పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న'' అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు ముఖ్యమంత్రి చెన్నారెడ్డిగారు. ఆనాటి ఆయన ప్రసంగాన్ని యథాతథంగా ఇక్కడ ఇస్తున్నాను.

''ఆరున్నర గంటలకు ప్రారంభం కావలసిన ఈ సమావేశం ఎనిమిదిన్నరకు అవుతున్నది. నా ఆలస్యానికి క్షమించవలసిందిగా కోరుతున్నాను. ఆలస్యం అవుతుంది, రాలేను అని మొదటే చెప్పాను. మీకాసంగతి చెప్పారో లేదో నాకు తెలియదు. కాని ఆలస్యమైనా ఫరవాలేదు, మీరు రావాలి అని నాకు చెప్పారు. అనేక కార్యక్రమాలను ఒప్పుకున్నప్పుడు సహజంగా ఆలస్యం అవుతూ వుంటుంది. ఆలస్యంగా వస్తే కోప్పడతారు. రాకపోతే తిడతారు.

నేను ఈ పుస్తకాన్ని పూర్తిగా చదవలేకపోయాను కాని అక్కడక్కడ చూశాను. బోయి భీమన్న గారిని నేను చాలాసార్లు చూశాను. వారు ఒక ప్రత్యేకమైన వ్యక్తి అని చెప్పడం అతి శయోక్తి కాదు.

ఆయన శాంత స్వభావుడో, కోపిష్టో నాకు తెలియదు. అహింసను ఒప్పుకుంటారో, హింసను ఒప్పుకుంటారో నాకు తెలియదు. కాని ఈ మధ్య నాతో ఎవరో చెప్పారు హింసపై యుద్ధం చెయ్యాలని ఎక్కడో ప్రబోధించారు అని. అప్పుడు అనుకున్నాను ఆయన పౌరుషవంతుడు కాడని. నిజానికి కవిత్వం రాణించాలంటే అన్ని రసాలూ రసవంతంగా వుండే లక్ష్యాలు కలిగివుండాలి.

చప్పిడి మనుష్యులు వ్రాసే కవిత్వం చప్పగా వుంటుంది. జీవితంలోని అన్ని అనుభవాలూ, సమాజంలో అన్ని దృక్పథాలూ అర్థం చేసుకుని, జీర్ణం చేసుకుని స్థిరమైన భావాలను సమాజంలో ప్రతిబింబించగలిగిన వారే మంచి కవిత్వం వ్రాయగలుగుతారు. కవిత్వమంటే నాకు వున్న ఆలోచన - ఒక ప్రక్క అప్పుడువున్న పరిస్థితులను ప్రతిబింబించడం, మరొక ప్రక్క నూతనమైన దృక్పథం చూపించడం. అవి లేకపోతే ఆ కవిత్వం జీవంలేని కవిత్వం అవుతుంది.

బోయి భీమన్నగారు తమ జీవితంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, జన సామాన్యాన్ని ఆకర్షించి, నూతన సమాజం నిర్మాణం కావడానికి ఉపయోగించే, ఆనందం పొందే కవిత్వాన్ని అందిస్తారు.

ఆయన గురించి ఆమె చాలా చక్కగా చమత్కారంగా మంచి శైలిలో చాలా ఓపికగా ఈ గ్రంథాన్ని రచించినందుకు బోయి భీమన్నగారి కంటే ఈమెకే ఎక్కువ అభినందనలు అర్పించాలి. భీమన్నగారికి వుండే శక్తి సామర్థ్యాలను మంచితనాన్ని చాల చక్కగా కూర్పుచేసి ప్రజలకు అందచేయటానికి ప్రశంసనీయమైన కృషి ఆమె చేశారని చెప్పవలసి వుంది.

నిజం చెప్పాలంటే భీమన్నగారితో నాకు వ్యక్తిగతంగా ఎక్కువ పరిచయం లేదు. అయినా ఆయనకు వున్న ప్రతిష్ఠ నాకు తెలుసు.

నేను ఎంత దూరాన వున్నా ప్రతిష్ఠ గలిగిన వ్యక్తులను అర్థం చేసుకునే అవకాశం నాకు తగులుతూనే వున్నది.

నేను ఉత్తరప్రదేశ్‌లో వున్నప్పుడు దక్షిణాదిన ఉండే పండితులను అక్కడకు పిలిపించి యూనివర్సిటీల ద్వారా వారిని గౌరవించాలనే పథకం గురించి అక్కడి వారికి చెప్పాను. మొట్ట మొదట కొందరికి అసంతృప్తి కలిగినా తరువాత నేను చెప్పింది వారికి నచ్చింది. హిందీ మాట్లాడే వారితో నేను చెప్పాను. ఇతర భాషలను గౌరవించడం నేర్చుకోవాలి. అది నేర్చుకో నంతవరకూ హిందీ భాషను మేము లక్ష్యపెట్టం అని బాహాటంగా మొరటుగా నిష్కర్షగా చెప్పాను. మీరు అట్టి గౌరవం ఇచ్చినప్పుడే దక్షిణాది ప్రజలలో, వారి హృదయాలలో జాతీయ భాషగా దీనికి స్థానం దొరకటానికి అవకాశం వుంటుంది అని చెప్పాను.

యూనివర్సిటీ కన్న పెద్ద సంస్థ, విద్యా పీఠం ద్వారా భీమన్నగారిని గౌరవించాలని ఆ ఏర్పాటు అక్కడ చేయటం జరిగింది. ఆ విధంగా చేసినప్పుడు చాలామంది సంతోషించారు. యు.పి.లోని కొంత మంది మిత్రులన్నారు, హిందీ పండితులను ఇక్కడకు పిలిపించి గౌరవించ వచ్చు గదా అని. వారు చెప్పింది న్యాయమే. కాని ఇక్కడ

నాకు ఊపిరి ఆడడం లేదు. రెండుసార్లు బడ్జెటు సమావేశాలు పెట్టే అవస్థ వచ్చింది. ఇప్పుడు ఇది ఇక్కడ జరుగుతుంటే నాకు అనిపిస్తున్నది, ఇక్కడ మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ద్వారా దానిని అమలుపరచ టానికి ఎంతవరకూ సాధ్యమవుతుందో పరిశీలించాలి.

కవిత్వం మన రాష్ట్ర సమగ్రతనే గాక దేశ సమగ్రతను కాపాడేటట్లుగా వుండాలి. మన సామాన్య సమస్యలను, మానసిక చింతను దూరం చేసేదిగా వుండాలి. భారతదేశంతో మనకు ఏమి నిమిత్తం వుంది అనుకుంటే అది పొరపాటు అవుతుంది. భారతదేశం అంటే మన దేశమే. ఢిల్లీలో రాజ్యం పాలించేవారు మన ప్రతినిధులే. ఈ దేశం నాది అన్న భావం కలిగించే కవిత్వం వ్రాయాలి. తెలుగు భాషలో కాస్మొపాలిటన్ తత్వం ఎక్కువగా వుంటుంది. సంకుచితత్వం వుండదు. అంటే ఇతర భాషలకు వున్నదని నా ఉద్దేశం కాదు. నాకు మాత్రం తెలుగు భాషలో, తెలుగు మనుష్యులలో, తెలుగు వారి భావాలలో కాస్మొపాలిటన్ తత్వం బాగా వుందని అనిపిస్తుంది.

మొత్తం భారతదేశ సమగ్రతకు తోడ్పడే కవిత్వం వ్రాయాలి. అలాంటి పనిని బోయి భీమన్న లాంటి వారే చేయాలి.

వారిని కౌన్సిల్‌లోనే ఎందుకు పెట్టారని కొందరకు సందేహం కలుగవచ్చు. నామినేటెడ్ మెంబర్స్‌కు ఏ చిక్కులూ వుండవు. మంత్రులకు, రాజకీయ పార్టీల సమస్యలకు పొద్దున లేస్తే పార్టీ మీటింగులు, డిస్కషన్సు, లిమిటేషన్సు అవన్నీ వుంటాయి. నామినేటెడ్ మెంబర్స్ అయితే ఇలాంటి చిక్కులు లేకుండా స్వైరవిహారం చేయవచ్చు.

రాజకీయాలలో ఇటువంటి వారి గురించి చెబుతుంటే రాజగోపాలాచారి గారు గుర్తుకు వస్తారు. రాజకీయాలలో తలదూర్చి, రాజకీయ పార్టీల ద్వారా సేవ చేద్దామనే మాటలేకుండా, తమంతట తాము పైకి ఎగిరి, ప్రపంచాన్ని గూడా పైకి ఎగిరించే శక్తిగల వ్యక్తులు వుంటారు. బోయి భీమన్నగారికి అలాంటి శక్తి కలగాలని కోరుతున్నాను.

బలహీన వర్గాల వారు పైకి రాలేదని అనుకోకూడదు. వారిని పైకి తేవాలనే మాట వుండకూడదు. వారంతట వారు పైకి వస్తారు. మనం మధ్యలో అవరోధాలు కల్పించకుండా

వుంటే చాలు. ఇదేదో వారిపై దయాదాక్షిణ్యాలతో చేస్తున్నామని కాదు. మన బాధ్యతను మనం నిర్వహిస్తున్నామనుకుంటే అదే పదివేలు.

బోయి భీమన్నగారు పైకి వచ్చిన వ్యక్తి. అందరూ కవిత్వం వ్రాయలేరు. కవిత్వం అనేది చదువుకుంటే వచ్చేది కాదు. అది సహజంగా రావాలి. పుట్టుకతో రావాలి. పుట్టుకతో అన్నాను గనుక గత జన్మ, కర్మలనే భావాలతో నేను ముడిపెడుతున్నా ననుకోవద్దు.

గ్రామాలు చూస్తే అక్కడివారు అమాయకంగా, నిర్మలమైన మనస్సుతో కన్పిస్తారు. పట్టణాలలోని వారు రంగులు పూసుకున్న వారిగా ఆర్టిఫిషియల్‌గా కన్పిస్తారు. పల్లెటూరి వారు ఏది అడిగినా సూటిగా అడుగుతారు. వారు అడిగే దానిలో హ్యూమన్‌హార్ట్ కన్పిస్తుంది. అలా వుండటం పట్టణంలోని వారికి సాధ్యం కాదు. కాని బోయి భీమన్నగారు అలా వున్నారు. వ్రాయడం, వ్యాఖ్యానం చేయడం. అదేం సామాన్యం కాదు.

నేను పుస్తకం అంతా చదవలేకపోయాను. అవధానిగారు పుస్తకం అంతా చదివి వుంటారు. బహుశా పద్యాలు కంఠస్థం కూడా చేసివుంటారు. వారు గంటల కొలది మాట్లాడ గలరు. నేను చదివినా గంటల కొలది మాట్లాడలేను. అక్కడక్కడా కొన్ని పేజీలు చూసిన దానిబట్టే నేను మాట్లాడుతున్నాను. సమాజాన్ని ఉద్ధరించే నూతన వాతావరణం నిర్మాణం కావాలని మన మందరం కలలు కంటున్నాం. అలాంటి కలలకు ఆకారం కల్పించే శక్తివంతు డిగా బోయి భీమన్నగారు నాకు కన్పిస్తున్నారు.

వారు ఇంకా ఇంకా వ్రాయాలని, ఇలాంటి ఉత్సవాలు అనేకం జరగాలని నేను ఆశిస్తూ వున్నాను. ఈనాడు మనం వివిధ పరిస్థితుల్లో దేశాన్ని నడిపించటానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇది సంధికాలం. ముప్పయి సంవత్సరాల క్రితం కూడా సంధికాలం అని అప్పటివారు చెప్పారు. అది వేరు. అప్పటి పరిస్థితుల్లో మనమూ, బ్రిటిష్ వారూ, యుద్ధమూ, స్వాతంత్ర్యమూ అనే ఆలోచనలతో సంధికాలంలో వున్నాం. కాని ఇప్పుడు కూడా సంధికాలంలోనే వున్నాం. ఇప్పుడు కనబడని శత్రువులతో లేని ఉత్సాహం తెచ్చుకుని పోరాడే సంధికాలంలో వున్నాం.

పాత దృక్పథాలను, కొత్త శక్తితో ప్రపంచం ముందు పెట్టవలసిన సంధికాలం

ఇది. ఈ కాలంలో ఇటువంటి వ్యక్తులు తమ ప్రభావంతో ప్రజలను కదిలించగలుగుతారు. వీరిని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను. వారు తమ కవిత్వంతో ప్రజలలో చైతన్యం, ఉత్తేజం తీసుకురావాలని కోరుతున్నాను. ఇప్పటికే ఆలస్యమైంది. బోయి భీమన్నగారి జన్మదిన సందర్భంలో ఇటువంటి పుస్తకాన్ని ఆవిష్కరించే అవకాశం నాకు కల్గినందుకు సంతోషిస్తూ ఈ అవకాశాన్ని కలుగజేసిన పెద్దలందరినీ అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను.''

మేధావి, కళా పోషకుడు

డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా వున్నప్పుడు, ఆయన అధీనంలో 19 యూనివర్సిటీలు వుండేవి. అక్కడికి కొంతమంది తెలుగు కవి పండితుల్ని రప్పించి ఎందుకు గౌరవించకూడదు అనే ఆలోచన వచ్చి, 1976లో దానిని అమలు పరచటం మొదలు పెట్టారాయన.

ఆ సందర్భంలో ఆయన ఉత్తరప్రదేశ్‌కు పిల్చిన దాశరథి, నారాయణ రెడ్డి, యశోదా రెడ్డి, వరదాచార్యులు గార్లతోపాటు నేను కూడ ఒకణ్ని.

వ్యక్తిగతంగా బాగా తెలియకపోయినా, నన్ను కూడ పిల్చి గౌరవించినందుకు ఆయన సహృదయతపట్ల నా హృదయం ఎంతో కృతజ్ఞతతో నిండిపోయింది. ఆనాడే – కాశీలో ఆయన ఆతిథ్యం స్వీకరించినప్పుడే, కాశీ క్షేత్రాలలో ఆనందంగా తిరుగుతున్నప్పుడే – అనుకొన్నాను నేను ఏదో ఒక కావ్యాన్ని చెన్నారెడ్డిగారికి అంకితం ఇవ్వాలని. అది 1976 ఫిబ్రవరి 19, 20 తేదీల నాటి ఉదంతం.

ఆ తర్వాత – 1976, 77, 78లో కొంతవరకు కూడ – నా జీవిత చరిత్ర రచనలోను, ముద్రణలోను మునిగి వుండిపోయాను – రచయిత్రి శ్రీమతి హైమవతికి తోడ్పడుతూ.

ఈ ప్రగతి దృశ్యకావ్యాన్ని చెన్నారెడ్డిగారికి అంకితమిద్దామని నిర్ణయించుకోవడం 1977లోనే జరిగినా, దీని ముద్రణ పూర్తికావడం మాత్రం ఇప్పటికి నెరవేరింది. ఈ

కావ్యం పీఠికలో ప్రచురించడం కోసం నేను వ్రాసుకొన్న వ్యాసం వారి షష్టిపూర్తి సంచికను ''సమష్టిమూర్తి'' అనే పేరుతో అలంకరించింది. దానిని మళ్ళీ నే నిక్కడ పునరుద్ధరించటం లేదు.

చెన్నారెడ్డిగారి పట్ల నాకుగల గౌరవ కృతజ్ఞతాభి ప్రతిపత్తి అపారమైనట్టిది. నా జీవిత చరిత్రలోను, సమష్టి మూర్తి వ్యాసంలోను, అప్పుడప్పుడు అక్కడ నేను వ్రాసే పద్యాలలోను, చేసే ఉపన్యాసాలలోను దానిని సూత్రప్రాయంగా పరికించవచ్చు – జిజ్ఞాసువులు.

రెడ్డిగారిపట్ల నాకుగల అభినందన పూర్తిగా వ్యక్తిగతమైనట్టిది.

ఆయన మేధావి, మహావక్త, కళాపోషకుడు, సృజనాత్మక భావుకుడు, రాజకీయాలలో ప్రవేశించకుండా వుంటే – ఒక మహాయోగో, బ్రహ్మర్షో అయి వుండేవారు. ఆయన ప్రతిభ, ఆత్మశక్తి అట్టివి.

అందుకే ఈ కావ్యాన్ని ఆయనకు అంకితం ఇస్తున్నాను.

ఇది–

చంద్రుడికో నూలుపోగు.

–భీమన్న

అంకితం

సత్త్వమందు మర్రి, సాహిత్య సౌందర్య
మాధవమున గున్న మావి చెన్ను,
మాన్య ముఖ్యమంత్రి మా మర్రి చెన్నయ్య!
మహిత శక్తిశాలి! విహిత శూలి!

వృక్ష వర్గమ్ములో వటవృక్ష మట్లు
మంత్రివర్గమ్ములో ముఖ్యమంత్రి నీవు,
జ్ఞానవత్తాన విజ్ఞాన చక్షు వట్లు
మానవత్తాన ధర్మ ప్రధాని వీవు!

కార్య శౌర్యమ్ము, వేగమ్ము, క్రమత, శ్రమత
సర్వ సేవానిరతి, సమస్త జన ప్రగతి,
పల్లె పల్లెను విశ్వరూపము ధరింప
జాతి – గీత ద్వయీ సవ్యసాచి వీవు!

సామ్యవాద మంచు, సంప్రదాయ మ్మంచు
స్పర్ధ పెంచుచుంద్రు స్వార్థపరులు,
సోషలిజము వేదసూక్తుల లేదొకో?
అమలుజరిపి చూపు మన్న చెన్న!

కాశి లోన తప్ప కాశీ మిఠాయిలు
ఇతరచోట్ల దొరక వెంత కైన,
బహుజ నాభివృద్ధి పథకాల క్షేత్రమ్ము
మాకు నీ చరిత్ర, మర్రి చెన్న!

మిత్ర శత్రు భావ మిసుమంతయును లేదు,
ప్రజ్ఞ ననుసరించి పదవు లనగు,
పని యె దైవ మన్న ప్రవచాన పనిచేయు
రాజ్యప్రగతి గతికి రాజ వీవు!

విశ్వ మానవుండు, విశ్వేశ్వ రాత్ముండు,
విశ్వ మత కుటుంబి, విశ్వ సముడు,
మధుర భక్తి రతుడు మర్రి చెన్నారెడ్డి
మామకీన కావ్య కామి యగుత!

ప్రగతి, అభ్యుదయిని, ప్రజాన దీపిక,
విశ్వ జన సమాన, వీర సేన,
పరమ మానవత్వ పథ లక్ష్య దర్శిని,
భవ్యవాణి, నాదు కావ్యలక్ష్మి!

ప్రగతి గామివి నీ వౌట ప్రగతి నొసగి
నిను పతిన్ జేసి, నే పయో నిధినె యౌదు;
నేను కోరున దొక్కటే – నీవు సతము
తెలుగు జన కోటి కోర్కెల వెలుగు వగుము!

భాగ్యనగరం
9-4-1979

– బోయి భీమన్న

ధర్మ వ్యాధుడు

ధర్మపీఠం

నాకు నా బాల్యం నుంచీ కూడ ధర్మ వ్యాధుడితో సాన్నిహిత్యం వుంది. చిన్నప్పటి క్లాసు వాచకాలలో నన్ను బాగా ఆకర్షించిన కథ ''కొంగ – కౌశికుడు''.

ఎంతో తపస్సు చేసిన కౌశికుడికి చూపుతోనే కొంగను భస్మం చెయ్యగల శక్తి సంక్రమించవచ్చు. సాత్వికాహారి కానివాడు, ఏ తపస్సూ చెయ్యనివాడు, జంతువుల్ని వేటాడే వాడు, మాంసం అమ్ముకొని బ్రతికే వాడు, సోఫిస్టికేటెడ్ సొసైటీకి చెందని వాడు, ఆహంకారిక సమాజానికి అంటరాని వాడు అయిన ఒక హరిజనుడు త్రికాలవేది కాగలిగాడంటే, కౌశికుడి లాంటి ఉగ్ర స్వభావుడైన బ్రాహ్మణుడికి ఉపదేశికుడు కాగలిగాడంటే ఎంతటి మహత్తరత!

నాకు పధ్నాలుగు ఏళ్ళు వచ్చే వరకు, అంటే ఫస్టు ఫారంలోకి వెళ్ళే వరకు, అంటే పద్యాలు వ్రాయడం మొదలైనప్పటి వరకు నేను ఉభయాహారిని. అంటే శాకాహారినీ, మాంసాహారినీ కూడ.

ఇక్కడొక వివరణ చెప్పాలి.

మనవాళ్ళు ఆహారం విషయంలో ఉపయోగించే రెండు మాటలలోను వెజిటేరియన్ (శాకాహారం) అన్నమాట సరయిందే. నాన్‌వెజిటేరియన్ (మాంసాహారం) అన్నమాట అర్ధవంతం కాదు. నాన్ వెజిటేరియన్ ఇళ్ళలోనూ, హోటళ్ళలోనూ, బార్లలోనూ కూడ వెజిటేరియన్ ఆహారం పుష్కలంగా వుంటుంది.

ఏ నాన్ వెజిటేరియనూ వెజిటేరియన్ ఆహారాన్ని నిషేధించిన వాడు కాడు. మాంసాహారానికి అభ్యంతరం లేనివాడు. మాంసాహారం దొరికినప్పుడు తప్ప ప్రతి నిత్యము శాకాహారం తినేవాడే.

అందుకే ఈ ఉభయ వర్గాలను వెజిటేరియన్, కాస్మో పాలిటన్ (శాకాహారి, ఉభయాహారి) అంటున్నాను.

నా పద్నాలుగో ఏట నేను మాంసాహారం మానేసి, పూర్తి శాకాహారిని అయ్యాను – మా అయ్యతోపాటు. ఆయన అప్పటికే శాకాహారి అయి, తన శిష్యుల్ని కూడ చాలా వరకు శాకాహారుల్ని చేశాడు. శాకాహారం సాత్వికాహారమనీ అందుకే బ్రాహ్మలు అంత గొప్ప వాళ్ళుగా వున్నారనీ, మాంసాహారం మెదడును మొద్దు బారుస్తుందనీ, పైగా అది హింసాత్మకమనీ సమాజం విశ్వసిస్తూ వుంది. ఈ అన్నిటి ప్రభావమే నేను మాంసాహారాన్ని వర్జించడానికి కారణం.

ఈ నా శాకాహార దీక్ష మూడేళ్ళ పాటు కొనసాగింది – నేను రాజోలు హైస్కూలులో ఫోర్తు ఫారంలో చేరి, అక్కడ ఒక కమ్మవారి హోటలులో భోజనం చెయ్యడం మొదలు పెట్టే వరకు.

ఈలోగా నేను నన్నయ భారతం క్షుణ్ణంగా చదవడం జరిగింది. ధర్మవ్యాధుడి హితబోధ కంఠస్థం కావడమూ అయింది.

ముసు దము చేసిన కర్మం
బున సూవె నశించు భూతములు, చంపెడు వా
డు నిమిత్త మాత్రు డంతియె,
అని చెప్పగ వినమె అంచితాచార్యులచే?

సలిలము లుర్వి యాకసము
సర్వము జంతు మయంబు, కావునన్
కలుగు నవశ్యమున్ సకల
కర్మల యందును హింస, హింసకున్
దొలగిన దేహయాత్ర కడు
దుర్ఘట మైనటు లుండు, ఇంతయున్
దలపరు, హింస చేయమని
వారు దలంతురు కొందరి మ్మహిన్

వంటి ధర్మ వ్యాధుడి బోధలు (నన్నయ గారి పద్యాలు) నన్ను ఉద్బోధించి, హింస నిజ స్వరూపాన్ని ఆవిష్కరించి, నేను మళ్ళీ ఉభయాహారిని కావడానికి తోడ్పడ్డాయి.

తాతగారి ప్రభావం

సంప్రదాయ చిత్తుడైన మనమణ్ణి తాతగారు వలె, నన్ను ధర్మవ్యాధుడు నా బాల్యం లోనే పట్టుకొని, ఎలా తన ప్రభావంలోకి ఆకర్షించుకున్నాడో పరిశీలిస్తే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది!

వేల సంవత్సరాల పూర్వపు కృతయుగం నాటి ధర్మవ్యాధుడి ప్రభావం ఈనాడు నా మీద పడ్డంతగా మరెవరి మీదా పడలేదనే నా ఉద్దేశం. ఈ యుగంలో నేనే ధర్మ వ్యాధుడి సరాసరి (డైరక్టు) వారసుణ్ణని నేను చెప్పుకోడానికి ఇదే కారణం.

"అయితే, అంతటి గొప్ప వాడిమెందుకు కాలేక పోయావ్?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, అట్టి వారికి నా జవాబు–

"ఆనాడు ధర్మ వ్యాధుడు కూడ, అన్ని శక్తులున్న బ్రహ్మజ్ఞాని అయివుండి కూడ, అప్పటి సమాజం దృష్టిలో వట్టి కటికవాడే కదా? అంటరాని వాడే కదా? ఆత్మజ్ఞాన లక్షణమే అట్టిది."

ఆ నాటి నుంచి, అంటే 1928 ప్రాంతం నుంచి, నేను ధర్మ వ్యాధుడికి చెందిన వాణ్ణనుకొంటూ వుండడం తప్ప, అతడి వంశ చరిత్ర గురించి నేనంతగా పట్టించుకోలేదు. చాల సంవత్సరాల తర్వాత, వరాహ పురాణాన్ని విమర్శనాత్మకంగా చదివిన తర్వాత, నాకు నిజంగా జ్ఞానోదయమయింది – ఈ భారత జాతి పుట్టుపూర్వోత్తరాలను గురించి!

అప్పుడు వ్రాశాను ఈ ధర్మవ్యాధుడు నాటకాన్ని – నలభై యేళ్ళ క్రితం, 1960 ప్రాంతంలో!

ధర్మ వ్యాధుడు కర్మయోగి. ఆత్మ జ్ఞాని. అపరోక్ష సాక్షాత్కారం పొందినవాడు. అంతర్ముఖుడు. బ్రహ్మైక్యం చెందిన వాడు. జీవన్ముక్తుడు. అట్టివాడికి లౌకిక విషయాలలో ఆసక్తి వుండదు. బ్రతకడం కోసం కర్మ చేస్తాడు. అంటే పనిచేస్తాడు. అంతేకాని, దేని

కోసమూ ఎగబడడు. పోటీ పడడు. పనిచేసి సంపాదించుకొన్న దానిని అనుభవిస్తాడు. మిగిలిన దానిని పంచి పెడతాడు. మరునాటి కోసం దాచుకోడు. భవిష్యత్తు గురించి ఆందోళన పడడు. ఆయాచితంగా తన వద్దకు వచ్చిన దానిని మాత్రమే స్వీకరిస్తాడు. స్వీయ కష్టార్జితాన్ని మాత్రమే అనుభవిస్తాడు.

అలాంటి అంతర్ముఖుడికి, బ్రహ్మజ్ఞానికి ప్రచారం వుండదు. గుర్తింపు కూడ వుండదు. మానవ విలువలకు విలువగల కాలం కాబట్టి, ధర్మవ్యాధుడి చరిత్ర ఆనాడు పురాణాలకు ఎక్కగలిగింది. మానవ విలువలకే కాదు, ఏ విధమైన సద్గుణాలకూ, సౌశీల్యాలకూ, సామర్థ్యాలకూ విలువలు లేని ఈనాడైతే – ధర్మ వ్యాధుడు లక్షా తొంభై మంది కటిక వాళ్ళలో ఒకడై, నామరూపాలు లేకుండా పోయేవాడు.

ఆనాడైనా – వాల్మీకి, వ్యాసుడు వంటి మహర్షులు, కాళిదాసు, పెద్దన వంటి మహాకవులు అప్పటి రాజ వంశాలతో సంబంధాలు పెట్టుకున్న వాళ్ళూ, రాజాస్థానాల కవులూ కనుకనే వాళ్ళకంతటి ప్రచారం వచ్చి వుంటుందని నా భావం. అంతకంటె మహత్తర ప్రతిభావంతులైన ప్రజా కవులకు గుర్తింపే లేకపోయింది. జానపద గేయాల కవులెవరు? వారి పేర్లేమిటి? వేద, పురాణ, కావ్య, ప్రబంధ, సాహిత్యానికంతకూ ఆధారభూతమైన జానపద సాహిత్యాన్ని సృష్టించిన మూల బ్రహ్మల ఆచూకి కూడ మనకు తెలియదే! కారణం? రాజాశ్రయం లేక. రాజాశ్రయాన్ని కోరక.

వాల్మీకి సీతను కష్టకాలంలో ఆదుకొన్నవాడు. వ్యాసుడు ఒక మహారాజ వంశానికే మూలపురుషుడు. కాళిదాసు, శ్రీనాథుడు, పెద్దన వగైరాలు చక్రవర్తులతోనే సహ పంక్తి భోజనాలు చేసే గొప్పవాళ్ళు.

ఈనాడు కూడ, ప్రజాస్వామిక రాజ్యాలలో కూడ రాష్ట్రాధినేతలుగా వున్న రాజకీయ నాయకులకు కుటుంబ మిత్రులో, జైలు మిత్రులో అయిన వాళ్ళకే తప్ప – అనాసక్త కళా తపస్వులూ, అంతర్ముఖులూ అయిన సర్వజనీన ప్రజాకవులకూ, ప్రజాగాయకులకూ, ప్రజా నటులకూ గుర్తింపెక్కడుంది?

ఆధునిక అరిషడ్వర్గాలు

బంధుత్వం, కులత్వం, మిత్రత్వం, మతత్వం, పార్టీలో ముఠాత్వం, పార్టీత్వం – ఇవి ఆరూ ఈనాటి అరిషడ్వర్గం. ఇవే ఈనాటి ఏ ప్రజాపాలకులైనా, ఎవరినైనా అభిమానించడానికి పెట్టుకొన్న అర్హతలు. ఇవే క్రమాలంకారంలో ఈనాటి మెరిట్!

ఆనాడు కూడ అంతే. గట్టి గింజలు మునిగిపోయి, తప్పలు తేలి సన్మానాలందు కొనే పద్ధతి నాడు వుంది. నేడు వుంది.

ఆనాడు ధర్మవ్యాధుడికి ఏ ప్రచారమూ లేకపోయినా, ఏ గుర్తింపూ లేకపోయినా, సమకాలీన సమాజాన్ని ప్రభావితం చెయ్యగలిగాడతడు. చరిత్రలోకెక్క గలిగాడు. శాశ్వతీకృడైనాడు. అతడి లక్షల తరాల క్రింది వారసుణ్ని నేను కూడ అదే జాతకంలో పుట్టడం నిజంగా అద్భుతం! ఆధునిక అన్నెక జీవులకు అవిశ్వసనీయం!

ధర్మ వ్యాధుడి చరిత్ర కుప్తంగా ఇది:

కౌశికుడు అనే కుర్రవాడు ఒక చెట్టు క్రింద కూర్చుని తపస్సు చేసుకుంటున్నాడు. అతడు బ్రాహ్మణ కులం వాడు. ఆనాడు వృత్తి వర్గాలే కులాలు. వృత్తుల పేర్లతోనే కులాలు పిలవబడేవి.

చదువు వృత్తిగా కలవాడు బ్రాహ్మడు. వేట వృత్తిగా కలవాడు వ్యాధుడు. అయితే – చదువు వృత్తిగా కలవాడి కొడుకులంతా మళ్ళీ చదువునే వృత్తిగా స్వీకరించకపోవచ్చు. వేటగాడి కొడుకు లంతా మళ్ళీ వేటగాళ్ళు గానే తయారుకాకపోవచ్చు. ఒక్క తల్లికీ, తండ్రికీ పుట్టిన నలుగురూ నాలుగు వేరు వేరు వృత్తుల్ని స్వీకరించి, నాలుగు వేరు వేరు కులాలకు చెంది పోవచ్చు. గుణాలనూ, వృత్తులనూ బట్టే కులాలేర్పడేవానాడు. పుట్టుకతో కులం ఏర్పడడమనే పద్ధతి లేనే లేదు.

తపస్సు చేసుకొంటున్న కౌశికుడి మీద ఒక కొంగ రెట్ట వేసింది. ఉలిక్కిపడి అతడు దానికేసి కోపంతో చురచుర చూశాడు. ఆ కోపాగ్నికి ఆ కొంగ భగ్గున మండి, చచ్చి పడిపోయింది.

చావనీ, వెధవ కొంగ అనుకొంటూ లేచి, మధ్యాహ్నం సూర్యుడు పైనా, ఆకటి చిచ్చు లోనా తనను దహించడం మొదలుపెట్టగా – భిక్షకు బైలుదేరాడతడు. నచ్చిన ఒక ఇంటి ముందు నిలబడి, భిక్షాందేహి అన్నాడు.

ఆ ఇంటి ఇల్లాలు తలుపు తెరిచింది. భిక్ష తెస్తున్నానని చెప్పి లోనికి పోయింది. కౌశికుడు వాకిట్లోనే నిలుచున్నాడు. ఆ ఇల్లాలు ఎంతకూ తిరిగి రాలేదు.

పైనా, లోనా మండుతున్న అగ్ని కళ్ళల్లోకి వచ్చేసింది కౌశికుడికి. ఆలస్యమయ్యే కొలదీ అగ్ని పర్వతమే అయిపోయాడతడు.

కొంత సేపటికి ఆమె తలుపు తెరిచి, భిక్షతో బైటికి వచ్చింది. లావా వెలిగ్రక్కుతున్న అతడి నేత్ర గహ్వరాలను చూచి, అక్కడే ఆగిపోయింది. క్షణం యోచించి, చిరునవ్వుతో ముందుకు వచ్చి, అతడి పాత్రలో భిక్షవేసి, వినయ స్వరంతో అంది–

''బాబూ, నీవు చిన్నవాడివి. అయినా, నా ఆలస్యానికి క్షమించు. వెంటనే వద్దామనుకున్నాను. అంతలో పాలం నుంచి మా ఆయన వచ్చాడు. కాళ్ళు కడిగి, మంచి నీళ్ళిచ్చి వచ్చేటప్పటికి, కొంచెం ఆలస్యమయింది.''

క్షమించుమని కోరినా, అతడి చూపులలోని నిప్పులు చల్లారక పోవడం చూచి, ఆమె మళ్ళీ అన్నది –

''అయినా, నీకింత దురాగ్రహం కూడదు. నీ ఈ క్షణాగ్నితో భస్మం కావడానికి నేను కొంగనేం కాను.''

అంతటి అగ్ని పర్వతమూ మంచుగడ్డ ముక్కై పోయిందా మాటతో. వడవడ లాడిపోయాడు కౌశికుడు. పడిపోయాడామె పాదాల మీద.

క్షమా భిక్ష పెట్టమన్నాడు. జ్ఞాన భిక్ష పెట్టమన్నాడు.

''నా జ్ఞానం నా సేవా దీక్షకు ఫలితం. అది నాకే పరిమితం. నీకు పెట్టడానికి చాలదు. నీకు గురువుగా జ్ఞాన భిక్ష పెట్టగలవాడు ధర్మ వ్యాధుడొక్కడే. పోయి అతణ్ని ఆశ్రయించు'' అన్నదామె. ధర్మవ్యాధుడి అడ్రస్సు కూడ చెప్పింది. ఆశీర్వదించింది.

ధర్మవ్యాధుణ్ని వెతుక్కొంటూ వెళ్ళాడు కౌశికుడు. పట్టుకొన్నాడతణ్ని. జ్ఞానోపదేశమూ పొందాడతడి వద్ద.

జ్ఞానం వ్యక్తిగతం

ఎవరీ ధర్మ వ్యాధుడు? అతడు మిథిలా నగరంలో మాంస విక్రయం వృత్తిగా గల ఒక వ్యాధుడు. కిరాతకుడు. బోయ. ఇప్పటి భాషలో చెప్పాలంటే ఒక అస్పృశ్యుడు. హరిజనుడు. వృత్తికి కసాయి వాడైనా – అతడు శాస్త్రజ్ఞుడు, ధర్మజ్ఞుడు, దైవజ్ఞుడు, బ్రహ్మజ్ఞుడు కనుక, అందరిచేతా గౌరవించబడుతూ గురుస్థానంలో వుండేవాడు.

అతడికి అర్జునుడు అనే కొడుకూ, అర్జునకి (అర్జుని అంటున్నాను నేను) అనే కూతురూ వున్నారు. వాళ్ళకి వేట సరదాయే కాని, వృత్తి కాదు.

ఒకసారి ఒక మృగయావిహార సందర్భంలో అర్జునీ అర్జునులు, ప్రసన్నుడనే యువకుడ్ని కలుసుకోవడం జరిగింది. అప్పుడు అర్జునీ ప్రసన్నుల మనస్సులు కలవడం (ఈ సంఘటన నా కల్పన), ధర్మవ్యాధుడు మతంగ మహర్షిని కలిసి ఆయన కొడుకు ప్రసన్నుడికి తన కుమార్తె నివ్వజూపడం, వివాహం జరగడం క్రమంగా జరిగిపోయాయి.

మతంగ మహర్షి కూడ ఇప్పటి భాషలో చెప్పాలంటే – అంటరాని వాడే. హరిజనుడే. ప్రథమ చండాలుడాయన.

తాను చెయ్యని పాపానికి వెలివేయబడి, వదిలి వేయబడి, అవమానించబడి, అంటరాని వాడుగా చెయ్యబడి, ఒక పశువు (గాడిద) పలికిన చాడీకోరు మాటలవల్ల తన బ్రాహ్మణత్వాన్నే పోగొట్టుకోవలసి వచ్చిన దురదృష్టవంతుడు మతంగుడు.

మనిషి నిజం చెప్పడు కదా! పైగా, కోపంగా వున్నప్పుడు, కక్ష సాధించే గుణంతో ఎంతటి అబద్ధమైనా చెపుతాడు కదా? పశువు, అందులోనూ గాడిద, నిజం చెప్పిందన్న గ్యారంటీ ఏమిటి? దెబ్బతినివున్న గాడిద మాటలు నమ్మి సొంత భార్యను అనుమానించిన బ్రాహ్మడు, వాడెలాంటి బ్రాహ్మడు? కనీసం మానవుడుగా కూడ పరిగణించబడజాలడే? మరి, అతడు భార్యను తప్పుపట్టి, ముక్కుపచ్చలారని కొడుకుని వెలివేసి, ఇల్లు వెడల గొడితే – సంఘ పెద్దలెలా వూరుకున్నారో?

సరే, పెద్దలెవరూ విజ్ఞత చూపకపోయినా, ఘోర దురన్యాయానికి గురైన మతంగుడు తల్లిదండ్రులైన బ్రాహ్మణుల మీదా, సమాజం మీదా ప్రచండమైన కోపాన్ని

ప్రదర్శించేశాడు. దాని ఫలితంగా కోపిష్ఠి, చండుడు, చండాలుడు అనే బిరుదు సంపాదించుకొన్నాడు. పేద కోపం పెదవికి చేటన్నట్టు, తన సత్యాగ్రహం స్వయం ఘాతకమే కాగా, ఏ స్వాములవారో సలహా చెప్పగా - పోయిన బ్రాహ్మణత్వం కోసం తపస్సు ప్రారంభించాడు. ''పర్ణ భక్షకుడు, వారి భక్షుడు, వాయు భక్షుడు'' అయి, అదే అలవాటయి, శాకాహారి అయినాడు.

మతంగుడు పుట్టుకతోనే బ్రహ్మజ్ఞాని. పశు పక్ష్యాదుల భాషలు కూడ తెలిసిన వాడు. అన్ని విధాలా దైవ సముడు. తత్సముడు. వైజ్ఞానిక కుటుంబంలో పుట్టి, వైజ్ఞానిక వాతావరణంలో పెరిగి, అన్ని విద్యలూ క్షుణ్ణంగా నేర్చిన వాడు. జగన్మాత అయిన సీత, ఒక్క పామరుడి పనికి మాలిన మాటకు ఆహుతి అయిపోయినట్టు, ఈనాడు పరమ పవిత్రశీలుడైన మంత్రి ఒక ప్రతిపక్ష ఆరోపణకు పత్తాలేకుండా పోయినట్టు - ఒక గాడిద అక్కసు కూతకు మతంగుడు అధఃపతనమై పోయాడు. ఎవడికి వాడే వ్యక్తిగతంగా, స్వతంత్రంగా బ్రతకగల్గిన నేటి వలె కాక సమాజం వెలివేస్తే నిప్పు, నీరు, తిండి, బట్ట లభించని ఆనాడు వెలివేయబడ్డ మతంగ బాలుడు ఎన్ని ఇక్కట్లు పడ్డాడో ఊహించుకొంటే నిజంగా భయం వేస్తుంది.

అలా దీనుడుగా, దిక్కు మాలినవాడుగా, అంటరాని వాడుగా చేయబడ్డ బ్రాహ్మణ కుమారుడు, బ్రహ్మజ్ఞాని మతంగుడు గత్యంతరం లేక కఠిన నిష్ఠా గరిష్ఠుడై, శాకాహార వ్రతం అవలంబించి, తపస్సు ప్రారంభించాడు. ఆర్ష ధర్మ కనుక, రాజయోగంలో, సంసార శ్రమంలో వున్నాడప్పటికి - ధర్మవ్యాధుడు తన కుమార్తె అర్జునకిని అతని కుమారుడు ప్రసన్నుడికిస్తానని వచ్చిన సమయానికి.

ధర్మవ్యాధుడు మతంగుని దర్శనానికి వెళ్ళినప్పటి ఆ సన్నివేశం గురించి వరాహ పురాణంలో చదవండి. మతంగాశ్రమ వర్ణన చదివి ఆనందించండి. ఆ ఆశ్రమంలో ''సరోవర తీరంబున, బహు శిష్య గణంబుల తోడ, ఆహ్నిక క్రియా కలాపంబులు తీర్చి, వేదాంత శాస్త్ర వ్యాఖ్యాన గోష్ఠినున్న మతంగుని గనుంగొని'' ఇలా అన్నాడు ధర్మవ్యాధుడు-

అనఘ స్వాంత! మతంగ సంయమి వ
రేణ్యా! నా తనూజాత న
ర్జునకీ కన్యక దెచ్చినాడ రమణీ
చూడామణిన్, మీ ప్రస
న్ననకున్ జేయుదమా వివాహ మిక? ఎం
దున్ జూచినన్ కల్గ రా
యన దక్కన్ ముని రాజ నందనులు, క
న్యా దాన యోగ్యుల్, వరుల్!

(వ.పు.ద్వి.పద్యం.119)

అర్జునీ ప్రసన్నుల ప్రేమ దాంపత్య జీవితం పార్వతీ పరమేశ్వర వైభవంగా సాగి పోయింది. అయితే–

సంసారం, సమాజం, వ్యక్తుల పెద్దరికాలు, అంతస్తు వారీ మర్యాదలు, సమర్థుల వినయాలు, అసమర్థుల అహంకారాలు వగైరా వున్నాయిగా? అవి లేకుండా సంఘ జీవిత మేముంది? అలాంటి కొన్ని సంఘటనలను ఈ నాటకంలో పొందుపరిచాను.

ఇక ధర్మవ్యాధుడి గురించి–

ధర్మవ్యాధుడి గత జన్మలు

వసువు రాజ్యము పుత్రున కప్పగించి, వనమున కేగి, తపస్సు చేసి పుండరీకాక్ష పాశస్తవము పఠించుచుండెను. అంత నీతని శరీరము నుండి, వికృత రూపుడొకడు వచ్చి, నా వలన బనిని గైకొనుమనియెను. వసువత్యాశ్చర్యము నొంది ''నీ వెవ్వడవు? ఇట్లేల వచ్చితివని'' యడిగెను.

''నేను బ్రహ్మ హత్యను. నీవు క్రిందటి జన్మమున బౌండ్ర వంశమున బుట్టిన రాజువు. అపుడు జనస్థాన పురము నీ రాజధాని. నీవు వేటకు బోయి లేడియని భ్రమపడి

మునిని గొట్టితివి. ఆ పాపము పోగొట్టుకొనుటకు నీవనేక పూజలు చేసితివి. వ్రతములు సల్పితివి. కాని దాన నీకు ఉదర శూల రోగము వచ్చినది. నీ మరణ కాలమున నీ భార్యయగు నారాయణిని దలచుకొంటివి. నీవు నారాయణ నామ ముచ్చరించుటచే నిన్ను స్వర్గమునకు గొని పోవుటకు విష్ణు దూతలు వచ్చిరి. నేనడ్డు పడితిని. నన్ను వారు మోదిరి. నేనపుడు నీ శరీర రంధ్రములలో దాగి యుంటిని. నీవు స్వర్గ లోక మందున్నపుడును, బ్రహ్మ నిన్ను మరల గాశ్మీర రాజుగా బుట్టించి నపుడును, నట్లే యుంటిని. ఇపుడు నీవు 'పుండరీకాక్ష' పాఠస్తవము చేయుటచే నీ శరీరము నుండి వెడలగొట్టబడితి''నని చెప్పెను. ''నీవలన నా పూర్వ జన్మవృత్తాంతమును వినగల్గితిని. నీవు ధర్మవ్యాధుడవై యుండు''మని చెప్పి వసువు స్వర్గమును బండెను. (పూర్వ గాథాలహరి)

ధర్మవ్యాధుడు మిథిలా నగర మందలి యొక బోయవాడు. కుల వృత్తి నెరవేర్చుచు, మాంస విక్రయము చేయుచు, సద్వర్తనుడై యుండెను. ఇతనికి బెక్కు ధర్మములు తెలిసి యుండెను. కౌశికుడను బ్రాహ్మణుడితని కడకు వచ్చి, ధర్మములు నేర్చుకొనెను. ఇతని వలన జీవ లక్షణంబులను, నహింసా లక్షణంబుల నెరింగెను.

ఇతనికి అర్జునుడు అను పుత్రుడును, అర్జునకి యను కుమార్తెయును గలరు. కుమార్తెను మతంగ ముని కుమారుడైన ప్రసన్ననకిచ్చి వివాహము చేసెను. కుమార్తె కితడు నీతులన్నియు బోధించి, యత్తవారింటికి బంపెను. ఒకనాడు అర్జునకిని నత్తగారు ''నీవు మృగములను జంపి తినువాని కుమార్తెవు'' అని నిందించెను. ఆమెకు గోపము వచ్చి, తండ్రి యింటికి వచ్చి చెప్పెను. ధర్మవ్యాధుడు కుమార్తెను వెంట బెట్టుకొని, యత్తవారింటికి తీసికొని వెళ్ళియామె నప్పగించెను. నేను మీ ఇంట భోజనము చేయుదునా, ఏమి పెట్టుదురు అని అత్తగారి నితడడిగెను. గోధుమలు, కందులు, ధాన్యములు వండి పెట్టుదుమని యామె అనియె. వానిని జూడ నిండని ధర్మ వ్యాధుడు కోరగ, మతంగుని భార్య చేటలో వానిని బోసికొని వచ్చెను. అవి చూచి ''ఛీఛీ మీ యింట భోజనము చేయను. అనుదినము ఇన్ని వేల జీవరాసులను జంపెదరా? నేను వారమున

కొక్క మృగమును మాత్రము చంపి తిందును. మీ యింట గుడువ రాదని'' ధర్మవ్యాధుడు వెళ్ళబోవుచుండగా, మతంగుడు బ్రతిమాలు కొనియె. అపుడు తన కూతురును నిందించుట దోషమని వారికి దెలియునట్లుగ జెప్పెను.

ధర్మవ్యాధుడు పూర్వ జన్మమున నొక బ్రాహ్మణుడు. ధనుర్విద్య నేర్చుకొని, రాజ కుమారులతో జెలిమి చేసి, వేటకు బోవు చుండెడి వాడు. ఒకసారి వేటకు బోయినపుడు మృగమని భ్రమపడి యొక మునిని గొట్టెను. ఆ ముని యితనిని జూచి నీవు బ్రాహ్మణుడ వయ్యునూ శూద్రునట్లు వర్తించితివి. కావున మాంసము నమ్ము వాడవై పుట్టుమని శపించెను. అతడీ బోయవాడై పుట్టెను. (పూర్వగాథాలహరి).

మన పురాణాల నిండా ఇలాంటి కథలే అనేకం వున్నాయి. ఈ చండాల కులం శిక్షా కులం (పనిష్మెంటు కులం)గా వినియోగించుకోబడ్డట్టు కనిపిస్తుంది. పూర్వ కాలంలో మునులు గాని, దేవతలు గాని తమకు కష్టం కలిగించిన వాళ్ళను చండాలురు కండని శపించడం పరిపాటిగా వుండేది. పరిశీలించండి. త్రిశంకుడు అలాగే శపించబడ్డాడు. వాల్మీకిని బ్రహ్మ అలానే శపించాడు. వసువును ఒక ముని కూడ అలానే శపించాడు. గత జన్మలో ధర్మ వ్యాధుడు ఒక కథ ప్రకారం బ్రాహ్మడు, మరో కథ ప్రకారం బ్రహ్మహత్య.

నా కనిపిస్తుంది – వేద పురాణ ఇతిహాస కాలాలలో ప్రతిభావంతులు, మహారాజులు, బ్రహ్మర్షులూ అందరూ మా వాళ్ళే అని! మా హరిజనులే అని!

హరిశ్చంద్ర చక్రవర్తిని కొన గలిగిన భాగ్యవంతుడు ఆ కాలంలో, కాశీలో వీరబాహు ఒక్కడే. అతడు మాల మాదిగ వాడే. ఆనాడు నృత్యగాన కళలలో ఆరితేరిన వాళ్ళు మాలెతలే. విశ్వామిత్రుని పెంపుడు కుమార్తెలు, భారత జాతికి పితామహి అయిన శకుంతలకు అక్కచెల్లెండ్రు!

తన కొడుకును రక్షించుకోవడం కోసం మరొక పేదవాడి కొడుకును (శునస్సేపుణ్ణి) బలి ఇవ్వడానికి సిద్ధపడ్డ స్వార్థపరుడు హరిశ్చంద్రుడు. అతడు జాత్యహంకారి కూడ. అట్టి వాణ్ణి మానవతా మార్గానికి మార్చడానికి ఎంతో కృషిచేసిన వాడు విశ్వామిత్రుడు. అందుకు సృష్టికి ప్రతి సృష్టి చేయడమే కాదు, స్వర్గానికి ప్రతి

స్వర్గాన్ని కూడ నిర్మించగలిగాడు. బలవంతుల దౌర్జన్యాల నుంచి బలహీనులను రక్షించడానికి తన తపస్సునంతా ధారపోశాడు. అందుకే ఆనాటి మహా పండితులు అతడికి విశ్వామిత్రుడు (విశ్వ+మిత్రుడు) అన్న పేరును రూఢి పరచగా, ఆ తర్వాత వైయాకరణులు దానికి విపరీతార్థం చెప్పడానికి ప్రత్యేక సూత్రాన్నే కల్పించుకోవలసి వచ్చింది.

విశ్వామిత్రుడు లేకపోతే శకుంతల లేదు. భరతుడు లేడు. భారత జాతి లేదు. అలానే అరుంధతి లేకపోతే వ్యాసుడు లేడు, కురువంశం లేదు, వేద సంస్కృతి లేదు, వేదాంతం లేదు. ఈ దేశమూ, ఈ జాతి, ఈ సంస్కృతీ యుగయుగాలుగా నేడు హరిజనులని పిలువబడుతున్న వారికి ఎంతగా ఋణపడి వున్నాయో చూడండి! వేద పురాణ సాహిత్యాన్ని పరిశీలించండి. ప్రతిభావంతుడైన ప్రతివాడూ కులం లేని వాడే కాడా?

హింస – అహింస

మనవేదాంతం ప్రకారం ఏది హింస? ఏది అహింస? చంపే వాడూ, చచ్చేవాడూ ఒక్కడే భగవంతుడు. ఎవరి స్వభావాన్ని బట్టీ, అభిరుచిని బట్టీ, అవసరాన్ని బట్టీ వాడు ప్రవర్తిస్తాడు. స్వభావాలూ, అభిరుచులూ, అవసరాలూ భగవంతుని బహు రూపాలు. విశ్వరూపాలు. దేనికీ, ఎవరినీ నిందించ నక్కరలేదు. అభినందించక్కర లేదు. ఎవరూ దేనికీ కర్తా కాదు, కర్మా కాదు. క్రియకు బద్ధులు. క్రియ భగవత్స్వరూపం. ఈ సత్యాన్ని వెల్లడించడానికి వ్యాస మహర్షి ఎన్నుకొన్న పాత్ర ధర్మవ్యాధుడు. భగవద్గీతను ఆవిష్కరించడానికి ఎన్నుకోబడ్డ శ్రీకృష్ణుడంతటి గొప్ప పాత్ర ధర్మవ్యాధుడు.

అడవిలో వేటకు బైలుదేరి, ఒక లేడి వెంటబడి తరుముతున్న ధానుష్కుని (ధర్మ వ్యాధుని) చూచి –

"ఓయి నిషాధ కులేశ్వర!
ఏయకు మేయకుము, జీవహింసకు నేలా
రోయవు.....?"

అంటూ ముదలకించిన ఒక బ్రాహ్మణ మునికి ధర్మవ్యాధుడిచ్చిన సమాధానం చూడండి.

"అవ్యాక్యంబు నిరాకరించి, దిశల
ల్లాడన్ కఠోరంబుగా
నవ్వెన్; నవ్వి నిషాద భర్త" మృగ సం
తానంబు జంపంగ నే
నెవ్వండన్, పరమాత్మ గాక? పిస వె
ర్రీ! విప్ర! ఈ చీకటుల్
త్రవ్వింపన్ పనిలేదు సుమ్ము మము బో
ట్లన్ వేరు వారిం బలెన్!"

(ప.పు.ద్వి.పద్యం.18)

ఎంత అధికారంతో, రాజసంతో ఈ జవాబు చెప్పాడో చూడండి ధర్మ వ్యాధుడు!

"వీళ్ళకూ, వాళ్ళకూ చెప్పేటట్టు నీ ధర్మపన్నాలు మాకు చెప్పక్కర లేదయ్యా, వెర్రి బ్రాహ్మడా!" అన్నాడు ధర్మవ్యాధుడు. చంపేదెవరు? చచ్చేదెవరు? వేదాంత సూత్రాలు వల్లించడానికేనా? ఆచరణకు పనికిరావా? నిజమైన వేదాంతులకు, రాజయోగులకు, స్వార్థ రహితులైన ఎవరికైనా సరే భారతీయ వేదాంత ధర్మ సూత్రాలు ఆచరణ సాధ్యాలే. స్వార్థపరులకు మాత్రమే కావు.

"శిశువు మంట (మట్టితో) నెద్దు
జేయుచు జెరచుచు
నాడునట్లు పోలె, నఖాల భూత
సృష్టిదాన జేయు, చెరచు నప్పరమాత్మ"
"విశ్వ మాత్ర ప్రణీతమై వికృతి బందు,
అందులోన అహంభావ మనుచితంబు"

"శరీర గ్రహణ ధర్మంబున ఎవ్వనికి నెద్ది విహితం బక్కర్మంబు చేసి, పరమాత్మకు సమర్పించవలె" అంటూ బోధ చేశాడా బోయ!

''ఇష్టమైన పనిచేసి, ఫలితాన్ని పరమాత్మకు సమర్పించి, జీవించు'' అంటూ ధర్మవ్యాధుడు చేసిన ఉద్బోధ కంటే, మార్క్స్ ఎక్కువ చెప్పాడా? మార్క్స్ చెప్పిన కేవల భౌతిక వాదం కంటె ధర్మవ్యాధుడు చెప్పిన సమిష్టి జీవన వేదాంతం సహజమూ, సుఖదమూ కాదా?

విశ్వంలోని ప్రతి అణువూ సజీవమైనట్టిదే అని నేడు సైన్సు నిరూపించి చూపుతుంటే ఓహో అంటున్నాం. వేల వేల సంవత్సరాల క్రితం ధర్మ వ్యాధుడు ''సలిలము లుర్వి ఆకసము సర్వము జంతుమయంబు'' అంటూ వక్కాణించాడే అతడెంతటి దివ్యజ్ఞానో గమనించండి!

''కనుక, అన్ని పనుల్లోనూ హింస కలుగుతుంది. అహింస అనేది వట్టి భ్రాంతి, మాయ మాట'' అన్నాడు ధర్మవ్యాధుడు.

నిర్జీవ భోజనం

మతంగముని భార్య అత్తరికం నెరపుతూ ''జీవఘాతి కూతుర!'' అంటూ కోడలిని తిట్టినప్పుడు, ఎకాయెకీని మతంగాశ్రమానికి వెళ్ళాడు ధర్మవ్యాధుడు. మతంగుడు సంభ్రమంతో లేచి ''కబురైనా లేకుండా ఇలా దయచేశారేమిటి?'' అని అడిగాడు.

''ఏమి లేదు. మీ ఇంట్లో నిర్జీవ భోజనం చేసి పోదామని వచ్చాను.'' అన్నాడు వ్యాధుడు.

వాళ్ళెంతో సంతోషించి, ఇంత కాలానికి ఈ కటిక మాంసాహారికి శాకాహారంపై జిహ్వ మళ్ళిందని ఆనందపడుతూ, భోజనం తయారుచేసి, వడ్డించి పిలిచారు.

''వంట ఏమిటి చేశారు?''

''వ్రీహి, గోధుమ, యవ –''

''అవి ఏమిటి? చూడనివ్వండి''

ఈ కటికవాడికి గోధుమలు ఎలా వుంటాయో కూడ తెలియదు, ఖర్మ – అనుకొంటూ మతంగుడి ఇల్లాలు ఒక చేటలో గోధుమలు పోసి, తెచ్చి చూపింది.

చూచి, ఉలిక్కిపడి, ఒక్క గెంతు గెంతాడు ధర్మవ్యాధుడు అసహ్యంతో వెనక్కి పరిగెత్తాడు.

హడలిపోయిన మతంగుడు ఆయనను పట్టుకొని, అంతటి అపరాధం ఏమి జరిగిందో – క్షమింపుమని వేడుకున్నాడు.

సామాన్యమైన అపరాధమా? క్షమించదగిన అపరాధమా?

"అసంఖ్యములైన జీవుల ననుదినంబు
కనికరము లేక ప్రాణాలు గొని భుజించు
ఘాతుకుని ఇంట కుడు పంగ రాదు, కాన
తొలగి పోవుచు నున్నాడు! కలిగెనేని
ప్రియమున భుజింతు, పెట్టు నిర్జీవ భుక్తి!"

(వ.పు.ద్వి.పద్యం.145)

ఆ తర్వాతి సీస పద్యంలో ధర్మవ్యాధుడు చెప్పిన మాట ఎంతటి వజ్రాల మూటో చిత్తగించండి–

"ఒక్క అడవి జీవిని చంపి, అతిథులకు పెట్టి, పురవాసులకు పంచి, మిగిలింది నేను తింటాను. నేను చంపేది రోజుకొక్క జీవిని.

రోజుకు మూడు పూటలా ఇన్నిన్ని వేల జీవుల్ని ఉడకబెట్టి చంపి తింటున్నారే? అమ్మో, ఎంత ఘోర పాతకులు!"

నిర్జీవ భుక్తి పెడితే తింటానన్నాడు. జీవ రహితమైన పదార్థం ఏముంది ప్రపంచంలో?

అప్పుడు ఒకవేద రహస్యాన్ని వెల్లడించాడు ధర్మవ్యాధుడు. అది యజ్ఞ రహస్యం.

"యజ్ఞాలు అయిదు. దైవయజ్ఞం, భౌత యజ్ఞం, పైత్ర యజ్ఞం, మానుష యజ్ఞం, బ్రహ్మయజ్ఞం. ఈ పంచ మహాయజ్ఞాలకోసం ఓషధులను, లతలను, పశువులను సృష్టించాడు బ్రహ్మ. వ్రీహి గోధుమ పక్షి మృగాది స్థావర జంగమాన్నంబులు యజ్ఞ నిమిత్తంబు గావింపవలె. అప్పుడే అవి పవిత్రమైన వవుతాయి."

అన్నాన్ని రెండు విధాలుగా చెప్పాడు చూడండి! స్థావరాన్నం అంటే వరి, గోధుమ, కాయగూరలు, దుంపలు మొదలైనవి. జంగమాన్నం అంటే పశువులూ, పక్షులు, చేపలు మొదలైనవి. తినే పదార్థమంతా అన్నమే. ఏ అన్నమైనా యజ్ఞంలో పవిత్రం చేసి తినాలి. (1) దేవతా ప్రీత్యర్థం (2) భూత ప్రీత్యర్థం (3) పితృ ప్రీత్యర్థం (4) మనుష్య ప్రీత్యర్థం (5) బ్రహ్మ ప్రీత్యర్థం – ఇందులో ఎవరో ఒకరి ప్రీత్యర్థం సమర్పించుకొని (అంటే నైవేద్యం పెట్టి) ఆ తర్వాత తినాలి. అప్పుడది పవిత్రాన్నమవుతుంది.

ఈ ఆచారం ముస్లిములలో మిగిలి వుంది. ముస్లింలు ఆహారం కోసం ఏ జంతువును చంపినా ''భగవత్ ప్రీత్యర్థం'' అనే మంత్రాన్ని జపిస్తూ చంపుతారు. జంతువుల విషయంలోనే కాదు. చెట్ల నుంచి, పాదుల నుంచి కాయగూరలను తెంపినప్పుడు కూడ ఆ మంత్రాన్ని జపించాలని వేదం విధిస్తున్నది. ఈ పవిత్రాచారాన్ని ముస్లింలు పాటించడం, వేద వారసుల మనుకునే మనం వదిలెయ్యడం విచిత్రం.

అంతటితో ఆగలేదు ధర్మవ్యాధుడు. తనను జీవఘాతి అన్నందుకు మనస్సులోని మంట ఇంకా చల్లారలేదు.

''ఎంతో వినయ విధేయతలు గల నా కూతురు జీవఘాతి కూతురైతే, మరి అంతటి పరుషవాక్కులు పలికే నీ కుల కాంత, నీ ఇల్లాలు ఏ విశిష్ట పురుషుని కూతురో చెపుతావా?'' అని ప్రశ్నించాడు. ఇక్కడ కుల కాంత అనడంలో కుల గర్వాన్ని ధర్మవ్యాధుడెంతగా అసహ్యించుకున్నాడో కూడ స్పష్టపడుతుంది.

''హింస చేసే నా కూతురు హింస చెయ్యని నీకు కోడలయింది. అయ్యో, పాపం! ప్రాయశ్చిత్తం చేసుకో'' అంటూ హాస్యమాడాడు వియ్యంకుడితో.

బ్రాహ్మణత్వ మనేది తన కంటె భిన్నమైనదనీ, తను బైట ఎక్కడో వున్నట్టిదనీ భ్రమపడుతూ, దానికోసం తాపత్రయపడుతున్న మతంగుడికి ఈ సంఘటన ఒక కనువిప్పు.

హరిజన

ఆ తర్వాత ధర్మవ్యాధుడు సంసార భారాన్ని కుమారుడైన అర్జునుడికి అప్పగించి, విరక్తుడై వెళ్ళిపోయాడట – ఎక్కడికి? ఎందుకు?

"……ముక్తి కాంత కుచ
పాళిక పజ్జల పత్ర భంగముల్
వ్రాయగ, లోహ దండ వన
వాటికి, సన్ముని రత్న పేటికిన్!"

(వ.పు.ద్వి.పద్యం.151)

"లోహదండం అనే అరణ్యానికి వెళ్ళాడట, ముక్తిని కోరి తపస్సు చేసుకోడానికి."

ధర్మవ్యాధుడి లాంటి ఒక గంభీర ధర్మ నిష్ఠాపరుడు, విరక్తుడై, తపస్సుకోసం అడవికి వెళితే – ఆ సందర్భాన్ని వర్ణించే పద్యం ఎంత శృంగార రస స్ఫోరకంగా వున్నదో గమనించండి!

ముక్తి కాంత యొక్క గుత్తమైన కుచద్వయం మీద, ఆ చుట్టు పక్కల మంచి గంధంతో అందమైన బమ్మలు వ్రాయడానికి వెళ్ళాడట ఆయన అడవికి! ఆ అడవి పేరు కూడ లోహదండం! అది సన్ముని రత్నపేటిక! ఓహో, రసధ్వని! ఈ ధ్వని మూలకర్త వ్యాసుడిదో, తెలుగులో వ్రాసిన జంట కవులదో!

ఈ వర్ణనలో అనౌచిత్య దోషం లేదా? లేదు – ఆ తర్వాత జరిగిన సంఘటనలను, చరిత్రలను బట్టి ఆలోచిస్తే.

హరినామం జపిస్తూ ఎంతోకాలం తపస్సు చేశాడు ధర్మవ్యాధుడు – "పాలస్థల కీలితాంజలి పుటుండై".

అప్పుడు హరి ప్రత్యక్షమై, వరం కోరుకోమన్నాడు. ధర్మవ్యాధుడు కోరిన వరం అత్యద్భుతమైనట్టిది. విశ్వమానవ సర్వోదయ సుందరమైనట్టిది. మానవుని మరో మజిలీకి, మరో మజిలీకి చేర్చే అభ్యుదయ నిశ్రేణి అది?

ఏమిటది?

తనకూ, తన వారసులకూ ఆత్మ విద్యా యుక్త సకల కళావత్కౌశల్యం దయ చెయ్యమన్నాడు. అదీ ఆ వరం! తన వంశంలో పుట్టిన వారందరినీ విజ్ఞాన పరులుగా చెయ్యమన్నాడు!

విజ్ఞానం అంటే నీతీ, నిజాయితీ, నిష్ఠా, నిష్కాపట్యమూ, ఇవి ఇంకా మిగిలి వున్నది హరిజనులలోనే కదా!

వరం దయచేశాడు హరి. అది సరే. మరి, ఈ వరంలో స్వార్థం లేదా? వుంది. ఏం చేస్తాం? ఆనాడు ఆ క్షణంలో అంతటి ధర్మవ్యాధుడు కూడ ఈనాటి రాజకీయ నాయకుడి లాగే ప్రవర్తించాడు. ''నా వంశం, నా వారసత్వం'' అనే అహంకారాన్ని వదులుకోలేక పోయాడు!

ధర్మవ్యాధుడు కోరిన వరాన్ని చిరునవ్వుతో ప్రసాదించిన హరి, ఆ వరప్రభావం వల్లనో యేమో, ''ఓ, మహా కవీంద్ర! వరములన్నియు నిచ్చితి!'' అన్నాడు.

మహా+కవి+ఇంద్ర = మహాకవీంద్ర అనే బిరుద నామంతో సాక్షాత్తు శ్రీహరి నోటనే పిలిపించుకొన్న ప్రథమ మానవుడు ధర్మవ్యాధుడు.

ఈ సందర్భాన్ని గురించి నేను కొన్ని వేల పుటలు వ్రాయగలను. కాని, వ్రాతకంటె సహృదయుల ఊహ గొప్పది కదా!

యుగ కవులైన ప్రతి వాళ్ళూ ఈ ధర్మవ్యాధుడి బోయ వంశానికి చెందిన వాళ్ళే కావడం ఈ వర ప్రభావమే. పరిశీలించండి!

ఇక్కడ మరొక్క విషయం–

యజ్ఞమూర్తిని ఎలా స్తుతించాలో వివరింపుమని ఆది వరాహమూర్తిని భూదేవి అడిగినప్పుడు, ఆయన చెప్పిన స్తుతి వాక్యాలలో ఈ క్రిందివి కూడ వున్నాయి–

యజ్ఞమూర్తి! కుభృత్సన్ని భాంగ!
యీశ!
యిజ్య! పరమాణుతుల్య! యో
గీంద్ర పూజ్య
హరి జనార్దన! మూర్ధ
సహస్ర పరమ
వేద వేదాంగ! వేదాంత
వేద్య! నిత్య!

ఈ వాక్యాలతో ''హరి జనార్దన'' అనే వాక్యం వుంది, చూడండి! హరి జనార్దన అంటే హరిజనులను పోషించే వాడా అని అర్థం. హరిజనార్దన అని విడదీయాలని కొందరనవచ్చు. ఇక్కడ హరిజన పదం ఏకపదమని నేనంటాను. పైగా, ధర్మవ్యాధుడు హరి వర ప్రసాదం పొందిన తొలి హరిజనుడు. ఇక్కడ హరిజన శబ్ద ప్రయోగం కాకతాళీయం కాదు. దైవికం.

ఇక్కడ మంత్రాల గురించి ఒక మాట–

మహా మంత్ర మాల

నా జీవితానుభవంలో నేను కొన్ని మంత్రాలను దర్శించాను. పాత మంత్రాల స్వరూపాన్నే కాక, కొత్త మంత్రాల సృష్టిని కూడా చేశాను. ఇవన్నీ నిరంతరంగా జపించినప్పుడు ఏకాగ్రత ఏర్పడి మనస్సుకు శక్తి సామర్థ్యాలను ఇస్తాయి. ఈ మాట సర్వకాల సత్యం.

1. ఓం:– ఇది ఏకాక్షరి. నాద బ్రహ్మ. దీనిని ఆపకుండా పలకాలి. సన్నాయి ప్రక్కన శ్రుతిలాగా, నాగస్వరం లాగా గుక్క తిప్పుకోకుండా. నాదోపాసన చాల కష్టమైన సాధన. దీనిని సాధించిన వాళ్ళే చిరంజీవులు.

2. రామా – ఇది ద్వ్యక్షరి. రెండక్షరాల మంత్రం. దీనినే తారకమంత్రం అంటారు. ఇవి రెండూ బీజాక్షరాలు. అగ్ని బీజం, కామ బీజం. ప్రకృతి పురుష సిద్ధాంతానికి ఇది మూలం. ఉచ్ఛ్వాసనిశ్వాసాలకు అక్షర కల్పన. లోనికి పీల్చుకొనే గాలి అగ్ని, బయటకు విడిచే గాలి కామం. ఈ మంత్రాన్ని నిరంతరంగా జపించే వాళ్ళకు ప్రాణశక్తి పెరుగుతుంది. సుషుమ్న ఎదుగుతుంది. జీవ బ్రహ్మైక్యం సిద్ధిస్తుంది.

3. ఓంతత్ సత్ – ఇది త్ర్యక్షరి. తత్ అంటే బ్రహ్మ. సత్ అంటే జగత్తు. పరబ్రహ్మ ప్రకృతి. ఈ తత్ సత్ శబ్దాలను హృదయ స్పందనాలుగా కూడా అనుకోవచ్చు. ఓం అనుకొంటూ తత్‌సత్, తత్‌సత్, తత్‌సత్ అనుకొంటూ వుంటే సాధకుడు హృషీకేశుడే అవుతాడు.

4. ఓంఐంహ్రీంశ్రీం – ఇది చతురక్షరి. నాలుగు బీజాక్షరాలు కలది. బ్రహ్మ, జీవం, శక్తి, ప్రకృతి. విశ్వసృష్టి క్రమవికాసం ఈ నాలుగక్షరాల మంత్రంలోనూ వుంది.

5. నమశ్శివాయ – ఇది పంచాక్షరి. అయిదు అక్షరాల మంత్రం. శివుడికి నమస్కరిస్తున్నాను అనే అర్థంతోపాటు, ''నేను నేను కాదు మహాశివుణ్ణి'' అనే అర్థం ఈ మంత్రంలో వుంది.

6. ఓం నమశ్శివాయ – ఇది షడక్షరి. ఆరక్షరాల మంత్రం. పంచాక్షరికి 'ఓం' చేర్చబడింది.

7. నమో నారాయణాయ – ఇది సప్తాక్షరి. నారాయణ మంత్రం. నారాయణుడు క్షీరసాగర శయనుడు. సర్వ సృష్టికీ బీజప్రాయుడు.

8. ఓం నమో నారాయణాయ – ఇది అష్టాక్షరి. సప్తాక్షరికి 'ఓం' చేర్చిన మంత్రం ఇది.

ఇంకా అనేక మంత్రాలున్నై. మానవుడు సాధించాలనుకొనే శక్తులు ఎన్ని వుంటాయో, మంత్రాలు అన్నీ వుంటై. ఉపాస్య శక్తికి ప్రతీకగా వుండే దేవత పేరుతో ఆ మంత్రం వుంటుంది. ఏ మంత్రమైనా శక్తి దాయకమే. ఏ మంత్రోపాసన అయినా, దాని లక్ష్యం మనస్సుకు, శరీరానికీ, వాటి ద్వారా జీవితావికీ బలోత్సాహాలను సమకూర్చడమే. మనస్సును ఏకాగ్రం చెయ్యగలిగితే శరీరం సర్వశక్తిమంత మవుతుంది. సంకల్ప సిద్ధి స్వాధీనమవుతుంది.

ఈ మంత్రాలన్నిటికీ తల్లి అనదగింది గాయత్రి. త్రిపదా గాయత్రీ అన్నారు. ఎనిమిదేసి అక్షరాలు గల మూడు పాదాల మంత్రం. మొత్తం 24 అక్షరాలు.

9. ఓం తత్ సవితృ వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

ఈ 24 అక్షరాలే గాయత్రి అంటే, రకరకాల సిద్ధాంతాల పండితులు, రకరకాల అక్షరాలను దేవికి ముందూ, వెనకా చేర్చి పఠిస్తారు. ఓం అనే అక్షరాన్ని భూః, భువః, స్వః అనే పదాలకు చేర్చి కలుపుతారు. అలాకాక ఓం అనేదాన్ని తత్ సవితుర్వరేణ్యం అనే మొదటి పాదానికే చేర్చాలి. అప్పుడది ఎనిమిది అక్షరాల పాదం అవుతుంది.

10. సర్వదేవ మయీం దేవీం
సర్వమంత్ర మయీం పరాం
ఆత్మానాం చింతయేత్ దేవీం
పరమానంద రూపిణీం

అంటూ సర్వమంత్రాలకూ, సర్వ దేవతలకూ మూల ధాతువైన విశ్వశక్తిని ఆరాధించారు పూర్వ ఋషులు. ఏ మంత్రాన్ని అయినా జపించినా, జపించకపోయినా ఈ శ్లోకాన్ని మాత్రం నిత్యం జపించుకొంటూ వుంటే ఆత్మబలం దానంతటదే కలుగుతుందనేది నా అనుభవం.

11. నేను రాగవైశాఖి రచన చేస్తున్నప్పుడు ఒక శ్లోకం వ్రాశాను. గ్రంథం అచ్చయిన తరువాత, దాని మీద పత్రికలలో చెలరేగిన వివాదాలతో నేను తలపట్టుకు కూర్చున్న కాలంలో సోషల్ వెల్ఫేర్ డైరెక్టరు ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీ బి.ఆర్.కె.శాస్త్రి. ఆయన ఫోనులో ఆ శ్లోకాన్ని చదివి తనకిలాంటివి వందల కొలదీ శ్లోకాలు పరిచయమేనని, బహుశా తనకి తెలియనివేవీ లేవని, అయితే ఈ శ్లోకం తనకెక్కడా కనిపించలేదనీ, ఇది అన్ని విధాలా సమగ్ర సుందరంగా, శక్తి ప్రదాయకంగా వున్నదనీ అంటూ ఈ మంత్రాన్ని ఎక్కడ నుండి తెచ్చారు? అని ప్రశ్నించారు.

అదెక్కడా లేదనీ, కేవలం నా సొంతమనీ చెప్పాను. అయితే, సహస్రనామాల నుంచి తీసుకొన్న పదాలతో ఈ శ్లోకాన్ని కూర్చాను అన్నాను. ఆయన నన్ను గురించీ, రాగవైశాఖిని గురించీ కొన్ని ప్రశంసా వాక్యాలు పలికి ఫోను పెట్టేశారు.

నేను నా కోసం సమకూర్చుకొన్న శ్లోకం ఇది. మంత్ర శక్తి గల శబ్ద సంపుటి ఇది. అది ఇది.

నమశ్శివాయ సాంబాయ
నటరాజాయ నమోనమః
నమశ్శివాయ సూర్యాయ
గంగాధరాయ నమోదనమః

నమశ్శివాయ సోమాయ
మహా బీజాయ నమోదనమః
నమశ్శివాయ భీమాయ
మృత్యుం జయాయ నమోనమః

ప్రకృతి ధర్మాన్ని అనుసరించి, హేతుబద్ధమైన కూర్పుతో, బీజాక్షరాలను అమర్చి ఈ విధంగా వందల, వేల మంత్రాలను సృష్టించుకోవచ్చు. ఏ మంత్ర శక్తి అయినా మనస్సును ఏకాగ్రంచేసి ఈప్సితాలను సఫలీకృతం చేయడానికే. ఏ మంత్ర సహాయము లేకుండానే కోరికలు తీర్చుకునే మనశ్శక్తి కలవాళ్ళు చాలమందే వుంటారు. ఏ శక్తులైనా కావలసింది బలహీన మనస్కులకే. మనోస్థైర్యం లేని వాళ్ళకు దైవ బలమూ, మంత్ర బలమూ అవసర మవుతై – వ్యాధి గ్రస్తులకు ఔషధాలవలె.

సమగ్ర మానవుడు

మానవ మనస్తత్వం దృష్ట్యా, ధర్మవ్యాధుడు సమగ్ర మానవుడు. అతడు జ్ఞాని, విజ్ఞాని, బ్రహ్మజ్ఞాని.

మానవుడిలోని సర్వతోముఖ సర్వసమగ్ర సహజ లక్షణాలను ఏకముఖం చేసి ఒకే ఒక వ్యక్తిలో చూపడానికే వేదవ్యాసుడు ఈ పాత్రను సృష్టించాడనవచ్చు. ఈ పాత్రను సంపూర్ణంగా ఆవిష్కరించడానికే వరాహ పురాణాన్ని వ్రాశాడేమో అనిపిస్తుంది నాకు. ఆయన వ్రాసిన పద్ధెనిమిది పురాణాలలోనూ వరాహ పురాణమే మొదటిది.

విశ్వేశ్వర పరమాత్మ శ్రీ మహావిష్ణువుగా ఊహించబడిన ప్రారంభ దశలో, ఆయన ధరించిన మొదటి రూపం వరాహావతారం. కేవల భూచరాలలో వరాహం మొదటిది. అంతకు ముందు అవతారాలు రెండు జలచరాలు. శ్రీ మహావిష్ణువును తొలి రూపంలో ఆది వరాహ మూర్తిగా కీర్తించారు. ఆయన భార్యగా భూమిని ఊహించారు. భూమిని భూదేవి అన్నారు. ఆది వరాహమూర్తి భూదేవికి, సృష్టికి సంబంధించిన అనేక రహస్యాలను వివరించినట్టుగా ఈ వరాహ పురాణంలో చెప్పబడింది. వేద వ్యాసుడు ఈ పురాణాన్ని

తన స్వీయ చరిత్రకు మూలంగా వ్రాసుకొన్నాడనుకుంటాను. తన వంశ వృక్షం అందరికీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నట్టిదే. వృక్షపు వేళ్ళు కనిపించవు. కనుకవాటి విషయంలో వివాదాలు తలెత్తుతాయి. అట్టి వివాదాలకు చోటులేకుండా తానే వాటిని గురించి ఈ పురాణంలో వివరించాడనుకోవచ్చు. వేదవ్యాసుడు మాల మాదిగవాడు కాబట్టి అతన్ని గురించి కానీ, అతడి మూల పురుషులను గురించి కానీ స్మృతుల కాలం తరవాత వాళ్ళెవరూ అంతగా పట్టించుకోలేదు.

జ్ఞాన బ్రాహ్మణం – జన్మ బ్రాహ్మణం

స్మృతుల కాలం తరువాత అన్నాను కదూ? దీనిని గురించి కొంచెం వివరించాలి. సంస్కృతిపరంగా భారతీయతను మూడు విధాలుగా విభజించాను నేను.

(1) జాంబవ యుగం. జంబూ ద్వీపాన్ని ఏకరాజ్యంగా ఆది భారతీయులు పరిపాలించిన యుగం.

(2) జంబూద్వీపం భరత వర్షం, భరత ఖండంగా కుంచించుకు పోతూ వచ్చిన భారతయుగం ఇది. మేనక మనుమడు భరతుడు పాలించిన కాలం. ఈ రెండు యుగాలూ వేదకాలం నాటివే. సిసలైన భారతీయత తోడివే. వర్ణ వ్యవస్థ అమలులో వున్నప్పటికీ, అది గుణ కర్మలను బట్టీ, వృత్తులను బట్టీ మారుతూ వచ్చేది. ఎక్కడ ఎలా పుట్టాడనే వాస్తవం మీద కాక వ్యక్తి సాధించిన జ్ఞానాన్ని బట్టీ, ప్రజ్ఞలను బట్టీ వర్ణాలు మారుతూ వచ్చేవి. గుహుడు, హిరణ్య ధన్యుడు, దాసరాజు వంటి స్వదేశీయ మహావీరులెందరో దేశాన్ని పాలించిన కాలమది.

అదంతా మాసిపోయిన తర్వాత, విదేశీ దండ యాత్రలతో దేశం చెక్కముక్కలై పోయిన మూడో యుగం. స్మృతుల యుగం ప్రారంభమైంది. సిరియనులు, అస్సీరియనులు ఈ దేశంపైకి వచ్చి మధ్యప్రాచ్యంలోని తమ స్పర్ధలను ఈ దేశంలో సురాసుర యుద్ధాలుగా కొనసాగించిన యుగం అది. సురాసుర యుద్ధాలే దేవాసుర యుద్ధాలుగా పేర్కొనబడ్డాయి. ఆ ఉభయ పక్షాలకూ కూడా హీబ్రూలు (యాదులు)

వచ్చారనవచ్చు. దేవతల గురువు బృహస్పతి, రాక్షసుల గురువు శుక్రాచార్యులు హీబ్రూ మేధావులే. (The Hebrew origin of the Indian Brahmin అనే ఆంగ్ల గ్రంథం చూడండి).

అంతవరకూ వున్న భారతీయ బ్రాహ్మణత్వం స్థానాన్ని ఈ హీబ్రూ బ్రాహ్మణత్వం ఆక్రమించుకుని స్మృతులు, ధర్మ శాస్త్రాలు సృష్టించి ఈనాటి అధోగతికి దేశాన్ని దిగజార్చాయని నేను భావిస్తున్నాను. అందుకే వ్యాసుడి వరకూ జరిగిన సాహిత్య సృష్టిలో పేర్కొనబడ్డ బ్రాహ్మణత్వం వేరు. ఈనాడు అమలులో వున్న బ్రాహ్మణత్వం వేరు. అది జ్ఞాన బ్రాహ్మణత్వం. ఇది జన్మ బ్రాహ్మణత్వం. నేను బలపరుస్తున్నది జ్ఞాన బ్రాహ్మణత్వాన్నే.

కర్మ నిజస్వరూపం

కర్మను గురించి సాధికారంగా చెప్పగలిగినవాడు ధర్మవ్యాధుడొక్కడే. హింస, అహింస మొదలైన కర్మలకు బాధ్యత ఆయా వ్యక్తులు కాదని ధర్మ వ్యాధుడు సిద్ధాంతీకరించాడు. 'మును తను చేసిన కర్మంబున' అనే ధర్మవ్యాధుని మాటకు అర్థం గతంలో తాను చేసేన పనికి అనే అర్థం. గత జన్మలో అని కాదు.

''చంపెడు వాడు నిమిత్తమాత్రుడు'' అంటే – ఏ వ్యక్తి అయినా తన అవసరానికి తగినట్టే ఏ పనైనా చేస్తాడు అని అర్థం. పిల్లి ఎలకను చంపుతుంది. పులి లేడిని చంపుతుంది. అవి తమ ఆహారం కోసం చంపుతాయి కనుక వాటికి హత్యాదోషం వుండదు. మనిషి కూడా అవసరం లేకుండా ఎవ్వరినీ చంపడు. ఏ పనిచేసినా ఏదో అవసరం వుండే చేస్తాడు. కనుక క్రియ, కర్త యొక్క అవసరాన్ని బట్టి జరుగుతుంది అనేది ధర్మవ్యాధుడి సిద్ధాంతం.

ధర్మవ్యాధుడి కొడుకు అర్జునకుడు మృత్యువును, కాల పురుషున్నీ, కూడా శాసించ గలిగిన సందర్భంలో కూడా ఈ విధంగానే అర్థం చెప్పుకోవాలి. అవగాహన చేసుకోవాలి.

అంకితం గురించి

ముద్రించబడిన నా ప్రతి గ్రంథమూ ఎవరో ఒక ఆత్మీయుడికో, ఆత్మీయురాలికో అంకితం ఇవ్వబడినట్టిదే. అంకితం ఇవ్వడానికి ప్రధాన అర్హత ఆత్మీయత.

ఇప్పటి వరకు నా గ్రంథాలను అంకితం పొందిన వారందరూ నా ఆత్మీయులే. నేను ఆత్మీయులుగా భావించుకొనే వాళ్ళు. తమకు నేను ఆత్మీయుణ్ణో, కాదో అనే విషయం నేను పట్టించుకోను. వాళ్ళలో కొందరు నన్ను ఆత్మీయుడుగా భావించలేదనే వాస్తవాన్ని నేను ఆ తర్వాత గుర్తించాను. అందుకు నేను బాధ్యుణ్ణి కాదు కనుక, అదీ నేను పట్టించు కోలేదు.

నా ఆత్మీయతే నాకు ముఖ్యం. అది నిత్య సత్యం. నిరంతర ప్రణయ స్రవంతి.

నేను అంకితాలిచ్చిన వారందరూ తెలుగు వెలుగులే. సమాజంలో అగ్రశ్రేణిలో ధీమహితులే. నా అంకితాలపై ఎవరైనా పరిశోధన చేస్తే రెండు మూడు డాక్టరేట్లయినా పొందవచ్చు. అంతటి ఉన్నత చరిత్రలున్నై వాటికి.

నా గ్రంథాలను అంకితం తీసుకొన్న వారిలో ఇంతవరకు ముగ్గురు మహిళామణులున్నారు. అందులో ఒకరు ప్రభ. రెండవ వారు నన్ను అన్నయ్యగా దత్తత చేసుకొన్న డాక్టర్ ఆది లక్ష్మి. ఆంగ్ల రచయిత ఆంజనేయులు గారి సతీమణి. మూడవ వారు మా చెల్లెలు ద్రౌపది. అంబేడ్కర సుప్రభాత కావ్యం ఆమెకు అంకితం.

ఇప్పుడు ఈ ధర్మవ్యాధుడు కావ్యాన్ని అంకితం తీసుకుంటున్న డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి గారు నాలుగో మహిళ. నా ఆత్మీయుల్లో మహా మనీషి. సారస్వత మహిమాన్వితి.

రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారి రాజసంతో ప్రసిద్ధికెక్కిన వంశం వాసిరెడ్డి. ఆ వంశంలో గుంటూరు జిల్లా చేబ్రోలులో, రంగనాయకమ్మ, రాఘవయ్య దంపతులకు ఉదయ రవి చంద్రికవలె ఉదయించిన బ్రాహ్మీమూర్తి సీతాదేవి. నవ రసాత్మక సారస్వత కేదారీశ్వరిగా పల్లీ పట్టణ ప్రజానీకంతో కలిసి మెలిసి, పెరిగి పెద్దదైన సీతాదేవి సహజంగానే కథా కోరకాలనూ, నవలా మందారాలనూ వాసిగల రాశులుగా వెలయిస్తూ ప్రఖ్యాతిలోకి వచ్చింది.

సీతాదేవి గారి మొదటి కథ మద్రాసులో పందిరి మల్లికార్జున రావు గారి కిన్నెర పత్రికలో మొలకెత్తింది. ఆ పందిరి సామాన్యమైంది కాదు కదా! అది వాంగ్మయాకాశ మంతటా విస్తరించి, దశ దిశలా గుబాళించింది. మట్టి మనిషి, మరీచిక, ఆమె కథ, ఉరిత్రాడు వంటి నవలలుగా, నవరస పూర్ణ కలశాలుగా సీతాదేవి గారికి సారస్వత రాజదర్బారులో రత్న కిరీటాలు పెట్టినై. సన్మానాలకూ, సత్కారాలకూ, పరిమితులే లేవు. గౌరవ మర్యాదలు అపార పరంపరలైనై.

సీతాదేవి గారితో నా పరిచయం ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తొలిరోజులలో, రాజధాని భాగ్యనగరులోనే. వృత్తి రీత్యా మహిళా సంక్షేమ శాఖలో ప్రవేశించి, పదవీ సమున్నతిని పొందుతూ, జవహర్ బాలభవన్ డైరక్టరుగా అగ్రశ్రేణిపై అలరారిన ప్రతిభావంతురాలు, ప్రజ్ఞా ధీమంతురాలు సీతాదేవి.

అట్టి సారస్వతాత్మకు ఈ నా ధర్మవ్యాధుడు దృశ్యకావ్యాన్ని అంకితం ఇస్తున్నందుకు ఆనందంగా వుంది. అమందానందంగా వుంది.

కృతజ్ఞతలు

ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు అనే రెండు నాటకాలను నేను ఏభై ఏళ్ళ క్రితమే వ్రాసాను. ఆ రెంటినీ ఒకేసారి ముద్రించి ప్రకటించాలనే ఉద్దేశ్యంతోనే ఇన్నేళ్ళూ గడిపాను.

ధర్మవ్యాధుడి పట్ల నాకు ప్రీతి మెండు. అతడు నాటకంలో ఇమడడం లేదని నవలగా వ్రాద్దామనుకొన్నాను. అది కష్టతరం కాగా, చేతి శక్తీ, కంటి చూపూ తగ్గుతూ రాగా, టేపు రికార్డరు కొనుక్కొని, పద్యాలలో కావ్యంగా పాడుకొన్నాను. అదీ తుదముట్టదని గ్రహించి ఇప్పుడు ఆ తొలి రూపంలోనే నాటకంగా ప్రకటిస్తున్నాను.

- బోయి భీమన్న

భాగ్యనగరం
19-9-1999

వేదవ్యాసుడు

కృతి సమర్పణ
శ్రీమతి ప్రతిభా భారతి గారికి

పూర్ణ రవిచంద్ర లీలా విలాసం నుంచి
నవోదయ సుప్రభాతంగా ఉదయించి
విద్యా వినయ సంపత్తితో విద్యార్థి నాయకురాలై
విశ్వ జన రంజక రశ్మితో వికసించి

ఎడ తెరిపి లేకుండా ఎచ్చెర్ల నుంచి
ఆంధ్ర అసెంబ్లీకి ఎన్నుకోబడుతూ
మాన్యమంత్రిగా మానవసేవకు లక్ష్యతారయై
భారతీయ ప్రతిభకు నాగావళీ వంశధారయై

ప్రస్తుతం ఆంధ్ర అసెంబ్లీ అధ్యక్ష్య పీఠంపై
స్పీకరుగా లోకమాన్య అవుతున్న
వ్యాస గీతా వరప్రసాద సుప్రభాత హారతి!
శ్రీమతి కావలి ప్రతిభా భారతి!

ప్రతిభా భారతి భారత
ప్రతిభకు సమ్యక్ ప్రతినిధి; ప్రభుతకు ఆద్య
స్రుతి! ఏ తత్ ప్రాజ్ఞత కీ
కృతి తగునని ఇచ్చుచుంటి కేల్మోడ్పులతో!

కవితా కుసుమాంజలితో

భీమన్న

జ్ఞానం నుంచి జన్మకు

(వేదవ్యాసుడు నాటకానికి పీఠిక)

అచతుర్వదనో బ్రహ్మా
ద్వి బాహు రపరో హరిః
అ ఫాలలోచనః శంభుః
సాయాత్ త్రైః బాదరాయణః

చాలా కాలం క్రితం నేను చదివిన శ్లోకం ఇది. ఎవరు వ్రాశారో నాకు తెలియదు. వేదవ్యాసుణ్ణి గురించి ఇంతకంటే గొప్పగా మరెవరూ చెప్పలేరనటం మాత్రం స్పష్టం.

వేదవ్యాసుడు ఎటువంటివాడు?

సాక్షాత్తు బ్రహ్మ. అయితే నాలుగు ముఖాలు లేవు, ఒకటే ముఖం. ఒకే ముఖం కల బ్రహ్మ.

సాక్షాత్తు విష్ణువు. రెండు చేతులు మాత్రమే కల విష్ణువు.

సాక్షాత్తు శివుడు. నుదుట మూడవ కన్ను లేని శివుడు.

వేదవ్యాసుడు త్రిమూర్తులు ముగ్గురూ కలిసిన ఏకైక మూర్తి. అంతటి శక్తిమంతుడు, ధీమంతుడు, సమగ్ర విశ్వ విజ్ఞాన తేజస్వి.

ఇంతటి వేదవ్యాసుడు బ్రాహ్మిమూర్తి మా పూర్వికుడంటూ, నేను ఆయన వారసుణ్ణంటూ, గర్వపడుతున్నా నంటే నే నెంత అదృష్టవంతుడిని!

ఇంతకూ ఈ వేదవ్యాసుడు ఎవరు? ఎక్కడ పుట్టాడు? నాకు పూర్వీకుడెలా అయ్యాడు? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం పరిశోధనలు చేస్తూనే వున్నాను. ఫలితాలను వెల్లడిస్తూనే వున్నాను. ఆయన జీవితంలోని కొన్ని సామాన్య జీవిత ఘట్టాలను తీసుకొని ఈ నాటకాన్ని అల్లాను. నేను చేసిన ఈ పని అన్ని విధాలా సవ్యమే. అందుకే చేశాను మరి. ఈ యుగంలో ఆయన వారసుణ్ణి కదా!

ధర్మ వ్యాధుడు, వేద వ్యాసుడు అంటూ నేను చాలా కాలం క్రితమే రెండు నాటకాలు వ్రాశాను. ఇవి రెండూ జంట నాటకాలు. ఎప్పుడో వ్రాసిన వీటిని కొంచెం

పరిష్కరించి ముద్రించాలనుకొన్నాను. ఒకేసారి ముద్రించబడవలసి నట్టివి. ఆర్థికంగా పేదవాడ్ని కదా! రెండు గ్రంథాలను ఒకేసారి ముద్రించటం సాధ్యం కాలేదు. నా కున్నదంతా ధర్మవ్యాధుడు ప్రింటింగుకే సరిపోయింది. అది గత సంవత్సరం (1999) మాట.

ఇపుడు, ఈ 2000వ సంవత్సరంలో ఈ 'వేదవ్యాసుడి'ని ముద్రిస్తున్నాను, పెద్దగా పరిష్కరించకుండానే.

'వేదవ్యాసుడు' గురించి ఎప్పుడు ఎవరు వ్రాసినా, అందులో పెద్దగా మార్పులేమీ వుండవు. దృక్కోణంలో మార్పులుండవచ్చు. ఆయన జీవితంలో మార్పులు చేయడం సాధ్యం కాదు. అది అందరికీ తెలిసినదే! ఎవరు ఏ దృక్కోణంతో చూసినా అదంతే. ఈ పీఠికలో నేను చెపుతున్నది మాత్రం పూర్తిగా వాస్తవ దర్శనం, వినూత్న దర్శనం, విశిష్ట దర్శనం. నాటకీకరించడంలో మాత్రం చిన్న చిన్న మార్పులు తప్పనిసరి కదా!

నేను చాల చిన్నప్పుడే, చిన్న క్లాసులు చదువుతున్నప్పుడే మహాభారతం చదివాను. కవిత్రయం వారి పద్దెనిమిది పర్వాలూ వరుసపెట్టి చదివేశాను. అప్పుడు వాటిని 'చేట భారతాలు' అనేవారు. వాటి సైజులు చాటలంతేసి వుండేవి అందుకాపేరు. నిజానికి నేను చదివిన మొదటి పుస్తకమే మహాభారతం. దానిని సంస్కృతంలో 'వ్యాసుడు' వ్రాశాడని తెలిసినపుడు, అతడెవరో కనుక్కోవాలనే ఆలోచన కలిగి పరిశోధన మొదలు పెట్టాను. అతడు 'అరుంధతి'కి ముని మనవడు అని తెలిసినపుడు నా ఆనందానికి అవధులే లేకపోయాయి. ఎందుకంటే, అరుంధతి మా 'ఇంటి ఆడపడుచు' కదా!

నేను పుట్టి బుద్ధెరిగి నప్పట్నుంచి, అరుంధతి మా కులానికి చెందినదే అనే సత్యం నాకు తెలుసు. మా వాళ్ళంతా అదే చెప్పారు. లోకమంతటికి తెలిసిన పౌరాణిక సత్యమే అది. ఈ విషయాలన్నీ నా సాహిత్యం నిండా నేను వ్రాస్తూనే వచ్చాను, ఇంకా యింకా పరిశోధిస్తూనే వస్తూన్నాను. ఇపుడీ గ్రంథం వేదవ్యాసుణ్ణి గురించిన చరిత్ర కాబట్టి ఇపుడు మళ్ళీ అదే చెపుతున్నాను. చెప్పిందే చెపుతున్నానని నన్ను నిందించకండి. సృష్టిలో ప్రతి విషయమూ ఇలానే నడుస్తూంది మరి! జరిగిందే జరుగుతూ వుంది. అదే మళ్ళీ మళ్ళీ జరుగుతూ వుంది. అంతా పునరుక్తి, చర్విత చరణం!

మూడే వర్ణాలు! నాలుగోది సేవక వర్గం:

''ఆర్యా త్రై వర్ణికా'' అనేది వేదోక్తి! అంటే ఆర్యులు ఈ భారత దేశానికి వచ్చినపుడు మూడు వర్ణాలుగా వచ్చారట! ఆర్యులు ఒకే జాతి వాళ్ళయితే వాళ్ళందరూ ఒకే రంగులో వుండాలి కదా! కాగా, వర్ణం అంటే రంగు కాదన్నమాట. వర్ణం అంటే వృత్తి. విద్య, రక్షణ, వ్యాపారం – ఈ మూడు ఏ జాతి మనుగడకయినా ముఖ్యమైనవే! ఈ మూడు వృత్తులలోను స్థిరపడ్డ వర్గాలకు సహాయకులు, సేవకులు అవసరం కనుక అందుకు దేశీయులను వాడుకొన్నారు. నిజానికి ఈ నాలుగోది వర్గం, బానిస వర్గం. స్వజాతీయ బంధితులను కూడా ఈ బానిస వర్గంలో చేరవచ్చు.

బ్రాహ్మణాః క్షత్రియాః వైశ్యాః
త్రయో వర్ణా ద్విజాతయః
చతుర్థ ఏకజాతిస్తు శూద్రోః
నాస్తితు పంచమాః

అన్నాడు మనువు అందుకే. అంటే అంతకుముందు నుంచీ దేశీయులుగా వుంటున్న వారినే జయించి తమ వర్ణ వ్యవస్థలో శూద్ర వర్ణంగా కలుపుకొన్న ఆర్యులు సాంఘికంగా ఒక నిబంధనను చేసుకొన్నారన్నమాట. దేశీయులందరూ ఒకే వర్ణం – సేవకులు. ఆర్య వర్ణ వ్యవస్థ ఈ నాలుగు వర్గాలుగా వుంటే చాలనుకొన్నారు. అందుకే ఐదవ వర్ణం లేదని ఖచ్చితంగా చెప్పేశారు.

ఆర్యులు వచ్చేనాటికి ఈ దేశంలో స్థిరపడివున్న ప్రజలెవరు? వాళ్ళు కూడా ఆర్యుల కంటె ముందు ఈ దేశానికి వచ్చిన ఆర్య జాతుల వాళ్ళే! ఈ చరిత్ర అంతా నేను 'రాగ వాశిష్టం' (అరుంధతీ కళ్యాణం) నాటకంలో, ముఖ్యంగా దాని పీఠికలో వివరించివున్నాను.

నిజానికి పంచముల ఆది మూలం గురించి నా గ్రంథాలలో అవకాశం కలిగినప్పుడల్లా పేర్కొంటూ వచ్చాను. అంతచేసినా, ఆ గ్రంథాలేవి చదవకుండా, కనీసం

మంగిపూడి వెంకట శర్మగారి 'నిరుద్ధ భారతం' గ్రంథాన్నయినా చూడకుండా, ఎందరో నన్ను ఈ దళితుల రూట్సు గురించి అడుగుతూనే వున్నారు. నేను చెపుతూనే వున్నాను, మళ్ళీ మళ్ళీ వ్రాస్తూనే వున్నాను. ఎవరూ చైతన్యవంతులు మాత్రం కావడం లేదు.

'ఆధునిక విజ్ఞానం గురించి, అందులో పాశ్చాత్యుల ముందంజ గురించి అందరూ చెప్పుకుంటూ వుంటే, ఒక బామ్మగారు అన్నారట – 'దాందే ముందీ? అన్నీ మన వేదాల్లోనే వున్నాయిషగా!'' అని. అదే ధోరణిలో నేనంటున్నాను, ''ఈ పంచముల చరిత్రంతా నా గ్రంథాలలో వుంది, చదవండి'' అని.

వ్యాసుడి పుట్టుక:

ఈ నాటకంలో మొదటి దృశ్యం వ్యాసుడి పుట్టుకకు సంబంధించినది.

''జాతో వ్యాసస్తుకైవర్త్యా'' అంటూ వ్యాసుడు ఒక బెస్తపిల్లకు పుట్టినవాడుగా మహాభారతంలో చెప్పబడింది. ''శ్వపాక్యాస్తు పరాశరంః'' అని కూడా అక్కడే చెప్పబడింది. పరాశరుడు ఒక మాల మాదిగ పిల్లకు పుట్టాడు అని.

ఈ వాస్తవాన్నే కాబోలు మంగిపూడి వెంకటశర్మ గారు ఒక పద్యంలో చెప్పారు.

వ్యాసముని చంద్రు గన్న పరాశరుండు
మాల దానికి పుట్టి బ్రహ్మర్షి అయ్యె;
వేశ్యకును పుట్టి, మాలెత బెండ్లియాడి
ఆ వశిష్ఠ మహర్షి బ్రహ్మర్షి అయ్యె.

ఇదే విషయాన్ని వెల్లడించే మేమన పద్యం కూడా ఒకటుంది, ఎంత మంది వ్రాసినా వాస్తవం మాత్రం ఒకటే. అరుంధతీ, అదృశ్యంతీ, శక్తిమునీ, పరాశరుడు, వేదవ్యాసుడు – ఈ అందరూ ఒకే కుటుంబం వాళ్ళనీ వెలివేయబడ్డ మతంగుల సంగం వాళ్ళనీ, పంచములనీ, మాల మాదిగ లనీ.

వీళ్ళను మాల మాదిగ లనడం తెలుగు భాషలో మాత్రమే. ఇతర భాషల వాళ్ళకు ఈ మాటలు అర్థం కావు. వేరు వేరు భాషల్లో వేరే వేరే పేర్లతో వీళ్ళు పిలవబడతారు. మొత్తం దేశమంతటా తెలిసే పేర్లే సంస్కృత భాషలో వున్నట్టివి. శ్వపచ, శ్వపాక శబ్దాలు

ఆహారానికి సంబంధించినవి. చైనా వంటి తూర్పు దేశాలలో అందరూ శ్వపచులే. మాంసాహార మన్నపుడు ఏ మాంసం అయినా ఒకటే! జీవ హింస అన్నపుడు, హింసించబడేది ఏ జీవి అయితే మాత్రమేమిటి? కార్మికులను హింసపెట్టే యజమానులు కూడా జీవహింసకులే కదా!

మాల మాదిగ అనేవి అవర్ణ వర్గాలకు తెలుగు పేర్లు మాత్రమే. దేశమంతటికీ తెలిసిన సంస్కృత నామాలలో ప్రధానమైనట్టివి 'చండాల' 'వాల్మీకి' అనేవి. ఇప్పటికీ బెంగాలీ భాషలో చండాల శబ్దమే వాడుకలో వుంది. చండాలుడు అంటే చండ గుణం కలవాడు, కోపం కలవాడు. తీక్షణంగా స్పందించేవాడు. ఈ గుణాలు కలవాడిని చండాలుడు అన్నారు. మొట్టమొదటి చండాలుడు మతంగుడు.

ఈ మతంగుడు ఎవరు? ఇతని పుట్టుక ఎలాంటిది?

ప్రథమ చండాలుడు:

''చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేన'' అని అమరకోశం అనే నిఘంటువు అర్థం చెపుతుంది. ఒక బ్రాహ్మణ వర్గం స్త్రీకి శూద్ర వర్గం పురుషుడివల్ల పుట్టినవాడు. అని ఆ మాటకు అర్థం, అంటే వర్ణ సంకరుడు అన్నమాట.

జ్ఞాన ప్రధానమైన వేద సమాజం శిధిలమైపోయి, జన్మ సంబంధమైన కుల వ్యవస్థ ఏర్పడుతున్న కొత్తలో సంఘటన కావచ్చు ఇది. చదువుకున్న వాళ్ళను బ్రాహ్మణులు అంటున్నారు. బ్రహ్మ విద్య అనేదే విద్యకు పరాకాష్ఠ కదా! బ్రహ్మ విద్య తెలిసిన వాళ్ళు బ్రాహ్మలు. బ్రహ్మ విద్య అంటే ఈ నాటి డాక్టరేటు లాంటిదన్నమాట!

సమస్త సృష్టికి, చరాచర వర్గానికి, స్థావర జంగమాదులన్నిటికీ, మూలాధారం ఒక శక్తి, ప్రాణశక్తి. పంచభూతాల సమ్మేళనంతో ఏర్పడిన శక్తి అది. దానిని 'బ్రహ్మము' అన్నారు. దీనికే బ్రహ్మ, పరబ్రహ్మ, పరమాత్మ, శక్తి, విశ్వశక్తి, ప్రకృతి పురుష శక్తి, తత్ సత్, ఆనంద మొదలైనవి పర్యాయ పదాలుగా వాడబడుతున్నాయి.

అలాంటి బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రాహ్మడు. ఈ తెలుసుకోవడమే జ్ఞానం. జ్ఞాన ప్రధానంగా ఏర్పడినట్టిది ఆదిలో వేద సమాజం. అటువంటి సమాజానికి అట్టి జ్ఞానం గల బ్రాహ్మడే అగ్రగామిగా, మార్గదర్శిగా వుంటాడు.

సమాజాన్ని శత్రు శక్తుల నుంచి కాపాడటానికి ధైర్య సాహసాలు కల బలమైన ఒక వర్గం వుంటుంది. అట్టి వాళ్ళకు క్షాత్రం ప్రధానం. అందుకే వాళ్ళను క్షతియులన్నారు. సామాజిక దైనందిన వ్యవహారాలు నడిపే సామాన్య జనాన్ని వైశ్యులు అన్నారు. వైశ్యులు అంటే విశ్వ నిర్వాహకులు, మొత్తం మీద ఈ అందరికీ సహాయ పడే పరిజనాన్ని, సేవకులను, భృత్యులను, చెప్పినపని తప్ప మరే పని చెయ్యగల నేర్పులేని పని వాళ్ళను మొత్తంగా 'శూద్రులు' అన్నారు.

ముఖ్యమైన వృత్తులను పై మూడు వర్గాలు చేపట్టడం వలన, ఈ శూద్రులు ఏ వృత్తి లేని వాళ్ళు. కేవలం పై వాళ్ళను సేవించడమే వీళ్ళకు వృత్తి అయింది.

ఈ వివరాలన్నీ ఇదివరకే చాలా చోట్ల చెప్పాను. ఇక్కడ మళ్ళీ చెపుతున్నాను. సంప్రదాయాన్ని వదిలేసి, ఇతర జాతులతో సంబంధాలు ఏర్పడి, ప్రపంచ మానవులంతా ఒకే జాతిగా బ్రతకడం జరుగుతున్న ఈ కాలంలో, గతానికి సంబంధించిన ఆచారాలు వదలకుండా పట్టుకొని వెనక్కులాగుతూ గందరగోళం పడుతున్న నవతరం వాళ్ళకోసం ఇదంతా మళ్ళీ చెపుతున్నాను.

వేద సమాజంలో వృత్తి విభజనే తప్ప, జాతి విభజన లేదు. ఇక్కడ జాతి అంటే 'జన్మ' అని అర్థం. ఎక్కడ జన్మించిన వాడయినా, ఎలా పుట్టిన వాడయినా బ్రహ్మజ్ఞాని అయిన వాడు బ్రాహ్మడే. ధైర్యసాహసాలు కలవాడు క్షతియుడు, ఏ పని స్వయంగా చేసుకోలేని వాడు శూద్రుడు. ఆ కాలంలో జన్మకు ప్రాధాన్యం లేదు, మానసిక స్థాయికి మాత్రమే ప్రాధాన్యం వుండేది.

అందుకే అడవిలో వేటాడుతూ, దోపిడీలు చేస్తూ బ్రతికిన గిరిజనుడు వాల్మీకి అయినాడు. పట్టపగలు ఒక బెస్త పిల్లకు పుట్టిన ద్వైపాయనుడు వేదవ్యాసుడు అయినాడు. ఆ కాలంలో వర్ణాలు (వృత్తులు) వున్నా వర్ణభేదాలు లేవు. నిషేధాలు లేవు, హెచ్చు తగ్గులు లేవు. అస్పృశ్యత లేదు, ప్రజ్ఞకు తగ్గ గౌరవం వుండేది. ప్రతిభకు అగ్ర గణ్యత వుండేది.

మరి, మతంగుడు వర్ణ సంకరుడెలా అయ్యాడు? అవర్ణుడెలా అయ్యాడు? వర్ణ బాహ్యత ఎలా కలిగింది? వెలి, అంటరాని తనం ఎలా సంక్రమించాయి?

ఈ ప్రశ్నలకు జవాబుగా కొంచెం వెనక్కు వెళ్ళి సురలు, అసురలు యీ దేశానికి వచ్చినప్పటి పాత గొడవలు కొన్ని తెలుసుకొనవలసి వుంది.

మధ్య ప్రాచ్యం – కశ్యప సంతానం:

ఎక్కడ పుట్టినా, 'ఎక్కడ పెరిగినా మానవ జాతిలోని వివిధ శాఖల మనుషులు మధ్య ప్రాచ్యంలో అభివృద్ధి పొందారనడం చారిత్రక వాస్తవం, 'మధ్య ప్రాచ్యం' అంటే మధ్యదరా సముద్రం, అరేబియా సముద్రం, సుమేరు పర్వాతాలు, సింధు లోయ ఆ మధ్యలో ఉండే భూభాగం అనవచ్చు. ఇప్పుడు మనం మధ్య ప్రాచ్యం అంటున్నది యిదే! ఏ దేశ చరిత్ర అయినా, ఏ జాతి ప్రజల విస్తరణ అయినా మధ్య ప్రాచ్యం నుంచి ప్రారంభమైనట్టిదే అని చరిత్ర.

ఎన్నో జాతులుగా, దేశాలుగా, విభజించబడి వున్న ఆ భూభాగంలో, సిరియా, అస్సిరియా అనే రెండు దేశాల వాళ్ళు అగ్ర పంక్తికి వచ్చి పరస్పరం కలహించుకొంటూ వున్న కాలంలో ప్రారంభమయింది మన చరిత్ర. ఈ సిరియా, అస్సిరియా దేశాల వాళ్ళు దాయాదులు. ఒకే తండ్రికి పుట్టిన సవతి తల్లి బిడ్డలు. ఆ తండ్రి పేరు కశ్యపుడు.

చరిత్రకు తెలిసిన మొదటి మహాముని అతడే గనుక, అతణ్ణి 'కశ్యప బ్రహ్మ' అన్నారు. బ్రహ్మ అంటే 'ప్రజాపతి' మాత్రమే కాదు, సర్వ సృష్టినీ చేసిన సృష్టికర్త. విశ్వాన్ని నిర్మించిన విశ్వకర్మ, సమస్త సృష్టికి అతడు పిత, కనుక 'పితామహ'! 'పితామహుడు' అంటే సామాన్యార్థంలో 'తాత' అనే కాదు, 'మహాపిత' అని. 'తాత' అనే అర్థం తీసుకొని 'బ్రహ్మ'ను ముసలివాడుగా చిత్రించడం అవివేకం.

ఈ కశ్యపుడు ఒక్కొక్క భార్యకు ఒక్కొక్క వర్గం చొప్పున సృష్టిలోని మొత్తం 84 లక్షల వర్గాలను కనిపెట్టినాడు. 'జీవు లెనుబది నాల్గు లక్షలు' అంటూ తత్త్వవేత్త యడ్ల రామదాసు కట్టిన లెక్కయిది. అదితికి ఆదిత్యులు, దితికి దైత్యులు, దనువుకు

దానవులు, మనువుకు మానవులు, వినతకు గరుడులు, కద్రువకు నాగజాతులు పుట్టినట్లు మనందరకూ తెలిసిందే కదా!

యూదులు, అరబ్బులు ఈ విధంగా పుట్టిన దాయాదులే. లోకంలో అగ్రగణ్యత కోసం పోరాడుకున్న వారిలో లోక దృష్టిని ఆకర్షించిన వాళ్ళు అదితి సంతానం. వాళ్ళే సిరియా దేశాన్ని పరిపాలించిన సిరియన్లు. వాళ్ళకు వైరస్థానంలో నిలిచి, ప్రాబల్యం కోసం పోరాటాలకు దిగిన వాళ్ళు దితి, దనువు వంటి వారి సంతానం దైత్యులు, దానవులు. వాళ్ళే అస్సీరియా దేశాన్ని పరిపాలించిన అస్సీరియన్లు.

సిరియనులే సురులని, అస్సీరియనులు అసురులని తదుపరి పేర్కొనబడ్డారు. సురులకు తండ్రి వాత్సల్యం, పెద్దల ఆశీర్వాదాలు ఎక్కువగా వుండటంవల్ల, అందుకు వాళ్ళ ప్రతిభా ప్రాభవాలు తోడ్పడడంవల్ల వాళ్ళు మధ్యధరా సముద్రం నుంచి హిమాలయ ప్రాంతాల వరకు వ్యాపించారు.

అసురులు కూడా వాళ్ళకు తీసిపోలేదు! అస్సీరియా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన అసురులు సురులను తరచు వేధిస్తూ వుండే వాళ్ళు. సదరు వైరమూ, పోరాటమూ వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా కూడానే వుండేవి. భారతదేశంలోకి కూడా వెన్నంటి వచ్చాయి, దేవాసుర యుద్ధాలుగా ప్రఖ్యాత మయ్యాయి.

క్ష్యపబ్రహ్మ అంతటి ప్రముఖుడు సృష్టికి ఆద్యుడు కనుకనే అతడుండే ప్రాంతానికి కౌశ్యపం (కాకేషస్ ప్రాంతం) అని, ఆ ప్రాంతంలోని జలాశయానికి కాస్పియన్ సముద్రం అని పేర్లు వచ్చాయి.

కాశ్మీరు లోయ మహా సరస్సుగా వున్నపుడు దాని నీటిని సింధూ నదిలోకి విడగొట్టి, దానినొక దేశంగా చేసిన వాడు కూడా ఈ కశ్యపుడే, ఇతని పేరు మీద కాశ్మీరు అని పేరు ఏర్పడినది.

పరశురాముడు రాజులందరినీ జయించి గైకొన్న భూలోకాన్ని ఈ కశ్యప ప్రజాపతికి ఇచ్చివేయడంవల్లనే భూమికి 'కాశ్యపి' అనే పేరు వచ్చింది. ఈ చరిత్రంతా కశ్యప బ్రహ్మ ఔన్నత్యాన్ని చాటేదే.

ఈ బ్రహ్మ ఇతర జాతుల చరిత్రలలో 'అబ్రహాం'గా పేర్కొనబడ్డాడని చాలా మంది మేధావుల వుద్దేశం. భారతీయ బ్రహ్మకు, హీబ్రూ అబ్రహాముకు పోలికలున్నాయి. బ్రహ్మ భార్య శారద. అబ్రహాం భార్య 'శారా' తన సృష్టికనుక బ్రహ్మకు శారద కూతురు అనవచ్చు. అబ్రహాము కూడా శారాను చెల్లెలుగా చెప్పుకున్నాడు. బ్రహ్మ సంతానంలో ప్రధానమైన శాఖలు దేవతలు, రాక్షసులు, అబ్రహాం సంతానంలో ప్రధాన శాఖలు యూదులు, అరబ్బులు. ఇలాంటి పోలిక లెన్నైనా చెప్పవచ్చు.

యుగాలు – వేదాలు:

భారతీయులు కాలాన్ని నాలుగు యుగాలుగా విభజించారు. ఆ నాలుగే మళ్ళీ మళ్ళీ రిపీట్ అవుతూ వుంటాయనేది సిద్ధాంతం. కలియుగం తరువాత, మళ్ళీ కృతయుగం వస్తుందన్నమాట. అయితే ఆ మళ్ళీ వచ్చే కృతయుగం మొదటి కృతయుగం లాటిదేనా? కాదంటాను నేను.

కాలగమనం సరళ రేఖ కాదు, క్రమోన్నతి కల వృత్త రేఖ. శంఖావర్త పురోగమన మది. ఘాట్టు రోడ్డు వంటిది. అస్సీరియన్లు, సిరియన్లు భారతదేశంలో ప్రవేశించి, తమ యుద్ధాలను కొనసాగించడం ప్రారంభించిన కాలమే ఒక కృతయుగారంభం. అంతకు ముందు ఎన్నో 'యుగచతుష్కాలు' గడిచిపోయి వుండవచ్చు. ఇప్పటి కృతయుగం మాత్రం ఇంద్ర, వృత్రాసుర యుద్ధంతో ప్రారంభమయిందనవచ్చు.

వేదాలు అంతకు ముందు నుంచే ఈ దేశంలో వున్నవా? లేక, మధ్య ప్రాచ్యం నుంచి దేవాసురలతో (ఆర్యులతో) వలస వచ్చి నట్టివా? అనే ప్రశ్నలు అప్పుడప్పుడు వెలువడుతూ వుంటాయి. ఈ ప్రశ్నలు అనవసరమని నా వుద్దేశం. ఎందుకంటే ఈనాటి భారతదేశం ఒకానొక కాలంలో అజనాభంగాను, జంబూ ద్వీపంగాను పిలువబడిందే కదా! ఆ కాలంలో ఉత్తర ధ్రువ ప్రాంతం కూడా భారత్‌లోదే. మధ్య ప్రాచ్యం కూడా భారత్ లోదే, అమెరికా కూడా ఈ జాతి మానవుల ఆవాస భారతం.

తిలక్‌గారు చెప్పిన హిమ ప్రళయం సమయంలో, అక్కడి ఆర్య జాతులు ధ్రువ

భూముల నుంచి, నాలుగు ప్రక్కలకూ వలస పోవడం జరిగింది. కొందరు యిటు దక్షిణానికి వస్తే, కొందరు అటు బేరింగు మీదుగా అమెరికాలో ప్రవేశించడమూ జరిగింది. అందువల్ల వేదాలు ఎక్కడ పుట్టాయి? ఎక్కడెక్కడికి ఎయే రూపాలలో ప్రయాణించాయి? అనే ప్రశ్నలే అక్కర్లేదు.

''అనంతాః వేదాః'' వేదాలు అనంతం. ఎప్పుడో ఒకప్పుడు పుట్టి ఆగి పోయినట్టివి కాదు. అవి నిరంతరంగా పుడుతూనే వున్నాయి. వేదాలు అపారుషేయాలు కదా! అంటే మామూలు మనుషులు చెప్పినట్టివి కాదు. అనుభవజ్ఞుల నోట దేవుడు పలికించినట్టివి. అప్పుడున్న దేవుడు ఇప్పుడు మాత్రమే లేడా! అప్పుడు పలికించినట్టే ఇప్పుడూ పలికించడా! ఋషులున్నది అప్పుడేనా! ఇప్పుడు లేరా? కనుకవేదాలు అపారుషేయాలు అంటే అనుభవజ్ఞులైన వాళ్ళు జ్ఞానం ద్వారా, ధ్యానం ద్వారా మానవుడి ప్రయోజనం కోసం చెప్పే సూక్తులన్నమాట.

ఈ సూక్తులు నాడు, నేడు కూడా చాలా వరకు ఒకే విధంగా వుంటై, కొన్ని మాత్రం కాలానుగుణంగా మారతై. పాత పద్ధతులను పరిహరించి, కొత్త పద్ధతులను ప్రవేశపెట్టే వాళ్ళు ఋషులే, మేధావులే. ఈ ఋషులు పూర్వం కంటె ఇప్పుడే ఎక్కువగా పుడుతున్నారని నా వుద్దేశం. ప్రకృతి ప్రవర్తనలో మార్పు వస్తున్న కొలది దానికి కారణభూతులైన ఋషులు అవతరిస్తూనే వుంటారు. ఇదొక నిరంతర పరిణామ క్రమం.

రెండెడ్ల బండి కాలం కంటె మోటారు కారు కాలం ఉత్తమమైనట్టిది కదా! అలాగే ఈ కాలపు అనుభవజ్ఞుడు ఉత్తమోత్తముడు కదా! ఆనాటి ఋషుల కంటె ఈనాటి సైంటిస్టులు ఎక్కువ గొప్పవాళ్ళు.

వేదాల విభజన:

వేదాలను విభజించినందువల్లనే వ్యాసుడు వేదవ్యాసుడైనాడు కదా! నిజానికి వేదాలను ఎందుకు విభజించవలసి వచ్చింది. విభజించక ముందు వేదస్వరూపం ఎలా వుండేది?

జ్ఞాన ప్రధానమైన వేద సమాజం వేరు, జన్మ సంబంధమైన కుల సమాజం వేరు, అనే నా సిద్ధాంతం ఈ సందర్భంలో పుట్టినదే! అరుంధతికి సంబంధించిన వర్గంలో పుట్టిన మాల మాదిగ వాడు వ్యాసుడు మొత్తం భారత జాతికే అన్ని విధాలా మూల పురుషు డెలా అయ్యాడు? అది జ్ఞాన ప్రధానమైన కాలం కనుక, జ్ఞానం అంటే బ్రహ్మ జ్ఞానం కనుక. ఆనాటి సమాజానికి అగ్రేసరుడైనాడు వ్యాసుడు. బ్రహ్మ విద్యావేత్తయై బ్రాహ్మణుడైనాడు.

ఆనాటి వర్ణాలు కూడా వృత్తులు, ప్రతిభను నాలుగు ప్రజ్ఞలుగా విభజించి, ఒక్కొక్క ప్రజ్ఞను ఒక్కొక్క వృత్తిగా ఎన్నుకొన్న వాళ్ళను ఒక్కొక్క వర్గంగా పరిగణించారు, అట్టి వృత్తి వర్గాలనే వైదిక భాషలో వర్ణాలు అన్నారు.

అందులో బ్రహ్మ జ్ఞానం ప్రధాన వృత్తిగా గల వాళ్ళు బ్రాహ్మణులైనారు కదా! వశిష్ఠాది ఋషులు వేదవ్యాసుడి వరకు అలా ఏర్పడ్డ బ్రాహ్మణ వర్గమే.

వేదాలంటే ఆనాటి పెద్దల అనుభవ సూక్తులు, వయోవృద్ధుల 'బుద్ధి' గల మాటలు. ఎవరో కొద్ది మంది యువకులను మినహాయిస్తే లోకానుభవం ప్రాతిపదికగా వెలువడే విలువైన వచనాలన్నీ, వాక్యాలన్నీ, పెద్దల నుంచి వచ్చేవే. అట్టి వారినే 'ఋషు'లన్నారు. అట్టి వాక్యాలే వేదవాక్యాలయినాయి.

యువకులయినా, వృద్ధులయినా, ఏ కొద్ది మందో చెప్పే మాటలే ప్రకృతి ధర్మాల ననుసరించి వుంటాయి. అట్టి ఎవరెవరో చెపుతూవచ్చిన ఎన్నెన్నో మాటలు సూక్తులుగా, వేదవాక్యాలుగా సమాజం నిండా వ్యాపించి వుండటం జరుగుతుంది. అవి బాగా విస్తరించినపుడు ఏ సందర్భాని కే వాక్యం పలకాలో తెలియకుండాపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అట్టి ప్రమాదం ఏర్పడిన సందర్భంలో అట్టి వాక్యాలన్నీ తెలిసిన విపుల విజ్ఞాన వేత్త అయిన వాడు వాటిని గుర్తించి చెప్పవలసి వుంటుంది. అట్టి పనినే మనం యిప్పుడు 'ఎడిటింగ్' చేయడం అంటున్నాము. ఆ విధంగా ఆనాడు వేద మంత్రాలను 'ఎడిటింగ్' చేసిన వాడే వేదవ్యాసుడు.

వ్యాసకాలపు యుగచతుష్కం సురాసుర యుద్ధానంతరం మొదలైనట్టిది. జ్ఞానం

స్థానంలో జన్మను నిల్పి, యీదు గురువులు బ్రాహ్మణులై వైదిక జ్ఞాన వ్యవస్థను ఆక్రమించు కొన్నట్టిది. మతంగుడి వెలికి మూలం యిదే.

నాలుగు సందర్భాలను ఎన్నుకొని కలగూర గంపగా వున్న వేద మంత్రాలను నలుగురు శిష్యులకు చెపుతూ వచ్చాడు వ్యాసుడు. ఒక్కొక్క శిష్యుడికి చెప్పిన మంత్రాలన్ని కలిసి ఒక్కొక్క వేద సంపుటి అవుతూ వచ్చింది. ఆ విధంగా నలుగురు శిష్యులు నాలుగు వేదాలకు 'నిధుల' య్యారు.

కుల వ్యవస్థ ఎప్పటి నుంచి:

ఆదిలో జ్ఞాన ప్రధానమైన వర్ణ వ్యవస్థగా వున్న భారత సాంఘిక వ్యవస్థ తరువాత జన్మ ప్రధానమైన కులవ్యవస్థగా ఎలా మారింది? ఎప్పుడు మారింది? ఎందుకు మారింది?

ఈ మూడు ప్రశ్నలకూ ఖచ్చితంగా, చారిత్రక పరిణామాల దృష్ట్యా సమాధానం చెప్పాలంటే అదొక పెద్ద విప్లవ గాథ అవుతుంది. నిజం చెప్పి నిష్కారం తెచ్చుకొనే కీర్తి కలవాణ్ణి కాబట్టి, నాకు తెలిసిన నిజం సూటిగా చెప్పాలనుకొంటున్నాను. ఈ విషయంలో ఎంతో పరిశోధన జరగవలసి వుంది! సాంఘిక స్వార్థం, రాజకీయ ప్రయోజనం, లాభ నష్టాల బేరీజు లేని ఉత్తమ మేధావులు చెయ్యవలసిన పరిశోధన అది. అందులో ఎలాంటి స్వపర పక్షపాతాలకు తావుండకూడదు.

జ్ఞాన కాలంలో ఎక్కడ ఎవరికి పుట్టిన వాడయినా, బ్రహ్మజ్ఞాని బ్రాహ్మణు డయ్యేవాడు! బ్రహ్మ జ్ఞానిత బ్రాహ్మణ అయిన ఆ కాలం వేదవ్యాసుడి వరకూ కొనసాగిందన వచ్చు.

ఎందుకూ పనికిరాని ఒక అజ్ఞాని అపూర్వంగా బ్రహ్మజ్ఞాని అయితే, అంతకు ముందు అతని కుండే దాస (పరిచారక లేక కార్మిక) స్థాయి మారిపోయి, బ్రాహ్మణ స్థాయి లభించేది. జన్మను బట్టిగాక, గుణ కర్మలను బట్టి వ్యక్తి సాంఘిక స్థాయి పెరుగుతూ, తరుగుతూ వుండేది. బానిస బ్రాహ్మణు డయ్యేవాడు, బ్రాహ్మణుడు పరిచారకు డయ్యేవాడు. ఈనాడు కొన్ని ఇతర దేశాలలో వున్న వర్గ నిర్మాణం అలాంటిదే కదా!

పరిస్థితుల మార్పును బట్టి కార్మికుడు యజమాని, యజమాని కార్మికుడూ అవుతున్నారు కదా! ఆనాడు భారతీయ వైదిక సమాజం కూడా, గుణ కర్మలను బట్టి మారే వర్గ సమాజంగానే వుండేది!

జ్ఞాన సమాజం జన్మ సమాజం ఎలా అయ్యింది?

కశ్యప కుమారులైన దేవదానవ దాయాది వర్గాలు రెండూ కొట్లాడుకొంటూ, భారత దేశంలో కూడా తమ పోరాటాలను కొనసాగిస్తూ, తుదకు అవి చల్లారిన తర్వాత, సమాజంలో మార్పులు చేర్పులు విపరీతంగా జరిగిన తర్వాత, దేశంలో ఒక విధమైన స్తబ్ధత ఏర్పడింది. చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడి, 'రాజ్యం వీర భోజ్యం' అనే సిద్ధాంతం పుట్టుక వచ్చింది. దేశం నిండా రకరకాల రాజులూ, రాజ్యాలూ! వేదాలు విస్మరించ బడ్డాయి. సమాజ నిర్వహణలో ప్రమాణాలు లేకుండా పోయాయి. అంతా అయోమయం, అంధ యుగం!

దేశ చరిత్రలో అట్టి చీకటి కాలం ఒకటున్నదని చారిత్రక పరిశోధకులు అందరూ అంగీకరిస్తున్నారు. అట్టి కల్లోల స్థితి ఎంత కాలం కొనసాగిందో తెలియదు. మళ్ళీ సమాజం ఒక గాడిన పడాలనుకొన్నప్పుడు, ప్రమాణాల సంగతి చర్చకు వచ్చి, ఎక్కువ మంది రాజులు వేద ప్రమాణాలను స్వీకరించదలచి వుంటారు. సర్వజనులకూ వేద ప్రమాణం సామాన్యం కాబట్టి, దాని కోసం ఆలోచించి వుంటారు.

ప్రతి రాజు సర్వ స్వతంత్రుడే! ప్రతి రాజు వేద పండితులకోసం అన్వేషించినవాడే! పూర్తిగా వేద జ్ఞానం కలవాళ్ళు దొరకలేదు. కొద్ది కొద్దిగా జ్ఞాపకమున్న వాళ్ళు లభించారు. తమకు జ్ఞాపకం వున్న వాటిని స్మరణకు తెచ్చుకొని 'స్మృతులు' వ్రాశారు. ఒక్కొక్క రాజు ఒక్కొక్క 'స్మృతి కర్త'ను ఆదరించి, ఒక్కొక్క స్మృతిని అధికార ప్రమాణంగా స్వీకరించాడు. అట్టి సంధికాలంలో ఏర్పడిందే. జన్మకుల వ్యవస్థ. వారసత్వ సిద్ధాంతం.

రాజ్యం వీర భోజ్యం, బలం కలవాడే రాజు అంటూ వచ్చి, శక్తి ప్రాధాన్య సిద్ధాంతాలను అనుసరించి ఏర్పడిన రాజ్యాలే ఆనాటి వన్నీ! పనిలో పనిగా, తమ

రాజ్యాలను సుస్థిరం చేసుకోవడానికి, అనువంశికంగా అనుభవించడానికి తగు చట్టాలను అప్పుడే ఏర్పాటు చేసుకొన్నారు రాజులు! అట్టి చట్టాలను నిర్మించిన పురోహితులకు, మంత్రులకు, అందులో భాగం పంచారు. ఆ విధంగా రాజు కొడుకు రాజు, మంత్రి కొడుకు మంత్రి వంటి జన్మ కులం ఉనికిలోకి వచ్చింది. ఇది జన్మాతిశయం కల యూదు సంప్రదాయం.

పంచమ యుగం:

కాలం నాలుగేసి యుగాల యూనిట్లుగా విభజించబడింది కదా. ఒక్కొక్క యూనిట్‌లో నాలుగు యుగాలుంటై. అలాంటి యూనిట్లు అసంఖ్యాకం. గడిచిన వెన్నో, గడవబోయేవెన్నో తెలియదు. అలాంటి యూనిట్లలో ఒకటి ఇప్పుడు జరుగుతున్న వ్యాస చతుష్కం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగ చతుష్కం ఇది. కలియుగం తర్వాత పంచమ యుగాన్ని చేరుస్తున్నాను నేను ఇప్పుడు.

వైదిక భారతంలోకి దేవాసురులు ప్రవేశించి, ఆధిపత్యం కోసం పోరాడుకుని దేశంలోని సంస్కృతినీ, సామాజిక వ్యవస్థనూ నాశనం చేసి, అయోమయం సృష్టించిన యుగ చతుష్కం ఇది. ప్రస్తుత యుగ చతుష్కం అట్టి అయోమయ స్థితి నుంచి ప్రారంభమై, త్రేతా గడిచి ద్వాపరం నడుస్తున్నప్పుడు పుట్టిన వాడు వ్యాసుడు. వ్యాసుడు పుట్టే వరకు కూడా వైదిక వ్యవస్థ అల్లకల్లోలంగానే వుంది.

దేవ జాతుల గురువు బృహస్పతి వంశం వాళ్ళూ, రాక్షస జాతుల గురువు శుక్రాచార్యుల వంశం వాళ్ళూ కూడా ఆయా జాతుల వెంట భారతదేశానికి వచ్చిన విదేశీ ఆర్యులే. యూదు జాతీయులే! మధ్య ప్రాచ్యంలో ఎన్ని జాతులు ఎన్ని పేర్లతో పిలువబడినా, ఆనాడు అక్కడ నివసించిన వాళ్ళందరూ ఒకే జాతి వాళ్ళు కశ్యప సంతానం. మంగోలియా నుండి టర్కీ మీదుగా మధ్యధరా సముద్రం వరకు, ఇటు గంగ సింధూ మైదానం వరకు ఆక్రమించి పరిపాలించిన ఆర్యజాతి అది.

ఏది ఏమైనా, వ్యాసయుగ చతుష్కం ప్రారంభం నాటికి దేశంలో వున్న స్థితి

అయోమయం. వైదిక వ్యవస్థ శిథిలం చేయబడింది. శ్రుతుల స్థానంలో స్మృతులు ప్రవేశ పెట్టబడ్డాయి. జ్ఞానం స్థానంలో జన్మ (పుట్టుక) ప్రతిష్ఠించబడింది. వర్ణ వ్యవస్థ కఠిన కుల వ్యవస్థగా మారగానే, తక్షణ ఫలితంగా కుల సంకరం ఏర్పడింది. కులాంతర ప్రేమ ఫలితంగా పుట్టిన వాళ్లు సంఘ పరిధి నుంచి వెలి వేయబడుతూ వచ్చారు.

తక్కిన కులాల సంగతి ఎలా వున్నా. మొదటి కులానికి చివరి కులానికి మధ్య సాంకర్యం కఠిన శిక్షలకు గురైంది. అలా సంఘ బహిష్కృతుడైన మొట్ట మొదటి పిల్లవాడే మతంగుడు.

వ్యాసయుగ చతుష్కంలోని కృతయుగం నాటి సంగతి అది. ఆనాడు కుల బహిష్కారమే తప్ప అంటరానితనం లేదు. వీరబాహుడు, పుల్కసుడు మొదలైన వాళ్ళందరూ బహిష్కృతులు కావచ్చు. అంటరాని వాళ్ళు మాత్రం కాదు. కాశీ నగర వీధుల్లో స్వేచ్ఛగా వూరేగుతూ, హరిశ్చంద్ర చక్రవర్తినే కొనగలిగిన వీరబాహుడు అస్పృశ్యుడెలా అవుతాడు? బహిష్కృత వంశం వాడన్న చిన్న చూపు అతనిపట్ల పైకులాల వాళ్ళకుంది. అంతే!

అందరూ అవైదికులే:

యయాతి చక్రవర్తి నుంచి క్రిందికి దిగివస్తే, ఈ దేశంలో భారతీయులుగా పరిగణించ బడుతున్న హిందువులందరూ ఆయన వారసత్వానికి చెందిన బహుజనులే (వెనుకబడ్డ కులాల వాళ్ళే). ముసలి యయాతికి చెందిన ముదిరాజులు, దేవయానికి చెందిన యాదవులు, శర్మిష్టకు చెందిన పౌరవులు, కాళిదాసుకు చెందిన గొల్లలు, నారదుడికి చెందిన రజకులు, దేవరాక్షస గణాలకు సురాపానము అందించిన గౌడలు, మయ, విశ్వకర్మ మున్నగు చతుష్షష్టి కళలకు చెందిన అనేక మంది, వృత్తులను బట్టి అనేక కులాల పేర్లతో జీవితాన్ని సాగిస్తున్న వివిధ వర్గాల ప్రజలంతా ఒకే అసుర మూల జాతికి చెందిన శాఖలే!

కాలజ్ఞాన తాత్వికుడైన వ్యాసుడికి ఈ అయోమయ స్థితి అంతా అవగతమైంది.

ఆది వైదిక సామాజిక వ్యవస్థను పునరుద్ధరించాలనుకున్నాడు. అందుకే వేద విభజన చేశాడు. పురాణాలు, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు చివరకు భగవద్గీత ప్రకటించి, అన్ని విధాలా భారతోద్ధారకుడైనాడు. నా వంశ వృక్షం ఇంతటి గొప్పది.

ఈనాడున్న కులవ్యవస్థ ఆనాటి వర్ణ వ్యవస్థ కాదు. ఈనాడున్న బ్రాహ్మలు ఆనాడు వేదాలను పలికిన బ్రహ్మజ్ఞానులు కాదు. ఈనాటి వాళ్ళంతా జన్మకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే యూదుజాతీయులు. మంగోలులు. టర్కీ దేశం కేంద్రంగా జంబూ ద్వీపాన్ని పాలించిన వాళ్ళు. ఇప్పుడున్న ప్రజలందరూ కులాంతర ప్రేమ వివాహాల ఫలితంగా పుట్టుక వచ్చిన బహుజనులే, స్వచ్ఛమైన వేద యుగాల వైదిక జాతుల వాళ్ళెవరూ ఈనాడు లేరు. అందుకు సాక్ష్యం జాత్యహంకారం, కులాధిక్యతా రాజసం, జన్మకుల వ్యవస్థ. ఈ వ్యవస్థ భారతీయం కాదు. అన్యజాతీయం. అభారతీయం.

ఈ దుస్థితిని సరిదిద్దడానికే నా ప్రయత్నమంతా. అందుకే కులం మార్పిడి చట్టం తీసుకురావాలంటున్నాను. జాతి మొత్తం కుల భేద రహితం కావాలంటున్నాను. వేద వ్యాసుడు కేంద్రంగా విస్తరిల్లిన ఈ యుగ చతుష్కం నాది. ఎన్ని కులాలు వున్నా అన్నీ సమానమే! ఏదీ జన్మ ప్రధానం కాదు. అన్నిటికి జ్ఞానమే అంతర్వాహిని.

కులాధిక్యత సహించరానిది. కుల గర్వం భరించరానిది. కుల గతాలైన రాగద్వేషాలు, పక్షపాతాలు, దురభిమానాలు అమానుషమైనట్టివి. అభ్యుదయ నిరోధకమైనట్టివి. నా జీవిత కృషి అంతా ఈ మార్గంలోదే. సాహిత్యం ఆయుధంగా నేను సాగిస్తున్న పోరాటమంతా ధర్మం కోసమే! సమగ్ర మానవ ధర్మ సర్వతోముఖ వికాసం కోసమే!

వ్యాసుడి చివరి యత్నం:

జ్ఞానమె జీవ లక్ష్యమయి,
శక్తికి పూజ లభించినట్టి ప్రా
చీన సమాజ మందు వికసించెను వేదములున్, పురాణముల్;

వాణి వరించె వాల్మీకుల,
వ్యాసుల వర్ణ విపక్ష లేక; తత్
స్థానము మార్చి, జన్మకుల
చట్టము తెచ్చిరి జాతి శత్రువుల్.

బ్రహ్మ విద్యయె విద్యా పరాత్పరమ్ము;
దాని లోగొని, కర్ర పెత్తనము నెరపి,
దేవదానవ యుద్ధాల తెరల వెనుక
జ్ఞానమును చంపి, జన్మ రాజై రహించె.

బ్రహ్మ యెవ్వరు? న్యాయ దైవతమె; అతని
పంచమ ముఖంబు త్రుంచి కుంచించిరేల?
చతురుడై వ్యాసముని భవిష్యత్తు చూపి
ఆత్మ రక్షణ కొరకు పోరాడు డనియె!

వేద కాలంనాటి భారతీయ సోషలిస్టు సమాజాన్ని పునరుద్ధరించడానికి వేదవ్యాసుడు చేసిన చివరి యత్నం భగవత్ గీత.

నాలుగు వర్ణాలు వ్యక్తి యొక్క గుణకర్మలను బట్టి ఏర్పాటుచేయబడ్డాయన్నాడు. సృష్టిని యే దేవుడూ చేయలేదన్నాడు. దానికదే స్వభావతా పుట్టి పెరిగిపోతున్నదన్నాడు. గౌరవ జీవితం ఒకళ్ళు భిక్షపెట్టేది కాదన్నాడు. దానిని యుద్ధం ద్వారా సాధించు కోవాలన్నాడు. పని చెయ్యమన్నాడు. ఫలితం వ్యతిరేకమైనా బాధపడవద్దన్నాడు.

"తస్మాత్ ఉత్తిష్ట, కౌంతేయ
యుద్ధాయ కృతనిశ్చయః"

అన్నాడు. ఈ భగవత్ గీతలో కూడా సన్యాసులు ఎవరికి తోచిన భావాలను

వాళ్ళు శ్లోకాలుగా వ్రాసి, మొత్తం గీతనే కల్తీ చేసి పారేశారే కాని యథాతథంగా బ్రతకనివ్వలేదు. ఇప్పుడా యుద్ధ గీత ఒక సన్యాస దూతగా మారి, పనికిరాకుండా పోయింది.

దేవ దానవులు అన్నదమ్ముల పోరాటంలో కొట్టుక చస్తుండే వాళ్ళు కదా, వాళ్ళు భారతదేశానికి కూడా వచ్చినప్పుడు, వాళ్ళతో పాటు మధ్య ప్రాచ్యం నుంచి యూదులు కూడా వచ్చారు. వాళ్ళే ఉభయ పక్షాలకు గురువులు కూడా అయ్యారు. యుద్ధాలు ముగిసి శాంతి నెలకొనేటప్పటికి శ్రుతులు పోయాయి. దేశమంతా పట్టణ రాజ్యాలు వెలిశాయి. యూదు గురువులు బ్రాహ్మణ మతాన్ని చేజిక్కించుకొని, శ్రుతుల స్థానంలో స్మృతులను నింపి, ధర్మశాసనాలు చేసి ప్రజలపై రుద్దారు.

అదే క్రమంగా హిందూ మతమైంది. జ్ఞానం స్థానంలోకి జన్మతేబడింది. వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థ అయ్యింది. స్వేచ్ఛా సమాజం కులకట్టుబాట్లతో కట్టు బానిస అయింది.

ఇది నా ఊహకాదు, ఆనాటి నుంచీ వివిధ జాతుల మేధావులు ప్రకటిస్తూ వస్తున్న అభిప్రాయమే.

వేదవ్యాసుడి చరిత్ర ప్రాచీన భారతీయ సమగ్ర చరిత్ర. చారిత్రక, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ, వేదాంతాది అన్ని రంగాలలోను గూడా వ్యాసుడే భారత జాతి, భారత జాతే వ్యాసుడు.

''అల్లుడుగారి ఈ ఇల్లరికం ఇంకా ఎంతకాలం?'' అంటూ ఎత్తి పొడుస్తున్న అత్తగారి మాటలను భరించలేక కాశీకి మకాం మార్చిన శివుడు, కాశీరాజైన దివోదాసుని వంచించి అతని రాజ్యాన్నే ఆక్రమించుకుని కూర్చున్నాడు కదా! అట్టి ఆది భిక్షువు తన రాజ్యంలో వేదవ్యాసుడికి భిక్ష దొరక్కుండా చేసి కాశీ నుండి వెళ్ళగొట్టాడు. ఈ అన్యాయపు గాథ వ్యాసుని జీవితంలో ఒక ప్రత్యేక నాటకానికే వస్తువు కాగలిగి నట్టిది. దానిని ఈ గ్రంథంలో నేను స్పృశించలేదు. కొన్ని వివరాలను మాత్రం నా బాలయోగీయం కావ్యంలో ఇచ్చి ఉన్నాను.

జయాపజయాలు:

''జయాపజయాలు దైవాధీనాలు'' అనేది సామెత, ఇది భగవద్గీతలోని ఒక శ్లోకానికి సారాంశం. ''కర్మణ్యే వాధి కారస్తే, మా ఫలేషు'' అనేది ఆ శ్లోకం. జయాపజయాలు దైవాధీనాలు. వాటిపై నీ కధికారం లేదు. వాటిని గురించి ఆలోచిస్తూ కూర్చోకు. నీ అధీనంలో ఉన్నదీ, నీవు చేయగలిగిందీ ఒక్కటే. పనిచేయడం. కర్తవ్య నిర్వహణ. చేసిన పని మంచి ఫలితాన్నిస్తుందా, విఫలమౌతుందా అనే ఆలోచనే నీకు అక్కర్లేదు. నీ కర్తవ్యం యుద్ధం చెయ్యడం. గెలిస్తే భూలోక రాజ్యం, చస్తే వీర స్వర్గం. కనుక ఫలితాన్ని గురించి ఆలోచించకు లేచి యుద్ధం చెయ్.

ఇదీ భగవద్గీత చేసిన బోధ. వేద వ్యాసుడు కృష్ణ భగవానుడిచే చెప్పించిన సుభాషితం.

ఇంతటి మహత్తర సుభాషితాన్ని వక్రీకరించి, నిష్కామ కర్మ, అనాసక్త యోగం వంటి మాటల్ని సృష్టించి గీతను, జాతిని కూడ పండితులు అధోగతిపాలు చేశారంటే, అది వ్యాసుడి దోషం కాదు కదా! శ్రీకృష్ణ బోధామృతంలో విషం కలిపి జాతి ప్రజలకు పంచిపెడుతున్నారు స్వాముల వార్లు. గుర్తించే జ్ఞానం ప్రజలకు లేదు మరి.

నా కథన ప్రణాళిక:

అట్టి వ్యాసుడి గురించి ఏమి వ్రాసినా, ఎంత వ్రాసినా అసమగ్రమే అవుతుంది. అందుకే ఈ నాటక రచనకు రెండు మూడు అంశాలను మాత్రమే తీసుకున్నాను. వ్యాసుడి పుట్టుక, అతడు భారత రాజ వంశాన్ని పునరుద్ధరించడం, వేదాలను విభజించడం, పురాణ రచన, భారత భాగవతాల నిర్మాణం, శ్రీశుకుడి పుట్టుక – వీటిని మాత్రమే ఈ రచనలో స్పృశించగలిగాను. సందర్భాలను అతకడానికి నేపథ్యం నుంచి ప్రయోక్త చేత కథ చెప్పించాను.

మొట్టమొదటిలో నా వుద్దేశ్యం మతంగుడి కథ వ్రాయాలని. అది కూడా ఒక మహా సముద్రమే. అందులో పడి ఈదసాగాను. కాని మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది.

అంట రానితనం ఏర్పడడానికి మూలపురుషుడు మతంగుడే. వెలి అంటరానితనంగా వెర్రి తలలు వేసినప్పుడు, ఆ తలలు కొన్ని స్వార్థపరుల కుల వ్యవస్థగా కుక్క మూతి పిందెలు కాయగా, మరికొన్ని వేద వ్యవస్థకే వేరుపురుగులై, వేద జాతినే నాశనం జేశాయి.

అదొక యుగ సంధి. యుగానంతర కల్లోల పరిస్థితి. దానిని అనేకులు అనేక విధాలుగా ఉపయోగించుకున్నారు. వేదాలను కల్తీ చేసి స్మృతులను సృష్టించి, వాటినే వేద ప్రతీకలుగా ప్రచారం జేసి, గుణ కర్మ ప్రధానమైన వర్ణ వ్యవస్థను కేవలం జన్మ ప్రధానమైన కుల వ్యవస్థగా మార్చి, విదేశీ పెత్తందార్లు జాతిని నిర్వీర్యం చేసిపారేశారు.

ఈ పెత్తందార్లు చారిత్రకంగా మొగలాయి తురుష్కులై వుండవచ్చునని కొందరనగా, యూదులై వుండవచ్చునని మరికొందరు అంటున్నారు. ఈనాడు ప్రచారంలో ఉన్న ఆధునిక మతాలకు సంబంధించిన కాలం కాదది. మూల వైదిక వ్యవస్థకు ప్రాణ ప్రతిష్ట చెయ్యటానికి ప్రయత్నించిన వ్యాసుడు తన భగవద్గీతలో ఆ విషయాన్ని ప్రస్తావించి వదిలేశాడు – ''చాతుర్వర్ణం మయా సృష్టం'' అంటూ. ఈ ఒక్క వాక్యాన్ని మాత్రమే గ్రహించి, ఆ తర్వాత ''గుణ కర్మ విభాగశ'' అనే ముఖ్య వాక్యాన్ని వదిలేసి, జాతిని అదే కాళ రాత్రిలో ముంచేసి వుంచేశారు మన సామాజిక గురువులు. ఇప్పటికీ అదే దుస్థితి.

ప్రజలకు తెలియదు, గురువులు నిజం చెప్పరు. ఈ దుస్థితిని తొలగించి వ్యాస సంస్కృతిని పునరుద్ధరించాలనేది నా ప్రయత్నమంతా.

అందుకు మతంగుడితో మొదలు పెట్టాలి కదా! మతంగుడు ధర్మ వ్యాధుడికి వియ్యంకుడు కనుక, అతడి కథను తీసుకొని ధర్మవ్యాధుడు నాటకాన్ని వ్రాసాను. దానికి జంటగా వుంటుందని వేదవ్యాసుడి జీవితంలోని కొన్ని ఘట్టాలను తీసుకొని ఇపుడీ నాటకాన్ని ప్రకటిస్తున్నాను.

ఈనాడు దళితులుగా పరిగణించబడుతున్న అంత్య కులాల మూలంలోకి వెళ్ళాలంటే అందుకు మూలపురుషులైన మతంగుడు (చండుడు), ధర్మవ్యాధుడు, కర్దముడు, అరుంధతి, వాల్మీకి, వీరబాహుడు, త్రిశంకుడు, అరుంధతి వంశం వాళ్లైన

శక్తి, పరాశరుడు, వేద వ్యాసుడు, అరుంధతి అక్కలైన అనసూయ మొదలైన వాళ్లు, తమ్ముడైన కపిల మహర్షి, ఆంజనేయుడు, సంగీతం కోసం మతంగుడికి కుమార్తెగా అవతరించిన మహాశక్తి మాతంగి వంటి మహావ్యక్తుల మూల చరిత్రలను పరిశీలించవలసి వుంటుంది.

అట్టి పరిశీలనా శక్తి బాధితులకు లేదు. బోధకులు చెప్పరు. విజాతీయుడైన మార్క్స్ ముల్లర్ పూనుకొని వుండకపోతే, ఈ మాత్రము పూర్వ చరిత్ర అయినా మన వరకూ వచ్చి వుండేది కాదు.

కనీసం ఈ నా రచనలు చదివి ఆలోచించగల విద్యావంతులు పుట్టుకవచ్చినప్పుడే నా ఆదర్శం నెరవేరుతుంది. జాతి పునరుద్ధరణలో నా పాత్ర కూడా అక్షయ మవుతుంది. ఈ రెండు నాటకాలతోపాటు ఇప్పుడే వెలువడిన నా ''పంచమ స్వరం'' కావ్యాన్ని కూడా చదవండి, గ్రహించండి.

శంఖారావం కావ్యం కూడా వస్తూ వుంది. ఎదురు చూడండి, ఎదురు చూడడమే చైతన్య లక్షణం కదా!

నా వంశ వృక్షం:

మతంగుడు (చండ దేవుడు)

జగన్మాత మాతంగి

మతంగుడు X ధర్మవ్యాధుడు

కర్దముడు ..... వాల్మీకి

అరుంధతి ... కపిలుడు

శక్తి ... అదృశ్యంతి

పరాశరుడు

వేదవ్యాసుడు

మహాభారత వంశం

నేను (నేటి మాల – మాదిగ)

నా వంశ వృక్షం – వివరణ:

1. మతంగుడు జన్మకుల వ్యవస్థ తొలి దశలలో రెండు కులాల తల్లిదండ్రులకు పుట్టిన వాడు. అందువల్ల వెలివేయబడిన వాడు. మొట్టమొదటి వర్ణ బాహ్యుడు. ఈనాటి అవర్ణులందరికి ఆద్యుడు.
2. సంగీత కళలో ఆద్యుడు అగ్రగణ్యుడు కనుక, అతని దగ్గర సంగీతం నేర్చుకోవడానికి జగన్మాతే కూతురై పుట్టింది. ఆమె మాతంగి. ఆమె కోసం తొలిసారిగా వీణను సృష్టించిన వాడు మతంగుడు. ఈనాటి వీణకు చాండాలిక అనే పేరుంది.
3. మతంగుడే తొలి చండాలుడు. సమాజంపై తిరుగుబాటు చేసిన విప్లవకారుడు. చండదేవుడు. సర్వ విద్యా సమగ్రమేధావి. రామాయణ కాలం నాటికి కిష్కింధలో ఋష్యమూక పర్వతం మీద స్థిరపడినవాడు. అదే మాలాద్రి. మాలకొండ.
4. గిరిజనుడైన ధర్మవ్యాధుడు తన కుమార్తెను మతంగుడి కుమారుడికిచ్చి వియ్యంకుడైనాడు. హరి నుంచి తన వంశం వాళ్ళు పారంపర్యంగా కవులు కావాలన్న వరం పొంది, హరిజనుడైనవాడు ధర్మవ్యాధుడు.
5. హరిజన, గిరిజన మైత్రికి మతంగ ధర్మ వ్యాధుల బంధుత్వమే అది.
6. మతంగ ధర్మవ్యాధుల బంధుత్వ కారణంగా విస్తరిల్లిన అవర్ణ ప్రజలలో గిరిజనులను అలా వుంచితే, హరిజనుల సంఖ్య దేశ మంతటా అశేషంగా పెరిగింది.
7. ఈనాడు ఆసేతు హిమాచలం మొత్తం దేశమంతటా విస్తరించి వున్న దళితులందరికీ మూల పురుషులు మతంగ ధర్మవ్యాధులే. అందులో మతంగుడి వంశ వృక్షం ఉన్నతోన్నతమైనట్టిది.
8. ఈ వంశంలోని వాళ్ళే ఎక్కువ మంది దేవ ఋషులు, ప్రజాపతులు, బ్రహ్మలు.
9. కర్దమ అనే మాటకు మాంసం, మురికి అనే అర్థాలున్నై. కర్దముడు అంటే మురికి వాడు, మాంసం తినేవాడు అని అర్థం.
10. కృతయుగం నాటి ఈ కర్దముడు సరస్వతీ నదీ తీరంలో విష్ణు నామ సంకీర్తనం

చేసుకొంటూ వుండేవాడు. ఇతని భార్య దేవహూతి. సంతానం తొమ్మిది మంది ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు. ఎనిమిదవ కూతురు అరుంధతి. పదవ వాడు కపిల మహర్షి. భక్తి జ్ఞానాదుల వల్ల కర్ధముడు బ్రహ్మ పదవిని పొందాడు.

11. మతంగుడి తరువాత అతని వంశ పరంపరలో కర్దముడు మరొక సుప్రసిద్ధుడు. తరువాత సుప్రసిద్ధుడు అదే పరంపరకు చెందిన వేద వ్యాసుడు.

12. జ్ఞానం స్థానంలో జన్మవచ్చి, వర్ణం స్థానంలో కులం వచ్చి కులాంతర సంతానం వర్ణ బాహ్యులైన తర్వాత, ఈ బహిష్కృత ప్రజావర్గంలోనే బ్రహ్మలూ, మేధావులూ, మహర్షులు పుట్టారనడానికి ఈ మహావ్యక్తులే నిదర్శనం.

13. అరుంధతికి సమకాలీనుడైన గిరిజనుడు వాల్మీకి. పుట్టుకతో హరిజనుడే, రామాయణ కర్త. ఈ చరిత్రను రామాయణంలో పేర్కొన్నవాడు.

14. అరుంధతికి అక్షమాల అనే పేరుంది. ఈ అక్షమాలలోని మాలే ఈనాటి మాల అయిందేమో! మతంగ నుంచి వచ్చిన పేరు మాదిగ కావచ్చు.

15. రుంధతి అంటే మురికిగా వుండేది అని అర్థం. తపస్సు ద్వారా అరుంధతి అయింది.

16. మాతంగి వేరు, అరుంధతి వేరు. మాతంగికి చండాలి అనే పేరు కూడా వుంది. ఆమె కోసం మతంగుడు నిర్మించిన వీణ చాండాలిక.

17. వశిష్టుడ్ని పెళ్ళాడిన అరుంధతికి సంతానం చాలా మంది. అందులో ముఖ్యుడు శక్తి మహర్షి. శక్తి భార్య మాల పిల్ల. అరుంధతి మేనకోడలు. పేరు అదృశ్యంతి. ఈమె కపిల మహర్షి కుమార్తె.

18. శక్తి, అదృశ్యంతిల కుమారుడు పరాశరుడు.

19. పరాశర సత్యవతుల కుమారుడు వ్యాసుడు.

20. వ్యాసుడి సంతానం ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు. భరత రాజవంశానికి వ్యాసుడు మూల పురుషుడు. ఈ పంచముల చరిత్రే పంచమ వేదం. మహాభారతం. వైదిక ధర్మ సమగ్ర చరిత్ర.

21. ధర్మ వ్యాధుడి వరాల ఫలితంగా వేదవ్యాసుడి వంశీకుడిగా పుట్టిన వాడ్ని నేను.

22. వ్యాస యుగ చతుష్కంగా పేర్కొనబడే నాలుగు యుగాల చరిత్ర నాది. ఈ నాలుగు యుగాల భారతీయ హైందవ ధర్మానికి ఆత్మ వ్యాసుడే. పరమాత్మ వ్యాసుడే. వ్యాస పరంగా వచ్చే యుగాన్ని పంచమ యుగం అంటున్నాము.

23. అందుకే నన్ను గురించి నేను వ్రాసుకున్నాను. అన్ని కులాల అందరి మేధావుల ప్రశంసలు పొందిన కవిత యిది....

"కృత యుగంలో ధర్మవ్యాధుడు బోయ
త్రేతా యుగంలో వాల్మీకి బోయ
ద్వాపర యుగంలో వ్యాసుడు బోయ
కలియుగంలో భీమన్న బోయ"

24. కృతయుగంలో మతంగ ధర్మవ్యాధులు హరిజన గిరిజన సమైక్యం మూలంగా పుట్టిన వంశవృక్షం నాది. శాఖోపశాఖలుగా పెరుగుతూ వచ్చిన ప్రధాన విభాగంలో సాహిత్య శాఖకు వాల్మీకి, వ్యాసుడు అఖండ జ్యోతులు. అదే వరుసలో ఒక చిన్న దీపాన్ని నేను.

25. ఒక పద్యంలో ఈ విషయం వివరించాను. "భీమన్న కావ్య కుసుమాలు" సంకలనంలో (1958) ఆ పద్యం ఉంది.

"వ్యాస వాల్మీకులే కవు లవని కెల్ల;
కడమ వారు వారల పాద కమల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధు వ్రతాలె;
అందు కడ పంక్తి నొక పసికందు నేను!"

కర్దముడి సంతాన వాహిని:

1. కర్దముడి భార్య దేవహూతి.

2. దేవహూతి స్వాయంభువ మనువు కుమార్తె. ఇతడు తొలి ప్రజాపతి.

3. దేవహూతీ కర్దములకు తొమ్మండుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడి పేరు కపిలుడు. ఇతడే విశ్వ వేదాంతంలో అగ్రశ్రేణి సాంఖ్య దర్శనానికి కర్త.

4. కుమార్తెలలో–

1. కళ: ఈమె మరీచి మహర్షి భార్య.
2. అనసూయ: అత్రి మహర్షి భార్య, త్రిమూర్తులను పసిపాపలుగా మార్చిన మహా పతివ్రత.
3. శ్రద్ధ: అంగీరసుని భార్య. ఆమె పుత్రికలు సినీవాలీ, కుహువు, రాక, అనుమతి. పుత్రులు – శల్యాం, ఇక్ష్వాకుడు, కవి మున్నగు వారు.
4. హవిర్భువు: పులస్త్యుని భార్య.
5. గతి: పులహుని భార్య. పంచజనుని తల్లి.
6. క్రియ: క్రతువు భార్య.
7. ఖ్యాతి: బృహువు భార్య. దేవ దానవ యుద్ధాలలో దానవులకు రక్షణ కల్పించి, విష్ణువు చేత చంపబడింది. గమనించండి.
8. అరుంధతి: వశిష్ఠుని భార్య. వేదవ్యాసుడి ముత్తవ్వ. మొదట్లో ''రుంధతి''గా వుండి, తర్వాత తపస్సు వల్ల ''అరుంధతి'' అయ్యింది. తండ్రి వలెనే ఈమె కూడా చిన్నప్పుడు మురికి మురికిగా వుండేదన్న మాట.
9. శాంతి: అధర్వుని భార్య.
10. కపిల మహర్షి.

ప్రతిభను పంచుకోవాలి:

కవితా, వనితా, లతా ఈ మూడు పరసహాయం లేకుండా వికసించలేవు. జీవితానికి ఆనందం కలిగించే త్రిమూర్తులలో నే నొకడిని. నేనంటే కవిత. సహజంగా లలిత కళలలో దేనికైనా, ముఖ్యంగా కవితకు పరసహాయం అవసరం. నాకూ అంతేకదా!

నా పంచమస్వరం కావ్యం ప్రమాథి సంవత్సరంలో ప్రకటించబడవలసినట్టిది. అప్పుడది సాధ్యం కాక, ధర్మవ్యాధుడు నాటకాన్ని ప్రకటించాను. ఈ విక్రమ నామ సంవత్సరంలో కూడ పంచమ స్వరానికి నవోదయం అవుతుందో లేదో అనే అనుమానం వచ్చి, వేదవ్యాసుడు నాటకాన్ని ప్రెస్‌లో ఇచ్చాను.

పంచమ స్వరం ప్రస్తావన వచ్చిన ముహూర్తం ఎలాంటిదో మరి. ముహూర్తాల మీద నాకు నమ్మకం లేదు. నమ్మకం వున్న వాళ్ళకు అది సెంటిమెంటు. సెంటిమెంటు బలంగా వుంటే అది జీవితం మీద ప్రభావం చూపక మానదు.

వేద వ్యాసుడు ప్రెస్‌లో ఇచ్చిన తర్వాత, అనుకోని విధంగా విజయనగరం నుంచి ఫోను వచ్చింది. విజయనగరం అంటే తెలుగు జాతి సకల విద్యలకు చిరకాలంగా కేంద్రం. అట్టి విజయనగరంలో విజయ భావన అగ్రశ్రేణిలో సాహిత్య సేవ చేస్తున్న ఒక ప్రధాన సంస్థ. దాని కార్యదర్శి డాక్టర్ అయ్యల సోమయాజుల గోపాలరావు. ఆయన ఫోను చేసాడు.

విక్రమ నామ సంవత్సర ఉగాది నాడు నాకు సన్మానం చేయడానికి తీర్మానించు కొన్నారట. తప్పకుండా రావాలని విజ్ఞప్తి.

విక్రమ ఉగాది నాడు, అంటే 5-4-2000 నాడు.

ఉత్తరాంధ్ర పర్యటన:

నేను కొన్ని సంవత్సరాలుగా ఇల్లు కదలడం లేదు. సిటీలోని ప్రోగ్రామ్‌లకు కూడ తరచు వెళ్ళడం లేదు. కారణం ఆసక్తి లేక, ఓపిక లేక. ముసలివాణ్ణి కదా! చివరి మెట్టు మీది శివుణ్ణి!

అయితే-

ఒక రోజున విజయనగరం నుంచి, విజయభావన సాహితీ సంస్థ నుంచి ఫోన్ వచ్చింది. ఆ సంస్థ సెక్రటరీ డా. ఆయ్యల సోమయాజుల గోపాలరావుగారు ఫోను చేశారు. ఏప్రియల్ 5వ తేదీన, విక్రమ ఉగాది నాడు విజయనగరంలో నాకు సన్మానం చేయడానికి తీర్మానించుకున్నారట. ఇద్దరకు రాకపోకలు. రసజ్ఞశేఖర కూరెళ్ళ వేంకటశాస్త్రి స్మారక పురస్కారం అందజేస్తారట తప్పక రావాలని వారి విజ్ఞప్తి.

విజయనగరంలో, విజయనగర పండిత వదాన్యుల సన్మానం ఒక గొప్ప అదృష్టం కదా! సరే అనేశాను. పోతే అక్కడే పోదాంలే అన్న ధీమా!

విజయభావన వారి సన్మానాలు, సత్కారాలు ఆ సాహితీ సమావేశాల వైభవాలు వర్ణనకు అందనివి. ఆ ప్రాంతాలకు ఎలాగూ వెళ్ళాను కాబట్టి గజపతి నగరంలో డా. మూర్తిగారి సాహితీ సన్మానం, విశాఖపట్టణంలో సాహితీ సాంస్కృతిక సంస్థల, సమాఖ్యల సన్మానాలు, ఆంధ్ర యూనివర్సిటీ వారి సన్మానం, కాపులుప్పాడలో అక్కడి సహ మిత్రుల ఆదరణ నిజంగా జన్మ ధన్యం అనిపించింది. నా వయసుగాని, అనాసక్తిగాని, శక్తి హీనతగాని ఆటంకం కాలేదు. అన్ని సమావేశాలలోనూ ఉత్సాహంగా పాల్గన్నాను. నాతోపాటు మా ఆవిడ హైమవతి ఉంది. మాకు సహాయంగా వచ్చిన ఆర్య సోమయాజుల సావిత్రిగారు, వారి బాబాయి దైవజ్ఞ సుబ్బారావు గారు కూడ మాతోనే ఉన్నారు.

అన్నిటి కంటే ప్రధానమైంది ఈ కార్యక్రమాలన్నిటికి పత్రికలలో ఇవ్వబడిన ప్రచార సరళి. అన్ని పత్రికల వారు కూడ అద్భుతమైన కవరేజి ఇచ్చారు. పెద్ద పెద్ద శీర్షికలతో నా ఉద్దేశాలన్నిటినీ ప్రజలకందజేశారు. వారందరికీ నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసి ఉంది.

ఇది ఒక గ్రంథానికి పీఠిక. ఇక్కడ వార్తా విలేఖనం కుదరదు. అయినా–

విజయ భావన సంస్థకు సంబంధించిన డా. గోపాల రావు, పి.వి.నరసింహరాజులు (బుచ్చిబాబు), ఏ.యల్.ప్రసాదరావు మున్నగు మిత్రులకు, డా. మూర్తి గారికి, విశాఖకు సంబంధించిన ఎమ్.వి.వి.యస్.మూర్తి (ఎం.పి.), డా. స్వామి, రాజ పాపయ్య (స్పందన), ఆచార్య ఆపదరావు, సి.హెచ్.శ్రీధర్ (ఆర్.డి.ఓ.), ఆర్.మల్లికార్జునరావు (జిల్లా సోషల్ వెల్‌ఫేర్ అధికారి), డా. జి. సుధాకర్ (అసిస్టెంటు ప్రొఫెసర్), కె.సురేశ్ ఆంధ్రయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాధాకృష్ణగారు, రిజిస్ట్రారు నాయుడుగారు ఇంకా ఎందరో – ఈ అందరికీ నేను ఎంతగానో కృతజ్ఞుడ్ని.

గోదావరి ఏ.సి.లో వెళ్ళిన మేము, రెండు పోష్టుపోన్‌మెంట్ల తరువాత, యూనివర్సిటీ వారి ఔదార్యంతో తిరిగి విమానంలో ఇల్లు చేరాము.

తొంబది యేండ్ల వాని కొక
ద్యోమణి రంభ నొసంగినారు! భ
వ్యంబు లనూహ్యముల్ విజయ
భావన లీలలు! చూతు నికనే
యంబుజ గర్భముల్ విరిసి
అంబర మంటునొ ప్రేమయాత్రలన్?
శంబుని కావ్య శేష నర
సం బకటైనను చాలు దక్కినన్!

విజయ భావన వారు నాకిచ్చిన బిరుదుకు నా స్పందన. బిరుదు రంభ. శంభుని కావ్యశేషమంటే శంకరాచార్యుని చేతిలో నుంచి నందీశ్వరుడు లాగేసుకున్న సౌందర్యలహరి కావ్యభాగం.

ఇంకా:

జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు నాకు అపర భోజరాజు. జాతీయ స్థాయిలో ఎన్నో అధునాతన బాధ్యతలను నిర్వహిస్తూ తీరికలేని తొందరలలో మునిగి వున్నప్పటికీ, నిరంతరం నన్ను పలుకరిస్తూ, నా మంచి చెడ్డలను గురించి పరామర్శిస్తూ వుండే ఆప్త మిత్రుడాయన.

నా సాహిత్య కృషిలో, ముఖ్యంగా ఈ గ్రంథానికి సంబంధించిన ఎన్నో సలహా సహాయాలు అందించిన వాళ్లు మా అమ్మాయిలు విజయపల్లవి, విజయేందిరలు, మా ఆవిడ హైమవతి. నా శక్తి సామర్థ్యాలన్నిటికి బాధ్యులైన ఈ అందరికీ కృతజ్ఞతలేం చెపుతాం?

ఇకనాకు ''ఊహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్'' కొందరున్నారు. అందులో ముఖ్యులు బంకా సుధాకరరావుగారు ఒకరు. ఆయన రిటైరైన ఐఏఎస్ అధికారి.

నిర్దుష్టమైన భాష, నిర్దిష్టమైన భావాలు కల మేధావి. మరొకరు రత్నరాజు. ఈయన సిండికేట్ బ్యాంకులో అధికారి. నిరంతరంగా ఆధునిక సమస్యలపై ఆలోచనలుసాగించే భాషా కృషీవలుడాయన.

ఈ గ్రంథాన్ని ముద్రించిన రవిచంద్ర ఒక మంచి కళాకారుడు. నా కవితా కృషిపట్ల గొప్ప అభిమానమున్నవాడు. వీరితోబాటు నా ఆరోగ్యంపట్ల శ్రద్ధవహించి తగు సలహాలిస్తుండే డాక్టర్ రమేష్, డాక్టర్ రూతేంజిల్, మెడికో సుశీల్, అడ్వకేట్ గొల్లమందల రమేష్, సుమిత్ర పంపన వంటి వారందరికీ కృతజ్ఞతలు.

సిగ్గుమాలిన వర్ణ బాహ్యత:

హిందూ సమాజంలోని అస్పృశ్యతను గూర్చి ఎంతైనా చెప్పవచ్చు. ఎంత పరిశోధన అయినా చేయవచ్చు. అస్పృశ్యత ఎలా పుట్టింది? ఎప్పుడు పుట్టింది? అనే విషయంలో అనేకమంది మేధావులు తలక విధంగానూ చెప్పారు. అసంగతమైన వాదనలు కూడా చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. దళితులలోని ప్రతిభా ప్రాభవాలను అణగద్రొక్కివేస్తున్నారు. వీటివల్ల ఫలితం ఏమిటి?

నేను కూడా పదే పదే చెబుతూ వచ్చాను. మతంగుడు, అరుంధతి, వాల్మీకి, వేద వ్యాసుడు, కురు పాండవులు, ఈ పారంపర్యాన్ని వర్ణ బాహ్య మూల జనులుగా అభివర్ణిస్తూ ఎన్నో కావ్యాలు వ్రాశాను.

వర్ణాలు మొదట్లో వృత్తి పరమైనట్టివి కదా? వ్యక్తులు తమ తమ శక్తి సామర్థ్యాలను బట్టి వృత్తులను మార్చుకోవచ్చు కదా? అంటే ఆనాడు వర్ణాలు ప్రతిభను బట్టి మారుతూ వచ్చేవన్నమాట! అందుకే ఆనాటి వ్యవస్థను జ్ఞాన వ్యవస్థ అన్నాను.

వర్ణ బాహ్యుడుగా వెలివేయబడిన మొదటి వ్యక్తి మతంగుడు అస్పృశ్యుడు కాడు. ఈనాడు దళితులమని చెప్పుకుంటున్న హరిజనులు ఆనాడు వర్ణ బాహ్యులైనా అస్పృశ్యులు కాదు. హరిశ్చంద్రుని కాలం నాటి వీరబాహుడు, రంతి దేవుడి కాలంలోని పుల్కసుడు మొదలైన వాళ్ళు తరువాతి వేదవ్యాసుడి వరకు వర్ణబాహ్యులు అస్పృశ్యులు కారు. వర్ణ బాహ్యత వేరు, అస్పృశ్యత వేరు. వర్ణ బాహ్యత వెలి. అస్పృశ్యత పారిశుద్ధ్య సంబంధి.

అంకితం గురించి:

నాకు వున్నా లేక పోయినా, నా కావ్యాలకూ, పీఠికలకూ, అంకితాలకు ఒక ఉజ్వలమైన చరిత్ర వుంది. కూలిరాజు నాటకాన్ని అప్పటి హరిజన మంత్రి వేముల కూర్మయ్యగార్కి అంకితమివ్వగా, పాలేరు నాటకాన్ని అప్పటి అగ్రశ్రేణి హరిజన నాయకుడైన కోనాడ సూర్యప్రకాశ రావుగారికి అంకితమిచ్చాను. అవి జంట నాటకాలు. నా నాటకాలు, కావ్యాలు చాల వరకు జంటలుగానే వుంటున్నై.

ఇపుడు ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు ఇవి జంట నాటకాలు. ధర్మవ్యాధుడు నాటకాన్ని ఒక మహిళకు అంకితమిచ్చాను. ఆవిడ అగ్రశ్రేణి రచయిత వాసిరెడ్డి సీతాదేవి గారు. ఇపుడీ వేదవ్యాసుడు నాటకాన్ని మరొక మహిళకు అంకిత మివ్వాలనేది నా ఆకాంక్ష. అందుకు ఎక్కువగా వెదకవలసిన అవసరం కూడా లేకపోయింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకరు కావలి ప్రతిభా భారతిగారు స్పష్టంగా, సార్వకాలిక సుప్రభాతం వలె ప్రకాశిస్తూ కనిపిస్తున్నది. ఆవిడకు ఈ వేదవ్యాసుడు రచనను సమర్పించుకుంటున్నాను.

కావలి ప్రతిభా భారతి అంటే జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారి కుమార్తె. అంటే ఇక చెప్పేదేముంది. ఉదయ సూర్యుణ్ణి చూపుతూ, సూర్య నమస్కారాలు చేయవలసిందే తప్ప, ఆలోచనకు తావెక్కడిది?

జాతీయోద్యమంలో, స్వాతంత్ర్య సమరాంగణంలో పున్నయ్యగారిది అగ్రశ్రేణి చరిత్ర. హరిజనోద్ధరణ కృషీ క్షేత్రంలో విద్యార్థి నాయకుడుగా ఉత్తరాంధ్రలో ప్రధాన పాత్ర వహించిన నాటి నుంచి, న్యాయవాదిగా, ఆంధ్ర యూనివర్శిటీ సెనేటు సభ్యుడిగా, రాష్ట్ర కాంగ్రెసు కార్యనిర్వహకుడుగా, శాసన సభ్యుడుగా, జిల్లా జడ్జిగా, హైకోర్టు న్యాయమూర్తిగా ప్రసిద్ధు డయినవాడు ఆయన. హరిజన సంక్షేమానికి అగ్రశ్రేణి నేత ఆయన. ప్రస్తుతం దళిత జనం మీద సవర్ణ దొరల అత్యాచారాలను గురించి పరిశోధించి, నివేదించడం కోసం ప్రభుత్వంచే ఏక సభ్య కమిషన్‌గా నియమించబడ్డారు. కేంద్ర ప్రభుత్వం వారి రాజ్యాంగ సమీక్షా సంఘంలో ప్రధాన సభ్యుడు.

అట్టి మహా వ్యక్తి కుమార్తె ప్రతిభా భారతి. కావలి కృష్ణప్రసాద్‌గారి సతీమణి. గ్రీష్మ, అభిషేక్‌ల మాతృదేవి.

ఉన్నత విద్యావతిగా విద్యార్థి నాయకురాలిగా ప్రతిభా ప్రాభవాలను ప్రదర్శించి, తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకురాలై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నుకోబడ్డారు. జాతిమణి ఆమె. అప్పటి నుంచి అవిచ్ఛిన్నంగా ఎన్నుకోబడుతూ, చాలా కాలం మంత్రిగా వుండి, ప్రస్తుతం శాసన సభకే స్పీకరు హోదాను చేపట్టి ప్రచండ శక్తితో కార్యనిర్వహణ సాగిస్తున్న చైతన్య భారతి ఆమె. నా కావ్య స్వీకర్తిగా ఆవిడను ఏక పక్షంగా నిర్ణయించుకున్నాను నేను. కృతి సమర్పణ చేస్తున్నాను.

ఇప్పుడు జరుగుతున్న వ్యాస యుగచతుష్కంలోని భారతీయ సాంఘికవ్యవస్థలో ఒక శాఖ యొక్క చరిత్ర ఇది. ఈ చరిత్రనే పంచమ యుగం అంటున్నాను.

సమగ్ర ప్రార్థన:

ఆంగికం భువనం యస్య
వాచికం సర్వ వాఙ్మయం
ఆహార్యం చంద్ర తారాది
తం వందే సాత్వికం శివం.

నా విజయనగర యాత్రలో ప్రతి సభలోను నా ప్రసంగాన్ని ఇదే శ్లోకంతో ప్రారంభిం చాను నేను.

శివుడంటే విశ్రాంతి స్థానం, సమాధి స్థితి, పరబ్రహ్మ. సచ్చిదానంద ధామద్వారం శివ శబ్దం. సర్వ ప్రపంచానికీ, సర్వజాతులకూ, సర్వ మతాల ప్రజలకు పనికి వచ్చే ఏకైక సర్వ సమగ్ర వైజ్ఞానిక ఆధ్యాత్మిక ప్రార్థన శ్లోకం ఇది.

నేటి హైందవ సమాజం వైదిక జ్ఞాన సమాజంగా వుండిన ప్రాచీనకాలంలో, సుమారుగా కళావాఙ్మయాలు ఆవిర్భవించిన ఆదికాలంలో పుట్టిన ఏకేశ్వర భావం ఇది. ఇంతటి సమగ్ర సుందరమైన శ్లోకం ఈనాడు దాని జన్మస్థలంలోనే ఉపేక్షించబడిందంటే, కేవలం నాట్యరంగానికి మాత్రమే పరిమితమై పోయిందంటే ఏమనాలి? లోపం ఎక్కడుందనాలి? మానవ సమాజం పురోగమిస్తున్నదనాలా, శిథిలమైపోతున్నదనాలా?

శిధిలమై పోతుండడం స్పష్టంగానే కనిపిస్తున్నది. ఈ పాతివ్యానికి కారణం ఆధ్యాత్మిక తత్వాన్ని రాజకీయం చేసి స్వార్థానికి ఉపయోగించుకోవడం మొదలుపెట్టిన వివిధ మతాలు, వివిధ సామాజిక వ్యవస్థల ఆచారాలూను.

జీవిత పురోగమనం ఆయా వ్యక్తుల చేతుల్లో లేకపోవడం వలన, దైవ స్వరూపం ఎవరికీ తెలియకపోవడం వలన, సామాన్య జనానికి ఆధ్యాత్మిక తత్వాలోచనలకు తీరిక లేకపోవడం వలన ఎవరో కొందరు డాంబికులు చెప్పిన మాటలనే నమ్మడం తప్పదు. వివిధ బుద్ధి జీవుల స్వప్రయోజక ప్రవచనాలను నమ్మిన వివిధ జాతులు (దేశాలు) ప్రజలు సన్నిహితులయ్యే కొలదీ పరస్పరం ఘర్షించుకోవడం మొదలు పెట్టివైరమతాలుగా శత్రు జాతులుగా తయారయ్యారు. ఈ శత్రు సమరక్షేతంలో బలవంతులు విజృంభించగా శాంతి కాముకులు ఓడిపోతూ బానిసలైనారు, కొన్ని వర్గాలు (జాతులు) నశించి పోయాయి కూడా. నశించిపోక పోయినా, బానిసలైపోయిన జాతులలో హైందవ జాతి ఒకటి.

''కృణ్వంతో విశ్వమార్యం'', ప్రపంచాన్ని ఆర్య (వ్యవసాయ) జాతిగా మార్చండి అని ప్రబోధించిన ఋగ్వేదాన్ని అలక్ష్యం చేసి. ''సమానమస్తు వో మనో'', మానవులారా సమానులై జీవించండి అనే వేద ప్రవచనాన్ని ప్రక్కకు నెట్టిన జాతి, ''అహం బ్రహ్మాస్మి'' అన్న సార్వకాలిక ధర్మాన్ని తిరస్కరించిన జాతి, ''ఆంగికం భువనం యస్య'' అన్న ఉత్తమోత్తమ ప్రార్థనను విస్మరించిన జాతి, ''సర్వ ధర్మాన్ పరిత్యజ్య'' అన్న భగవద్గీతనే తప్పుదారి పట్టించిన జాతి పతనం కాక మరి ఏమవుతుంది?

జ్ఞాన ప్రధానమైన వర్ణ (వృత్తి) వ్యవస్థ జన్మ ప్రధానమైన కఠిన కుల వ్యవస్థగా, వైదిక సోషలిస్టు సామాజికవ్యవస్థ దుష్టస్వార్థ స్వప్రయోజక వర్ణవ్యవస్థగా ఎలా మారింది? ఎందుకు మారింది? ఎవరు మార్చారు? ఈ ప్రశ్నలకు జవాబేమిటి? ఆలోచిస్తున్నారా?

కుల వ్యవస్థ పోవడానికి అగ్ర కులాల వాళ్లు అంగీకరించరు. పీడిత కులాల వాళ్లకు ప్రశ్నించే జ్ఞానాన్ని కాని, తిరగబడే శక్తిని కాని కలగచేయరు. ఏమిటి దీనికి పరిష్కారం? ఆధునిక రచయితలు కూడా వేద వ్యాసుడ్ని గురించి చెపుతున్నప్పుడు వశిష్టుడి ముని మనుమడు అంటున్నారే తప్ప, అరుంధతి పేరైనా ఎత్తడం లేదే!

మతంగుడు, ధర్మ వ్యాధుడు దగ్గర నుంచి వాల్మీకి, అరుంధతి, పరాశరుడు, కృష్ణ ద్వైపాయనుడు, కర్దముడు, కపిల మహర్షి, నారదుడు తుదకు కాళిదాసు వరకూ కూడా నిమ్న కులాలకు చెందిన వాళ్ళే అనే సత్యాన్ని ప్రకటించడం లేదే! ఎందుకు ప్రకటించడం లేదు? వాస్తవాలను ఎందుకు దాచిపెడుతున్నారు?

నా జవాబు ఒక్కటే! అట్టి రచయితలందరూ స్వప్రయోజనాలను వదులుకోలేని దొరల సంతతికి చెందిన వాళ్ళు కనుక.

రిజర్వేషనులు పత్యం మెతుకులు:

దళిత జనుల అభివృద్ధి కొరకు పోరాడిన డాక్టర్ అంబేద్కర్ సైతం సాంఘిక న్యాయ సాధనకు రిజర్వేషనులు ఒక్కటే మార్గం కాదన్నాడు. బౌద్ధులు కూడా హిందు మతస్తులే అంటూ పేర్కొన్న ఆయన, తాను హిందూమతం నుంచి బౌద్ధ మతంలోకి మారాడు. అది రాజకీయం. ఆధునిక భారతీయ సమాజంలో అది కేవలం బెదిరింపు.

అంత మాత్రం చేతనే దళిత జనోద్ధరణ జరగదని ఆయనకు బాగా తెలుసు. ఇందుకు అనేక మార్గాలు సూచించాడు. స్టేట్ సోషలిజం అన్నాడు. అయినా, వ్యాధి నిజ నిర్ధారణ జరగలేదు, వేరు పురుగును ఎవరూ పట్టలేదు. శాశ్వత పరిష్కారం పై వర్గాలకు తెలిసినా, అందుకు వారు పూనుకోరు. పూనుకోగల దళిత వర్గాలకు అంతటి తెలివి లేదు, ఉన్నవాళ్లు బలవంతులు కాదు.

నేటి భారతీయ (హైందవ) సమస్యలన్నిటికీ మూల పరిష్కారం నేను చెపుతున్నాను. పౌరాణిక వస్తువును ఆధారంగా తీసుకొని నేను వ్రాసిన నాటకాలన్నీ దళిత జనుల మూల బలం ఏమిటో ఎత్తి చూపేవే. వీళ్లను బలవంతులను చేసేవే.

ధర్మవ్యాధుడు నాటకం మతంగుడితో ముడిపడి వుంది. ఈ ఇద్దరిలో ధర్మవ్యాధుడు ఎస్.టి., మతంగుడు ఎస్.సి... ఈ వేదవ్యాసుడు నాటకం అరుంధతి, మత్యగంధి, కృష్ణ ద్వైపాయనులతో ముడిపడి వుంది. ఇందులో అరుంధతి ఎస్.సి., మత్స్యగంధి బి.సి., వ్యాసుడు ఎస్.సి.

మొత్తం మీద ఈ జంట నాటకాలు ఎస్టీ, ఎస్సీ, బిసీ వర్గాల మూలాన్ని ప్రకటిస్తున్నట్టివి.

ఇందులో ధర్మవ్యాధుడు నాటకాన్ని ఒక అగ్రస్థాయి రచయిత్రికి వాసిరెడ్డి సీతాదేవిగారికి అంకిత మిచ్చాను. ఈ వేద వ్యాసుడు నాటకాన్ని ఒక అగ్రస్థాయి ప్రజాధినేత్రికి కావలి ప్రతిభా భారతిగారికి అంకిత మిస్తున్నాను.

పాలేరు, కూలిరాజు నాటకాల వలెనే ధర్మవ్యాధుడు, వేద వ్యాసుడు నాటకాలు సర్వజన పురోగమన సముద్బోధకాలు. సర్వేజన సుఖినోభవంతులు. భారత జాతి సమైక్యతకు, సర్వతోముఖ వికాసానికి సర్వార్థ సాధకాలు.

తుది మాట:

చివరిగా నేను చెపుతున్నదేమిటంటే–

1. వేదకాలం నాటి ఆర్య మతం జ్ఞాన ప్రధానమైనట్టిది. దేవ రాక్షస గణాల మధ్య జరిగిన యుద్ధాలు ముగియడంతో ఈ జ్ఞానమతంకూడా శిథిలమై అంత మయ్యింది.
2. ఆ తర్వాత పునరుద్ధరించబడిన హిందూమతం జన్మ ప్రధానమైనట్టిది. నాటిది వర్ణ వ్యవస్థ కాదు, కుల వ్యవస్థ.
3. ఆనాటి జ్ఞాన వ్యవస్థకు పుట్టుకతో సంబంధం లేదు. వ్యాసాదులతో సహా వేద ఋషు లందరూ ఎక్కడెక్కడో పుట్టి బ్రహ్మజ్ఞానులైన వాళ్ళే.
4. ఈనాటి కుల వ్యవస్థలో జన్మకే ప్రాధాన్యం. పుట్టుకకే గుర్తింపు. జ్ఞానానికి కాదు. అగ్ర నాయక దౌష్ట్యానికి, మానవతా ఔన్నత్యానికి, ఈ వ్యవస్థ అతి నికృష్ట స్థాయి.
5. కనుక ఇప్పుడు నా ప్రతిపాదన ఏమిటంటే ''తిరిగి వేద వ్యవస్థలోకి వెళదాం'' అనేది. Go back to veda's అనేది చిరకాలంగా నా నినాదం.
6. వేద కాలపు సామాజిక వ్యవస్థ ''సమానమస్తు వో మనో'' అనే సూత్రం ప్రాతిపదిక అయినట్టిది. అది స్వచ్ఛమైన సోషలిస్టు వ్యవస్థ. శక్తినిబట్టి పని, అవసరాన్ని బట్టి ఆహారం.
7. దీనినే నేను ''జాతీయ సోషలిజం'' అంటున్నాను.

8. ఆర్య మంగోలు మిశ్రమ జాతి తురుష్కులు ఇస్లాం మతం స్వీకరించి, మతాన్ని కత్తితో ముందుకు నడిపించే ఉద్యమాన్ని చేపట్టి, భారత్‌ను చావగొట్టి ఆక్రమించుకున్నారు.

క్రీస్తు శకం 700 సంవత్సరం నాటికి ఆఫ్ఘనిస్తాన్ భారత్‌లో భాగంగా ఉండేది. ఆఫ్ఘని స్థానం, కాశ్మీరు చిరకాలంగా క్షతియ రాజుల పాలనలో ఉండేవి.

9. అరబ్బులు సింధును, గజనీ తురుష్కులు పంజాబును, గోరీ, బాబరీ తురుష్కులు మిగిలిన భారత్‌ను ఎలా జయించగలిగారు?

దేశంలో ఆనాటి పరిస్థితే ఈనాడు కూడా లేదా? దీనిని సరిదిద్దవలసిన బాధ్యత మనకు లేదా!

10. The Turkish conquest gave a rude shock to the caste system and the idea of physical pollution among the people of India. The result was that those people of India who suffered under the caste system, became the supporters of the new rulers (Muslims). *(Vidyadhar Mahajan, "HISTORY OF INDIA". Page : 85)*

11. భారతీయ సమాజంపై చరిత్ర చేస్తున్న ఈ నిందకు ఏమిటి జవాబు. జవాబు ఒక్కటే నా కులం మార్పిడి చట్టం.

తస్మాత్, ఉత్తిష్ఠ! ఉత్తిష్ఠ!!

-భీమన్న

❀ ❀ ❀

రాగవైశాఖి

శృంగార లేఖాకావ్యం

రాగవీచిక

''ప్రింటింగుకు ఒక పదిహేను వందలు ఖర్చయ్యే పుస్తకం ఏదైనా ప్రెస్సులో ఇచ్చేయండి!''

ఇది బాపురెడ్డిగారి లేఖ – విశాఖ నుంచి.

లేఖ చూసుకొన్న వెంటనే రాగవైశాఖి వ్రాత ప్రతిని ప్రెస్సులో ఇచ్చేశాను – పదిహేను వందలలో కాదని తెలిసినా, అదనంగా ఎంతైతే అంత సొంతం పెట్టుకొందామన్న ధీమాతో.

''సొంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి తోడుపడవోయ్!'' అన్న గురజాడ మహాకవి నిర్దేశానికి సాక్షాత్తు ప్రత్యక్ష నిదర్శనం బాపురెడ్డి. తానూ కవే. తన కావ్యాన్ని ప్రింటు చేద్దామన్న పట్టాభిరామరెడ్డి గారితో భీమన్న గారి కావ్యమేదైనా ప్రింటు చేద్దాం అని చెప్పి, ఒప్పించి నాకు లేఖ వ్రాశాడు బాపురెడ్డి.

కోటు పట్టాభిరామ రెడ్డి విశాఖలో ఇంజనీరు కాంట్రాక్టరు. బాపురెడ్డికి మిత్రుడు. బాపురెడ్డి లాగే ఉదార చరిత్రుడు. ఉన్నంతలో పొరుగు వాళ్ళకు, ముఖ్యంగా మిత్రులకు, తోడ్పడడమే జీవిత లక్ష్యంగా కలవాడు.

ఆ విధంగా ప్రింటయిన ప్రణయ కావ్యం రాగవైశాఖి. ఇందుకు సంబంధించిన వివరాలు నా జీవిత చరిత్రలో చూడవచ్చు.

రాగవైశాఖి ఒక ప్రణయ లేఖా కావ్యం. అక్కడక్కడ పద్యాలూ గేయాలూతో కూడిన వచన కావ్యం. ఇది కోటు పట్టాభిరామరెడ్డిగారికే అంకితం చేశాను.

"He got something to give us" అన్నారట పట్టాభి రామరెడ్డి గారు బాపురెడ్డితో – ఈ కావ్యం చదివిన తరువాత.

పట్టాభిరామరెడ్డి గారిని గురించీ, ఆయన వంశ విశిష్టతను గురించీ, నెల్లూరు

జిల్లాలోని ఆయన స్వస్థలమైన సంగం గురించీ ''కావ్య కల్యాణం'' అనే శీర్షిక క్రింద అంకిత చరిత్రలో వర్ణించడం జరిగింది.

ప్రణయ లేఖల సంపుటి

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వాళ్ళు ఏదో ఒక సందర్భంలో కలుసుకున్నప్పుడు, ఒకళ్ళపట్ల ఒకళ్ళకు ఇష్టత ఏర్పడింది. అప్పటి నుంచీ తరచు కలుసుకొనేవాళ్ళు. ఇష్టత ప్రణయంగా వికసించింది. వాళ్ళు తరచు కలుసుకొంటూ వున్నప్పటికీ, ఒకరికొకరు లేఖలు కూడా వ్రాసుకొనేవాళ్ళు. అవి ఎన్నో జీవిత విషయాలపై చర్చలుగా వుండేవి. ఆ లేఖల సముదాయమే ఈ కావ్యం. అందుకే దీనిని శృంగార లేఖా కావ్యం అన్నాను. ప్రణయ సౌందర్యాల విన్యాసమే శృంగారం కదా!

కళను కళగానే చూడాలి. దానికి వైయక్తిక రాగ ద్వేషాలను ఆపాదించకూడదు. వైయక్తికత వుండదని కాదు – అది విశ్వజనీనంగా వుంటుంది.

రాగవైశాఖిని నేను ప్రారంభించింది 1960లో. తరువాత కొన్ని అసూయలూ, అపోహలూ వల్ల దాని వ్రాత ప్రతి ఒకసారి పోతే మళ్ళీ వ్రాయడం, రెండోసారి పోతే కూడ మళ్ళీ వ్రాయడం జరిగింది. మూడోసారి పోకుండా జాగ్రత్తపడి బెంగుళూరు వెళ్ళి, అక్కడి లాల్ బాగ్ గార్డెన్స్‌లో ఒక నెల రోజులపాటు కూర్చుని, పూర్తిచేయడం జరిగింది దీన్ని.

అప్పటి నుంచీ ఈ కావ్యం వ్రాతప్రతిలోనే ఎంతోమంది మిత్రులుచదివారు. ప్రశంసించారు. ముద్రించుమంటూ తొందర చేశారు. 1965లో బాపురెడ్డిగారి లేఖ అందే నాటికి ఉన్న పరిస్థితి అది.

ఈలోగా ఈ కావ్యం వ్రాతప్రతికి సోదరి లలిత కొన్ని నకళ్ళు తీసిపెట్టింది. వాటిని జాగ్రత్తగా భద్రపరచడం కూడా జరిగింది. నా కావ్యాలు చాలా వాటికి లలితే నకళ్ళు తీసి పెడుతూ వుండేది.

దీనితోపాటు అదే కాలంలో ప్రారంభించి వ్రాసిన ''అనాది కొస నుంచి

అనంతత్వంలోకి'' వచన కవితా సంపుటి అప్పటికే ముద్రించబడింది. ''ఆత్మా, శరీరమా'' (క్షీరసాగరం) అన్న ఒక మహా నవల ఈనాటికీ ముద్రణ కాలేదు. ''శివాలకలు'' వచన కవితల సంపుటి మరొకటి. ఈ నాలుగు గ్రంథాలకూ మూలతత్వం ఒకటే – ప్రేమ, రసాద్వైతం.

ప్రశస్తీ, ప్రతికూలతా

రాగవైశాఖి ముద్రణ జరిగి, గ్రంథావిష్కరణ, అంకితోత్సవం సభ నిర్వహించబడినప్పుడు భాగ్యనగరంలోని మహా కవులూ, విద్వాంసులూ, మంత్రులూ ఎందరో మహనీయులు గ్రంథాన్ని వేనోళ్ళ కీర్తించారు. ప్రపంచ సాహిత్యంలోనే ఈ నవ కావ్యం ఉత్తమోత్తమ మైనట్టిదన్నారు. జాతీయ అంతర్జాతీయ అవార్డులెన్నో రమణీయమైన ఈ సాహిత్యానికి రావలసి వున్నాయన్నారు.

అయితే, సభలో ఆసీనులై వున్న యువ మిత్రులలో కొందరు అసూయతో రగిలి పోయి, ఆ మర్నాటి నుంచే గ్రంథాన్ని అనేక విధాల దుయ్యబడుతూ పత్రికల కెక్కారు. గ్రంథాన్ని నిషేధించాలన్నారు. గ్రంథకర్తను అరెస్టుచెయ్యాలన్నారు. అసెంబ్లీలోనూ, కౌన్సిలు లోనూ విమర్శోపన్యాసాలు చేయించారు. 'భారతి' వంటి సాహిత్య పత్రికలలో ఖండన సమీక్షలు వ్రాయించారు. సుమారు రెండు సంవత్సరాలపాటు సాగింది ఈ దుమారం, ఈ సాహితీ విప్లవం.

రాగవైశాఖి గ్రంథాన్ని తాము ప్రత్యేకంగా పండితుల చేత పరిశీలింపచేశామనీ, అందులో శృంగారం ఉన్నప్పటికీ తాత్విక చింతనా, సామాజిక స్పృహా చాలా ఎక్కువగా వున్నాయనీ, ఇది అనేక సమస్యలపై ప్రజలకు కనువిప్పు కలిగించేదిగా వున్నదనీ, కనుక నిషేధించవలసిన అవసరం లేదని ఆయా పండితులు అభిప్రాయాలు వెలిబుచ్చారంటూ అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు అసెంబ్లీలో ఒక ప్రకటన చేశారు. ఆ మర్నాటి నుంచీ బ్రహ్మానందరెడ్డిగారినే విమర్శిస్తూ పత్రికలలో వ్రాతలు వచ్చాయి.

'అభిసారిక' సంపాదకుడు రాంషా, డి.ఆర్.కుసుమ, గిడుగు రామమూర్తి మొదలైన సాహితీ దర్శకులు రాగవైశాఖి మహోత్తమమైన రసవత్కావ్యమంటూ తిరగబడి వ్రాసేవరకూ ఆ దుమారం అలానే కొనసాగింది. ఆ తర్వాత విమర్శలు తగ్గిపోతూ, ప్రశంసలు పెచ్చరిల్లుతూ, రాగ వైశాఖికి సాహిత్య దర్శనాలలో ఒక రసాద్వైత శాశ్వత స్థానం సమకూరింది.

అయితే, గ్రంథం నిషేధింపబడగలదేమోనన్న భయం కారణంగా ముద్రిత ప్రతులు ఎవరెవరి చేతుల్లోనో పడి అదృశ్యమైపోయాయి. తుదకు నా సొంతానికి ఒక ప్రతిగూడ లేకపోయింది. మా చెల్లెలు ద్రౌపదికిచ్చిన ప్రతిని తెప్పించుకొని, ఇప్పుడు అదే ప్రతిని పునర్ముద్రణ కోసం ప్రెస్సులో ఇచ్చాను. ఇరవై ఎనిమిది సంవత్సరాల తర్వాత.

ఈలోగా–

విద్వాంసుల అభిప్రాయాలు

"అద్భుతమైన, అపూర్వమైన రచన." "Raga Vysakhi is the book of the decade. I feel like that" అంటూ ఒక లేఖలో పేర్కొన్నారు డా. బెజవాడ గోపాలరెడ్డిగారు.

"భీమన్న సమగ్ర జీవిత తత్వాన్ని ప్రతిబింబించే రసాద్వైత దర్పణం ఈ మహాకావ్యం" అంటూ ఆనాడు తనకిచ్చిన ప్రతి చివరి పేజీలో వ్రాసుకొన్నారు మహాకవి బాపురెడ్డిగారు.

సమకాలీన అగ్రశ్రేణి సాహితీ మహిళా రత్నాలు ఇద్దరు రాగ వైశాఖిని మెచ్చుకొన్నారు. ఆ ఇద్దరూ తెన్నేటి హేమలత, వాసిరెడ్డి సీతాదేవిగార్లు.

"రాగ వైశాఖి చదివారా? అది సర్వకాల, సర్వదేశ సుందర సాహిత్య సారం" అంటూ సహజ కవి మల్లెమాల (సుందర రామరెడ్డి) గారు తమ వద్దకు వచ్చే ప్రతి సహృదయుడికీ చెప్తారు. ప్రతి సభలోనూ రాగవైశాఖి పేరు స్మరిస్తారు.

"పరమజ్ఞతకు పరాకాష్ఠ రాగవైశాఖి" అంటూ పేర్కొన్నారు ఉస్మానియా యూని

వర్సిటీ తెలుగు శాఖాధిపతి వేటూరి ఆనందమూర్తిగారు – ''యువభారతి'' వారు ప్రతినెలా రెండవ శనివారం నిర్వహించే సాహితీ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, రాగవైశాఖిపై ప్రత్యేకంగా జరిగిన సదస్సు అది, 1990 అక్టోబరులో, రాగవైశాఖి శృంగారంలో సున్నిత భావనలే కానీ పచ్చిదనంలేదన్నారు ఆనందమూర్తిగారు.

''భీమన్న రస సిద్ధుడు. అతడి జోలికి వెళ్ళకండి!'' అన్నారట కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు – తన శిష్యులతో, సదరు కాంట్రవర్సీలో తమ పాత్ర ఎలా వుండాలని అడిగినప్పుడు.

ఈ విధంగా రాగవైశాఖి గురించి జరిగిన వాదోపవాదాలలో ఉదాహరించదగిన వాక్యాలు, వ్యాఖ్యలు అసంఖ్యాకంగా వున్నై. వీటన్నిటినీ ఇక్కడ పేర్కొంటే అది మళ్ళీ మరొక మహాకావ్యం అవుతుంది.

''రాగవైశాఖి – ఒక పరిశీలన'' అంటూ శ్రీమతి డి.సరోజినిగారు ఒక పరిశోధక థీసిస్ వ్రాసి సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఎమ్.ఫిల్. పట్టా తీసుకొన్నారు. గైడు ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు. ఆచార్య వీరభద్రరావుగారికీ, ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారికీ రాగవైశాఖి ప్రాణతుల్యమైన రసవత్సాహితి.

మిత్రుడు మోదుకూరి జాన్సన్ సినిమా రంగంలో అడుగుపెట్టిన మొదట్లో, తన రచనా వ్యాసంగానికి రాగ వైశాఖిలోని భాషా, శైలీ, భావాలూ తనకెంతో తోడ్పడుతున్నాయని ఆయన నాకు వ్రాసే ప్రతి ఉత్తరంలోనూ పేర్కొనేవాడు.

రాగ వైశాఖి కావ్యాన్ని తమ పర్యటనలలో ఎల్లప్పుడూ తమతోనే వుంచుకొనే వారు – ఐ.ఎ.ఎస్. అధికారి ఎల్.మాలకొండయ్యగారు. ఆయన 1971 ప్రాంతంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టరుగా వున్నప్పుడూ, ఆ తర్వాత కొన్ని శాఖలకు కమీషనరుగా వున్నప్పుడూ కూడా నాకు ఎన్నో సన్మానాలు ఆయన ప్రోత్సాహంతో జరిగాయి. మా స్వగ్రామంలో 1971 డిసెంబరులో జరిగిన నా షష్టిపూర్తి మహోత్సవం కూడా అందులో ఒకటి.

మా గ్రామానికి చెందిన శెట్టి బలిజ నాయకుడు, బ్యాంకరు, భూస్వామి అయిన చిట్టూరి నరసింహంగారు – ఆ దారిన పోతున్న మా తమ్ముడు అర్జునుడ్ని ఆపి అన్నారట

– ''మీ నాన్న పేరు నిలబెట్టగలిగిన గొప్ప గ్రంథం రాశాడయ్యా భీమన్న'' అని. నరసింహంగారు ఆ కాలంలో మా నాన్నకు తరచు అప్పులు పెడుతుండే షావుకారు. ఎవరినీ మెచ్చుకొనే తత్వం కాదు. బహు గ్రంథ పాఠకుడాయన. అటువంటివాడు బహుపరిశీలనగా మెచ్చు కొన్నాడట రాగవైశాఖిని.

రాగవైశాఖిపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఎంతో మంది శాసన సభ్యులు సాహిత్య ప్రభావితులైనారు. అందులో విశాఖ మండలానికి చెందిన పాలవెల్లిగారొకరు. ఆయన గ్రంథాన్ని ఎక్కడో రెట్టింపు ధరకు కొనుక్కొని చాలా వరకూ కంఠస్థం చేశారు. నాకు ఆత్మీయులైనారు.

ఇలా ఎంతో మంది – ఆనాటి సాంస్కృతికశాఖా మంత్రి ఎమ్.ఆర్.అప్పారావు, మిత్రులు డా. ఖాను గార్లతో సహా.

ఈ రాగవైశాఖి రచనా పరంగా ఆధునిక తెలుగు వాఙ్మయ సరళినే ఒక మలుపు తిప్పి రస రంజితం చేసిందనీ, ఎంతో మంది సినిమా రచయితలకూ, నవలా రచయితలకూ మార్గదర్శక మయిందనీ సాహితీ మిత్రులంటుంటారు ఈనాటికీ.

ఎన్నో సిద్ధాంతాలు

రాగవైశాఖి ఒకమహాకావ్యమనీ, అందులో అనేక జీవిత సిద్ధాంతాలు ప్రతిపాదించ బడి వున్నాయనీ బాపురెడ్డిగారు పేర్కొంటూ ఆనాడే ఒక మంచి పరిశోధక వ్యాసాన్ని తయారు చేశారు. పరిశీలనగా చదివితే ఒక పాతిక సిద్ధాంతాలైనా రాగవైశాఖిలో ప్రతిపాదించబడి వున్నై. అవన్నీ ప్రాథమిక సత్యాలతో కూడిన వినూత్న సిద్ధాంతాలు.

జీవితం రెండు విధాలు. ఒకటి – ఒక క్రమం అంటూ లేకుండా ఇష్టం వచ్చినట్టు సాగిపోయేది. దానిని స్వేచ్ఛా జీవితం అనవచ్చు.

రెండోది – క్రమబద్ధమైన జీవితం. ఒక సిద్ధాంతాన్ని అనుసరించి సాగుతుందది. క్రమబద్ధ జీవితం సాంఘికమైనట్టిది. దానిలో శాంతి భద్రతలున్నై. స్వేచ్ఛా జీవితం ప్రమాదాలతో కూడుకొన్నట్టిది. అయితే దానిలో థ్రిల్లు వుంది. సృజనాత్మకత వుంది.

జీవితం వంటిదే కావ్యం కూడా. ఏ సిద్ధాంతానికీ కట్టుబడకుండా స్వేచ్ఛా జీవితాన్ని అనుసరించి సాగే కావ్యం సహజ సుందరంగా వుంటుంది. సృజనాత్మకమై వుంటుంది. జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకొన్న కవి వ్రాసిన స్వేచ్ఛా కావ్యమే నిజమైన కావ్యం.

ఒక సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని కొన్ని నియమ నిబంధనలకు కట్టుబడి వ్రాసే కావ్యంలో కొత్తదనం వుండదు. రాగ వైశాఖిలో ఎన్నో సిద్ధాంతాలు ప్రతిపాదించబడ్డాయనీ, ముఖ్యంగా రసాద్వైత సిద్ధాంతం అందులో అంతర్వాహినిగా వున్నదనీ చెప్పినప్పుడు – ఈ కావ్యం సిద్ధాంతబద్ధమైన రచనగా పరిగణించకూడదు. రచన స్వేచ్ఛగా సాగిపోతున్నప్పుడు దాని నుంచి యథాలాపంగా ఆయా సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయనాలి.

రసాద్వైతం కోసమో, ఇతర సిద్ధాంతాలకోసమో లక్ష్యపూర్వకంగా వ్రాసిన కావ్యం కాదిది. స్వేచ్ఛగా కావ్యసృష్టి జరుగుతున్నప్పుడు ఆ సృష్టినుంచి ఉద్భవించి ఓజోవంతాలైన సత్యాలివి. జీవితం గురించి, కావ్యం గురించి అధ్యయనం చేసినప్పుడు ఈ తేడాలను గుర్తించవలసి వుంది.

పరస్పర భక్తే రసాద్వైతం

భారతీయ వేదాంత దర్శనాలలో ఆత్మకూ, పరమాత్మకూ అభేదాన్ని ప్రతిపాదించే అద్వైతం ప్రధానమైనట్టిది. ఆత్మా, పరమాత్మా వేరు వేరు కాదనీ, ఆ రెండు తత్వాలూ ఒకటేననీ అద్వైతం చెపుతుంది. అవి రెండూ ఒక్కటి కాదనీ, రెండూ రెండు వేరు వేరు తత్వాలనీ ద్వైతం చెపుతుంది. విశిష్టాద్వైతం, ద్వైతాద్వైతం, శుద్ధాద్వైతం మొదలైన పేర్లతో పిలువబడేవన్నీ ద్వైతంలో భాగాలే.

నేను అద్వైతంలో పుట్టి పెరిగినవాణ్ణి. ఆత్మా, పరమాత్మా ఒక్కటే అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అవి విత్తనమూ వృక్షమూ లాంటివి. దీపమూ, వెలుగూ లాంటివి. సముద్రమూ, కెరటమూ లాంటివి. అయితే అవి రెండూ సత్యమే అవుతాయి.

ఒకటి సత్యమూ, రెండోది అసత్యమూ కావు. ఈ విధమైన చింతనతో నేను అద్వైతాన్ని అంగీకరిస్తూనే, పరమాత్మతోపాటు దాని వికాసరూపమైన ప్రకృతి కూడా, దాని అసంఖ్యాక రసభావ సౌందర్యాలు కూడా సత్యమే అనే నిర్ణయానికి వచ్చాను. అంటే నాకు పరమాత్మ ఎంత సత్యమో జీవితమూ అంతే సత్యం. కాకపోతే, ఒకటి శాశ్వతం, రెండోది తాత్కాలికం. ఒకటి స్థిరం, రెండోది అస్థిరం. అంతే!

నా రచనలన్నిటికీ జీవితానందమే ప్రాతిపదికగా వుంటున్నది కాబట్టి దానికొక మంచి పేరు పెట్టుకోవలసిన అవసరం ఏర్పడి, దానిని రసాద్వైతం అన్నాను. నా సిద్ధాంతంలో పరమాత్మ రస స్వరూపి. రసమే పరమాత్మ. రసం అంటే ఏమిటి? రెండు ఆత్మల పరస్పరాకర్షణతో, అన్యోన్యానురాగంతో ఆర్ద్రమైన మనస్సే రసం. మనస్సు రసార్ద్రమైనప్పుడు, అది పరమాత్మే. ఈ రసాద్వైతం కవితా స్వరూపి. జీవిత ప్రతిష్ఠ. మరీ స్పష్టంగా చెప్పాలంటే, అద్వైతం వైరాగ్య నిష్ఠం అయితే, నా రసాద్వైతం జీవిత నిష్ఠం.

మరొక్క విషయం ఇక్కడ వివరించాలి.

సమాజం నుంచి కుల మతాలను తొలగించాలనీ, నిత్యావసరాల పరంగా మానవు లంతా సమానంగానే చూడబడాలనీ, మరణానంతరం ప్రతిజీవీ పొందేది మోక్షమేననీ (బ్రహ్మై క్యమేననీ), పునర్జన్మ సిద్ధాంతం తప్పనీ, పరమాత్మలో ఐక్యమైన ఆత్మ తిరిగి అదే వ్యక్తిత్వంతో జన్మించడం సాధ్యం కాదనీ, అన్ని మతాలకు దేవుడొకడే అనడం వాస్తవం కాదనీ, మతాలు చెప్పే దేవుడు ఒక డ్రగ్గు అనీ, ఈ డ్రగ్గును నిషేధిస్తే తప్ప సర్వమానవ సమైక్యం సాధ్యం కాదనీ నేను చెపుతూ వస్తున్నాను. ఇవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలోని మానవుల ప్రవర్తనలకు సంబంధించిన నా భావాలు.

సత్ చిత్ రిరంస

తాను ప్రేమించిన స్త్రీకోసం పురుషుడూ, పురుషుడి కోసం స్త్రీ, ఎంతటి త్యాగానికైనా సిద్ధపడే శక్తి ప్రేమకు ఎలా వచ్చింది?

కని పెంచిన తల్లి దండ్రులనూ, బ్రతుకు బహుముఖాలుగా వికసించడానికి తోడ్పడిన తోబుట్టువులనూ ధిక్కరించి, విసర్జించి పోగల సామర్థ్యం ప్రేమకు ఎక్కడి నుంచి వచ్చింది?

ప్రకృతి పురుష ద్వంద్వ సమాస పరమాత్మ యొక్క నిరంతర రమణం నుంచి వచ్చింది. అట్టి పరమాత్మ యొక్క నిరంతర సిసృక్షే సృష్టి. సృష్టిలోని ప్రతి లవమూ ప్రకృతి పురుష తత్వ నిష్ఠమే. అదే సత్ చిత్ రిరంస. దానినే రసాద్వైతం అన్నాను.

దీనిని స్వప్రయోజక, లౌకిక, సాంసారిక నియమాలతోనూ, కామనలతోనూ, ఉద్రేకాలతోనూ పోల్చి విమర్శించగూడదు.

ఈ రిరంసా ద్వయమే ఈ కావ్య నాయికా నాయకులు – వైశాఖీ వసంతులు.

ఈ కావ్యంలో పది అధ్యాయాలున్నై. వాటికి శ్రావణ పూర్ణిమ మొదలు వైశాఖ పూర్ణిమ వరకూ గల పూర్ణిమల పేర్లు పెట్టాను. ఇందులోని రసానంద రహస్యాన్ని రసజ్ఞులు ఆస్వాదించగలరు.

రాగ వైశాఖి, నా తదితర కావ్య కళా శిల్పాలతోపాటు, రస భావ సౌందర్య నిష్ఠమైనట్టిది. ఇది కేవల ఆనంద సుందర బృందావనం. పరమాత్మలోని ఆత్మ చైతన్యం బహుముఖాలుగా వికసించి పరిమళించే, ఫలించి రసబంధురమై ప్రవహించే రామణీయకం ఇది. ఒకే భావ స్రవంతికి ఇవి రెండు శాఖలు. వాస్తవ జీవిత పరిశీలన ద్వారా వీటిని అర్థం చేసుకోవలసి వుంది.

భారతీయ వైదిక చింతనా ఫలితమైన సచ్చిదానంద తత్వాన్ని, ప్రకృతి పురుషుల నిరంతర భగవద్యోగ లీలా లౌల్యాన్ని రసవత్ సుందరంగా వర్ణిస్తే – అట్టి వర్ణనను అశ్లీలమంటూ గోలపెట్టిన వాళ్ళ నేమనాలి? వైరాగ్య తత్వానికీ, రాగ జీవిత సౌందర్యానికీ తేడా తెలుసుకొని సుఖ శాంతులతో బ్రతకడం నేర్చుకోమనాలి. అదే అంటున్నాను. నేను ఈ రాగ వైశాఖిలో.

ప్రస్తుతాంశం

ప్రేమకూ, సెక్సుకూ తేడా తెలియని, లోకజ్ఞత లేని కలాల వెంట వరదలుగా పొంగుతున్న ఈనాటి కవిత్వాన్నీ, నవలలనూ, సాహిత్య విమర్శలనూ, తిలకిస్తూ కలవరం

చెందుతున్న నేను – రాగవైశాఖిని మరొకమారు ప్రజల ముందు పెట్టాలనే తీవ్రకాంక్షతో 28 సంవత్సరాల తర్వాత పునర్ముద్రణకు ప్రెస్సులో ఇచ్చాను.

దీని ముద్రణకు అయ్యే ఖర్చు నా తలకు మించినట్టిదనే సత్యం నాకు తెలుసు. ఈ విషయం తెలుసుకొన్న మల్లెమాల సుందర రామరెడ్డిగారు కొంత సహాయం చేస్తామన్నారు. తెలుగు యూనివర్సిటీ వారి సహాయం తప్పకుండా అందగలదన్న ధీమా వుంది.

మొదటి ముద్రణ ముఖ పత్రానికి చిత్రశిల్పి పి.ఆర్.రాజుగారు వేసిన వర్ణ చిత్రం ఆధారంగా ఫిలిం రచయిత్రి, ప్రొడ్యూసరూ అయిన శ్రీకరుణ వేయించిన ఈ ముఖ చిత్రం రసిక జనామోదం పొందగలిగినట్టిది. ఆర్టిస్టు ఏలే లక్ష్మణగారికి కృతజ్ఞతలు.

–భీమన్న

* * *

ధర్మంకోసం పోరాటం

అంకితం

డాక్టరు అంబేద్కరుకు

జయ జయ జయ అంబేద్కర!
జయ దళిత జన స్వరా!
జయ మానవ మందారా!
జయ భారత భాస్కరా!

నవ భారత సంవిధాన
ధర్మ పథక నిర్మాతా!
భువి సమస్త పీడిత జన
దుఃఖశాంతి తథాగతా!

వేదాలను శోధించి
వేదాంతము నధిగమించి
మనిషి మనిషిగా బ్రతుకుటె
మహిత మన్న మహాశయా!

అస్పృశ్యత రూపు మాపి,
అగ్ర అంత్య భేద ముడిపి,
నిష్కుల భారత జాతికి
నీడయైన బోధి ప్రియ!

జాతీయ సమైక్యానికి
మతాతీత రాజ్యానికి
ప్రజాస్వామ్య ధర్మానికి
శరణమైన సంఘర్షీ

జగతికి స్వేచ్ఛా సమతా
సౌభ్రాత్రములను కూర్పగ
జన్మమెల్ల పోరాడిన
జనగణ విప్లవ యోద్ధా!

అంధకారమున పుట్టి
అవనికి దీపము పెట్టి
పంకమును మధించి మహికి
పరిమళ మొసగిన సూరీ!

రాళ్ళకు జీవము పోసి,
మ్రొళ్ళను చిగురింప జేసి,
మట్టి నుండి మానవులను
మలిచిన కారణ జన్మా!

భీమ సేన

1967లో కర్నూలులో సంజీవయ్య గారి ఓటమిని స్వయంగా చూసిన తర్వాత, నేను ఒక నెల రోజులపాటు మరికొన్ని జిల్లాలలో పర్యటించి వచ్చి, హైదరాబాదులో కూర్చొని, ఒక పదిహేను రోజులలో వ్రాసి ముగించిన జీవగ్రంథం ఈ ధర్మం కోసం పోరాటం. గుండె పగిలే దృశ్యాలను చూచినప్పటి మనస్సు రగిలే వేదనాపూరిత భావాలను ఇందులో పొందు పరచాను. నా వేదనను, ఉపశమన మార్గాన్ని ప్రజలందరితోను పంచుకోవడం కోసం వెనువెంటనే ముద్రించాను. ప్రకటించాను.

Educate అన్న అంబేద్కరు అన్న మాటకు అర్థం ప్రజలకు అక్షరాలు నేర్పమని కాదు. Awareness అంటే అవగాహన కలిగించమని.

మన మెవరం? ఎందుకిలా బాధ పడుతున్నాం? ఈ బాధలను తొలగించుకొనే మార్గం ఏమిటి? ఈ మూడు ప్రశ్నలకు జవాబులను ప్రజలకు వివరించవలసి ఉంది. అలా వివరించడానికే అంబేద్కరు అస్పృశ్యులెవరు? అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈ అస్పృశ్యులన బడే వాళ్లంతా Broken People అయి ఉంటారన్నాడాయన. ఈ Broken అనే ఇంగ్లీషు మాటకే దళిత అనే సంస్కృత పదాన్ని వాడుతున్నాం ఇప్పుడు. అంబేద్కరుది చారిత్రక దృక్పథం. వాస్తవాన్ని పరిశోధన ద్వారా తెలుసుకొనేది.

నాది చిన్నప్పటి నుంచీ కూడ పౌరాణిక దృక్పథం. వేదాలు, కావ్యాలు, పురాణాలు వగైరాలతో కూడిన సాహిత్యాన్ని పరిశోధించి మన మెవరమో తెలుసుకొన్న జ్ఞానం – మనం దళితులం కావచ్చు, కాకపోవచ్చు. కాని భారత జాతీయుల మనడం మాత్రం తథ్యం. వట్టి భారత జాతీయులం మాత్రమే కాదు. భారతీయత (Indianism) అనే దానికి, భారతీయ సంస్కృతికి, భారతీయ సాహిత్యానికి, భారతీయ వేదాంత దర్శనానికి కూడ మనమే మూల పురుషులం, మూల ఋషులం. ఇది మన చరిత్రను గురించిన నా పరిశోధనా ఫలితం.

మనం అంటే మాల మాదిగలం.

''మాలమాదిగ యువకుల్లారా ఏకం కండి!'' అనే నినాదం ఈ గ్రంధానికి కేంద్ర బిందువు. ఎందుకు ఏకం కావాలి? ఎలా ఏకం కావాలి? శతాధిక కులాలతో విచ్ఛిన్నమైపోయి ఉన్న భారతజాతిని ఎలా సంఘటిత పరచాలి? అనే విషయాలు ఈ కేంద్ర బిందువు చుట్టూ అల్లుకొని వున్నై.

అంటే – Educate అని అంబేద్కరు ఇచ్చిన పిలుపును నేను అంతకు ముందేనాడో అందుకొని, నా రచనల ద్వారా ఆచరిస్తున్నా ననుకోవచ్చు. నిజంగా చెయ్యవలసిందిది. ఈ ధర్మం కోసం పోరాటాన్ని ఎంతమంది చదివి అవగాహన చేసుకొన్నారో తెలియదు. అనేకవేల ప్రతులు మాత్రం ప్రజల చేతుల్లోకి వెళ్లాయి. ప్రజలు మేల్కంటున్నారనేది కూడ వాస్తవంగా కనిపిస్తున్నదే. నా కృషి వృధా కాలేదు. సంతోషం.

దీనిని ''దళిత్‌కైపిడి'' అనే పేరుతో కన్నడంలోకి అనువదించుకొన్నారు.

''నేను హరిజనుల గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు, హరిజనుల కోసం ఏదైనా మంచి చెయ్యవలసి వచ్చినప్పుడు కొంచెం భయపడేవాణ్ని – స్వకుల పక్షపాతి అంటారేమోనని. ఈ ''ధర్మం కోసం పోరాటం'' చదివిన తర్వాత ఇప్పుడు నాకు కొండంత ధైర్యం వచ్చింది. ఈ దీనులకు నేనే చెయ్యకపోతే మరింక ఎవళ్లు చేస్తారు? అనే ఆలోచన కలిగింది. ఈ గ్రంథాన్ని ఇప్పటికి నాలుగుసార్లు చదివాను. ఐదవసారి చదువుతున్నాను. దీనిని ఇంగ్లీషులోకి, హిందీలోకి అనువదింపజేస్తాను'' అన్నారు దామోదరం సంజీవయ్యగారు – తెనాలిలో జరిగిన ఒక సెమినారులో మాట్లాడుతూ.

అంతకు కొన్నిరోజుల ముందే ఈ గ్రంథం ఆయన అధ్యక్షత క్రిందే ఆవిష్కరించబడింది. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు అద్భుతమైన ఉపన్యాసం చేశారు – ఆ ఆవిష్కరణ సభలో. ఈ సంగతులన్నీ శ్రీమతి హైమవతి వ్రాసిన ''పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న'' అనే నా జీవిత చరిత్రలో వివరించబడి వున్నవి.

భారతీయ సమాజాన్ని, ముఖ్యంగా ఈ దేశంలో మెజారిటీ ప్రజలకు చెందిన హైందవ సమాజాన్ని, సంస్కరించి ఒక బలమైన జాతిగా తీర్చిదిద్దడానికి ఈ గ్రంథంలో ఒక విశిష్టమైన ప్రణాళికను ఇచ్చాను. దానిని అమలుపరచడం కోసం ఒక పటిష్ఠమైన

యువజన సంస్థకు కూడా రూపకల్పన చేశాను. అదే భీమసేన. దానిని నేను వాస్తవంగా 1968లో స్వయంగా నెలకొల్పాను. ఈ గ్రంథం వ్రాసే నాటికి ఆ సంస్థ పనిచేస్తూ వుంది.

డా. భీమ్‌రావ్ అంబేద్కర్ పేరు మీద నాచే నెలకొల్పబడిన సంస్థ భీమసేన. ఈనాటి దళిత ఉద్యమాలు ఈ సేనను పునరుజ్జీవింపచేసి నడపవచ్చు.

ఇప్పుడిది నాల్గవ ముద్రణ. మొదటి మూడు ముద్రణలూ తొలి ముద్రణ తర్వాత మూడేళ్లలోనే జరిగాయి. మూడవ ముద్రణ 1970లో జరిగింది. ఆ తర్వాత రెండేళ్లలోనే ప్రతులన్నీ అయిపోయినై. 1972-92 మధ్యలో 20 సంవత్సరాలపాటు ఎప్పటికప్పుడు కొత్త రచనలను ప్రకటించుకోవడంతోనే కాలం గడిచిపోతున్నది. పునర్ముద్రణలకు అవకాశం చిక్కకుండా ఉంటున్నది. ఇప్పుడు దీనిని ప్రజల ముందుకు తెస్తున్నాను. దీనిని కావాలంటున్న వారి సంఖ్య అధికాధికంగా వుంది.

ఈ నాలుగవ ముద్రణ విషయంలో నాతో సహకరించిన వారందరికీ, ముఖ్యంగా శ్రీ పి.కమలేశ్వరరావు ఐ.ఏ.ఎస్. గారికీ, శ్రీ ఎమ్.ఎన్.భూషిగారికి, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్ గారికీ, శ్రీ బి.వేదయ్యగారికీ, ప్లానోగ్రాఫర్స్ ప్రెస్ ప్రొప్రయిటర్స్ పి.సుబ్బయ్య, మురళి గారలకు నేను కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాను.

ఈ గ్రంథాన్ని ప్రధానంగా హిందీలోకీ, ఇంగ్లీషులోకీ అనువదింప చేస్తానని ప్రకటించిన సంజీవయ్యగారి మాట కార్యరూపం ధరించనే లేదు. అయితే, ఆ తర్వాత ఇంగ్లీషులోకి అనువదించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అందులో మొట్టమొదటగా ప్రయత్నించినవారు శ్రీ కె.ఎస్.ఆర్.మూర్తి, ఐ.ఎ.ఎస్.గారు. ఆ తరువాత కొంత కాలానికి శ్రీ కె.మాధవ రావు ఐ.ఎ.ఎస్.గారు అనువదించారు కాని ఫైనలైజ్ చెయ్యలేదు. వారున్న పదవుల కార్యభారాలు అలాంటివి. ఈ గ్రంథం ప్రధానంగా హిందీలోకి అనువదించబడాలి. అది భాషా సాహిత్యాల పరంగా వ్యుత్పన్నులైన యువకులు దళిత వర్గాల నుంచి ఉద్భవించి నప్పుడు మాత్రమే సాధ్యం కాగలదేమో!

నేను తొలి ముద్రణకు, తరువాత రెండు ముద్రణలకూ వ్రాసిన పీఠికల నుంచి కొన్ని వాక్యాలను క్రింద ఇస్తున్నాను.

మొదటి ముద్రణ పీఠిక నుంచి

బహుజన హితాయ!

బహుజన సుఖాయ!

భారతదేశంలోని హరిజన సమస్యను అమెరికాలోని నీగ్రో సమస్యతో పోల్చడం ఈ రోజుల్లో పరిపాటి అయింది. అది సమంజసం కాదు. రెండు సమస్యలకూ పోలిక లేదు.

అమెరికాలోని నీగ్రో సమస్య నల్ల తెల్ల జాతుల మధ్య సమస్య.

ఇండియాలోని హరిజన సమస్య తాతలనాటివెలి సమస్య. వెలికి లక్షకారణాలుండ వచ్చు. రంగుకి కాని, జాతికి కాని ఇందులో ప్రమేయం లేదు. హరిజనులు, తదితర స్పృశ్య కులాలవారు అందరూ ఒకే రంగు, ఒకే జాతి.

వేదకాలంలో – అంటే ఋషుల కాలంలో కులభేదాలు లేవు. అసలు కులాలే లేవు. ఆనాడు ప్రధానంగా గణించబడింది ప్రతిభ ఒక్కటే.

ఆనాడు ఎక్కడ, ఎవరికి, ఎలా పుట్టినవాడైనా – ప్రతిభావంతుడైతే, మానవాగ్రణి గానే గౌరవించబడేవాడు. మహర్షిగా, మహా పురుషుడుగా, పురుషోత్తముడుగా సన్మానింపబడే వాడు. విద్యకే ఆనాడు పట్టాభిషేకం, శక్తికే ఆనాడు పూజ.

శ్రీరామ ధర్మరాజాది రాజుల, వశిష్ఠవ్యాసాది మహర్షుల వృత్తాంతాలను పరిశీలించి చూస్తే – ఈ సత్యం వెల్లడి అవుతుంది.

భారతదేశం మీదికి విదేశీ దండయాత్రలు మొదలై, పవిత్ర వేద మతస్థులు 'హిందూ' వంటి అప్రాచ్య నామంతో పిలువబడడం ప్రారంభమై విదేశీ యజమానుల బూట్లు తుడవడంలో పోటీపడ్డ స్వదేశీ బానిసలు తమలో తాము అంతస్తులు సృష్టించుకొని, వర్ణ వ్యవస్థ కరడుకట్టిన తర్వాతే – వర్ణ సాంకర్యానికి అవకాశం కలిగింది. వర్ణసంకరులు వెలి వేయబడడం జరిగింది.

నాటి వర్ణాలే నేటి కులాలు గద? వర్ణాలే లేకపోతే వర్ణసాంకర్యం ఎక్కడుండేది?

బానిసకు అహంభావం ఎక్కువ. కులం తక్కువ వాడిననే కాంప్లెక్సు పెరిగే కొలదీ

గొప్పవాడి ననిపించుకోవాలనే తాపత్రయం పెరుగుతుంది. పతిత అయిన స్త్రీ పట్ల పతివ్రత కుండే ఉదారభావం వ్యభిచారిణి కుండదు. అందుకు కారణం కాంప్లెక్స్!

కారణం ఏదైతేనేం – భారతజాతికి హిందూ నామం స్థిరమై, కుల వ్యవస్థ భారతీయత గుండెల మీద కుంపటిలా దాపురించి, అమాయకులైన ఒక వర్గం ప్రజలకు వెలి (అస్పృశ్యత) అంటగట్టబడింది. సరే. అయితే – అది ఎంతకాలం? ఈ చట్టానికి సవరణ లేదా? భారత రాజ్యాంగం కంటె మనుస్మృతి గొప్పదా?

తాతల నాటి వెలిని, అంటరానితనాన్ని ఆర్థిక స్వప్రయోజనాలకు వాడుకొన్నారు – బానిస చట్టానికి మత నైతికత కల్పించారు – ఆ తర్వాత పురోహితులూ, వారి చేతిలో కీలుబమ్మలైన పరిపాలకులూ! అందుకే – ఆత్మతేజం ఆరిపోయి, జీవధాతువు ఎండిపోయి, తాము మనుషులమే అన్న జ్ఞాన స్పర్శను కోల్పోయారు హరిజనులు. తమ వారైన ఒక వర్గం ప్రజల్ని ఇంతగా జీవచ్ఛవాలను చేయగల్గిన జాతి – మనిషిని కాలదన్ని, పశువును పూజించే జాతి – ప్రపంచంలో ఒక హిందూ జాతి తప్ప మరొకటి లేదీనాడు.

అమెరికాలోని నీగ్రో సమస్య మొన్న మొన్నటిదే అయినా త్వరలోనే నీగ్రోలు మేల్కన గలిగారు. బానిసత్వంపై తిరగబడగల్గారు. భారతదేశంలోని హరిజన (చండాల) సమస్య వేల సంవత్సరాల నాటిదైనా, నేటికీ ఈ అంటరానివాళ్లు తలెత్తుకోలేక పోతున్నారు. వీళ్ళ జీవశక్తి ఎంతగా నాశనం చేయబడిందో దీనివల్ల మన కర్థ మవుతుంది.

ఈ జీవచ్ఛవాలకు ఆత్మచైతన్య శక్తిని కలిగించి, మానవ సహజ ప్రవృత్తిని మేల్కల్పడమే ఈ పోరాటాన్ని ప్రకటించడంలోని నా ఉద్దేశ్యం. చదువుకొని, మాలమాదిగ పేటల నుంచి పారిపోయి, పట్టణాలలో దాక్కొంటున్న పిరికి వాళ్ళకు కాదీ ఉద్బోధ. ఇంకా ఆ పేటలనే పట్టుకొని వ్రేలాడుతున్న సనాతన చండాల జనం ప్రగతి పథంలో పురోగమించడం కోసం ఇది.

''కృణ్వంతో విశ్వమార్యం'' అన్న ఋగ్వేద నినాదంలోని ''ఆర్య'' మతం నాది. ఆర్య శబ్దం జాతిపరమైన శబ్దం కాదిక్కడ. అదొక జీవిత విధానం. ధర్మ, అర్థ, కామ మోక్ష

– ఈ నాలుగూ పురుషార్థాలు. మానవుడు మానవుడుగా సంపూర్ణ జీవితాన్ని అనుభవించి, పూర్ణ పురుషుడై భగవత్సముడు కావడానికి ఈ చతుర్విధ పురుషార్థాలూ ప్రతిపాదింపబడినై. ప్రతి మనిషీ తనకు స్వభావసిద్ధమైన గుణాలను అనుసరించి, మానవ ధర్మ పరిధిలో బ్రతుకుతూ, అర్థ కామాలను అనుభవిస్తూ పెరిగి, ముముక్షువై, తుదకు మోక్షం పొందుతాడు. ఆర్య జీవన విధాన ప్రణాళిక ఇదీ. ఏ మానవుడి జీవిత వికాసానికైనా, జీవిత సాఫల్యానికైనా ఇదే పద్ధతి. కులంతో దీనికి సంబంధం లేదు.

కుల మత వర్ణ వర్గ విభేద రహితమైన ఆర్య భారత జాతి ఆవిర్భవించాలనేదే నా ఉద్యమం.

కులవ్యవస్థను నిర్మూలించాలని అందరూ అంటున్నారు. కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలన్నీ అదే చెపుతున్నై. కాని అది ఎలా జరగాలో ఎవరూ చెప్పటం లేదు. నేను చెపుతున్నాను. చిత్తశుద్ధి కల ప్రగతి కాముకులంతా దీన్ని పరిశీలిస్తారని విశ్వసిస్తున్నాను.

హిందూమతం, కుల వ్యవస్థ అనే పదాలు నేడు పర్యాయ పదాలుగా తయారైనై. పుట్టుకతోనే ఒక మనిషి ఒక వృత్తికి చెందడం ప్రకృతి విరుద్ధం. ధర్మ విరుద్ధం. గుణ కర్మలను బట్టి వర్గ విభజన ఉండవచ్చు. గుణకర్మలు స్థిరమైనవి కావు. నిత్య చైతన్య శీలాలవి. దొంగ అయిన వాల్మీకి మహాకవి వాల్మీకి అయినాడు. స్త్రీ లోలుడైన వేమన మహాయోగి వేమన అయినాడు. శూద్రుడైన వెంకటరత్నం నాయుడు బ్రహ్మర్షి అయినాడు. అదీ ఆర్య జీవిత విధానం. అదీ ఆర్య మతం.

హిందూ కుల వ్యవస్థను రద్దుచేసి, దాని స్థానే ఆర్యమతాన్ని పునరుద్ధరించడానికి ఈ మధ్య రెండు ఉద్యమాలు బైలుదేరినై. అవి రెండూ విఫలమైనై. బ్రహ్మ సమాజం ఉన్న జందాలు తీసివేయమన్నది. ఆర్య సమాజం లేని జందాలను వేసుకోమన్నది. మనిషి కంటె జందానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే అవి విఫలమైనై. ఈ సమస్య పరిష్కారాన్ని క్రింది నుంచి, మూలమాదిగ పేటల నుంచి ప్రారంభించమంటున్నా నందుకే.

ఈ రచనలోను, ఈ నా ప్రణాళికలోను నేను కొంత తీవ్రత కనబరిచాననీ,

అతిగా పోయాననీ కొందరు ఉద్దేశపడవచ్చు. రాజా రాంమోహనరాయ్, దయానంద సరస్వతి, వివేకానంద, వేమన యోగి, వీరేశలింగంపంతులు, బ్రహ్మంగారు. పిఠాపురం మహారాజా వంటి వారితోను – గాంధీ, అంబేద్కరు, జగజ్జీవనరాం వంటి వారితోను మూర్తి, కూర్మయ్య, సంజీవయ్య వంటి వారితోను – మంగిపూడి వెంకటశర్మ, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, కవిరాజు, శ్రీశ్రీ, జాషువా వంటి వారితోను – రచనలలో కాని, కృషిలో కాని పోల్చి చూస్తే – ఆ మహా సముద్రాలలో నేనొక అల కూడా అవుతానో, లేదో! అహంకార రహితంగా, ఆత్మమాత్ర పరిశుద్ధంగా, కేవల మానవ దృష్టితో ఈ నా రచనను, ప్రణాళికను పరిశీలించవలసిందిగా సహృదయుల్ని కోరతున్నాను. నేను విశ్వమాన వతావాదిని, విశ్వార్య వైదికుణ్ణి, సత్యవాదిని, ధర్మైక వర్తనుణ్ణి, అపార్థం చేసుకోకండి, ఆలోచించడం మొదలు పెట్టండి.

ఈ దేశంలో హరిజనులు ఒక బలమైన వర్గం. వారి ఉద్దేశాలను ప్రయోజనాలను, యోగక్షేమాలను ఉపేక్షించటం విజ్ఞత కాదు. ఈ సత్యాన్ని పూర్తిగా మనసులో ఉంచుకొని, నిష్కల్మష హృదయంతో, సానుభూతితో ఈ గ్రంథ పఠనకు ఉపక్రమించవలసిందిగా భారత యువకుల్ని కోరుతున్నాను.

వేదాలు నాలుగే అయినా, పంచమ వేదంగా మహాభారతం ఎక్కువ ప్రాధాన్యం పొందింది. అలాగే – వర్ణాలు నాలుగే అయినా, పంచమ వర్ణం ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకొన్నది. ఈ సత్యాన్ని గుర్తించి, వర్ణాంతర వివాహాల ద్వారా వర్ణ (కుల) వ్యవస్థను నిర్మూలించి, భారత జాతిని ఏకజాతిగా తీర్చిదిద్దకపోతే – ప్రపంచ జాతుల మధ్య దానికి భవిష్యత్తు లేదు.

ఆహార విహారాదులు వ్యక్తిగతమైన స్వభావాన్ని బట్టీ, అభిరుచిని బట్టీ, ఆరోగ్య పరిస్థితిని బట్టీ ఉంటై. ఒకరి ఆహార విహారాల జోలికి మరొకరు పోవడం ధర్మం కాదు. ఈ విషయంలో మూఢాచారాలను, సెంటిమెంటును వదులుకోక తప్పదు. వేదకాలం నాడు ఏమి జరిగిందనేది ఇప్పుడు అప్రస్తుతం. అప్పటికేది అవసరమో అది ఆనాడు జరిగి ఉంటుంది. ఈనాడు మనకేది అవసరమో దాన్ని మనం ఇప్పుడు అనుసరించవలసి ఉంది. వ్యక్తిగత ఇష్టానిష్టాలను రాజకీయ సమస్యలుగా తయారు చెయ్యకూడదు.

కాలానుగుణంగా మారని పాతకాలపు పీఠాలకు నేటి కాలపు మానవ జీవితాలను శాసించే శక్తి లేదు. దురభిమానాలు అభ్యుదయ కరాలు కావు.

యుగపురుషుడు, దళిత జనోద్ధారకుడు, బౌద్ధమత మహాయానంలో నాగార్జునుని తర్వాత అవతరించిన అపర బుద్ధుడు, మానవతా సమతా ధర్మ ప్రవర్తకుడు అయిన డాక్టరు అంబేద్కరుకు ఈ గ్రంథాన్ని అంకితం ఇస్తున్నాను. ఇందుకు ఎంతో ఆనందపడుతున్నాను.

రెండవ ముద్రణ పీఠిక నుంచి:

చదువుకొని, చిన్న చిన్న ఉద్యోగాలైనా చేసుకొంటున్న యువకులు హరిజనులలో లేకపోలేదు. అట్టి యువకులు ఒక్కొక్కరు తమ జాతి ఋణం తీర్చుకోవడం కోసం ఒక్క ఆరు రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడితే గ్రామానికి రెండు ప్రతులు అనే నా కోరిక నెరవేరగలదు. అట్టి ప్రతి యువకుడూ – జన్మకు ఒక్కసారి – రెండు పుస్తకాలు కొని, తన గ్రామంలోని రెండు మాల మాదిగ పేటలకు బహూకరించగల్గితే చాలు. మాల మాదిగలు సమైక్యం కావడం అనే ప్రథమ లక్ష్యం అచిరకాలంలోనే సిద్ధించగలదు.

ప్రతి ఇంటా ఒక ''ధర్మం కోసం పోరాటం'' గ్రంథం ఉండాలనేది నా ఆశ. ఎక్కడైనా ధన సహాయం లభిస్తే – లక్షల కొలది ప్రతులు ముద్రించి, బైబిలు గ్రంథాలవలె ఇంటింటికీ ఉచితంగా పంచి పెట్టాలని కూడ ఉంది నాకు. ఉద్యోగులూ, నాయకులూ తలచుకొంటే – గ్రామానికి రెండు పుస్తకాలనైనా అందజేయవచ్చు. అదంత కష్టమైన పనేమీ కాదు.

ముద్రించిన గ్రంథాలను మార్కెట్టులో పెట్టే అలవాటు నాకు లేదు. నా గ్రంథాలను కొని చదివే అలవాటు ప్రజలకు లేదు. నాకూ – ప్రజలకూ మధ్య కులం ఒక బ్రహ్మ రాక్షసిలా నిలబడి ఉంది. కుల నిర్మూలన జరిగితే తప్ప, నా గ్రంథాలు చదివి ఆనందించే అవకాశం ప్రజలకు ఉండదనవచ్చు. అందుకే కుల నిర్మూలన జరగక తప్పదు.

ధర్మం అనేది దేశ కాల పాత్రల గుండా, భూత వర్తమాన కాలాల ద్వారా, అనాది నుంచి అనంతత్వంలోకి ప్రవహించిపోతూ ఉండే ఒక సమాజ చైతన్యధార. ఒక నిత్య నిరంతర ప్రవాహం. ఈ ప్రవాహానికి ఏవో అడ్డుకట్టలు కట్టి, తమ సొంత పాలాలను

సాగు చేసుకోడానికి బలవంతులైన స్వార్థపరులు నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటారు. అట్టి వాళ్ళ ప్రయత్నాలను నిరోధిస్తూ, అట్టి అడ్డుకట్టలను తీసిపారవేస్తూ – క్రింది వర్గాల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తులుగా వుండవలసి వుంది. అట్టి నిరంతర జాగృతే ధర్మం కోసం పోరాటం.

మూడవ ముద్రణ పీఠిక నుంచి:

''అచ్చు పుస్తకాన్ని పునర్ముద్రించడం కదా! తప్పులెందుకు వస్తాయి?'' అనుకొన్నాను నేను. పుస్తకాన్ని ప్రెస్‌లో ఇచ్చి, ప్రూఫుల బాధ్యత మిత్రులకు అప్పగించి, వేరే పనుల మీద పోయాను. ఫలితం ఇది!

దీనికి తప్పొప్పుల పట్టిక తయారుచేసి చూశాను. దానికంటే నాలుగో ముద్రణ వేసుకోవడమే సులభంగా తోచింది. ఈ ముద్రణ ప్రతులు ఖర్చు కాగానే – నాలుగో ముద్రణ ఒక్క తప్పుకూడ లేకుండా జాగ్రత్త తీసుకోగలనని మాట ఇస్తున్నాను.

ప్రపంచం అన్ని దేశాలలో ఉన్న సమస్యలన్నీ మన దేశంలోనూ ఉన్నై. కుల వ్యవస్థ, అంటరానితనం అనే సమస్యలు రెండూ మన దేశానికి అదనం. ఈ రెండు సమస్యల్నీ నిర్మూలించిన తర్వాతగాని, ప్రపంచ దేశాల పంక్తిలో మనకు చోటు లభించదు.

అందుకే – కుల వ్యవస్థ వల్ల బాధపడుతున్న వారందర్నీ – ముఖ్యంగా మాలమాదిగల్ని ఏకం కమ్మంటున్నాను. ఈ రెండు దుష్ట సమస్యల్నీ నిర్మూలించి – దేశ సమైక్యానికీ, ప్రపంచ ప్రగతికీ మార్గదర్శకులు కమ్మంటున్నాను.

లోకంలో – ముఖ్యంగా మానవ సమాజంలో దుఃఖం ఉంది. దారిద్ర్యం ఉంది. అధర్మం ఉంది. వీటి నిర్మూలనకు కావలసింది నీతి బోధలు కాదు. నిర్మొహమాటమైన కార్యక్రమాలు.

స్వార్థపరుల పెత్తనం నుంచి – ఓ స్వార్థరహిత యువకులారా, మీరు విడుదలై, జాతిని విడిపించండి!

శుభం భూయాత్

భాగ్యనగర్
ఏప్రిల్, 1992

–బోయి భీమన్న

రాజకీయ వీరుడు డాక్టరు ఖాను

పరిచయము

బహు గ్రంథ కర్తలు, కవులు, వినూతన సిద్ధాంత ప్రతిపాదకులు నయిన శ్రీ బోయి భీమన్నగారు తెలుగు సారస్వత లోకానికి సుపరిచితులు. వివిధ సాహిత్య వీధులలో వారు కావించిన కృషి సుప్రసిద్ధమైనది. ఈ గ్రంథ రచనతో భీమన్నగారు మరొక క్రొత్త సాహిత్య ప్రక్రియకు పూనుకొనినారు.

ఈ గ్రంథము డాక్టర్ ఖాన్ జీవిత చరిత్ర. డాక్టర్ ఖాన్ గొప్ప అధికార పదవుల నలంకరించిన పౌరులు కాదు. అందుచేత ఆయన జీవిత వివరాలు చాల మందికి పరిచితమైనవి కావు. సుప్రసిద్ధుడు కాని వ్యక్తిని యీ గ్రంథ రూపమున పరిచయము కావించు ప్రయత్న ములో యేదో యొక ముఖ్యమైన అభిప్రాయము గర్భితమై యుండక తప్పదు. నిజానికి యే దేశ చరిత్ర యైనను తెలుసుకొన వలెనన్నచో దేశ నాయకుల జీవితములను తెలుసుకొని నంత మాత్రమున సరిపోదు. ఎందుకనగా అసాధారణ వ్యక్తుల జీవితాలు ధేశమునకు ఆదర్శపాత్రములే కాని, సమకాలిక దేశ పరిస్థితులను సంపూర్ణముగా తెలియజేయజాలవు. అందుచేతనే కాబోలు ఒక సాధారణ పౌరుని జీవిత చరిత్రను తీసుకొని, వివిధ రాజకీయ సామాజిక పరిస్థితులలో సాధారణ పౌరుడు జాతీయ సమైక్యతకు అనుగుణముగా తన బాధ్యతలను యెట్లు నిర్వహించినాడో భీమన్నగారు యీ గ్రంథమున చక్కగా చిత్రించినారు.

ఇందులోని కథా నాయకులు డాక్టర్ ఖాన్ జన్మచేత ఇస్లామ్ మత నాయకులు. కాని – కర్మచేత ఇస్లాం, హిందూ, క్రైస్తవ మత ధర్మాలలోని ఉదాత్తతను తన వ్యక్తిత్వములో మేళవించుకొనిన సంస్కృతీపరులు. కావుననే ఆయన మన భారత జాతీయతకు ప్రతిబింబ మని చెప్పవచ్చును.

గడచిన ముప్పది సంవత్సరాలలో మన దేశములో చరిత్రాత్మకమైన సంఘటనలు జరిగినవి. అనేక క్లిష్ట పరిస్థితులు ఉత్పన్నమైనవి. ఈ పరిస్థితులలో మన డాక్టర్ ఖాన్

భారత పౌర ధర్మమును ప్రశంసనీయముగా నెరవేర్చి దేశ నాయకుల మన్ననలను పొందినారు.

డాక్టర్ ఖాన్ దృష్టిలో అన్ని మతాలు, అన్ని కులాలు, అన్ని వర్గాలు ఒక్కటే. తనలో అందరిని, అందరిలో తనను చూసుకొనిన అద్వైతి ఆయన. తెలుగులో అక్షరాభ్యాసము చేసిన అచ్చ తెనుగు వాడు ఆయన. ఉరుదూతోపాటు తెలుగును ప్రేమించిన రసికుడు ఆయన. భారత జాతీయోద్యమములో, విశాలాంధ్ర ఉద్యమములో పాల్గనిన రాజకీయ వీరుడు ఆయన. ఆయన యింటిలో అన్ని భాషలకు, అన్ని మతాలకు సుస్వాగతము. ఆయన గృహము ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలను ముడి వేసుకొన్నది. ఇటువంటి ఉదాత్త సంస్కృతీపరుని జీవిత వివరాలను యీ గ్రంథములో పేర్కొని శ్రీ బోయి భీమన్నగారు ప్రశంసనీయమైన పని చేసినారు.

భారతీయ పౌర ధర్మానికి, జాతీయ జీవనానికి ఆదర్శ ప్రాయమైనది డాక్టర్ ఖాన్ జీవితము. ఆయన వంటి పౌరుల సంఖ్య మన దేశములో అభివృద్ధి చెందినచో మన జాతీయ సమస్యలు సులభముగ పరిష్కారమయి, దేశము అభ్యుదయ మార్గమున పురోగమించ గలదు. డాక్టర్ ఖాన్‌కు నా శుభాకాంక్షలు. శ్రీ భీమన్నగారికి నా అభినందనలు.

హైదరాబాదు
ప్లవంగ సంక్రాంతి
14-1-1968

దేవులపల్లి రామానుజ రావు
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి

కొత్త ప్రయోగం

డాక్టరు ఖాను చరిత్ర ఇంతే కాదు. ఇంకా చాలా ఉంది.

జీవిత చరిత్రను ఒక మహా సౌధంతో పోలిస్తే – ఈ గ్రంథం ఒక తాత్కాలిక కట్టడం మాత్రం.

ఇందులో స్పృశించబడ్డ అంశాలను సూక్ష్మంగా పరిశీలించి, పరిశోధించి, సమగ్రంగా వ్రాయడానికి భవిష్యత్తులో ఎవరైనా పూనుకొంటే – అట్టివారికి ఇది ప్రాతిపదిక

గ్రంథం అనవచ్చు. అట్టి కృషి ద్వారా ఇంకా ఎన్నో గొప్ప గొప్ప క్రొత్త విషయాలు వెలుగులోకి రావచ్చు కూడ.

రాజుల ప్రతాపాలు, మంత్రుల చాణక్యాలు, అంతఃపుర కుట్రలు, తాంత్రిక యుద్ధాలు, విజయోన్మాదాలు, పటాటోపాలు – ఇవే చరిత్ర అనుకొన్న రోజులు పోయినై ప్రవక్తల, నియంతల, నాయకుల మహాకార్య నిర్వహణోదంతాల వివరణ పట్టికలే చరిత్ర అనుకొంటున్న రోజులు కూడ పోతున్నై. సామాన్య మానవుడి దైనందిన జీవిత చరిత్రే నిజమైన, సరియైన దేశ చరిత్ర అని గుర్తించవలసిన రోజులు వస్తున్నై. వచ్చేసినై.

సామాన్య మానవులలో డాక్టరు ఖాను ఎంతటి ఆదర్శ పురుషుడో, రచయితలలో శ్రీ బోయి భీమన్న అంతటి ఆదర్శ పురుషుడు.

ఇతర దేశాలలో వలె ఈ భారతదేశంలో కూడ మత విషయకమైన కలహాలు, కొట్లాటలు, రక్తపాతాలు లేకుండా ఉండాలంటే – ఇతర మతాల వారి వలెనే ఇస్లాం మతస్థులు కూడ ఈ దేశపు వేష భాషల్ని అనుసరించక తప్పదు.

తెలుగుదేశంలోని హిందువుడు ఎంతటి తెలుగువాడో, క్రైస్తవుడు కూడ అంతటి తెలుగువాడే. ముస్లిం కూడ అంతటి తెలుగు వాడే కావలసి ఉంది. ఎవరు ఏ ప్రాంతం వాడో నిర్ణయించేవి వేష భాషలు. తెలుగు వేషం, తెలుగు భాష – ఈ రెండింటిని అనుసరించ కుండా, ఎవడూ కూడ – చివరకు దేవుడైనా సరే – తెలుగువాడు కాలేడు.

అలానే ఏ భాషా ప్రాంతం విషయంలోనైనా కూడ.

ఈ విషయంలో భారతీయ ముస్లింలకు డాక్టరు ఖాను ఆదర్శ పురుషుడు.

తాను ముస్లిం. ఇస్లాం మతస్థుడు. మతం వ్యక్తిగతం. తాను తెలుగు వాడు. అన్ని విధాలా తెలుగు సంప్రదాయాన్ని అనుసరించిన వాడు. అందువల్ల ఆదర్శ పురుషుడు.

మనం ఏ నేలలో పుట్టామో, ఆ నేలకు విధేయులమై, విశ్వాస పాత్రులమై ఉండాలి. అదే దేశభక్తి. దేశభక్తి జీవిత రక్తికి, భుక్తికి, ముక్తికి కూడ అవసరమైన ప్రధాన విషయం. జాతీయత లేకుండా అంతర్జాతీయత లేదు.

భారతదేశంలో వివిధ భాషా ప్రాంతాలలో నివసించే ముస్లింలు ఎలా ప్రవర్తిస్తే వారు సరియైన భారత పౌరులు కాగలరో – తాను స్వయంగా ఆచరించి చూపుతున్న వాడు డాక్టరు ఖాను. ఈ ఒక్క ఆదర్శమూ చాలు, ఆయనను ఒక మహావ్యక్తిని చెయ్యడానికి.

అలాంటి ఒక ఆదర్శమూర్తి జీవిత చరిత్రను వ్రాయగల్గిన శ్రీ భీమన్నగారు – శ్రీ దేవులపల్లి రామానుజరావుగారన్నట్లు – చరిత్ర రచనలో ఒక నూత్న యుగాన్నే సృష్టించిన వారైనారు. ప్రజాస్వామిక సోషలిజం లక్ష్యపథంలో ఒక విప్లవాన్నే సాధించిన వారైనారు.

ఈ దేశంలోని ముస్లింలలో అత్యధిక సంఖ్యాకులు సున్నీలు. ప్రవక్త బోధనలు విని ముస్లింలైనవారు. అంటే – మతాంతరులైన దేశీయులే. కనుక దేశీయమైన వేషభాషల్ని అవలంబించటానికి సంకోచపడవలసిందేమీ లేదు. డాక్టరు ఖాను నడుస్తున్న మార్గంలో నడిస్తే చాలు.

ఆదర్శ పురుషులైన ఇలాంటి వారి జీవిత చరిత్రలను ఇతోధికంగా వ్రాసి, దేశ నాయకుల లక్ష్యశుద్ధికి, సమాజ నేతల చిత్తశుద్ధికి ఒరవడి పెట్టవలసిందిగా శ్రీ భీమన్నగారిని కోరుతున్నాం. డాక్టరు ఖానుగారి ఆయురారోగ్యైశ్వర్యాల ఇతోధికాభివృద్ధి కోసం ప్రార్థిస్తున్నాం.

హైదరాబాదు,
జనవరి, 1968

సుఖేలా నికేతన్

అంబేడ్కరిజం

(అంబేడ్కరు సాంఘిక రాజకీయ కార్యప్రణాళికపై సిద్ధాంత గ్రంథం)

భావ స్రవంతి

నిన్ను మించిపోవాలన్నది నా కోరిక
కనీసం నిన్ను అందుకోగలనా అన్నది నా సందేహం,
కోరిక నీకే మార్గదర్శకమై ముందుకు దూకుతుంటే
సందేహం నన్ను నన్నే వెనక్కి గుంజేస్తున్నది.

ఎవరైనా కొందరు మేధావులు, ముఖ్యంగా దళిత కులాలకు చెందిన మేధావులు, ఒక కమిటీగా ఏర్పడి, ''అంబేడ్కరిజం'' గురించి ఒక సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించ వలసి వున్నదని నేను నా ''అంబేడ్కర సుప్రభాతం'' కావ్యపీఠికలో ఒక సూచన చేసివు న్నాను. అందరూ ఔనన్న సూచన అది.

లోగడ జరిగిన ఒక సభా సన్నివేశం కారణంగా ఇప్పుడు నేనే అంబేడ్కరిజం గురించి నా ఉద్దేశాలను వెల్లడించవలసి వచ్చింది. అంబేడ్కరు గురించి, ఆయన సిద్ధాంతా లను గురించి నేను అవగాహన చేసుకొన్న పద్ధతిలో అంబేడ్కరిజానికి ఈ రూపకల్పన చేశాను. ఎవరికైనా ఈ నా సిద్ధాంతీకరణ నచ్చినా నచ్చక పోయినా, ముందుగా క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకొని, సర్వజనీన దృక్పథంతో అందరూ ఆలోచిస్తారనే విశ్వసిస్తున్నాను.

1984 అక్టోబరు 14 సాయంకాలం, హైదరాబాదులోని వీర్‌నగర్‌లో అంబే డ్కరు లైబ్రరీకి నేను ప్రారంభోత్సవం చేశాను. అక్కడి అంబేడ్కర యువజన సంఘం యువకులు ఆ లైబ్రరీని నెలకొల్పుకొన్నారు. ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గనే అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ తన మిత్రులైన పి.బి.సు రేష్, జె.నరసింహులు మొదలైన యువకులతో వచ్చి నన్ను ఆ ఉత్సవంలో పాల్గన జేశాడు.

ప్రారంభోత్సవం మొదట్లో నేను రిబ్బను కత్తిరించి హాలులోకి ప్రవేశించి అంబేడ్కరు పటం ముందు నిలబడినప్పుడు, ఇద్దరు బౌద్ధ భిక్షువులచే త్రిశరణాలూ, బుద్ధ వందనమూ గానం చెయ్యబడ్డాయి.

''నమో తస్స భగవతో అరహతో సమ్మా సంబుద్ధస్స'' అంటూ ప్రారంభమైన ఆ వందనాన్ని భిక్షువులు ఒక్కొక్క మాటనే అంటూ వుంటే, అక్కడ చేరిన జనం దానిని రిపీట్ చేస్తూ వచ్చారు. అంబేడ్కరుకు సంబంధించిన కొన్ని రకాల సమావేశాలలో, బౌద్ధ భిక్షువులు అందుబాటులో వున్నప్పుడు, బుద్ధ వందనమూ, త్రిశరణ గానమూ జరపడం ఈ మధ్య ఒక ఆచారమయింది. అందులో మన నాయకుడైన అంబేడ్కరు ప్రస్థావన అసలు వుండడమే లేదు. ఇది నేను సహించలేని సంగతి.

వందనం ముగిసి జనం కదలబోతున్న సమయంలో నేను వారిని ఆపి, నా త్రిశరణాలు చెప్పాను. వాటిని కూడా భిక్షువులతో పాటు జనం రిపీట్ చేశారు. నా త్రిశరణాలలో బుద్ధం అనే పదానికి బదులు భీమం అనే పదం వుంచాను. అది అనుకోని సంఘటన. అందరూ ఆమోదించిన సవరణ. బుద్ధం అనే పదానికి బదులు అంబేడ్కర్ అనే మొదట అన్నాను. అయితే, బుద్ధం అనే రెండక్షరాల స్థానంలో అంబేడ్కర్ అనే మూడక్షరాలు ఇమడవు. అందుకే భీమం అనవలసి వచ్చింది. భీమం అంటే భీమారావు అంబేడ్కరు. జై భీమ్ వంటి ప్రయోగాల ద్వారా భీమ్, భీమం పదాలు సర్వత్రా ప్రచారంలో వున్నట్టివే.

భీమం అంటే భయంకరుడైన వాడు అని అర్థం. అంబేడ్కరు భయంకరుడూ, భయ రహితుడూ, ఊజ్జీటచ్చిచ్చుచీ ఉచ్చుటజ్చాటు దుష్ట శిక్షకుడూ, శత్రు భయంకరుడూ అయిన అంబేడ్కరు యొక్క ఉదాత్త వ్యక్తిత్వానికి భీమం అనే పదమే సరైనట్టిది.

ఆ విధంగా, అనుకోని ఒక మార్పుతో ప్రారంభమైన ఆ ఉత్సవంలో నా ప్రసంగం కూడ కొంత విప్లవ ధోరణిలోనే కొనసాగింది.

మానవ చరిత్రను పరిశీలించి చూస్తే, అనాది నుంచీ మనకు తెలియకుండానే కొన్ని కొన్ని అపచారాలూ, అపోహలూ మనల్ని అంటుకొని వస్తూ వుండడం కనిపిస్తుంది. ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒక చోట ఆగి, సింహావలోకనం చేసుకొని, పునఃపరిశీలన

జరిపి, అవసరమైన ఆచారాలను వుంచుకొని, పనికిరాని వాటినీ, కాలదోషం పట్టిన వాటినీ విసర్జించి పారవేస్తూ వుండాలి. లేకపోతే మానవజీవితం ఒక శవ పేటికగానో, ఒక మురికి గుంటగానో, ఒక కీకారణ్యంగానో తయారైపోతుంది. దుర్భరమై పోతుంది.

ఏ నీతి సూత్రమైనా

ఆనాటి సభలో నాకు ఆ విధంగా తట్టిన భావాలను స్వేచ్ఛగా వెల్లడించి వున్నాను. అందులో కొన్ని ఇవి–

(1) శాంతి, సత్యం, అహింస అనేవి వట్టి నినాదాలు మాత్రమే. మానవ చరిత్రలో ఎప్పుడూ ఎక్కడా అమలు జరిగినట్టివి కావు.

(2) సందర్భోచితమైన శక్తి యుక్తులను ప్రదర్శించడం ద్వారానే మానవ సమాజం ప్రగతిని సాధించగల్గింది. అంతేగాని, సత్యాహింసల ద్వారా మాత్రం కాదు.

(3) అహింస సహజమైనట్టిది కాదు. హింస చెయ్యకుండా వుండడం సాధ్యం కాదని కృతయుగంలోనే ధర్మవ్యాధుడు హేతుబద్ధంగా పేర్కొని వున్నాడు. అహింసా సిద్ధాంతం అసహజమంటూ దానిని వ్యతిరేకించిన తొలి విప్లవకారుడు ధర్మవ్యాధుడే.

(4) ''అహింసే పరమ ధర్మం'' అనే సూక్తి యొక్క విలువ చెప్పడం వరకే. చెయ్యడానికి పనికిరాదు. బలంకలవాళ్లు, అగ్రకులాల వాళ్లు సాధువులైన ప్రజలను మోసగించి కూడబెట్టుకొన్న సంపదను రక్షించుకోవడానికీ, ప్రజలు తిరగబడకుండా నిరోధించడానికీ కల్పించిన సూత్రమే ఏ నీతి సూత్రమైనా.

(5) బౌద్ధ మతం పాతిక వందల సంవత్సరాల క్రితం నుంచీ వుంది. బుద్ధుడు గాని, ఆయన నిర్మించిన సంఘంగాని, ఆయన ప్రతిపాదించిన ధర్మం గాని ఇంత వరకూ దళిత జనోద్ధరణ కోసం, అస్పృశ్యతా నివారణకోసం, కుల భేదాల రద్దుకోసం, దారిద్ర్య నిర్మూలన కోసం ఎట్టి కార్యక్రమాలనూ చేబట్టలేదు. అందుకు నిజంగా కృషిచేసినవాడు అంబేడ్కరు ఒక్కడే.

(6) అంబేడ్కరు మతం కోసం బౌద్ధ మతంలో చేరలేదు. ఏ లక్ష్య సాధన కోసం

తన జీవితమంతా శ్రమించాడో ఆ లక్ష్యాన్ని సాధించడానికి మతం మార్పిడిని ఒక సాధనంగా మాత్రమే ఆయన వినియోగించుకొన్నాడు.

(7) బుద్ధుడి కంటె అంబేడ్కరు ఎన్నో విధాల ఆధునికుడు, అధికుడు. సాంఘిక రాజకీయ వైజ్ఞానిక స్పృహ నూటికి నూరుపాళ్ళు కలది అంబేడ్కరిజం. ఇది ఒక మతం కాదు. అంబేడ్కరిజంలో మతానికి ప్రాధాన్యం వుండకూడదు. ఏ మతం వాడైనా అంబేడ్కరిస్టు కావచ్చు.

(8) అన్ని రంగాలలోనూ సమాన హక్కుల కోసం, సమాన అవకాశాల కోసం సమాన సుఖశాంతుల కోసం మానవుడు జరిపే పోరాటమే అంబేడ్కరిజం.

(9) అంబేడ్కరు విగ్రహాలు ప్రతి గ్రామంలోనూ నెలకొల్పబడాలి. విగ్రహం వుండే ప్రతిచోటా ఒక లైబ్రరీ వుండాలి. అందులో అన్ని కులాలకూ అన్ని సంస్కృతులకూ చెందిన సాహిత్య గ్రంథాలుండాలి. పరిశోధనలు జరగాలి. సంగీత సాహిత్యాది కళలలో శిక్షణ ఇవ్వబడాలి. దళిత వర్గాలు ఏ రంగంలోనూ ఎవరికీ తీసిపోనంతటి ప్రజ్ఞా ప్రాభవాలను గడించుకోవడానికి నిరంతరం కృషి చెయ్యాలి.

(10) అన్యాయాలను, అవమానాలను, దారిద్ర్యాన్ని, దళితత్వాన్నీ ధైర్య సాహసాలతో ఎదిరించి నిలవగల దిట్టలుగా ప్రజలను తయారుచెయ్యాలి. ''బానిసగా బ్రతకలేవా? బలం సంపాదించుకో'' అనే సూత్రాన్ని పటిష్ఠంగా అమలుపరచాలి.

ఈ విధంగా సాగిన నా ఉపన్యాసానికి అక్కడి యువకులంతా ఎంతో ఉత్తేజితులయ్యారు. ఉత్సాహం పెల్లుబికింది. ఆ ఉత్సాహంలో అందులో కొందరు నన్ను కోరారు – అదే ధోరణిలో అంబేడ్కరిజం గురించి ఒక గ్రంథం వ్రాయమని.

ఆనాటి సమావేశంలో దళిత సమస్యలపట్ల నిరంతరం శ్రద్ధాళువులై ఎప్పటికప్పుడు వాటి పరిష్కారం కోసం కార్యరంగంలోకి దూకుతూ వుండే ఉత్తమశ్రేణి యువకులు చాల మందే పాల్గన్నారు. శ్రీయుతులు సి.రాములు, బజ్జా తారకం, జె.బి.రాజు, యమ్.ప్రేమ్ కుమార్, బి.రామస్వామి, బడుగు పురుషోత్తం, నాతి నారాయణమూర్తి, భూషి రామదాసు, టి.శ్రీనివాసరావు, మాష్టార్‌జీ, ఎస్.చెన్నయ్య వంటి స్ఫూర్తిమంతు

లైన వారెందరో అందులో వున్నారు. ఈ గ్రంథ రచనకు మూలం ఆనాటి సభ. ఆ సభలో వెలువడిన నా భావాలు. వాటిని గ్రంథస్థం చెయ్యమని నన్నుకోరిన ఆ యువకులు.

నాకు సహజం కాని ఒక విలక్షణ ధోరణిలో, ఒక విపరీత శైలిలో వెలువడిన గ్రంథం ఇది. భావాలే కాదు, పదాలూ వాక్యాలూ కూడ ఎన్నెన్నో పునరుక్తాలైనై. ఒక చిత్రమైన భావ స్రవంతి (Stream of Conscience) అనేది ఒక ప్రముఖ విధానం. భావాలు ఒక ప్రణాళిక ప్రకారం కాక, తరంగాలుగా పెల్లుబికి ప్రవహించే పద్ధతి ఇది. వచ్చిన భావాలు వచ్చినట్టే అక్షర బద్ధం చెయ్యబడతై. అంత స్వేచ్ఛగా కొనసాగింది ఈ రచన.

ఈ రచనకు మొదట్లో నేను పెట్టిన పేరు ''నా దృష్టిలో అంబేడ్కరిజం'' అని. నా దృష్టిలో అనడం ఎందుకు? అంటూ ప్రశ్నించారు గనుమల జ్ఞానేశ్వర్, వారా వేణు వంటి కొందరు సన్నిహిత మిత్రులు. అనంతపురంలో ఈ శీర్షికను చూచిన చింతా శ్రీరామమూర్తి గారు నా దృష్టిలో అన్నమాట అక్కరలేదని నా చేత ఒప్పించగలిగారు. మునప్పగారు కూడా అందుకు తోడ్పడ్డారు.

''మీ రచనలన్నీ కూడ మీ దృష్టిలోవే కదా? మీ సొంత భావాలే కదా? ఈ ఒక్క గ్రంథానికి నా దృష్టిలో అని పేర్కొనడం ఎందుకు?'' అదీ వారి వాదన. నిజమే కదా మరి?

ఈ గ్రంథాన్ని వ్రాసే సందర్భంలోనూ ముద్రణ జరిగే సమయంలోనూ నాకెంతో సహకారం అందించిన కొద్ది మంది మిత్రులకు నేను కృతజ్ఞతలు చెప్పవలసి వుంది. అందులో ఇద్దరు మరీ ముఖ్యులు. ఒకటి గనుమల జ్ఞానేశ్వర్, రెండు కుసుమ జవహర్ లాల్.

పూర్వం అయితే నా రచనలన్నీ నేనే స్వహస్తంతో వ్రాసుకునే వాణ్ని. నిజానికి డిక్టేటు చేసే అలవాటు నాకు లేదు. ఈ మధ్య స్వయంగా వ్రాసుకోలేకపోతుండడంవల్ల, డిక్టేటు చెయ్యడం తప్పనిసరి అయింది. డిక్టేటు చేస్తే వ్రాసేవాళ్లుండాలి కదా! మా ఆవిడ హైమవతి, మా అమ్మాయిలు విజయపల్లవి, విజయేందిరా అప్పుడప్పుడూ వ్రాస్తుంటారు. కాని ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు డిక్టేటు చేస్తే వ్రాయగల వాళ్ళు లేరు. అంబేడ్కర

సుప్రభాత కావ్యరచనా సందర్భంలో వలెనే, ఈ అంబేడ్కరిజం గ్రంథ రచనా సందర్భంలో కూడ ఈ పనిని దృఢ దీక్షతో నిర్వహించిన వాడు కుసుమ జవహర్‌లాల్.

గనుమల జ్ఞానేశ్వర్ కూడా అలాంటివాడే. ఏదైనా పని పట్టుకుంటే అది పూర్తయ్యే వరకు నిద్రపోని కార్యసాధకుడూ, నిరంతర శ్రామికుడూ ఆయన.

అద్దానికి ముందూ, వెనకా

నన్నెవరూ అపార్థం చేసుకోకూడదని నా ఆకాంక్ష. ఎందుకంటే–

(1) నాకు కుల మత భేదాలు లేవు. మానవుణ్ణి, కనీసం భారతీయుణ్ణి. కుల మత భేదాల నుంచి రక్షించడానికే ఈ గ్రంథంలో నేను కుల మత చర్చ చేశాను. విమర్శించాను.

(2) కులం, మతం, పదవీ రాజకీయం ఈ మూడే మానవ జాతిని తెలియకుండా తినేస్తున్న విషక్రిములు. వాటిని నిర్మూలించకుండా మానవ జాతి ముందుకు నడవజాలదనేది నా విశ్వాసం

(3) నేను నిరసించేది కుల బ్రాహ్మణ వ్యవస్థను. జ్ఞాన బ్రాహ్మణ తత్వాన్ని కాదు. జ్ఞాన బ్రాహ్మణులు అన్ని కులాలలోను, అన్ని మతాలలోను వున్నారు. వారికి నా నమస్కారాలు.

(4) జగమెరిగిన బ్రాహ్మణుడికి జందెం అక్కరలేదనేది లోక సత్యం. అది వైదిక ధర్మ సత్యం కూడా. సన్యాసికి జందెం నిషిద్ధం. సన్యాసి అంటే బ్రహ్మజ్ఞాన పారమ్యాన్ని అందుకొన్నవాడు. అట్టివాడికి జందెం, నామం వంటి కుల మత ప్రత్యేక చిహ్నాల ప్రమేయం వుండదు. ఉంటే అతడు బ్రహ్మజ్ఞాని కాదు. నేను మన్నించేదీ, ఆమోదించేదీ జ్ఞాన బ్రాహ్మణుణ్ణి.

(5) బ్రహ్మజ్ఞానం అంటే బ్రహ్మం గురించిన జ్ఞానం. బ్రహ్మం అంటే ఏమిటో అనేకచోట్ల చర్చించి వున్నాను. ఒక అద్దం ఉన్నదనుకోండి, మనకు వుండే పని అంతా దాని ముందు భాగంతోనే. దాని వెనక భాగంతో మనకు పనిలేదు. దానిని గురించిన

ఆలోచనే మనకు వుండదు, వుండనక్కర లేదు కూడా. అయితే ముందు భాగానికి వెనక భాగం ఆధారమనేది సత్యం. ఈ సత్యం తెలియడమే జ్ఞానం. ఆ వెనక భాగమే బ్రహ్మం. మనం వాడుకునే ముందు భాగం ప్రకృతి, సృష్టి. ఇదీ నా దృష్టిలో వైదిక ధర్మ సూత్రం. నిజమైన బ్రహ్మజ్ఞాని ధరించవలసింది ఈ సూత్రాన్ని, నూలు దారాన్ని కాదు.

(6) కులాలకు, మతాలకు ఏ రంగంలోను కూడ ప్రత్యేక ప్రాతినిధ్యాలు, ప్రత్యేక సాంఘిక న్యాయాలు వుండకూడదనేది నా ప్రతిపాదన. అటువంటి ప్రత్యేకతలు ఏ జాతి కైనా సరే పక్కలో ముళ్ళూ, నల్లులూ వలె బాధాకరం అవుతాయి. (అస్పృశ్యులది ప్రత్యేక పరిస్థితి.)

(7) నేను ప్రధానంగా కవిని. రాజకీయాలు నా కార్యరంగం కాదు. అగ్రశ్రేణి కవిగా కీర్తి ప్రతిష్టలూ, గౌరవ సన్మానాలూ అందుకొన్న వాణ్ణి. దళితుడుగా పుట్టినా, దళితత్వం లేని విశ్వజనీన సాహిత్య సమారాధకుడుగా జీవిస్తున్న వాణ్ణి. నేను అందరి వాణ్ణీ. కుల మత రాజకీయాల జోలికి పోవలసిన అవసరం నాకు లేదు.

అయితే, ఇలాంటి గ్రంథాన్ని ఎందుకు వ్రాశాను?

నేను పుట్టిన పరిసరాలలోని దళితత్వాన్ని తొలగించడం కోసం వ్రాశాను. నేను పుట్టిన సమాజంలోని అవర్ణ సవర్ణ విషమ కాలుష్యాన్ని కడిగి వెయ్యడానికి వ్రాశాను. నేను పుట్టిన పేటలలోని దాస్యాన్నీ, దైన్యాన్నీ, దళితులమనే ఇన్ఫీరియారిటీనీ తొలగించి, యువకుల మనస్సులలో నాటుకొని వున్న తమస్సులను నా కందిన సాహిత్య దీపంతో నిర్మూలించడం కోసం వ్రాశాను. నా కృషి వృథా కాదనే విశ్వసిస్తున్నాను.

మతాలన్నీ మార్క్సిజాలే

నేను ఈ పీఠిక వ్రాస్తున్న సమయంలో ఏదో ఆలోచిస్తూ టేబిలు మీద గల బైబిలును చేతికి తీసుకోగా, జేమ్స్ హితబోధ కనిపించింది. 5వ అధ్యాయంలోని 4వ వాక్యం మీద నా దృష్టి పడింది. అది ఇది.

Behold the hire of the labourers who have reaped down your

fields, which is of you kept back by fraud' crieth: and the cries of them which have reaped are entered into the ears of the Lord of Sab'-a-oth.

(అదిగో చూడు, నీ పొలంలో పనిచేస్తున్న కూలీలను, నీ విచ్చే కూలి డబ్బుల కోసం వాళ్ళు రోజంతా పనిచేసి, నీ చేలలోని పంటను కోసి నీ ఇంటికి చేరుస్తున్నారు. ఆ సంపద అంతా ఆ కూలీల శ్రమ ఫలితమే. దానిని సృష్టించడానికి నువ్వు చేసిందేమీ లేదు. అయినా, దాని నంతా సొంతం చేసుకుంటున్నావు. అందుకు తగిన ప్రతిఫలం నీవు ఆ కూలీలకు ఇవ్వడం లేదు. ఈ దగాకు వాళ్ళ ప్రాణాలు ఆక్రోశిస్తున్నాయి. ఆ ఆక్రోశపు కరుణ స్వరాలు భగవంతుని చెవులలో పడుతూ వున్నాయి.)

ఇది జేమ్స్ మహాశయుడు ఆనాడు చేసిన హితబోధ. పేదకూలీ జనాన్ని దగా చేసి దోచుకుంటూ సంపన్నులవుతున్న భూస్వాములకు ఆయన చేసిన హెచ్చరిక.

''మీరు చేస్తున్న దగాలను భగవంతుడు చూస్తున్నాడు. మీచేత దగాపడుతున్న పేద తమ్ముళ్ళ దీనాలాపాలను భగవంతుడు వింటున్నాడు. మీ పాపం పండే కాలం ఎంతో దూరంలో లేదు. మీ క్షణిక జీవిత భోగాల నిమిత్తం అనంతకాలం మీరు నరకయాతనలు అనుభవించబోతున్నారు'' అంటూ జేమ్స్ మహాశయుడు హెచ్చరించాడు.

అయితే, ఈ హెచ్చరికను గుర్తించిన, గుర్తించి తమ స్వార్థ ప్రవర్తనను సరిదిద్దు కొన్న భూస్వాములెంత మంది?

క్రైస్తవ మతం పుట్టి 1900 సంవత్సరాలు దాటింది. దాని కంటె బౌద్ధ మతం మరొక 600 సంవత్సరాల పూర్వపుది. బౌద్ధ మతం కంటే ఉపనిషత్తులు, ఉపనిషత్తుల కంటే రుగ్వేదం ఇంకా ఎన్నో వందల వేల సంవత్సరాల పూర్వపువి. మానవుడికి రాత్రింబగళ్ళు అర్ధమై సూర్యోదయం అవగాహనలోకి వచ్చి అది హృదయాన్ని స్పందింప చేసి ఆనందం కలిగించిన నాటి నుంచే రుగ్వేదం ప్రారంభమైందనవచ్చు. ఈ కోట్ల, లక్షల, వేల, వందల సంవత్సరాల వయస్సులు కల రుగ్వైదిక, ఔపనిషదిక, బౌద్ధిక, క్రైస్తవ మొదలైన మతాలు ఆనాటి నుంచీ బోధించుకొంటూ వచ్చిన మానవ ధర్మ సూత్రాలు అన్నీ మొత్తం మీద ఒకే న్యాయాన్ని బోధిస్తున్నట్టివి. అది మానవులంతా ఒకటే అనే సాంఘిక న్యాయం.

ఇక్కడ నా ప్రశ్న ఒక్కటే. ఈ న్యాయాన్ని గుర్తించిన వాళ్లు, పాటించిన వాళ్లు, అమలు జరిపిన వాళ్లు ఏ మతంలోనైనా ఏ పది మందైనా వున్నారా? అనేది. (ఏ టాల్‌స్టాయో, ఏ గాంధీయో, ఏ అంబేడ్కరో తప్ప.)

అందుకే దేవుడితోనూ, పరలోకాలతోనూ ముడిపెట్టి మతాలు చెప్పే నీతి సూత్రాలు, మానవ ధర్మాలు, సమతా న్యాయాలు మానవుడి మీద పనిచెయ్యవని నేన నడం. అందుకే మానవ సౌజన్యానికీ, సౌజన్య వికాసానికీ, సంపూర్ణ మానవ శ్రేయస్స మాజం ఉద్భవించడానికి మత ప్రమేయం అక్కరలేదని నేననడం.

కారల్ మార్క్స్ అంతటి విప్లవకరమైన కొత్త ఆర్థిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించ డానికి తోడ్పడిన మూల బీజం ఈ జేమ్స్ మహాశయుడి బైబిలు వాక్యమే కావచ్చునని నాకు ఆ క్షణంలో స్ఫురించిన విచిత్ర భావం.

అందుకే చెబుతున్నాను. (1) మార్క్సిజం అంటే సమతా ధర్మం. (2) ప్రతి మతంలోని ప్రతి నీతీ మార్క్సిష్టు నీతే. (3) ఏ మతం ద్వారాను అట్టి మానవత్వ నీతి అమలు జరగలేదు. అట్టి నీతిని మతం నుంచి వేరుచేసి మార్క్స్ మహాశయుడు దానిని రాజకీయం చేసి చెప్పినా కూడా, అది ఇంతవరకు తృప్తికరంగా అమలు జరగలేదు. (4) మార్క్సిష్టు దేశాలలో కూడ మార్క్స్ లేదు.

(5) మానవ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని, తనకు సొంతమైనదేదో వుండాలన్న సహజ వాంఛను, సృజనాత్మక మనస్తత్వాన్ని, కల్పనా శక్తిని అర్థం చేసుకోకుండా మానవుడి మీద కేవల భౌతికాలైన రాజకీయ వ్యావహారిక నియమ నిబంధనలను రుద్దడానికి ప్రయ త్నించ కూడదు. అలా ప్రయత్నించిన ఏ మతమూ, ఏ రాజకీయ వాదమూ సఫలం కాలేదు. వాస్తవంగా అమలు జరగలేదు. నీతి నియమాలన్నీ ఇతరులకు బోధించడం వరకే పనికి వచ్చాయి. స్వతంత్ర భారత్‌లో గాంధీయిజంగా పిలవబడే ధర్మకర్తృత్వ విధా నమూ, రామరాజ్యంగా పిలవబడే బ్రాహ్మణమతాధిపత్య దాష్టీకమూ కూడ విఫలమైపో యిన కారణం ఇదే.

(6) ప్రజాజీవితంలో క్రమ వికాసంతో కూడిన మార్పు నిజంగానే రావాలంటే, ఒక్క అంబేడ్కరిజం ద్వారానే రావలసి వుంది. అందుకు గ్రామస్థాయి నుంచి

జాతీయస్థాయి వరకు నేనిందులో సూచించిన కార్యక్రమాలను నిజాయితీతో అమలు జరపవలసి వుంది.

ఆర్థిక, అధికార రంగాలలో కూడ బడుగు వర్గాల యువకులు తమ దీన దళిత త్వాన్ని విదల్చుకొని తదితర అగ్రవర్గాల నిపుణులతోనూ, మేధావులతోనూ పోటీపడ గల ఉన్నత స్థాయికి ఎదగవలసి వుంది. అందుకు రోజుకు 18 గంటలు చొప్పున ఏక దీక్షతో కృషిచేసిన అంబేడ్కరును ఆదర్శంగా ఎదుట నిలుపుకోవలసి వుంది.

శాంతి, సహజీవనం నా ధ్యేయం
మనిషికి మనిషి దాస్యం చెయ్యడం హేయం,
ముద్దకోసం ముద్దు బిడ్డను అమ్ముకోకు
అన్నం లేకపోయినా అక్షరాభ్యాసం మానకు.
నేను నిరసించేది దైవాన్ని కాదు, మతాన్ని
మతం నీతులు చెబుతుంది, దైవాన్ని చూపదు.

రిజర్వేషనులు-పందెపు గుర్రాలు

"Equality means equality under equal circumstances". In order to provide real equality, the oppressed communities must be brought to the level of other communities, and for this reservations are necessary.

రిజర్వేషనులు ఎందుకు అవసరమో జస్టీస్ పతంజలి శాస్త్రి గారు వెలిబుచ్చిన అభిప్రాయమిది.

సమానత్వం అంటే, సమాన పరిస్థితులలో సమానత్వం. పైన మేడమీది వాళ్ళను, క్రింద పెంటమీది వాళ్ళను ఎక్కడి వాళ్ళను అక్కడనే వుంచి, అందరూ సమానమే అంటే కుదరదు.

మేడమీది వాళ్ళను క్రిందకైనా దించాలి. క్రింది పెంటమీది వాళ్ళను మేడ మీది కైనా చేర్చాలి: లేక వాళ్ళనూ వీళ్ళనూ ఆ మధ్యలో ఒక సమప్రాంతంలోనైనా నిలపాలి.

మొత్తం మీద పైవాళ్ళకూ క్రింది వాళ్ళకూ కలిపి ఒకే సమానస్థితి గతులను సమకూర్చ కుండా సమానత్వం ఏర్పడదు.

శతాబ్దాలుగా అవిద్య, అవిజ్ఞానం, చీకటి, మురికి, దారిద్ర్యం, దాస్యం కూపా లలో కుళ్ళిచచ్చేలా చేయబడిన అస్పృశ్య దళిత కులాలను అగ్రకులాల స్థాయికి తేవా లంటే 35 సంవత్సరాలే కాదు, 300 సంవత్సరాలు పట్టినా మనం ఆశ్చర్యపడ నక్కర లేదు. మన సాంఘిక ప్రగతి అంత మందకొడిగా వుంది.

అందుకే నేనంటున్నాను దళిత కులాలకు సాంఘిక న్యాయం లభించే వరకు దళితులకు (అస్పృశ్యులకు) రిజర్వేషనులు తప్పవని.

ఇక్కడ నేనొక ఉదాహరణను పేర్కొంటున్నాను. గుర్రప్పందాలను గురించి తెలి సిన వాళ్ళకు ఇది బాగా అర్థం అవుతుంది.

హిందూ సమాజంలో పంచవర్ణాలున్నట్టే, గుర్రప్పందాలలో పాల్గనే గుర్రాలలో ఐదు తరగతులున్నై. ఏ తరగతి పందెంలో అయినా ఆ తరగతి గుర్రాలే పాల్గంటాయి.

ఒక రేసులో పది గుర్రాలు పాల్గంటున్నాయనుకొందాం. ఆ పది గుర్రాలలోనూ కొన్ని గుర్రాలు శక్తివంతమైనవిగా వుంటై. మరికొన్ని శక్తిహీనంగా వుంటై. అధిక శక్తి కల వాటికి, శక్తి లోపించిన వాటికి కూడ పందెంలో గెలిచే అవకాశం సమానంగా కల్పించడా నికి కొన్ని (ఫ్రెఛీజీచ్ఛిఇ) ఏర్పాట్లు చెయ్యబడతై.

ఆ పది గుర్రాల శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకొని అన్నిటికంటె శక్తిగల గుర్రాల మీద 60 కిలోల బరువు వేస్తే, అన్నిటి కంటె తక్కువ శక్తిగల గుర్రం మీద 40 కిలోల బరువు మాత్రమే వెయ్యబడుతుంది. శక్తిగల గుర్రం 60 కిలోల బరువుతో పరు గెడితే, శక్తి తక్కువ గుర్రం 40 కిలోల బరువుతో పరుగెడుతుంది. ఆ విధంగా ఆ పది గుర్రాలకు వాటి వాటికి తగిన బరువులను వేస్తూ వాటన్నిటికీ సమానంగా గెలిచే అవ కాశం కల్పిస్తారు.

గుర్రాలకు కల్పించబడుతున్న ఈ సమతా న్యాయానికి మానవులు అర్హులు కారా? దరిద్రులుగా, దళితులుగా అణచి పెట్టబడివున్న వాళ్ళకు రిజర్వేషనులను

కల్పించడం వెనకవున్న న్యాయం ఇదే. న్యాయం గురించి, ధర్మం గురించి, దేవుడి గురించి మాట్లాడేవాళ్లు రిజర్వేషనులను వ్యతిరేకించకూడదు. అలా వ్యతిరేకించే వాళ్లు మానవ మాత్రులుగా పరిగణించబడరు.

పున్నయ్యగారి గురించి

ఈ అంబేడ్కరిజం గ్రంథాన్ని జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారికి అంకితమిస్తున్నాను. నా గ్రంథాలన్నీ మొత్తం మీద ఎవరికో ఒకరికి అంకితం ఇవ్వబడినట్టివే. స్నేహానికీ, బాంధవ్యానికీ కావ్యాంకితాలు సంకేతాలని నా భావం.

పున్నయ్యగారు శ్రీకాకుళం జిల్లా, సోంపేట తాలూకా, బారువలో 1923 ఆగస్టు 19న జన్మించారు. తల్లిదండ్రులు మంగమ్మ పాపయ్యగార్లు. 4వ ఫారం నుంచి విజయనగరంలోని మహారాజావారి కళాశాలలో చదివారాయన.

బారువ పేరు వినగానే మనకు సర్దార్ గౌతు లచ్చన్నగారు జ్ఞాపకం వస్తారు. ఇద్దరు ఆంధ్ర మహాపురుషులకు జన్మస్థలమైన బారువా ఎంతటి గొప్ప పుణ్యస్థలమో ఊహించవచ్చు.

విజయనగరం మహారాజావారి కాలేజీలో పున్నయ్యగారు ఇంటర్ మీడియట్ చదువుతుండగా 1942లో దేశం మీద క్విట్ ఇండియా ఉద్యమం విరుచుకుపడింది. రక్తంలో జాతీయత పెల్లుబికే భారతీయులంతా అందులో దూకారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ నిర్వహించిన జాతీయోద్యమంలో అది అంతిమ ఘట్టం. పున్నయ్యగారు చదువుకు స్వస్తి చెప్పి ఆ ఉద్యమంలోకి దూకి అరెస్టై కారాగారం పాలయ్యారు. బళ్లారిలో జైలు జీవితం రుచి చూశారు. ఆ విధంగా ఆయన విద్యార్థి దశలోనే స్వాతంత్ర యోధుడైనారు.

హరిజనుల అవస్థలు ఈనాడే ఇంత ఘోరంగా వున్నప్పుడు, 60 ఏళ్ల క్రితం ఎంత ఘోరాతి ఘోరంగా వుండేవో ఊహిస్తేనే భయంతో నెత్తురు గడ్డ గట్టుకు పోతుంది. అంతటి కాలాంధకారం నుంచి ఉదయించి ఈనాటికి మధ్యాహ్న ప్రభాకరుడిగా భాసించ గల్గిన ప్రతిభా వంతుడు పున్నయ్యగారు.

జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత, విద్యార్థి కాంగ్రెసును నెలకొల్పారాయన. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడై జాతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని హరిజన వాడల లోకి నడిపించిన వాడాయన. ఆయన మళ్ళీ చదువుకొనసాగించింది దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే.

పున్నయ్యగారిని నేను మొట్టమొదట చూసింది 1945, 46 ప్రాంతంలో విజయవాడలో, వేముల కూర్మయ్యగారింట్లో. ఆయన రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సమావేశం కోసం అక్కడకు వచ్చారు. నేను రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా జిల్లాలు తిరుగుతూ అక్కడికి వెళ్ళాను. మేమిద్దరం ఒకరి నొకరం పరిచయం చేసుకున్నది అప్పుడే.

సవర్ణ హిందువులతోపాటు హరిజనులకు సమానహక్కులూ, సౌకర్యాలూ కావాలంటూ పున్నయ్యగారు నడిపిన ఉద్యమంలో దేశాన్ని ఆకర్షించిన ముఖ్య సంఘటన 1948లో పలాసాలో జరిగింది. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర కాంగ్రెసు ప్రభుత్వంలో కూర్మయ్యగారు హరిజన సంక్షేమ పౌర సంబంధాల శాఖల మంత్రిగా వున్న రోజులవి. కూర్మయ్యగారి సన్నిహిత మిత్రుడుగా నేను ఆయన సమీపంలోనే ఉంటూ వుండే వాడిని. కూర్మయ్యగారి అధికార నివాసమే కార్యస్థానంగా వ్యవసాయ కూలీ పత్రికను నెలకొల్పి నడుపుతూ వుండేవాడిని. ప్రతి నెల 30వ తేదీని హరిజన దినోత్సవంగా జరపాలని కూర్మయ్యగారు ఉత్తర్వులు జారీ చేసిన రోజులవి.

సదరు ఉత్తర్వుల క్రింద ఆ రోజులలో 30వ తేదీన హరిజనోద్ధరణ కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా జరిగేవి. సవర్ణుల బావుల నుంచి హరిజనులు నీళ్లు చేదుకోవడం, స్థానికంగా వుండే దేవాలయాలలోకి ప్రవేశించడం, హోటళ్ళలో అందరితోపాటు కూర్చొని కాఫీ ఫలహారాలు సేవించడం ఈ మూడూ ప్రధాన కార్యక్రమాలుగా వుండేవి. జాతీయ భావాలు గల యువకులు, పెద్దలు కుల మత భేదాలు లేకుండా ఈ కార్యక్రమాలలో పాల్గనే వాళ్ళు. జిల్లా కలెక్టర్లు, తాసిల్దార్లు మొదలైన ప్రభుత్వాధికారుల ఆధ్వర్యంలో ఆ ఉత్సవాలు నిర్వహించబడేవి.

ఈ కార్యక్రమాలలో విద్యార్థి కాంగ్రెసు నాయకుడిగా పున్నయ్యగారు పాల్గంటూ ఉద్యమాలకు ఉద్యమాలనే నడిపించారు. అందులో 1948లో పలాసా సంఘటన ఒకటి,

1950లో సోంపేట సంఘటన మరొకటి. ఈ రెండూ కూడ సవర్ణుల బావుల నుంచి హరిజనులు నీళ్లు తోడుకునే హక్కులకు సంబంధించినట్టివే.

1948 ఉద్యమంలో మంత్రి కూర్మయ్యగారినే అక్కడకు తీసుకువెళ్ళి విజయం సాధించగా, 1950లో నాలుగు రోజులపాటు నిరాహార దీక్షపూని విజయం సాధించారాయన. ఈ సోంపేట ఉద్యమానికి పత్రికలలో ప్రధానంగా ఆంధ్రప్రభలో విశేషమైన ప్రచారం జరిగింది. అప్పుడు నేను ఆంధ్రప్రభ సంపాదక వర్గంలో వుండడం ఒక యాదృచ్ఛికం.

హరిజనాభ్యుదయం కోసం ఆనాడు నిర్వహించబడిన ఆ కార్యక్రమాలు గాని, ఆ ఉత్సవాలుగాని, ఆ సేవా దీక్షగాని ఈనాడు కనిపించడం లేదంటారు పున్నయ్య గారు. నిజమే. ఎక్కడైనా హరిజనులపై దౌర్జన్యాలు జరిగినప్పుడు ఏదో ఒక మీటింగు పెట్టిమరేదో ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి విన్నవించుకోవడం తప్పితే ఈనాడు హరిజన సంఘాలుగాని, హరిజన సేవా సంఘాలుగాని చేస్తున్నది ఏదీ లేదు. అఘాయిత్యాలు జరగకుండా నివారించగలిగే కార్యక్రమాలు చేపట్టబడడం లేదు.

ప్రతి గ్రామంలోనూ హరిజనులకూ, హరిజనేతర వర్గాలకూ మధ్య వుండే సంబంధాలను గురించి పరిశీలన జరగాలి. వాళ్ళ వాళ్ళ సమస్యలేమిటో గుర్తించబడాలి. వాటి పరిష్కారానికి వెంట వెంటనే చర్యలు తీసుకోబడాలి. అట్టి కార్యక్రమాలు నిర్వహించబడినప్పుడే అన్యాయాలూ, అఘాయిత్యాలూ అరికట్టబడతాయి. గత జల సేతు బంధనాల వల్ల, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడంవల్ల ప్రయోజనం వుండదు. ఈ సత్యాన్ని ఈనాటి దళిత సంఘాల వాళ్ళు గుర్తించడం లేదు. పున్నయ్యగారు గాని, నాలాంటి వాళ్లుగాని బాధపడేది ఈ దుస్థితి పట్లనే.

హరిజనాభ్యుదయ కార్యక్రమాలను పున్నయ్యగారు ఉద్యమస్థాయిలో నిర్వహిస్తున్న ఆ రోజులలోనే ఆయన గురించి నేననుకున్నాను – హరిజనాభ్యుదయ నభోమండలంలో ఒక యువతార ఉద్భవించిందని.

నేననుకొన్నట్టే ఆయన క్రమాభ్యున్నతి పొందుతూ వచ్చారు. 1955లో ఆంధ్ర శాసన సభకు ఎన్నికైనారు, 1956లో అది ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యత్వంగా పరిణమించి

1962 వరకు కొనసాగింది. 62లో తిరిగి పోటీలేకుండా శాసన సభ్యుడయ్యారు. రాజకీయ రంగంలో పోటీలేకుండా ఎన్నిక కావడంలో ఆయన యొక్క ప్రజాసేవ నిరతి ఎంతటిదో స్పష్టపడుతున్నది. ఆయన ఎంతగా జన ప్రియుడైనాడో ఈ క్రమాభ్యున్నతి స్పష్టపరుస్తున్నది.

ఈ మధ్యలో శ్రీకాకుళం జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడుగా వుంటూ మొత్తం మీద జిల్లా అభివృద్ధికీ, ప్రత్యేకంగా ప్రాథమిక విద్యారంగానికీ ఆయన చేసిన సేవ, సాధించిన విజయం అపారమూ, అద్వితీయమూ. ఈనాటికి కూడా అన్ని జిల్లాలలోనూ, మొత్తం దేశమంతటాను అనుసరించవలసివున్న ఆదర్శప్రాయమైన కార్యప్రణాళిక అది.

ఈ కాలక్రమంలో ఆయనతో నా పరిచయం పెరుగుతూ వచ్చి 1960, 64 ప్రాంతాలలో ప్రగాఢతరమైంది. మేమిద్దరమూ ఆంధ్రయూనివర్సిటీ సెనేట్‌లో సభ్యులంగా వున్నకాలమది. బ్రహ్మానందరెడ్డిగారి ముఖ్యమంత్రిత్వపు రోజులవి. మంత్రివర్గంలో వున్నయ్యగారికి స్థానం కావాలంటూ మేమెంతో కృషిచేసిన రోజులు. అందుకోసం గోవాడ నిరీక్షణ రావు గారు నిరశన వ్రతం కూడా పట్టిన రోజులు. నిలకడవుండని రాజకీయ పదవిని కాదని పవిత్రమైన న్యాయ దేవత ఆయనను వరించింది. 1964లో జిల్లా జడ్జిగా ప్రవేశించి రాష్ట్రంలో మొత్తం మీద అన్ని జిల్లాల ప్రజల ప్రేమాభిమానాలు చూరగొంటూ 1974 అక్టోబరులో ఆయన హైకోర్టు న్యాయమూర్తి అయినారు.

ఇది కదా మనం ఆశించే హరిజనాభివృద్ధి క్రమం! ఇది కదా ప్రతి దళిత జన యువకుడు చేబట్టవలసిన ఆదర్శ వికాస జ్యోతి.

ఈనాడు ఆయన హైకోర్టు న్యాయమూర్తి. సాంస్కృతిక రంగంలో ఉజ్వలంగా ప్రకాశిస్తున్న సహృదయ సూర్యుడు. కవుల, పండితుల, కళాకారుల పెదవుల మీది చిరునవ్వులు, మనో వీధుల్లోని విద్యుద్దీపాలు జిగేలుమనేది ఆయనకేసే. ఇదంతా మనం చూస్తున్నదే. మన కళ్ళముందు నడుస్తున్న ఆధునిక సాంస్కృతిక చరిత్రే.

వున్నయ్యగారి ఈ సమ్యగౌన్నత్యం వెనక ఎంటి ప్రతిభ వున్నదో, సంకల్పబలం వున్నదో, మానవ సేవాసక్తి వున్నదో, అలుపెరుగని కృషి వున్నదో మనం నిశితంగా పరిశీ

లించి చూస్తే, అది యువతరానికీ ఎంతటి లక్ష్య సిద్ధమైనట్టిదో, ఎంతటి మార్గదర్శక మై నట్టిదో స్పష్టపడుతుంది.

పున్నయ్యగారి సతీమణి శ్రీమతి లీలావతి గారు, కుమారుడు రాజకుమార్, కుమార్తె ప్రతిభా భారతి, శాసన సభ్యుడైన సోదరుడు కొత్తపల్లి నర్సయ్యగారు.

శ్రీమతి ప్రతిభా భారతి గారిని గురించి నేనిక్కడ ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. విద్యార్థినిగా విద్యార్థి సంఘాలకు నాయకత్వం వహించి యువతరపు విద్యారంగంలోనే అభ్యుదయకర సంచలనాలను సృష్టించిన వీరబాల ఆమె. తండ్రిని మించిన కుమార్తె. తెలుగుదేశం ప్రభుత్వం మూడు మంత్రివర్గాలలోనూ ఆమె మంత్రి. ప్రస్తుతం సాంఘిక సంక్షేమంతో పాటు సాంస్కృతిక వ్యవహారాలను కూడ నిర్వహిస్తున్న విద్యాభారతి ప్రతిభా భారతి.

కొత్తపల్లి పున్నయ్యగారి వ్యక్తిత్వం ఎంతటిదో నాలుగు మాటలలో చెప్పడం జరి గిందిక్కడ. అంతటి ఉన్నత ఉత్తమ నాయకుడు ఈ అంబేడ్కరిజం గ్రంథానికి కృతిప తిగా లభించడం ఒక గొప్ప అదృష్టం. అందుకు నేనెంతో ఆనందపడుతున్నాను.

రాజకీయ నాయకులు స్వార్థ రహితులు కావాలి. కుల మత పక్షపాతాలు మానాలి. ప్రాంతీయ సంకుచితత్వాలు విడనాడాలి. సార్వజనిక జాతీయతా దృక్పథంతో కార్యవి ధానాలను అమలుపరచాలి. అందుకే అంబేడ్కరిజానికి ఒక పరిధిలేని కేంద్రాన్ని మాత్రమే సూచించాను. జాతీయస్థాయిలో కొన్ని ప్రధాన విధానాలను మాత్రమే సూత్రప్రాయంగా పేర్కొన్నాను.

సుప్రభాతమూ – సుహృద్భావమూ

ఈ గ్రంథం చదివే ముందుగాని, చదివిన తర్వాతగాని, ధర్మంకోసం పోరాటం, జన్మాంతర వైరం గ్రంథాలను కూడ చదవడం అవసరం.

లోగడనే నేను వ్రాసి ప్రకటించిన ''అంబేడ్కర సుప్రభాతం'' కావ్యం ఎంతో మందిని ఆకర్షించింది. వెలను లెక్కచేయకుండా ఎంతో మంది పుస్తకాల కోసం వ్రాస్తు

న్నారు. ముత్యాలకూ, మొక్కజన్నలకూ తేడా గుర్తించగలుగుతున్నారు. సంతోషం. అయితే తగిన సౌకర్యాలు లేక అందరికీ పుస్తకాలు పంపలేక పోతున్నాను.

ఈ సుప్రభాతంపై, నా తదితర రచనలపై వలెనే, ఎన్నో పత్రికలలో ఎన్నెన్నో మంచి మంచి సమీక్షలు వచ్చినై. అవికాక కావ్యాన్ని వివిధ కోణాల నుంచీ సమీక్షిస్తూ, ప్రశంసిస్తూ ఎందరెందరో సాహితీ మూర్తులూ, సహృదయ మిత్రులూ నిత్యమూ లేఖలు వ్రాస్తూ వున్నారు. అందులో డాక్టర్ దాశరథీ, డాక్టర్ కొండవీటి వెంకటకవీ, శ్రీ ఎండ్లూరి, అమూల్యశ్రీ, బుంగా సుగుణారావు, పాలమూరి వెంకటస్వామి, జి.మోహనరావు, యమ్. నారాయణ మూర్తిగార్లు కొందరు. ఈ లేఖలన్నిటినీ చేర్చి ప్రత్యేకంగా ఒక గ్రంథం ప్రకటించాలని వుంది.

నా ఆరోగ్య పరిస్థితిని గురించి ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకొనడం ద్వారా నా సాహితీ కృషికి దోహదం చేస్తున్న మిత్రులు డా. గురుకుల మిత్రా గారికి, డా. దాసరి ధనపతిరావు గారికి నేనెంతో రుణపడి వున్నాను.

అంబేడ్కర సుప్రభాతం కావ్యపీఠిక ఉషస్సులోనే, ఆ కావ్యాన్ని ఎలాంటి పరిస్థితిలో వ్రాశానో వివరించి వున్నాను. ఆ సమయంలో నేనున్న పరిస్థితిలో మరెవరైనా (అంబేడ్కరు తప్ప) ఉండి వుంటే – చుట్టూ డాక్టర్లు, టేబిలుపై మందులు, బంధుమిత్రులు వగైరాతో అంతా హడావుడిగా వుండేది. అయితే ఆ సమయంలోనే నా ఊహా ఫలకంపై అంబేడ్కరూ, నా మనసు నిండా పద్యాలూ, నా టేబిలుపై రకరకాల కలాలూ, కాగితాలూ – అదీ అప్పుడు నా చుట్టూ వున్న దృశ్యం.

అలాంటి రోజులలో, నేను అంబేడ్కర సుప్రభాతం పద్యాలను ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు లేచి వ్రాస్తున్నప్పుడు, నాకు మహాకవి జాషువాగారి ''ఫిరదౌసీ''లోని ఒక పద్యం గుర్తుకొచ్చింది. అందులో నుంచి జాషువాగారి రెండు పాదాలను స్పృశిస్తూ నేను ఒక పద్యాన్ని వ్రాసుకొన్నాను. అది ఇది–

''ఒక్కొక పద్దియమ్మునకు
ఒక్కొక నెత్తురు బట్టు మేనిలో

తక్కువగా రచించితి, వృ
థాశ్రమ'' కాదని విశ్వసించితిన్;
భిక్కుతనమ్ము వీడి, జయ
భీములు కండు; పురోగమించి మీ
హక్కులు గెల్చుకొండు; భర
తావని గొల్వుడు ధర్మ సత్తులై.

ఈ పద్యం అంబేడ్కరీయులందరికీ నా కానుక.

సక్రమ విమర్శ కావాలి

డి.పి.దాస్ అనే ఒక హరిజన మేధావి ఇంగ్లీషులో వ్రాసుకొన్న ఆత్మకథపై ఇన్ డియన్ ఎక్స్‌ప్రెస్ 31-3-85 సంచికలో బి.జి.వి. చేసిన సమీక్షను చూశాను. దానిలో ఒక మూడు వాక్యాలు ఇలా వున్నై.

"He is equally critical of Gandhi and Ambedkar, the former justifying Varnashram and evoking pity for untouchables rather than seeking to uproot the evil of caste, and the later for seeking individual salvation by leading a few of his followers to individual salvation by embracing Buddhism".

"Gandhi's concept of Rama Rajya is attacked as another manifestation of 'forever India' - a proclaimed coronation of the old and ancient value systems."

"In the ultimate analysis, both Gandhi and Ambedkar failed to provide any permanent relief to the untouchables of India."

ఈ మూడు వాక్యాలలోను విమర్శలు వున్నై. గాంధీయొక్క వర్ణాశ్రమ ధర్మ సమ ర్థనను, అంబేడ్కరు యొక్క బౌద్ధ మత స్వీకరణను, గాంధీ యొక్క రామరాజ్య ప్రతి

స్థాపన ప్రతిపాదనను డి.పి.దాస్ గారు తీవ్రంగా విమర్శించారు. దేశంలో ఏయే సమస్యల మీద ఎన్నెన్ని రకాల అభిప్రాయాలు వ్యక్తమవుతాయో చూపటానికే ఈ పై ఉదాహరణ లిచ్చాను.

అంబేడ్కరుకు వ్యతిరేకమైన విమర్శలను నేను సహించలేను. అందుకే సమగ్రమైన భావనకు ఉదాహరణగా ఈ గ్రంథాన్ని వ్రాశాను.

అంబేడ్కరు బౌద్ధ మతంలో చేరాడు కాబట్టి మేమంతా అందులో చేరుతున్నాం అంటున్నారు కొంతమంది దళితులు. వాళ్ళకు మతానికీ, సామాజిక వ్యవస్థకూ తేడా తెలియదు. హిందూ మతం గురించి తెలియదు. బౌద్ధ మతం గురించీ తెలియదు. అంబేడ్కరు బౌద్ధుడయ్యాడు కాబట్టి తాము కూడ అవుతాం అంటున్నారు. అలా అంటూ అంబేడ్కరును పక్కకు నెట్టేసి బుద్ధుణ్ణి అనుసరిస్తున్నారు. బుద్ధుడు మనకు చేసిందేమిటి అని ప్రశ్నిస్తే, మొండి జవాబులు తప్ప హేతువాదం లేదు.

మతాన్ని సాకుగా పెట్టుకొని సమాజం పట్ల తమకున్న బాధ్యతల నుంచి తప్పించుకోవడం కోసం కొంతమంది దళితులు అనుసరిస్తున్న విధానాలే డి.పి.దాస్ లాంటి వాళ్లు అంబేడ్కరును అపార్థం చేసుకోవడానికి కారణమవుతున్నై.

అంబేడ్కరు మతం మారడానికి అసలు కారణం ఏమిటో నిశితంగా ఆలోచిస్తే, ఆయన తన సొంత మోక్షం కోసం మతం మారాడని ఎవరూ అనరు. అందుకే బాగా ఆలోచించమంటున్నాను. మతమూ, భక్తీ, ఆరాధనా పూర్తిగా ఎవరికి వారికే వ్యక్తి గత విషయాలు. సాంఘిక స్పృహ మనకు ప్రధానం. మతం ముసుగులో దాగుకోకండి. ముసుగును తీసిపారేసి, అంబేడ్కరు చెప్పిన పోరాట మార్గాన్ని చేబట్టి, ధైర్య సాహసాలతో ముందుకు పదండి.

4-4-1985

-భీమన్న

అంకితం
జస్టిస్ పున్నయ్యగారికి

న్యాయం అంటే ఏమిటి?
న్యాయ స్వరూపం ఎలాంటిది?
న్యాయం కోరేది ఎవరు?
న్యాయం కావలసిం దెవరికి?
న్యాయ పక్షంలో నిలబడి
న్యాయం కోసం పోరాడే దెవరు?
ఈ ప్రశ్నలన్నిటికీ ఒకే జవాబున్నదయ్యా,
అదే న్యాయమూర్తి కొత్తపల్లి పున్నయ్య!
అంటరానితనం అనే పంకంలో పుట్టి
స్వాతంత్ర్యోద్యమం అనే ఉషస్సును చేపట్టి
యువ జాతీయ నవ పద్మంగా వికసించి,
దళితుల ధర్మ హక్కుల కోసం
సత్యాగ్రహ పోరాటాలు నిర్వహించి,
శాసన కర్తగా అభివ్యక్తుడై
న్యాయ పీఠం అధిరోహించి,
హరికీ హరిజనుడికీ ఒకే పంక్తిలో
అమృతం పంచి ఇస్తున్న ఘనాఘనుడు
కొత్తపల్లి పున్నయ్య మహాశయుడు!
ఆయన వందే మాతరం ఉద్యమోద్భవుడు

ఏ తరం ధర్మానికైనా యువతరం నాయకుడు,
ఆయన ప్రజ్ఞా ప్రజ్ఞాన ప్రాభవుడు
ప్రతిభా భారతికి జనకుడు,
ఆయన అందరికీ ఆప్తుడు ఆత్మీయుడు
సంభావ్యుడు సహాయుడు సన్మార్గ దర్శకుడు,
ఆయన లక్ష్మీ సరస్వతీ పార్వతీ వరప్రసాదుడు
సర్వజనాశ్రయ సముదార గుణశీలుడు,
అట్టి పున్నయ్యగారికి అంకితం ఈ అంబేడ్కరిజం
అదృష్టం అనే దుంటే అది నాదే నిజం!

-భీమన్న

ఇదిగో, ఇదీ

భగవద్గీత

భీమన్న భాష్యం

అంకితం

రసాద్వైత మూర్తులు

ప్రకృతి పురుష ప్రతీకలు

అమ్మకు

నాన్నకు

ముఖ చిత్రం

సంపూర్ణ మానవ జీవితానికి మార్గదర్శక సూత్ర గ్రంథం భగవద్గీత.

మానవ జీవిత నిరంతర పురోగమనానికి ప్రతీకలు ధనుర్బాణాలు.

బాణం జీవితం.

దాని విజయానికి ఆధారమైన ధనుస్సు యోగం (ఏకాగ్రత, నిష్ఠ).

మానవుడు నిత్య పురోగామీ, విజయుడూ కావాలంటే ధనుర్ధారి కావాలంటున్నది గీత. దుష్ట శిక్షణా, శిష్ట రక్షణా అవశ్య కర్తవ్యాలంటున్నది.

అదే ఈ ముఖ చిత్రం.

ఈ వాస్తవానికి రూపకల్పన చేసిన చిత్ర శిల్పి, మిత్రుడు శ్రీ సూర్యవిశ్వనాథ్. ఆయన చిత్ర రచనలో సుప్రసిద్ధుడు కాదు, సిద్ధుడు. ఆయనకు నేనెంతో కృతజ్ఞుడ్ని.

ఈ ధనుర్బాణ చిత్రం ప్రతి ఇంటా వుండవలసి నట్టిది.

జయ భద్రకమైనట్టిది.

శంఖారావం

సర్వేత్ర సుఖినః సంతు
సర్వే సంతు నిరామయాఃా
సర్వే భద్రాణి పశ్యంతు
మా కశ్చిత్ దుఃఖ మాప్నుయాత్.

సర్వ ప్రజలూ సుఖంగా ఉందురు గాక
సర్వ ప్రజలూ ఆరోగ్యవంతులై ఉందురు గాక
సర్వ ప్రజలకూ భద్రత లభించు గాక
ఎవరికీ దుఃఖం కలుగకుండు గాక.

ఇదీ వైదిక ధర్మం. లోకంలోని సర్వజనులూ, సర్వ ప్రాణులూ సుఖ శాంతులతో వర్ధిల్లాలనే శుభాకాంక్ష వైదిక ధర్మం.

అట్టి విశ్వజనీనమైన వైదిక ధర్మం కాలక్రమేణా వర్ణ, వర్గ, కుల, ప్రాంత, భాషా, రాష్ట్ర స్వార్థాలకూ, స్పర్థలకూ చిక్కి, సంకుచితమై, జాతి విచ్ఛిత్తికి దారితీసిందంటే – అలా ఎందుకు జరిగింది? అందుకు కారణం ఏమై వుంటుంది? భారత ప్రజలచేత ఆలోచింప చెయ్యడానికే ఈ భాష్యాన్ని వ్రాశాను.

భారత ధర్మాన్ని వేదాల నుంచీ వడపోసుకొంటూ వచ్చిన వేదవ్యాసుడు భగవద్గీత వద్దకు వచ్చేటప్పటికి ఏం చెప్పాడో పరిశీలించి చూడండి.

ధర్మంలో లోపం ఏమీ లేదు. అది స్వచ్ఛమైన అపరంజి (బంగారం) లాంటిది. నిష్కల్మషమైన ఆత్మ లాంటిది. ఏదైనా కల్తీ చేరిందంటే దాన్ని అమలుపరిచే, వాడుకలోకి తెచ్చే వాళ్ళ స్వప్రయోజక బుద్ధి ద్వారానే. భారతీయ ధర్మంలోకి, గీతా బోధనలోకి కల్తీ చేరిం దంటే అది వాటి ఇటీవలి వ్యాఖ్యాతల దురూహల ద్వారానే. అట్టి వ్యాఖ్యాతల దుష్టభాష్యాలన్ని టినీ నేను ఖండించలేదు. గీతకు సరియైన అర్థం ఏదో మాత్రం చెప్పాను.

జన్మను (పుట్టుకను) బట్టి వృత్తి ఏర్పడుతుందనే విషప్రాయమైన కల్తీ అభిప్రాయాలు ప్రాతిపదికగా ఏర్పడినట్టిదే ఈనాడు అమలుజరుగుతున్న హైందవ కుల వ్యవస్థ. ఈ కల్తీలోని కల్పిత విషాలే (synthetic poisons) పునర్జన్మ, పూర్వజన్మ కర్మ సిద్ధాంతాలు.

రాజ్యం ఎలా ఉండాలి? ప్రజా పాలన ఎలా జరగాలి? అనే విషయాలపై లోకంలోని అనేక మంది మేధావులు అనేక విధాలుగా చెప్పారు. అనేక సిద్ధాంతాలు చేశారు. రాజరికం, ధనిక స్వామ్యం, కార్మిక నియంతృత్వం, ప్రజాస్వామ్యం, ధర్మ కర్తృత్వం, సామ్యవాదం (socialism) మొదలైన అనేక పద్ధతులను సూచించారు.

పరిశీలించి చూస్తే అన్ని పద్ధతులలోనూ ప్రాతిపదికగా వుంటున్న ప్రధాన ధర్మం ఒకటే – బలం.

బలం కలవాడే రాజు. నియంత, నాయకుడు, పరిపాలకుడు. అట్టి బలం కలవాడు మంచివాడూ, వివేకం కలవాడూ అయితే ప్రజలు సుఖపడతారు. చెడ్డవాడూ, మూర్ఖుడూ అయితే దుఃఖ పడతారు.

ఈ అన్ని పద్ధతులూ వర్గ సంకుచితాలే. ఏ వర్గానికి చెందిన నాయకుడు పాలకుడైతే ఆ వర్గం వాళ్ళు రాజ్యభోగాలను అనుభవిస్తారు.

ఈ సందర్భంలో భగవద్గీత చెపుతున్నదేమిటి? ప్రజా పాలకుడు స్థిత ప్రజ్ఞుడై వుంటే రాజ్యంలో అన్యాయాలకూ, అక్రమాలకూ తావుండదు. దుర్మార్గాలకూ, దుశ్చేష్టలకూ వీలుండదు. ''స మోహం సర్వ భూతేషు'' అనే గీతా సిద్ధాంతం అమలు జరిగితే, రాజ్యం నిజమైన సామ్యవాద రాజ్యం (Socialist State)గా రూపొందడం జరుగుతుంది.

తొలి పరిచయం

నేను భగవద్గీతను చిన్నప్పుడెప్పుడో చదివాను. ఆ తర్వాత దానితో సంబంధం పెరుగుతూ వచ్చింది. మొదట్లో దానిని చదువుత ఆధ్యాత్మిక దృష్టితోనే. ఒక భారతీయ వేదాంత గ్రంథంగానే మొదట భగవద్గీత నాకు పరిచయమైంది. మా నాన్న పల్లయ్యగారు గోదావరి ప్రాంతంలో వేదాంత గురువు కావడమే అందుకు కారణం.

మొట్టమొదట వేదాంత దృష్టితో చదివినా, చదివిన తరువాత నాకు గీతలో కవిత కనిపించింది. అది పరమాత్మీయమైన కవిత. అందుకోసమే నేను దానిని మళ్ళీ మళ్ళీ చదివే వాణ్ణి. కావ్యానందమే తప్ప, నిశిత పరిశీలన నాకప్పుడు లేదు. నేను కవిగా ఎదిగేకొలదీ, ఏవో కొన్ని కొన్ని శ్లోకాలు తప్ప, గీత కొంత మరుగున పడుతూ వచ్చింది.

ఆ తరువాత, నేను సాహిత్య రంగంలో కొంచెం తలెత్తుకు తిరుగుతున్న రోజుల్లో కొన్ని కొన్ని గీతోపన్యాసాలకు హాజరు కావడం, అధ్యక్షత వహించడం కూడ జరుగుతూ వచ్చింది. కొందరు తమ గీతానువాదాలను నాకు చదివి వినిపిస్తే, మరికొందరు పీఠికలే వ్రాయించుకొన్నారు. ఈ పీఠికలు వ్రాసే సందర్భంలోనే గీతను నేను నిశితంగా పరిశీలించడం జరిగింది.

కృష్ణ భగవానుడు చెపితే వ్యాసభగవానుడే వ్రాశాడో, వ్యాస భగవానుడే కృష్ణ భగవానుడి నోట పలికించాడో! ఏదైనా ఒకటే. ఇద్దరూ నాకు గౌరవనీయులే. ఇద్దరూ ఏకస్వరూపం. ఏకైక మూర్తి. కృష్ణనామ చైతన్యం.

గీతలో నాకు వైరుధ్యాలు చాలానే కనిపించేవి. అయినా వాటికేమో అంతరార్థాలుండవచ్చు ననుకొనే వాణ్ణి. ప్రకృతి స్వభావమే అంత. ప్రకృతి నిండా వైరుధ్యాలే కదా! అంతేకాదు. భారతీయ తాత్విక చింతన అంతా ప్రతీకా ప్రభ. సత్ అసత్తులకు రూపకల్పన.

అయితే–

''వేద వ్యాసుడు మా తాతగారు అంటావు కదా, మరి చాతుర్వర్ణ్యం వంటి శ్లోకాల నెందుకు వ్రాశాడు?'' అంటూ తరచు పండితులు నన్ను ప్రశ్నిస్తున్నపుడు, ఖచ్చితమైన జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి నాకు ఏర్పడింది.

నిజమే. ఎందుకు వ్రాశాడు?

అదే శ్లోకంలోని ''కర్మ'' శబ్దానికి ''పూర్వజన్మ కర్మ'' అనే అర్థాన్ని ఎక్కడ వ్రాశాడు?

''ధర్మం'' అంటే వర్ణాశ్రమాచార ధర్మమా? ''ప్రకృతి'' అంటే జన్మాంతర సంస్కారమా? వ్యాసుడు వ్రాశాడా? ఎక్కడ?

ఇంతకూ గీత మత గ్రంథమా? కుల గ్రంథమా? సాంఘికాచారాలను నియమించే

స్మృతి శాస్త్రమా? యుద్ధం చెయ్యమని ఉద్బోధించే వీర గీతమా? సన్యాసుల జపమాలా? మెట్ట వేదాంతమా? లేక-

భగవంతుడి కోసం ఆరాటపడే కోట్లాది ప్రజలు, అమాయక భక్తులు హైందవ కుల తత్వ వాదులచే పరమతాలలోకి తరిమి వేయబడుతుంటే, ఏమీ చెయ్యలేని చేతగాని తనంతో చూస్తూ వుండిపోతున్న క్లైబ్యమా?

ఏది భగవద్గీత?

ఈ విధమైన ప్రశ్నలతో, జిజ్ఞాసతో, అనేక దృక్కోణాల నుంచి పరిశీలించి చూచినప్పుడు నాకనిపించిందేమిటంటే-

(1) ప్రపంచంలో ఏ తాత్విక గ్రంథానికీ లేని విశ్వజనీనత భగవద్గీత కున్నదని.

(2) ప్రపంచంలోని అన్ని మతాలకూ, మత సిద్ధాంతాలకూ భగవద్గీతే మూలభూత మని.

(3) మానవుడు కేంద్రంగా అతడి చుట్టూ సాగుతున్న జీవన ప్రగతికి భగవద్గీతే సుప్రభాత మని.

(4) భారతీయ సాహిత్య మంతటిలోనూ చేరినట్టే, భగవద్గీతలో కూడా బహువిధాలైన ప్రక్షిప్తాలు చేరి కలుషితం చేశాయని.

(5) అట్టి కాలుష్యాలన్నింటినీ తొలగించి, స్వచ్ఛతను చేకూర్చి, భగవద్గీతకు నవనవో న్మేషమైన ఒక కొత్త భాష్యం ద్వారా సర్వజనామోదాన్ని (Popular acceptability), మతాతీతమైన విశ్వ జనీనతనూ (Universal credibility) కల్పించవలసి ఉన్నదని.

అందుకే ఈ నా ప్రయత్నం.

ప్రక్షిప్తాలు - పునరుక్తులు

భగవద్గీతలో ఏడు వందల ఒక్క (701) శ్లోకాలు వున్నై. అందులో 339 శ్లోకాలు ప్రక్షిప్తాలని, నకిలీవనీ సర్వశాస్త్ర నిష్ణాత అయిన, విపశ్చిద్వరేణ్య బిరుదాంకితులైన పండిత

శ్రీ ముక్తి రామోపాధ్యాయుల వారు నిర్ణయించారు. వారు వ్రాసిన గీతా భాష్యం పండిత గోపదేవ గారి తెలుగు అనువాదంతో ఇప్పుడు లభ్యమవుతూ వుంది. గీతలో ప్రక్షిప్తాలు చాలానే చేరి వున్నాయని పండితులనడమే తప్ప, ముక్తి రామోపాధ్యాయులవలే ఇంత స్పష్టంగా ఏరి పారేసిన వాళ్ళు మరొకరు లేరనుకోవచ్చు. ఆయన భగవద్గీతను హేతుబద్ధం చెయ్యడానికి తమ భాష్యంలో కొంతవరకూ ప్రయత్నించినట్టు కనిపిస్తుంది కాని, అవసరమైనంతగా లేదు.

భగవద్గీతకు భాష్యం వ్రాసిన మాననీయులలో ఆది శంకరాచార్యుల వారూ, రామా నుజాచార్యులవారూ ప్రధాన వ్యక్తులుగా గుర్తించబడ్డారు. ఆదిశంకరులు అద్వైతపరంగా భాష్యం చెపితే, రామానుజులు విశిష్టాద్వైత పరంగా భాష్యం చెప్పారు. ద్వైత సిద్ధాంత పరంగా మధ్వాచార్యులు, అహింసాపరంగా గాంధీజీ, కృష్ణచైతన్య తత్వపరంగా ప్రభుపాదుల వారు – ఈ విధంగా ఎంతోమంది తమతమ విశ్వాసాలకూ, సిద్ధాంతాలకూ అనుగుణంగా భగవద్గీతకు భాష్యం చెప్పారు.

భక్తి వేదాంతాల గురించి ఏ కొంచెమైనా తెలియని వారెవరూ వుండరు. అట్టి వారిలో రచన చెయ్యడం చేతనయిన ప్రతి ఒక్కరూ, రామాయణాన్ని వలెనే, భగవద్గీతను కూడా ఇష్టానుసారంగా వ్రాసి పారేశారు. రచయితలకు రామాయణం రంభ, భగవద్గీత ఊర్వశి అయి కూర్చున్నాయి.

ఆ విధంగా ఎందరెన్ని విధాలుగా వ్రాసినా – గతానుగతికమైన అర్థాలూ, వివరణలూ తప్ప – గీతా హృదయాన్ని స్పృశించిన వాళ్ళు లేరనే చెప్పవచ్చు. ఏమో! ఎక్కడైనా వున్నారేమో! నాకు తెలిసినంతవరకూ లేరు.

(1) జీవుడికీ, దేవుడికీ తేడా ఏం లేదు. జీవుడే దేవుడు. తాను దేవుడనే అని గుర్తించిన జీవుడు దేవుడే అవుతున్నాడు. ఇది అద్వైతం. జీవ బ్రహ్మైక్యతత్వం. భగవద్గీత నుంచి దీనిని సాధించడానికి శంకరాచార్యులు కొంత కష్టపడవలసే వచ్చింది.

(2) జీవుడూ, దేవుడూ ఒక్కటి కాదు. అయితే దేవుణ్ణి మనసారా ఆరాధించిన జీవుడు దేవుడి రూపాన్ని పొందుతాడు. దేవుడి వలెనే, దేవుడితో సమానంగా శాశ్వతంగా

దైవలోకంలో నివసిస్తాడు. ఇది విశిష్టాద్వైతం. జీవుడికీ, దేవుడికీ రూపంలో అద్వైతం వుంది. తదితర గుణ శక్తులన్నిటా కూడా అద్వైతం వుంది. అయితే దేవుడి కుండే స్వయం క్రియా శక్తి జీవుడికి లేదు. రామానుజులు ఈ సిద్ధాంతాన్ని స్థాపించడానికి ఎక్కువ కష్టపడవలసిన అవసరం లేకపోయింది.

(3) ఇకద్వైతం సర్వ సాధారణమైన, ప్రపంచంలోని మానవులందరూ సహజంగా విశ్వసిస్తున్న సిద్ధాంతమే. ''సమస్తమూ నేనే'', ''సృష్టి స్థితి లయాలన్నీ నాలోనే జరుగుతున్నై'' అనగల శక్తి, అధికారం దేవుడికున్నై. జీవుడికి లేవు. జీవుడు నీతిమంతుడైతే, నియమ వర్తనుడైతే, దేవుడిలో విశ్వాసం కలవాడైతే అతడు జనన మరణ దుఃఖం నుంచి విముక్తి చెంది దైవ లోకంలో శాశ్వతంగా వుండిపోతాడు. సదా దేవుణ్ణి చూస్తూ, ఆయన సమీపంలో ఆనందిస్తూ, ఆయన లోకంలో శాశ్వతంగా సుఖించడమే ఏ జీవుడికైనా పరమార్థం. పరమ గమ్యం. నీవూ, నేనూ అనే భిన్నత్వంలోనే ఈ ద్వైతం స్పష్టంగా వుంది. ఇది మధ్వాచార్యుల మతం.

ముఖ్యులైన ఈ ముగ్గురూ కాక, ఇంకా ఎంతోమంది భగవద్గీతకు భాష్యాలు వ్రాశారు కదా! యుద్ధం చెయ్యమని పదేపదే ఉద్బోధిస్తున్న గీతను, యుద్ధం చెయ్యవద్దనే అహింసకు వర్తింపచేయగలిగిన గాంధీజీ అందరికంటే గొప్పవాడేమో అనిపిస్తుంది నాకు. సమస్తమూ తానే అని చెప్పుకొన్న కృష్ణుడి పరంగా కృష్ణ చైతన్య తత్వం ప్రభవించడం సహజమే. మరణ కాలంలో కృష్ణ నామ స్మరణ చేస్తే, కృష్ణ వైకుంఠం ప్రాప్తిస్తుందనేది ప్రభుపాదుల వారి మతం. అందుకు నిరంతరాభ్యాసం కర్తవ్య నిష్ఠ అవసరం.

ఎన్ని భాష్యాలు చూచినా నాకేమీ తృప్తి అనిపించలేదు. అన్నీ పెడదారి బట్టినవే అనిపించింది. ఇంకా విశేషమేమిటంటే – అసలు భగవద్గీత వేదాంత గ్రంథమేనా అనే అనుమానం రావడం!

నరుణ్ణి కర్మణ్యుణ్ణి, క్రియాశీలుణ్ణి చెయ్యడానికి పుట్టిన గీత శుష్క వేదాంత గ్రంథంగా ఎప్పుడు, ఎందుకు మారింది?

గీత వేదాంత గ్రంథమా?

భగవద్గీత మహాభారత కావ్యంలోని ఒక చిన్న ఉపాఖ్యానం. కృష్ణుడొక పాత్ర మాత్రమే. అది మహాభారత కవి అయిన వేదవ్యాసుడు కల్పించిన పాత్ర.

భారత రామాయణ కావ్యాలూ, పురాణాలు వంటివీ, భారతీయ (ముఖ్యంగా హైందవ) జన జీవితంలో ఒక దైనందిన విధి నిషేధాలుగా మారిపోయినప్పటికీ, పరమ వాస్తవాలుగా కనిపిస్తున్నప్పటికీ, అవి కేవలం కవుల రచనలు మాత్రమే అనే సత్యాన్ని మనం మరచిపోకూడదు. కృష్ణుడూ, అర్జునుడూ వంటి వ్యక్తులందరూ కేవలం కావ్య పాత్రలు.

ఏ కవి అయినా, తన కావ్యంలో ఏ పాత్రల నోటనైనా, ఎలాంటి సిద్ధాంతాలనైనా పలికించవచ్చు. ఆయా సన్నివేశాలను బట్టి, సాధించవలసిన ప్రయోజనాలను బట్టి ఆయా పాత్రలు మాట్లాడడమూ, ప్రవర్తించడమూ జరుగుతుంది. పాత్రలకు కావ్య వ్యక్తిత్వాలే తప్ప వాస్తవ వ్యక్తిత్వాలుండవు. వాళ్ళ ప్రవర్తనలు కూడ అంతే. వాళ్ళు చెప్పే మాటలు కవి ఉద్దేశాలు. అర్జునుడికి విషాదం కలుగడం, కృష్ణుడు కర్తవ్యం బోధించడం – ఆ రెండు పనులూ ఒకే వేదవ్యాసుడు చేసినట్టివి. ఈ వాస్తవాన్ని గుర్తిస్తే తప్ప ఏ కావ్యాన్నీ అర్థం చేసుకోలేం. కావ్య ప్రయోజనాన్ని పొందలేం.

భగవద్గీత వేదవ్యాసుడు వ్రాసిన ఒక కావ్యం. అది వేదాంత కావ్యమా? కేవలం నరుడికి వేదాంతం చెప్పడమే దాని ప్రయోజనమా? కొంచెం ఆలోచించి చూడండి.

కేవలం ఆనాటి భారత సమాజానికి విధి నిషేధాలను బోధించే వేదాలను క్రమబద్ధం చెయ్యడానికి పూనుకొన్న వ్యాసుడు, తన కార్యక్రమ సందర్భంలో లోకాతీత భావాలను కూడా వాటిలో అక్కడక్కడ కుగొనడం జరిగింది. అట్టి భావాలను విపులీకరిస్తూ ఆయన పద్దెనిమిది ఉపనిషత్తులను నిర్మించాడు. ఆ ఉపనిషత్తులు తలకొక భావాన్నీ, తలకొక విధంగానూ చెపుతున్నటువంటివి. వాటన్నిటినీ సమన్వయపరచి, ఒకే వేదాంత సిద్ధాంతాన్ని వ్యక్తీకరించడం కోసం ఆయన బ్రహ్మ సూత్రాలు వ్రాశాడు. బ్రహ్మ సూత్రాల తరువాత మరొక వేదాంత గ్రంథాన్ని సృష్టించవలసిన అవసరం ఆయనకు ఏం వచ్చింది? బ్రహ్మ

సూత్రాలకు వివరణలు కావలసివస్తే, భారత భాగవత కావ్యాలలో ఆయన ఆ పని చేస్తూనే వచ్చాడు కదా!

కాగా వ్యాసుడు కేవలం వేదాంతాన్ని చెప్పడానికి మాత్రమే భగవద్గీతను ఉద్దేశించాడనుకోవడం సరియైన భావన కాదు. ప్రసంగ వశాత్తూ వేదాంతం జోలికి పోయాడే తప్ప, గీతకు ప్రధానోద్దేశం మాత్రం వేదాంతమై వుండదు.

అయితే మరి, గీతకు ఉద్దేశించిన ప్రయోజనం ఏమైవుంటుంది?

ఆలోచన దేనికి? అది స్పష్టంగానే వుంది. ''మనోవైకల్యం విడిచిపెట్టు. జీవిత పురో గమనంలో దుఃఖించవలసిందేమీ లేదు. ధైర్యం తెచ్చుకో. విల్లందుకో. యుద్ధం చెయ్యి!''

ఇదీ వేదవ్యాసుడు తన పాఠకుడికి చేసిన ఉద్బోధ. భగవద్గీతకు ప్రయోజనం క్రియా శీలత. శిష్ట, దుష్టశక్తుల మధ్య తప్పనిసరిగా జరిగే నిత్య సంఘర్షణలో వెనకడుగు వెయ్య కుండా స్థిత ప్రజ్ఞుడై ముందుకు దూసుకుపోవడం!

భిన్న జాతుల కలయిక:

ఇంతకూ, వేద వ్యాసుడెవరు?

ఆర్య, ఆర్యేతర ప్రజావర్గాల సమ్మేళన ద్వారా భరత ఖండంలో ఏర్పడుతూ వస్తున్న ఒక కొత్త భారత జాతికి ప్రతినిధి ఆయన.

ఒక ప్రక్క అరుంధతికి మనుమడయిన పరాశరుడు. మరొక ప్రక్క దాసరాజు కూతురయిన మత్స్యగంధి. దళిత వర్గానికి చెందిన మహిళ అరుంధతి. దేవదాసీ గణానికి చెందినవాడు వశిష్ఠుడు. కేవల అనార్య జాతీయుడూ, మత్స్య కార్మికుడూ దాసరాజు. ఈ విధమైన భిన్న భిన్న రక్త సంబంధాల కలయికవల్ల ప్రాదుర్భవించినవాడు కృష్ణ ద్వైపాయనుడు, వేదవ్యాసుడు.

ఆయన నల్లటి వాడు. ఆయన అసలు పేరు కూడ కృష్ణుడే. అందుకే కావచ్చు – భగవంతుడితో అభేదం కల్పించబడిన పాత్రకు, తన రచనలన్నిటా పరమోత్తమమైన పాత్రకు కృష్ణుడు అనే నామకరణం చేసి వుంటాడు. తన పేరే పెట్టుకొని వుంటాడు.

ఈ విధంగా ప్రపంచ మానవ జాతులన్నీ ఒక్కటై ఏక జాతిగా వెలసిన భారత జాతికి, దాని సంస్కృతికి, సాహిత్యానికి, వేదాంతానికి ఏకైక ప్రతినిధిగా నిలిచిన వేదవ్యాసుడు ''చాతుర్వర్ణ్యం'' వంటి శ్లోకాన్ని భగవద్గీతలో వ్రాశాడంటే, అందుకు కారణ మేమిటై వుంటుంది?

నేను మొట్ట మొదట అనుకొన్న దేమిటంటే – ఇటువంటి కొన్ని శ్లోకాలకు మాత్రమే వ్యాఖ్య వ్రాసి వదిలేయాలని! చివరకు ప్రక్షిప్తాలనూ, అనేకంగా వున్న పునరుక్తులనూ తొలగించి వేస్తూ, మొత్తం భగవద్గీతకే రుజు భాష్యం వ్రాయక తప్పలేదు. అందుకు నేను ఎంచుకొన్న శ్లోకాలను చివరగా లెక్కపెట్టి చూస్తే 175 అయినై!

భారతీయ సమాజ స్వరూపం

ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాల ద్వారా మానవ పురోగతిని సాధించదలచినట్టిది భారతీయ సామాజిక వ్యవస్థ. ఈ వ్యవస్థకు ఈ నాలుగు పురుషార్థాలూ నాలుగు మూల స్తంభాలు. ఇవి ఆధారంగా భారతీయ సమాజాన్ని ప్రమాణీకరించి, దానిని ఇతర దేశాల సాంఘిక వ్యవస్థలకు విస్తరింప చెయ్యడమే భగవద్గీత లక్ష్యంగా నేను అర్థం చేసుకొన్నాను.

ధర్మార్థ కామ మోక్షాలలోని ''ధర్మం'' వేరు, ''ధర్మక్షేత్రే కురుక్షేత్రే''లోని ''ధర్మం'' వేరు.

మౌలికంగా ధర్మం అంటే ప్రకృతి ధర్మం, జీవ ధర్మం, సహజ స్వభావం, ప్రవృత్తి అని. అట్టి ధర్మం మార్పులేనిది. సహజసిద్ధమయినట్టిది. సనాతన మయినట్టిది.

జలం క్రిందికే ప్రవహిస్తుంది. అగ్ని జ్వాలలు పైకే లేస్తై. మల్లె మొగ్గలు వసంత ఋతువు లోనే వస్తై. గులాబి తీగకు ముళ్ళుంటై. గొంగళి పురుగు సీతాకోక చిలుక అవుతుంది. ధర్మ ప్రవర్తన ఇలా వుంటుంది. స్థిరమైనట్టిదిగా వుంటుంది.

ధర్మార్థకామ మోక్షాలలోని ధర్మం మానవుడి సహజ ప్రవర్తనకు సంబంధించినట్టిది. సృష్టిలోని ఒకొక్క జీవికి ఒకొక్క రకమైన ప్రవర్తన వుంటుంది. చరాచరాలలో, స్థావర

జంగమాలలో ఏ పేరు చెప్పినా దాని స్వభావ స్వరూప ప్రవర్తనలను గురించి ఎవరైనా సులభంగా వర్ణించి చెప్పేయవచ్చు.

అతడు మనిషి అనగానే అతడికొక ప్రత్యేకమైన స్వరూప స్వభావాలుంటై. గుణ వర్తనలుంటై. సుఖ దుఃఖాలను అనుభవించే విశిష్టమైన పద్ధతులుంటై. వాటన్నిటికీ మానవత అని పేరు పెడితే, ఏ మానవుడి విషయంలోనైనా సరే, అతడి మానవతకు ఒక పరిధి వుంటుంది. అది ఏ పరిస్థితిలోనూ కూడా ఆ పరిధిని దాటి వెళ్ళదు. మానవ ప్రవృత్తిని అధిగమించి ప్రవర్తించే వ్యక్తిని మానవుడనం.

సామాజిక శ్రేయోభివృద్ధుల దృష్ట్యా మనిషి ప్రవర్తన మానవతా పరిధిని దాటిపోకూడదు. అది పురుషార్థాలలోని ధర్మం. అంటే ధర్మం ధర్మబద్ధమై వుండాలన్నమాట. రెండోది ధర్మబద్ధమైన అర్థం. అర్థం అంటే ధనం, సంపద, సంపాదన, ఆదాయం. జీవిత నిర్వహణకు కావలసిన సంపదను ధర్మబద్ధంగా సంపాదించాలి మనిషి.

మూడోది ధర్మ కామం. ధర్మబద్ధమైన కామం. కామం అంటే కోరిక. ప్రేమ, సంపాదన, అధికారం, సుఖానుభవం, గౌరవ ప్రతిష్ఠలు వంటి జీవిత సామగ్రి అంతా కామం క్రిందికే వస్తుంది. అంటే మనిషి తాను బ్రతకడానికి చేసే పనులన్నీ, ఆలోచనలన్నీ ధర్మబద్ధంగానే వుండాలి.

అదే వరసలో ప్రతి వ్యక్తి కోరుకోవలసిందీ, కోరుకొనేదీ, పొందవలసిందీ, పొందేదీ నాలుగవ పురుషార్థం మోక్షం. ధర్మం, అర్థం, కామం – ఈ మూడు దశలనూ ధర్మాను గుణంగా దాటిన వాడికి నాలుగో పురుషార్థం మోక్షం సులభసాధ్యమవుతుంది. దానంతటదే లభిస్తుంది.

భారతీయ జీవిత విధానం ఎంతటి సమగ్ర సుందరమైన ప్రణాళికో స్పష్టమయింది కదా! ఇక వీటిని వ్యక్తి భౌతిక జీవితానికి, సామాజిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి ఎలా అనుసంధించారో గమనించండి.

ధర్మం అనేది సహజ ప్రవృత్తి కదా! వ్యక్తికి అది బాల్యావస్థ. సామాజికంగా శూద్రత్వం.

అర్థం ధనం కదా! ధన సంపాదన యౌవనావస్థ. సాంఘికంగా వైశ్యత్వం.

కామం కోరికలు తీర్చుకొనే ప్రౌఢావస్థ. ఏ విధమైన సంకోచాలూ లేకుండా

ధైర్య సాహసాలతో తాను సాధించదలచిన కోరికలన్నిటినీ తీర్చుకొనే కాలమది. సామాజికంగా అది క్షతియత్వం.

ఇక చివరిది మోక్షం. శారీరకంగా వార్ధక్యం. సాంఘికంగా బ్రాహ్మణత్వం. అంటే మొదటి మూడు దశలూ దాటిన తర్వాత ప్రతి మానవుడూ చివరకు సచ్చిదానంద మూర్తిగా జీవితాన్ని ముగించవలసి వుంటుంది. ఎంత చక్కటి ప్రణాళిక! ఎంత సమగ్ర సంవిధానం!

ఈ జీవన సంవిధానంలో ప్రతి మనిషీ పుట్టుకతో శూద్రుడు. సంపాదన పరుడుగా వైశ్యుడు. దాన వీర శూర కర్మల ద్వారా క్షతియుడు. చివరకు బ్రహ్మజ్ఞానం ద్వారా బ్రాహ్మణుడు. ఈ పురుషార్థ సాధక ప్రణాళికను ప్రవర్తింప చేస్తున్నట్టిదే భగవద్గీత.

ఇతర మత వ్యవస్థల వలే ఏదో ఒక ప్రాంతంలో స్థిరంగా నిర్మించబడ్డ రాతికోట కాదిది. పురుషార్థాలను పండించుకొంటూ విశ్వరూపం ధరించి ప్రపంచం దశదిశలకూ సాగి పోగల జీవ చైతన్య రథం ఇది. It is living, moving and flexible.

కార్యశూరులూ – సన్యాసులూ

''ధర్మక్షేత్రే కురుక్షేత్రే'' అంటూ ప్రారంభమయింది భగవద్గీత. భారతయుద్ధం జరిగిన కురుక్షేత్రాన్ని, 'ధర్మక్షేత్రం' అంటాడు వ్యాస భగవానుడు.

యుద్ధంలో భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి, కర్ణుణ్ణి, సైంధవుణ్ణి, అభిమన్యుణ్ణి, దుర్యోధనుణ్ణి, ద్రౌపదీ పుత్రులైన ఉప పాండవుల్ని చంపిన పద్ధతి ధర్మ సమ్మతమైంది కాకపోయినా, కురుక్షేతం ధర్మక్షేతమనే అంటున్నారు. ఎందుకని?

భగవద్గీతలో వ్యాసుడు చెప్పవలసింది ఒక మహాయుద్ధం గురించి.

పోరాటంలో రెండు పక్షాలు విజయం కోసం కొట్టుకు చచ్చేది యుద్ధం. అందులో ఏదో ఒక పక్షమే గెలుస్తుంది. గెలిచిన పక్షంలో అందరూ మంచివాళ్లే, ఓడిన పక్షంలో అందరూ చెడ్డవాళ్లే వుండరు కదా! మంచి వాళ్లు ఓడనూ వచ్చు, చెడ్డవాళ్ళు గెలవనూ వచ్చు. ధర్మమే గెలిచి తీరుతుందనడం సరికాదు.

ఏ పక్షానికైనా గెలవడం ప్రధానం. గెలవడం కోసం ఆ పక్షం, లేక ఆ వ్యక్తి ఏ పద్ధతులైనా అనుసరించవచ్చు. ఏ ఆయుధాలనైనా ప్రయోగించవచ్చు. గమ్యమే ప్రధానం. గతులూ, గమనాలూ ఎలాంటివైనా కావచ్చు.

ఇదంతా యుద్ధంలో మానవులు చేసేది. పరస్పర విజయకాంక్షతో చేసేది. అక్కడ యుద్ధానికే తప్ప యుద్ధ రంగానికి ప్రమేయం లేదు. యుద్ధ రంగం పాత్ర ఉభయులపట్ల సమానమైనట్టిదే. తటస్థమైనట్టిదే. అందుకే ధర్మం గెలవాలన్న శుభాకాంక్షతో దానిని ధర్మక్షేత్రం అన్నాడు వ్యాసుడు.

క్షేత్రం అనే పదానికి ముఖ్యమైన అర్థాలు మూడున్నై. భూమి, భార్య, శరీరం. భూమి అర్థంలో పంట భూమి, యుద్ధ భూమి రెండూ వస్తై. ధర్మక్షేత్రం అనడంలో ప్రధానంగా కురుక్షేత్రాన్నే ఉద్దేశించినా, శరీరం అనే అర్థం కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. శరీరం కూడా ఒక యుద్ధ రంగమే. ఈ రంగంలో నిరంతరం పోరాడుకొంటున్న శత్రువులు ఆర్గురు. వాళ్ళు కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం. వీటినే అరిషడ్వర్గాలంటున్నాం. ఈ అరిషడ్వర్గాల అంతర్యుద్ధానికి సేనాపతులై వున్నట్టివి సత్వ రజస్తమో గుణాలు.

యుద్ధంలో విజయం కోసం కౌరవ, పాండవ సేనలు ఎలా విజృంభించి పోరాడాయో, జీవితంలో విజయం కోసం శరీరంలోని సదసత్తులు నిత్యం అలా ఘర్షణ పడుతూనే వున్నై. బయటా, లోపలా కూడా మానవుడు విజయం సాధించాలంటే – అందుకు ఏం చెయ్యాలో, ఎలా ప్రవర్తించాలో, ఏయే శత్రు శక్తుల్ని నాశనం చెయ్యాలో, ఏయే మిత్ర శక్తుల్ని పెంపొందించుకోవాలో స్పష్టంగా చెప్పడమే భగవద్గీత ఉద్దేశం. ఈ మొదటి శ్లోకం కలిగిస్తున్నది ఈ స్ఫూర్తినే.

అయితే, మానవ జీవితంలోని ప్రాపంచిక, ఆంతరంగిక జీవ స్వభావానికి ఇంతటి సమాన ప్రాధాన్యాన్ని వ్యాసుడిస్తే – అంతటి బాధ్యతాయుతంగానూ దానిని లోకం గుర్తించ గలిగిందా?

లోకానికి చెప్పవలసిన వాళ్ళు సంస్కృత భాషను చక్కగా అర్థం చేసుకొన్న పండితులు, వ్యాసుడి హృదయాన్ని స్పష్టంగా గుర్తించగలిగిన వాళ్ళు జ్ఞానులు. అయితే,

భగవద్గీతకు ఈ విషయంలో పట్టిన దురదృష్టం ఏమిటంటే, నిష్పక్షపాతంగా, స్వప్రయోజన దృష్టి లేకుండా, ఉన్నదున్నట్టు లోకానికి వెల్లడిచేయగల, ప్రజలకు తెలియపరచగల మేధావులు భాష్యకారులుగా లభించకపోవడం.

వాస్తవ జీవితంలో, జీవిత పోరాటంలో విఫలురైన బలహీనులు, పిరికి వాళ్ళు, జడులు, సన్యాసులు, సోమరులు భగవద్గీతకు భాష్యకారులు కావడం వల్ల వాస్తవ లోక దృష్టి మరుగై పోయి, కేవల ఆధ్యాత్మిక చర్చలే వెలుగులోకి రావడం జరిగింది.

ప్రతి యువకుణ్ణీ ఒక అర్జునుడిగా తీర్చిదిద్దవలసిన భగవద్గీతకు ద్వైతమనీ, అద్వై తమనీ, విశిష్టాద్వైతమనీ, కృష్ణ చైతన్యమనీ రంగు రంగుల కాషాయ వస్త్రాలను తొడిగారు – అకర్మణ్యులైన భాష్యకారులు.

''వ్యాఖ్యాతలు వైదిక మత సంప్రదాయాను సారము సామాన్యముగను, 'కర్మకు' వర్ణాశ్రమాచార కర్మగను 'అకర్మకు' సన్యాసముగను వ్యాఖ్యానములను చేసిరి. గీతా వ్యాఖ్యా తలు చాలా మంది సన్యాసులగుట వలన సన్యాసార్థము ప్రాబల్యమును గాంచినది'' అన్నారు కాశీనాధుని నాగేశ్వర రావుగారు, తాము వ్రాసిన గీతాభాష్యంలో. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడూ, కర్మయోగీ కనుక వాస్తవాన్ని అంత స్పష్టంగా ప్రకటించ గలిగారు.

భగవద్గీతకు వేదాంతపరంగా మాత్రమే ప్రాచుర్యం కలగడానికి, అదొక మెట్ట వేదాంతంగా అపప్రధ పొందడానికి కారణం దాని ప్రధాన ప్రయోజనం, ఉద్దిష్ట కర్తవ్యం పూర్తిగా మరుగై పోవడం. దీనంతటికీ కారణం భగత్సింగుల్లాంటి, అల్లూరిలాంటి, నేతాజీ లాంటి, అంబేడ్కరు లాంటి కార్యశూరులైన యువకులు గీతను చేపట్టకపోవడం. ఈ సత్యాన్ని ప్రకటించడం కోసమే నేనీ ఋజు భాష్యానికి పూనుకొన్నది.

నరుడి విషాద ప్రవృత్తి

నరుడికి శతాధిక క్లిష్ట పరిస్థితులలో సహస్రాధిక మనో వైకల్యాలు కలుగుతూ వుంటై. నిరుత్సాహం, నిరాశ, నిస్పృహ, విషాదం, వైరస్యం, వైరాగ్యం, చికాకు, శంక,

చింత, కారుణ్యం, మమకారం, లోభత్వం, క్లీబత్వం వగైరా ఎన్నో రకాల మనోవైకల్యాలు. బలహీనతలకు లంగి పోయి, కృంగిపోయే దురదృష్టక్షణాలు తటస్థపడని జీవితమంటూ వుండనే వుండదు. అలాంటప్పుడు ఏ నరుడైనా ఏం చెయ్యాలి?

ఉత్సాహం కలిగినప్పుడు ఉవ్వెత్తున ఎగిసిపడాలా? నైరాశ్యం కలిగినప్పుడు పాతాళపు లోతుల్లోకి క్రుంగిపోవాలా? ఏం చెయ్యాలి?

ఎట్టి పరిస్థితులలోనైనా సరే నరుడు నిశ్చల మనస్కుడు కావాలి అంటున్నది భగవద్గీత.

తబ్బిబ్బు పడవద్దు. తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు. సహస్రాధిక జీవరాశుల్లో నీ వొకడివి. ఏ జీవి జీవిత పరిధి ఆ జీవికుంది. నీ పరిధిని నీవు ముందు గుర్తించు. అట్టి నీ పరిధిని నీవు అధిగమిస్తున్నావో, మరొక జీవిని నీ పరిధిలోకి అధిగమించ నిస్తున్నావో జాగ్రత్తగా పరిశీలించు. అట్టి రెండు పద్ధతులూ సహజ ధర్మాన్ని అతిక్రమిస్తున్నట్టివే.

నీవు దురాక్రమణ చెయ్యకూడదు. నీపై మరొకరి దురాక్రమణను సహించకూడదు.

నిన్ను నీవు అర్థం చేసుకో! లోకాన్ని అర్థం చేసుకో! సాంఘిక విధి నిషేధాలను సహజ ధర్మాలనుకోవద్దు. లోభ మోహాలకు లంగిపోవద్దు. స్థిర చిత్తంతో ఆలోచించు. స్థిత ప్రజ్ఞుడివై పురోగమించి. స్వధర్మం ఏమిటో తెలుసుకొని కర్తవ్యాన్ని నిర్వహించు అంటూ ఉద్బోధిస్తున్నది భగవద్గీత. ఉద్బోధ బాగానే వుంది. అయితే, ఆచరించడం ఎలా?

కష్టం కలిగింది. దుఃఖం వచ్చింది. కారుణ్యం కలిగింది. కర్తవ్యం సడలింది. కరవ మంటే కప్పకు కోపం, విడవ మంటే పాముకు కోపం. రెండూ ఆపదలో వున్నట్టివే. ఒకదాని రక్షణ మరొకదాని మృత్యువు. కప్పను తినకుంటే పాము చస్తుంది. పాము తినేస్తే కప్ప చస్తుంది. ఈ విధి విలాస దృశ్యం నరుడి ముందున్నది. పరిష్కారం అతడి చేతిలో వున్నదను కొంటే, అతడేం చెయ్యాలి? శిబి చక్రవర్తిలా ఆత్మార్పణ చేసుకోవాలా? అప్పుడు తాను చస్తాడు.

కురుక్షేతంలో, యుద్ధారంభంలో ఉభయ సైన్యాలనూ పరికించి చూచిన నరుడికి కలిగిన మనోవైకల్యం ఇది. నరుడు అంటే అర్జునుడు. వాస్తవం దృష్ట్యా అక్కడ కురుక్షేతంలో

అర్జునుడు, సర్వజనికతా దృష్ట్యా నరుడంటే సామాన్య మానవుడు. అటు ఆ అర్థం, ఇటు ఈ అర్థం. ఉభయత్రా కూడా మానవుడి మనస్సు అస్థిమితంగా వున్న పరిస్థితిలో, అతడికి కర్తవ్యస్ఫురణ కలిగించవలసి వుంది. అదీ భగవద్గీత చేసిన పని.

మానవ జీవిత రహస్యాలను – కర్తవ్యాలను, బాధ్యతలను వెల్లడించడానికి వేద వ్యాసుడికి లభించిన గొప్ప అవకాశం ఈ సన్నివేశం. దానిని ఆయన పూర్తిగా వాడుకొన్నాడు.

వాస్తవంగా యుద్ధ రంగంలో అర్జునుడికి కృష్ణుడు చేసిన హితోపదేశం కొద్దిపాటిదిగా వుండి వుండవచ్చు. దానిని వ్యాసుడు ఆ తర్వాత విపులీకరించి వుండవచ్చు. అయినప్పటికీ ఈనాడు గీతలో కనిపిస్తున్న ఇన్ని వైరుధ్యాలూ ఇన్ని పునరుక్తులూ మూల రచనలో వుండి వుండవు. అందుకే సునిశితమైన పరిశీలన అవసరమైంది.

ప్రక్షిప్తాలకు కారణం ఆయా ప్రక్షేపకులు తమ తమ భావాలకు గీతాధికారం పొందాలనుకోవడం. పునరుక్తులకు కారణం కూడా అదే.

ధర్మం – అధర్మం

ధర్మం సరే! అది సహజ ప్రవర్తన. మరి అధర్మం ఏమిటి? ఎక్కడిది?

అధర్మమూ సహజ ప్రకృతే!

సృష్టిలోని ప్రతి జీవీ ఒకదాని నొకటి తినేస్తూ వుంటుంది. తినడం అనే క్రియ తినేదానికి ధర్మం, తినబడే దానికి అధర్మం. ఈ విధంగా ఒకే పనిలో ధర్మా ధర్మాలు రెండూ వుంటున్నై. అదీగాక ధర్మం నుంచి అధర్మం పుడుతూ వుంటున్నది.

ఒక పని అంటే ఒక కర్మ జరుగుతూ వున్నప్పుడు, దానితోపాటే దానిని నిరోధించే వికర్మ కూడా వుంటున్నది. విత్తనంలోనే వికాసమూ, విలయమూ కూడ వున్నై కదా!

ప్రకృతిలోనూ, మానవ జీవితంలోనూ, శరీరంలోనూ కూడ ప్రతి కదలికా ధర్మ క్షేత్రమే. కదలిక అంటే ముందుకో, వెనకకో, ప్రక్కలకో, పైకో, క్రిందికో గమించడం. గమనంలోనే గమన నిరోధకత కూడా వుంది. కాగా ప్రచోదక, నిరోధక శక్తుల మధ్య అట్టి ధర్మ క్షేత్రం నిత్య కురుక్షేత్రమే అవుతుంది.

ప్రకృతిని అలా వదిలేసి, మానవ జీవితాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకొంటే – ఆర్థిక, విద్య, సాంఘిక, రాజకీయ, వ్యాపార, ఉద్యోగ మొదలైన అన్ని రంగాలలోనూ, ప్రతి ఘట్టంలోనూ రాగద్వేషాల మధ్య, అనుకూల ప్రతికూల శక్తుల మధ్య, శిష్ట, దుష్ట వర్గాల మధ్య స్పర్ధ, ఘర్షణ, పోటీ, పోరాటాలు చెలరేగుతూనే వున్నై.

కనుక జీవితం ప్రాథమికంగా, స్వాభావికంగా ఒక యుద్ధ రంగమనీ, పురుషార్థాలలో నీవు దేనిని సాధించదలచినా శత్రు శక్తులను ఢీకొనక తప్పదనీ, వెనకడుగువేసి ప్రయోజనం లేదనీ నరుడికి బోధిస్తున్నాడు నారాయణుడు.

కనీసం ఒక మనిషిగా బ్రతకడానికయినా ప్రతికూల శక్తుల్ని ఎదుర్కోక తప్పదు. పోరాటమే ప్రకృతి నైజం. ఎదిరించి నిలబడగలిగితేనే బ్రతికే అవకాశం వుండేది. ఘర్షణలో గెలవకపోయినా, ఓడకుండా వుంటే బ్రతికే అవకాశం వుంటుంది. గెలిస్తే స్వేచ్ఛగా పురోగమించ వచ్చు. ఓడిపోతే మాత్రం దాస్యం తప్పదు. దాస్యమంటే ఆత్మ వినాశమే కదా?

ఇక్కడ మరొక సత్యం చెప్పాలి.

ఏ జీవి గుణాలైనా ఆ జీవికి శత్రువులు కావు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అవి కల వ్యక్తికి శత్రువులు కావు. జీవిత పోరాటంలో విజయం సాధించడానికి తోడ్పడే సాధన సంపత్తులవి. అస్త్ర శస్త్రాలవి. చతురంగ బలాలవి. వాటి యజమాని ఆత్మ. ఆత్మ ప్రబోధాన్ని ధిక్కరించి అవి అదుపు తప్పినప్పుడే అవి శత్రువు లవుతాయి.

త్రిగుణాలు అదుపు తప్పి త్రిదోషాలు అవుతై. ప్రకృతిలోని ఏ గుణమైనా అంతే. ఎంతో సహనంతో కష్టపడి నిర్మించుకొన్న ఉపాధిని ఒక్క ఉద్రేకపు ప్రేలుడు, ఒక్క ఉన్మాదపు విస్ఫోటనం సర్వనాశనం చెయ్యగలుగుతుంది. గుణాలను వలెనే వాటి ఉద్రేకాలను కూడా దేశ కాల పాత్రలను బట్టి నడుపుకోవాలి. వాటిపై ఆత్మకు కంట్రోలు వుండాలి.

''తన కోపమె తన శత్రువు'' అనేది సర్వత్రా నిజం కాదు. ఎట్టి క్రియాచరణకైనా చోదక శక్తులు ఉద్రేకాలే. కోపం రావలసిన తరుణంలో – అంటే, ప్రాణ విత్త మాన భంగ సందర్భాలలో – కోపం రాకపోతే జరిగే నాశనం కంటే, కోపం వస్తే జరగగల నష్టం

తక్కువ. మనిషి మనిషిగా బ్రతకడానికి కామ క్రోధాదుల సముచిత ప్రయోగం చాలా ముఖ్యం.

అనేక వైరుధ్యాల సంకుల సంఘర్షణల మధ్య భద్రంగా పురోగమించవలసిన కత్తి మీద సాము మానవ జీవితం.

వెలుగున్నప్పుడు నీడ వుంటుంది. ప్రాణం ఉన్నప్పుడు అపానం వుంటుంది. పాజిటివ్, నెగిటివ్ శక్తులు సహజమైనట్టివి. నిరోధక శక్తిని నిరోధించి, నిర్జించి ముందుకు పోకపోతే ప్రగతి లేదు.

కురుక్షేత్రంలో అర్జునుడు లోనైన విషాదమూ, దానిని తొలగించవలసిన కృష్ణుడి కర్తవ్యమూ రెండూ సహజమైనట్టివే. అర్జునుడి విషాదంలో మంచి చెడ్డల, కర్తవ్యాకర్తవ్యాల వితర్కం వుంది. ఎదుటి వాణ్ని చంపే కంటే తాను చావడం ఉత్తమం కాదా? అని ఆలోచించే సందర్భాలుంటై. తాను తిండి మానుకొని అవతలి వాడికి భోజనం పెట్టడం చాలా సందర్భాలలో మంచిదవుతుంది. ఒక విశాల ప్రయోజనం కోసం, విస్తృత సౌభాగ్యం కోసం తాను త్యాగాలు చెయ్యడం శోభస్కరమై వుండవచ్చు. ఏది మంచి? ఏది చెడు? అసందిగ్ధంగా తేల్చుకోలే నప్పుడు, మిత్ర వాక్యం పాలించదగింది. అట్టి మిత్రవాక్యాన్ని అర్జునుడికి ప్రసాదించిన వాడు కృష్ణుడు.

ఏది మంచి? ఏది చెడు?

అంతమంది బంధువుల్ని చంపి తాను రాజయ్యే కంటే, యుద్ధం మాని తాను చావడమే మంచిది కదా! అనే ఆలోచన అర్జునుడికి వచ్చినపుడు, కాదు అని చెప్పినవాడు కృష్ణుడు.

వాళ్ళు బ్రతికి నీవు చావడం కంటే, నీవు బ్రతికి వాళ్ళు చావడమే మంచిది. ఎంత గొప్ప జీవిత సత్యం! ఇదొక్కటే జీవిత సత్యం – మరొకటేదీ కాదు అన్నంత గొప్పగా చెప్పాడు. నిర్ధారణగా చెప్పాడు.

చావడమంటూ వచ్చినప్పుడు, ఎవరు చచ్చినా ఒకటే కదా? కాదు! ధర్మం బ్రతకాలి. అధర్మం చావాలి. ధర్మం అంటే అత్యధిక ప్రాణికోటికి శ్రేయస్సు కూర్చేది.

అధర్మం అంటే కేవలం కొద్ది మందికిమాత్రమే స్వార్థం నింపేది. మిత్రుడు ఉపకారం చేసేవాడు. మిత్ర రక్షణ, శత్రు శిక్షణ సహజ ధర్మం. కురుక్షేత్రంలో సార్వజనిక శ్రేయస్సంబంధమైన ధర్మం పాండవ పక్షంలో వుంది. స్వార్థ నిష్ఠమైన అధర్మం కౌరవులది. అట్టి స్థితిలో కౌరవులు ఓడకా తప్పదు. పాండవులు గెలవకా తప్పదు.

మానవ వేదాంత తత్వానికి పరమ పారమ్యంగా వేద వ్యాసుడు నిర్మించినట్టిది ఈ గీత. విశ్వమానవ ధర్మ సంహిత ఇది. ఇది తర్వాత, కులతత్వ వాదులైనా కుహనా పండితుల చేతుల్లో పడి, సంకుచిత సనాతన వర్గానికి పరిమితమై పోవడం దురదృష్టకరం.

అప్పటికే దళితమైపోతున్న భారతీయ సాంఘిక వ్యవస్థను, పని విభజన, కుల విభజనగా కరడు గట్టుకు పోతున్న భారతీయ సామాజిక వ్యవస్థను రక్షించడానికి కూడ వేదవ్యాసుడు తుది ప్రయత్నం చేశాడు గీతలో. అయితే –

ధర్మం అంటే వర్ణాశ్రమ ధర్మం అనీ, కర్మ అంటే పూర్వ జన్మ కర్మ అనీ గీతలో ఎక్క డుంది? ఎక్కడా లేదు! భాష్యకారుల అర్థ వివరణ కూపాలలో వుంది.

కృష్ణుడు ఒక్క సనాతన హిందూ వర్గానికి మాత్రమేనా భగవంతుడు? ప్రపంచాని కంతటికీ, ప్రాణి కోటి కంతటికీ భగవంతుడు కాదా?

కృష్ణుడు భారత జాతికి మాత్రమేనా చాతుర్వర్ణ్య వ్యవస్థను అంటకట్టింది?

నిజంగా అనాసక్తంగా పని చెయ్యమని, ఏ ఫలాన్నీ ఆశించకుండా కర్మ చెయ్యమని కృష్ణుడు చెప్పాడా? గీతలో ఎక్కడుంది? అనాసక్త యోగం, నిష్కామ కర్మ, పూర్వ జన్మ సంస్కారం వంటి మాటలకు అర్థాలేమిటి? వ్యాఖ్యాతలూ, భాష్యకారులూ చెపుతున్న ఈ మాటలు మొత్తం గీతా హృదయాన్నే భంగ పరచడం లేదా?

ఒక చిన్న ఉదాహరణ చూడండి.

ఒక చండాలుడి వల్ల అద్వైత తత్వాన్ని గ్రహించిన శంకరాచార్యుడు 'చండాలుడే నా గురువు' అంటూ మనీషా పంచకం వ్రాశాడు. ''చండాలోస్తు సతు ద్విజోస్తు గురు రిత్యేషా మనీషా మమ'' అంటూ చండాలుణ్ణి గురువుగా స్తుతించాడు. ఆ చండాలుడి

కులదైవమైన ''మాతంగి''కి ''మతంగ ముని కన్యకాం మధుర భాషిణీ ఆశ్రయేత్'' అంటూ సాష్టాంగ పడ్డాడు.

అంతటి మహా మనీషి, ''అహం బ్రహ్మాస్మి'' అంటూ అద్వైత మతాన్ని నెలకొల్పిన బ్రహ్మజ్ఞాని శంకరాచార్యుడు కూడా భగవద్గీతకు తన భాష్యంలో కులాతీతతను ప్రతిపాదించ లేక పోయాడు. గమనించండి!

ఇదే విధంగా ప్రతి మతాచార్యుడు గీతను తన మత ప్రచారానికి వాడుకొన్నాడే తప్ప, ఏదో ఒకమతానికి పరిమితం చేశాడే తప్ప, సర్వజనామోదకరంగా వ్యాఖ్యానించలేక పోయాడు!

భగవద్గీత వెలువడే నాటికి దేశంలో అనేక మతాలున్నై. మతాన్ని 'యోగం' అన్నాడు వేదవ్యాసుడు. సాంఖ్యయోగం, జ్ఞానయోగం, విజ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం వంటి వన్నీ మతాలే. ఎన్ని మతాలైనా చివరకు భక్తి యోగంలోనే విలీనమైపోతాయని ఆయన తేల్చాడు. అప్పటికి అమల్లో వున్న మతాలన్నిటినీ అధ్యాయాలుగా చేర్చి ''సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'' అంటూ ఏకైక భక్తి మార్గాన్ని ప్రతిపాదించాడు.

సమస్త మత సమన్వయ రూపమైన భగవద్గీతను వ్యాఖ్యాతలు మళ్ళీ మత ఖండాలుగా చేసి వెయ్యలేదా? వ్యాసుడు చేసిన ఏకీకరణను భగ్నం చెయ్యలేదా? శంకరాచార్యుడైనా కుల వ్యవస్థను ఖండించి జాతిని సమైక్యపరచి వుండవలసింది. అలా జరగకపోవడం భగవద్గీత దురదృష్టం. అది పుట్టిన జాతి దురదృష్టం.

ఆత్మావిష్కరణ

భారతీయ వేదాంత దర్శనాలైన ప్రస్థాన త్రయంలో భగవద్గీతను ఒకటిగా చేర్చారు. అలా చేర్చకూడదు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు వేదాంత దర్శనానికి చాలు. భగవద్గీతలో వేదాంత దర్శనం వున్నప్పటికీ, జీవిత దర్శనంలో అదొక భాగంగా వుంది.

వేదాంత మొక్కటే జీవితం కాదు. సంపూర్ణ జీవితాన్ని నాలుగు ధర్మార్థ కామ

మోక్షా లుగా దర్శించినప్పుడు, చివరి నాలుగో దశ మాత్రమే వేదాంతం. తక్కిన మూడు దశలూ జీవితమే. సంపూర్ణ జీవితంలోని నాలుగు దశలనూ చక్కగా వివేచించి చూపే సంపూర్ణ దర్శనం భగవద్గీత. దానిని మొత్తంగా కట్ట కట్టి వేదాంత గ్రంథాల జాబితాలో చేర్చేయడం సహించరాని నేరం. కనుక వేదాంత గ్రంథాలుగా ఉపనిషత్తులనూ, బ్రహ్మసూత్రాలనూ పేర్కొంటే చాలు.

భగవద్గీతను సంపూర్ణ జీవిత కాంక్షాపరులైన ప్రజలకు ఇచ్చివెయ్యడం మంచిది.

అధర్మం చేతిలో ధర్మం దెబ్బతింటున్నది కనుక, ధర్మపక్షం వహించి పోరాడవలసి వుంది. విజయం సాధించవలసి వుంది. అందుకు మరొక ప్రతివాదం లేదు.

''తస్మాత్ ఉత్తిష్ఠ! జహి శత్రుం! యుద్ధం చెయ్యి! ఫలితం గురించి బెంగ పెట్టుకోకు! నీవు చెయ్యవలసింది పని మాత్రమే. ఫలితం భగవంతుడికి వదిలెయ్! ఫలితం ఏమవుతుందో అనే చింతతో, పనిచెయ్యడం మానకూడదు. పాప పుణ్యాలు, ధర్మాధర్మాలు, దయాదాక్షిణ్యాలు వంటివన్నీ భగవత్పరం చేసి, స్థిత ప్రజ్ఞతతో నీ కర్తవ్యాన్ని నీవు నిర్వహించు'' అంటున్నది భగవద్గీత. ఇది వట్టి వేదాంత గ్రంథమెలా అవుతుంది?

అయితే ఇందులో వున్న వేదాంత మెలాంటిది? మానవుడు జీవిత పురోగమనంలో ధర్మార్థ కామాలను సంతోషంగా నిర్వహించుకొంటూ వెళుతున్నప్పుడు చివరగా కలిగే అనుమానం ఒకటుంది. మరణం తర్వాత ఏమున్నది? అనేది.

పుట్టిన ప్రతి లవమూ మరణిస్తున్నది. జాతి, మత, వర్గ భేదాలేవీ మృత్యువుకు లేవు. రాజూ చస్తున్నాడు. సేవకుడూ చస్తున్నాడు. చచ్చిన తర్వాత ఎవరు ఏమవుతున్నారో, ఆ తర్వాత ఏమైనా వున్నదో, లేదో ఎవరికీ ఏమీ తెలియడం లేదు. పర్యవసానం ఏమిటి?

ఈ అనుమానాన్ని ప్రతీ జీవీ – ముఖ్యంగా మానవుడు ఏదో వొక దశలో నివృత్తి చేసుకోవలసి వుంది. మరణానంతరం తానేమవుతాడో ఇదమిద్ధంగా తేల్చుకోవలసి వుంది. ప్రత్యక్ష ప్రమాణం లేకపోయినా తర్కం ద్వారానైనా ఒక నిర్ణయం తీసుకోవలసి వుంది. అందుకు గురువులు, ప్రవక్తలు, వేదాంత చింతకులు సహాయపడుతున్నారు. వాళ్లు తమకు తోచిన విధంగా తలక మాటా చెపుతున్నారు. మరణానంతరం జీవిత

సౌఖ్యం కోసం తలక దారీ చూపుతున్నారు. మరణానంతరం తానేమవుతాడో తెలుసుకోవడం ప్రతి మానవుడికీ సహజగుణం. మరణమే ముగింపు కాదని, శరీరం పోయినా ఆత్మ బ్రతికే వుంటుందని, మంచికి స్వర్గమూ, చెడుకు నరకమూ వుంటాయని నమ్మకం కలిగినప్పుడే మనిషి తృప్తిగా మరణిస్తాడు.

దైనందిన జీవిత కృషిలో పూర్తిగా మునిగివుండే జన సామాన్యానికి జన్మాంతర స్థితి గురించి ఆలోచించే తీరిక వుండదు. ఆలోచించిపెట్టే వాళ్ళను ఆశ్రయించి బ్రతకవలసి వుంది. అట్టి ఆధ్యాత్మికాలోచనకు అగ్రతాంబూలం భగవద్గీతది.

లోకంలో మిత్రులు శత్రువులూ, శత్రువులూ మిత్రులూ అవుతూ వుంటారు. అలాగే శరీరంలో గుణాలు దోషాలూ, దోషాలు గుణాలూ అవుతూ వుంటై. బయటి శత్రువుల్ని జయించడానికి భౌతిక బలం అవసరం. లోని శత్రువుల్ని జయించడానికి ఆత్మబలం అవసరం.

అర్జునుడికి భౌతిక బలం సమస్తమూ వుంది. ఆత్మబలం లోపించింది. దానిని కలిగించడానికే కృష్ణుడు ఇక్కడ వేదాంతం చెప్పాడు.

జీవిత చైతన్య రాజ్యానికి శరీరం ఒక కోట. ఆత్మ రాజు. బుద్ధి మంత్రి. మనస్సు సేనాపతి. ఆత్మకు మనస్సు మీద సంపూర్ణాధిపత్యం వుంటే, సాధించలేనిదేమీ వుండదు.

''మనస్సు చంచలమైనట్టిది. దీనిని స్వాధీనంలో వుంచుకోవడం సాధ్యమవుతుందా?'' అంటాడు నరుడు.

సాధ్యమవుతుంది. స్థిత ప్రజ్ఞుడైన వాడికి సాధ్యం కానిదేదీ వుండదు.

''స్థిత ప్రజ్ఞత ఎలా సిద్ధిస్తుంది?''

వైరాగ్యం ద్వారా, అభ్యాసం ద్వారా, మనో నిగ్రహాన్ని సాధిస్తే అదే స్థిత ప్రజ్ఞత!

వైరాగ్యం అంటే రాగద్వేషాలు లేని సమస్థితి. ఫలితాన్ని భగవత్పరం చేసి, ఫలితం ఎటైనా ఒకటే అనుకొని, తన కర్తవ్యాన్ని తాను నిలకడతో నిర్వహించుకోవటం వైరాగ్యం. అట్టి పద్ధతిని నిరంతరంగా అనుసరించడం అభ్యాసం.

యుగం నుంచి వచ్చిన మాట యోగం. యుగం అంటే రెండు. జంట, ద్వయం, ద్వితీయం అని అర్థం. జంటను ఎప్పుడూ కలిపి వుంచే ప్రయత్నమే యోగం. ఆధ్యాత్మికమైన జంట ఆత్మ, పరమాత్మ. జీవిత పరమైన జంట ఆత్మ, మనస్సు.

ఆత్మ సంకల్పించిన ఏ పనినైనా సరే చెయ్యగలది మనస్సు. మనస్సు ఎంత ఎక్కువ విధేయంగా వుంటే, జీవితం అంత ఎక్కువ విజయవంతం అవుతుంది.

మనస్సును స్వాధీనంలో వుంచుకొనేదే ఆత్మ యోగం. అదే క్రియా యోగం. అదే తపస్సు. అదే సవికల్ప సమాధి. అట్టి పరిపూర్ణమైన ఆత్మయోగం సిద్ధించిన వ్యక్తి సంకల్ప సిద్ధుడు కాగలడు. మహిమలు చూపగలడు. మహా విద్యలు ప్రదర్శించగలడు.

మనస్సుతో కూడుకొన్న ఆత్మ పరమాత్మలో విలీనం కావడం సులభం. అట్టి సిద్ధి దానంతటదే కలుగుతుంది. అట్టివాడు జ్ఞాని. జీవ బ్రహ్మైక్యాన్ని సాధించిన పురుషోత్తముడు.

కర్మయోగం, జ్ఞానయోగం మొదలైనవన్నీ ఈ ఆత్మ యోగంలోవే.

ఎన్ని యోగాలైనా మనో నిగ్రహం తోడివే. ఏకాగ్రత తోడివే. అయితే అవి కష్ట సాధ్యాలు. భక్తి యోగ మొక్కటే అందుకు సులభ సాధ్యమైనట్టిది. భగవంతుడికి తనను తాను పూర్ణార్పణ చేసుకొని, వైరాగ్యంతో కర్మాచరణ చేస్తూ ముందుకు పోయిన వాడే సంపూర్ణ మానవుడు అనేది గీతాతత్వం.

భగవంతుడంటే ఒక వ్యక్తి కాదనీ, అదొక పరమ శక్తి అనీ, ఆ పరమ శక్తే తనకు తాను సృష్టిస్థితి లయాలు పొందుతున్నదనీ, పని చెయ్యడమే జీవి కర్తవ్యమనీ స్పష్టపరచింది గీత. జీవిత సిద్ధికోసమే యోగనిష్ఠ కావాలన్నది. యోగనిష్ఠను సాధించే వివిధ పద్ధతులనూ సూచించింది.

ఈ సృష్టి, ఎక్కడి నుంచో భగవంతుడనే ఎవరో ఒక వ్యక్తి చేసింది కాదు. కర్త అయిన వాడెవడూ లేడు. ప్రకృతి సర్వ స్వతంత్రమైనట్టిది. దాని ప్రవర్తనకు బీజం పరమాత్మే అంటున్న గీత ఎంత గొప్పది! నేను నా భాష్యం కోసం తీసుకొన్న సంపూర్ణ గీత ఇది! గీతలోని తదితర భాగాలన్నీ ప్రక్షిప్తాలు, పునరుక్తాలు.

ఆధునిక విజ్ఞాన రంగం

కార్య నిర్వహణ (management) ప్రాధాన్యం వహిస్తున్న ఆధునిక యుగంలో నిష్కామ కర్మను బోధించే భగవద్గీత ఎందుకు పనికి వస్తుంది?

ఇదీ ఈనాడు లోకంలో సర్వత్రా చర్చించబడుతున్న విషయం.

ఒక్క ఆధునిక యుగంలోనే కాదు, ఏ యుగంలో నైనా సరే కార్య నిర్వహణే ప్రాధాన్యం వహిస్తుంది. నిజానికి భగవద్గీత పుట్టింది కూడా ఆనాడు యుద్ధ కార్య నిర్వహణ కోసమే కదా!

ఒక మహా యుద్ధానికి నరుణ్ని కార్యోన్ముఖుడ్ని చేయగలిగిన గీత ఈనాడు సామాన్య జీవిత రంగాలలో కార్య నిర్వహణను ప్రోత్సహించడానికి ఎందుకు పనికిరాదు?

ఈ కార్యాన్నైనా జయప్రదంగా నిర్వహించడం ప్రధానం. అందుకు అవలంబించే పద్ధతు లెలాంటివైనా ఫర్వాలేదు. ఇదీ గీతా దర్శనం. ప్రధానం ఫలితం. సాధనం కాదు. ఫలితం కోసమే పనిచెయ్యి. ఫలితం వ్యతిరేకమైతే బాధపడకు. దుఃఖపడకు. ఇదీ గీతా దర్శనం. ఇంతకంటే లోకంలో ఏ దర్శనం మాత్రం ఏం చెప్పగలదు?

ఒక్క మహాభారతంలోనే కృష్ణపాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను గమనిస్తే – భీష్ముడు, ద్రోణుడు, సైంధవుడు, దుర్యోధనుడు, జరాసంధుడు మున్నగు మహావీరుల వధ ఎలా సాధ్యమైంది? ప్రతిభావంతమైన కృష్ణుడి నిర్వహణ వల్లనే కదా!

''జహి శత్రుం మహాబాహో'' అంటూ అర్జునుడ్ని ఉత్తేజ పరచిన కృష్ణుడు నిష్క్రియ (Inaction)ను బోధించాడంటే ఎలా నమ్మడం?

నిష్కామ కర్మనూ, అనాసక్త యోగాన్నీ, ఫల త్యాగాన్నీ, నిష్క్రియనూ బోధించిన వాళ్ళు భాష్యకారులూ, వ్యాఖ్యాతలూ అయిన సన్యాసులు – కృష్ణుడు కాదు.

కృష్ణుడు బోధించింది ''పనిచెయ్'' అని. ''కర్మ చెయ్'' అని.

''ఏది జరిగినా మన మేలు కోసమే. కర్తవ్య నిర్వహణలో పుణ్య పాపాల ప్రసక్తే లేదు. నీ ధర్మం యుద్ధం చెయ్యడం. గెలిస్తే రాజ్యం, చస్తే స్వర్గం.''

యుద్ధం చేస్తే ఫలితం రెండు విధాలుగా వుంటుంది – విజయం, మరణం.

విజయానికి ఫలం రాజ్యాధికారం. మరణానికి ఫలం వీర స్వర్గం. రెండు విధాలకూ రెండు రకాల ఫలాలు చూపబడ్డై. ఇందులో ఫల త్యాగం ఎక్కడుంది?

''కర్మ చెయ్యడం వరకే నీకధికారం. దాని ఫలితం మీద నీకధికారం లేదు'' అనే దానిని నిష్కామ కర్మ అనడం తప్పు కాదా?

ఫలితాన్ని ఆశించకుండా అనాసక్తంగా పనిచెయ్యమనడం వెట్టి చాకిరి చెయ్యమనడమే. వెట్టి చాకిరి చెయ్యడం అసహజం. ధర్మ విరుద్ధం. అట్టి ధర్మ విరుద్ధ బోధను గీత చేసిందనడం గీతకు ద్రోహం చెయ్యడం.

గుణాలు - వ్యక్తులు

ఏ గుణ విశేషం కలిగిన వ్యక్తి ఏ పని చెయ్యడానికి పనికి వస్తాడో గీత స్పష్టంగా చెప్పింది.

గుణాలు స్థూలంగా మూడు. సత్వం, రజస్సు, తమస్సు. ఈ మూడు గుణాలకూ ప్రత్యేకంగా విష్ణువూ, బ్రహ్మా, శివుడూ కల్పించబడ్డారు. శాంత గుణానికీ, కోప గుణానికీ, తమో గుణానికీ ఆ ముగ్గురూ రూప కల్పనలు. మానవులలోని (సకల ప్రాణులలోనూ అనవచ్చు) వివిధ గుణాలకు ఆ ముగ్గురూ ఆదర్శప్రాయులు. శాంతంలో బలమైన క్రియా శక్తి వుంది. కోపంలో అహంకారం వుంది. తామసంలో గుడ్డి పోకడ వుంది.

క్రీడా, విద్యా, వ్యాపార, రాజకీయ, యుద్ధ - ఏ జీవిత రంగంలోనైనా సరే - సమర్థ వంతమైన నిర్వహణకు ఆయా రంగాలకు పనికి వచ్చే గుణాలుగల వ్యక్తులు ఎంత అవసరమో గీత వివరిస్తున్నది. ఇంతకంటె కార్య నిర్వహణకు మార్గదర్శకత్వం మరేం కావాలి?

సిగ్గుపడకుండా నాట్యం చెయ్యగలదీ, జాలిపడకుండా ప్రాణం తియ్యగలదీ తమో గుణమే. సంప్రదాయాన్ని, ఒక నిర్దిష్ట ప్రణాళికను మరొక ఆలోచన లేకుండా ఆరాధనా భావంతో శ్రద్ధాళువై అనుసరించగలదీ తమో గుణమే. నాయకత్వ స్థాయిలో తప్ప, కార్య నిర్వహణ రంగాలకు పనికి వచ్చే వాళ్ళంతా తామసికులే.

నాయకత్వం, మార్గదర్శకత్వం వహించవలసింది సత్వగుణం. తెల్లని సూర్య కిరణంలో అన్ని రంగులూ కలిసి వున్నట్టు సత్వగుణంలో అన్ని గుణాలూ అంతర్లీనమై వున్నై.

పరాక్రమ క్రియా రంగానికి కావలసింది రజో గుణం.

ఏ వ్యక్తి ఏ గుణ వర్గానికి చెందుతాడో గుర్తించి, ఆ వ్యక్తిని అందుకు సంబంధించిన కార్యనిర్వహణకు నియమిస్తే, మరి ఆ వ్యక్తికి అపజయం ఎందుకు వుంటుంది?

కాగా, ఆధునిక వ్యాపార రంగానికి, కార్యనిర్వహణ విధులకు భగవద్గీత చక్కని మార్గదర్శకమై వుంది.

ఇంతవరకూ గీతకు భాష్యాలు వ్రాసిన వాళ్ళంతా ''అనాసక్త యోగం'' అనే భ్రాంతిలో పడి కొట్టుకుపోవడంవల్ల, గీత నిజస్వరూపం లోకానికి సాక్షాత్కరించలేదు.

గాంధీజీ వంటి రాజకీయ నాయకుడు గీతను స్పృశించినప్పుడు, దానిని అనాసక్త సన్యాస యోగంగా కాక వీర కావ్యంగానే చేబట్టవలసింది. పరతంత్ర భారతంలో స్వాతంత్ర్య సమర సాధనాలుగా ఖాదీ, గృహ పరిశ్రమలూ, ఉప్పు తయారీ, మద్య నిషేధమూ, అస్పృశ్యతా నిర్మూలనా, అహింసా, సత్యాగ్రహమూ వంటి నాటు ఉద్యమాలను చేపట్టినప్పుడైనా గాంధీజీ వాటి నిర్వహణకు అనాసక్తతను చేర్చకుండా వుండవలసింది. అనాసక్తంగా ఎవరేది చేయాలనుకొన్నా అందులో క్రియ వుండదు. నిజాయితీ ఉండదు.

ఇంతవరకూ భగవద్గీతను యథాతథంగా అర్థం చేసుకొన్న వాళ్ళు లేరు. బహుశా కృష్ణుడు కూడా ఇది గుర్తించి వుంటాడు. అందుకే మొత్తం గీతనంతా బోధించిన తర్వాత ఆయన అర్జునుడ్ని అడిగాడు –

''ఓ నరుడా! నేనింతవరకూ చెప్పిన దానిని నీవు తిన్నగా విన్నావా?'' అని.

ఒక్క అర్జునుడికే కాదు, మనందరికీ వేసిన ప్రశ్న ఇది. జవాబు చెప్పండి!

అవతార వాదం - స్థూల పూజ

పండిత శ్రీ ముక్తిరామోపాధ్యాయ, పండిత గోపదేవ శాస్త్రి వంటి ఆర్య సామాజికాచార్యులు అవతార వాదాన్ని, విగ్రహ పూజను ఒప్పుకోలేదు. ఈ రెండూ ఈనాడు హైందవ సమాజానికి పట్టుకొమ్మలుగా వుంటున్నై.

అవతారవాదాన్ని కాదనే వాదంతో నేను ఏకీభవించలేను. అవతారం అంటే పై నుంచి కిందికి దిగేదే కానక్కరలేదు. అవ్యక్తం నుంచి వ్యక్తమయ్యేది కూడా అవతారమే.

గీత పరమాత్మను గురించి చెపుతున్నదే కాని దేవుణ్ణి గురించి చెప్పడం లేదు. ''నేను'' అంటున్న కృష్ణుడు పరమాత్మకు ప్రతినిధిగా పురుషోత్తమ స్థానం నుంచి మాట్లాడుతున్నాడు.

అవ్యక్తంగా వున్న పరమాత్మ వ్యక్తం కావడం అవతారం. వ్యక్తమైన ప్రతి జీవ లవమూ, జీవేతర పదార్థమూ కూడా అవతారమే. ఎన్ని జీవరాశులున్నాయో అన్ని అవతారాలున్నట్టు లెక్క. ఏ జీవిలోకి పారమాత్మిక శక్తి అత్యధికంగా వ్యక్తమవుతుందో ఆ జీవిని ప్రత్యేకంగా, రూఢిగా అవతారంగా పేర్కొంటున్నారు. అట్టి పరమ సత్తాక జీవి మానవుడు కావచ్చు, మానవేతర మైనట్టిదీ కావచ్చు.

''సంభవామి యుగే యుగే'' అంటే ఎప్పుడెప్పుడు ధర్మగ్లాని ఏర్పడుతుందో అప్పుడప్పుడు పుడుతున్నాను అని అర్థం. ధర్మగ్లాని నిత్యమూ ఏర్పడుతూనే వుంది. పరమాత్మ నిత్యమూ అవతరిస్తూనే వుంది. నీతి బోధకులు, గురువులు, సంస్కర్తలు, ప్రవక్తలు, విప్లవకారులు, ఉద్యమకారులు, సజ్జనులైన నాయకులు - ఈ విధంగా అన్యాయాన్ని, అధర్మాన్ని, దోపిడీని, పర హింసను ఎదిరించి పోరాడుతున్న శక్తులన్నీ కూడా అవతారాలే. అట్టి శక్తులతో సహకరించడమే మన కర్తవ్యం.

ఇక జడ పూజ విషయం-

జడ పూజ చేసే వాళ్ళు ఆ జడ పదార్థాన్ని జడంగా అనుకోరు. రాతి విగ్రహంలో, లోహ ప్రతిమలో, కొయ్య బమ్మలో, మట్టి పిడసలో కరుణాళువైన పరమాత్మనే దర్శిస్తారు భక్తులు. విగ్రహమే దైవమనే భావనగల మానవులుండరు. తమ కోరికకు అనుగుణమైన

రూపాన్ని కల్పించుకొని, అందులో తమ ఇష్టదైవాన్ని ఆరోపించుకొని పూజలు చేస్తారు. అందులో త్రిగుణాలకు సంబంధించిన వాళ్ళూ వుంటారు. సాత్వికుడైన యోగి కూడా దేవీ పూజ చేస్తాడు. కవి సరస్వతిని ఆరాధిస్తాడు. యోధుడు ఆంజనేయుణ్ణి కొలుస్తాడు. ఏ రూపం ద్వారా భక్తితో తనను ఆరాధించినా ఆ ఆరాధన పరమాత్మకే చెందుతుందన్నాడు కృష్ణుడు. కనుక బహు దేవతా పూజ అక్రమమైనదేమీ కాదు. అది పూర్తిగా హేతుబద్ధమైనట్టిది.

భూయః కథయ – మళ్ళీ చెప్పు

విస్తరేణాత్మనో యోగం
విభూతిం చ జనార్దన!
భూయః కథయ తృప్తిర్హి
శృణ్వతో నాస్తి మేఽమృతమ్. (10:18)

''కృష్ణా! నీవు చెపుతున్న యోగం గురించి, నీ విభూతిని గురించి వింటున్న కొలదీ అమృతం వలే ఆస్వాదించాలనే వుంది. తనివి తీరడం లేదు. మళ్ళీ చెప్పు'' అంటున్నాడు అర్జునుడు. ''భూయః కథయ'' (మళ్ళీ చెప్పు) అంటున్నాడు.

మరో చోట ''భూయః శృణు ప్రవక్ష్యామి'' (మళ్ళీ చెపుతున్నాను విను) అంటూ కృష్ణుడు చెప్పిందే చెప్పడం సాగించాడు. (10.1)

ఈ గీతోపదేశం చేస్తున్నది యుద్ధరంగంలో. శంఖాలు పూరించి, సేనలు తలపడుతున్న క్షణంలో ప్రధానమైన కార్యం అర్జునుడి విషాదాన్ని పోగొట్టడం. బంధుమిత్రులను చంపడం పాపం కాదా అన్న ప్రశ్నకు వీలైనంత క్లుప్తంగా జవాబు చెప్పి అర్జునుడ్ని యుద్ధాభిముఖుడ్ని చెయ్యడం. అయితే ఇక్కడ జరిగిందేమిటి?

తీరికగా ఆశ్రమంలో కూర్చుని వేదాంత విద్యను నేర్చుకోవడం జరిగింది. గీతలో ప్రక్షిప్తాలు చేరాయంటే అందుకు ఇంతకంటే ఉదాహరణ మరేముంటుంది? మళ్ళీ మళ్ళీ చెప్పించుకోవడం, మళ్ళీ మళ్ళీ చెప్పడం – ఇది సేనా ముఖంలో సాధ్యమా?

భగవద్గీతలోని పద్దెనిమిది అధ్యాయాలను మూడు కాండలుగా విభజించారు భాష్య కారులు. మొదటి ఆరు అధ్యాయాలూ కర్మ కాండ. తరువాతి ఆరు అధ్యాయాలూ జ్ఞాన కాండ, ఆ తరువాతి ఆరూ మోక్ష కాండ.

నా కనిపిస్తుందీ – యుద్ధ రంగంలో కృష్ణుడు చెప్పింది కర్మ కాండ మాత్రమేనని. ఆ తరువాత రెండు కాండలను కుల, మత, సంప్రదాయవాదులైన, గొప్ప భాషా పండితులైన పలు రకాల సన్యాసులు చేర్చి వుంటారని. గీత నిండా పునరుక్తులూ, వైరుధ్యాలూ, హేతుబద్ధం కాని సంప్రదాయాలూ అధికంగా వుండడానికి అదే కారణమై వుంటుందని. 'మళ్ళీ చెప్పు', 'మళ్ళీ చెపుతున్నాను' అనే మాటలతో పునరుక్తులను సమర్థించుకోవడం జరిగిందని.

యజ్ఞం – దానం – తపస్సు

పురాణ కాలంలో, మహా భారత కాలం వరకూ కూడా అనవచ్చు, వైదిక మతం యజ్ఞ, దాన, తపస్సులపై ఆధారపడి నడిచేది. పురుషార్థాలు ప్రాతిపదికగా ప్రజలు జీవ యాత్ర నడిపే వాళ్ళు. అప్పటి ప్రజా జీవిత విధానాన్ని అనుసరించి చెప్పబడినట్టిదే భగవద్గీత. ఆనాటి ప్రజలకు భగవద్గీతే మార్గదర్శక గ్రంథం. ఇప్పటి భాషలో మత గ్రంథం.

తర్వాత, తర్వాత వర్ణధర్మం కుల వ్యవస్థగా మారిపోతూ వచ్చి, ఈనాటి ఆత్మ విచ్ఛేదక విషమ హిందూ మతంగా స్థిరపడింది. ఈనాటి హిందూ మతం వైదిక మతమూ కాదు, ఆర్ష మతమూ కాదు. ఇదొక దయ్యపు బిడ్డ.

అందుకే వైదికజన జీవిత నిర్దేశంలో తుది అధికార గ్రంథమైన భగవద్గీతను పునరుద్ధరించి మానవ సమాజాన్ని, ప్రధానంగా హిందూ సమాజాన్ని తట్టిలేపి ముందుకు నడిపించాలనే ఉద్దేశంతోనే నేనీ భాష్య రచనకు పూనుకోవడం జరిగింది.

ప్రపంచంలోని ప్రతి మానవుడూ, వ్యక్తిగతంగా గాని, సామూహికంగా గాని, ఏదో ఒక పద్ధతిలో విగ్రహారాధకుడే. రూపారాధకుడే. రూపం కాకపోతే, ఏదో ఒక తెల్లటి గోడనైనా ఎదర వుంచుకొని ప్రార్థన చేసేవాడే.

ప్రధానంగా ఈనాడు ప్రజలకు విగ్రహారాధన ఒక్కటే మతంగా చెలామణి అవుతూ

వున్నది. ఆలయాలు, వివిధ రూపాలలో వివిధ దేవతలు, వాళ్ళకు సేవలు, జాతరలు, మేళాలు, ఉత్సవాలు ఎన్నో ఎన్నో. ప్రజలకు ఇదే మతం అయింది. ఆ దేవతలు ఇచ్చే వరాలు, తీర్చే కోరికలు మాత్రమే జీవిత పరమార్థం అయింది.

ఇక మేధావుల విషయానికి వస్తే గీతోపన్యాసాలు, పురాణ కాలక్షేపాలు, పీఠాధిపతుల పాదసేవలు – అవే తరణోపాయాలు అయినై. ఇక పీఠాధిపతుల విషయానికి వస్తే మారుతున్న లోకానికి అనుగుణంగా ఎదుగుతున్న దేమీ లేదు.

ఇంతగా చెడిపోయిన సమాజానికి నేను చూపుతున్న తరణోపాయం భగవద్గీతను మళ్ళీ ఉద్ధరించడమనేదే. ఈ ఉద్ధరించడం అంత కష్టమేమీ కాదు. ఇప్పుడు జరుగుతున్న దానినే పరిశుద్ధ పరచి, క్రమబద్ధం చేసి, ప్రజలకు మార్గదర్శకం కావలసి వుంది.

ఈనాటి హైందవ ప్రజా సమూహంలో ప్రబలంగా వున్నది విగ్రహారాధన. అదే మతం గానూ, అదే జీవిత పరమార్థంగానూ చెలామణి అవుతూ వుంది. అది భగవద్గీతకు అనుగుణ మైనట్టిదే.

అన్ని రూపాలు పరమాత్మవే. నీకు ఇష్టమైన రూపంలో పరమాత్మను ఆరాధించు. దాని మీదే మనస్సును కేంద్రీకరించు. ''సర్వ ధర్మాన్ పరిత్యజ్య'' అనే శ్లోకానికి లక్ష్యార్థం ఇదే. ఈ సత్యాన్ని ప్రజలకు స్పష్టపరచవలసి వుంది.

బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, సరస్వతి, లక్ష్మి, దుర్గ, విఘ్నేశ్వరుడు, షణ్ముఖుడు, అయ్యప్ప, హనుమ, వెంకటేశ్వరుడు, రాముడు, కృష్ణుడు, శివుడు, నరసింహుడు, ఎల్లమ్మ, పోచమ్మ మొదలైన అనేక నామాలతో పూజలు చెయ్యబడుతున్న వాళ్ళంతా ఒకే పరమాత్మ యొక్క అంశలు. నిరాకార పరమాత్మ యొక్క సాకార విగ్రహాలు.

ఇందులో ఏ రూపాన్ని పూజించినా అదే రూపంలో పరమాత్మ సాక్షాత్కరిస్తుంది. అభయం ఇస్తుంది. ఆకాంక్షలు తీరుస్తుంది. పూజించడం మాత్రం ఏకాగ్రతతో, ఏక దీక్షతో చేయాలి. ప్రగాఢమైన విశ్వాసంతో చెయ్యాలి. విశ్వాసాన్ని మారనివ్వకూడదు. ఒక విగ్రహాన్ని ఆరాధించి, ఫలితం కనిపించలేదని మరొక విగ్రహాన్ని ఆశ్రయించకూడదు. ఏ విగ్రహమైనా ఒకటే. ఫలించడం, ఫలించక పోవడం అనేవి వ్యక్తి దీక్షపై ఆధారపడి వుంటై. తన ఆరాధ్య దైవం వెనక, తన ఇష్ట దైవం వెనక ఒక అనంతమైన, అద్వితీయమైన

చైతన్య శక్తి ఉన్నదని గుర్తించాలి. నానాత్వంలో ఏకత్వం ఇదే. ''సమోహం సర్వభూతేషు'' అనే గీతావాక్యంలోని యథార్థం ఇదే.

మంత్రం, యంత్రం, తంత్రం – ఇది త్రిశక్తి. యంత్రం శరీరం. తంత్రం బుద్ధి (వ్యూహం). మంత్రం ప్రాణం (చోదక శక్తి). ఈ త్రిశక్తికి రూపకల్పనే ఏ విగ్రహమైనా. వీటన్నిటికీ ఒక క్రమపద్ధతి వుంటుంది. ఒక శాస్త్రం వుంటుంది. ప్రతి వ్యక్తీ తన గుణ స్వభావాలకు అనుగుణమైన ఆరాధనలను చేపట్టవలసి వుంది.

ఈ ఆరాధనల కోసమే, మనో నిగ్రహాన్ని సాధించడం కోసమే గీత యోగాన్ని ప్రతి పాదిస్తున్నది. యోగ ప్రక్రియలు అనేకం. అవి కూడా వ్యక్తి గుణ స్వభావాలను బట్టే చేకొనబడ వలసినట్టివి, వ్యక్తిగతమైనట్టివి.

యువగీతం

భగవద్గీతా! నీ ధృతి
భగవత్ సింగ్ వంటి సరుల పాణి స్థలమే
యగు; సన్యాసులు నిను గొని
దిగజార్చిరి భరతజాతి ధీ భుజశక్తుల్!

ఈ పద్యం వ్రాసుకొని, హృదయానికి హత్తుకొని, నిర్వేదంలో మునిగిపోయాను నేను ఒకానొక ముహూర్తంలో.

నిజంగా నేను పరిశీలన దృష్టితో భగవద్గీతను చదివినప్పుడు, నాకు దానిపట్ల ఎంతో జాలి కలిగింది. భగవద్గీత పట్ల జాలి! అవును. జాలి. విశ్వ భారత మహారాజ్ఞిగా ప్రపంచ మానవ చింతనను పరిపాలించవలసిన భగవద్గీత ఏదో కొద్ది మంది సన్యాసులకు ఊడిగం చేస్తున్నదన్న జాలి. అంతటి ఔన్నత్యం ఎంతగా దళితమై పోయిందా అన్న జాలి.

గీతపట్ల నాకు కలిగిన అట్టి కారుణ్యమే నన్ను ఈ 'భీమన్న భాష్యం' రచనకు పురి కొల్పింది.

ఈనాటి కార్ల్ మార్క్స్ సాంఘిక న్యాయ చింతనలో ఆనాటి వ్యాస భగవానుడి కంటే గొప్పవాడు కాడు.

హే భారత యువకుడా! ఇదుగోనయ్యా, విశ్వమానవ సమతా గీత. ఎండమావుల కేసి పరిగెత్తడం ఆపు. ఇవిగో ఈ సర్వమానవ శ్రేయో క్షేతాల వైపుకు మళ్ళు.

భగవద్గీత యువగీత. వీరగీత. యుద్ధగీత. సమధర్మ సమర గీత. ''తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః'' అంటూ నరుడ్ని నారాయణ రూపంలో కృష్ణుడు హెచ్చరిక చేసిన గీత.

గెలుపే ముఖ్యం – గెలవడానికి అవలంబించే మార్గాలు ముఖ్యం కాదు. ఏ విధంగా నైనా సరే – దుర్మార్గుల్ని చంపు. సన్మార్గుల్ని రక్షించు. ఇదీ నీతి. కృష్ణుడి సారథ్యంలో భారత యుద్ధం మానవుడికిచ్చిన జీవిత నీతి.

సత్యాహింసలకు ధర్మరాజు ప్రతీక. అవి రెండూ కూడా విఫలమైనై. ఓడిపోయినై. ధర్మరాజు యొక్క సత్యాహింసలు పాండవులకు అవమానాలనూ, దుఃఖాలనూ మాత్రమే తెచ్చిపెట్టినై. చివరకు యుద్ధం తప్పలేదు. ధర్మరాజు అబద్ధమాడకా తప్పలేదు. యుద్ధం చెయ్యకా తప్పలేదు.

సృష్టి స్థితి లయాలు హింసా దుఃఖాలతో కూడుకొన్నట్టివి. అవి ప్రకృతి సిద్ధమైనట్టివి. వాటిని కాదని పురోగమించడం సాధ్యం కాదు. కనుక అహింస, సత్యాగ్రహం అనే పిచ్చి భ్రమలు మానుకొనుమనేదే కృష్ణుడు అర్జునుడికి చేసిన హితబోధ.

గీత పద్ధెనిమిది అధ్యాయాలు. ఈ అధ్యాయాలకు యోగాలు అనే పేరు ఎప్పటి నుంచి వచ్చిందో తెలియదు. ఎప్పుడు, ఎందుకు, ఎవరు మార్చారో తెలియదు. నేననుకునే దేమిటంటే – అప్పటికి ప్రచారంలో వున్న వివిధ మత భేదాలను, భావ వైరుధ్యాలను సమన్వయ పరచి ఏక మతాన్ని, ఏకేశ్వర తత్వాన్ని ప్రతిపాదించడానికి ఆనాడు భగవద్గీత ప్రయత్నించిందని, ఈ సమన్వయమే నానాత్వంలోని ఏకత్వం. అదే కర్మ, జ్ఞాన యోగాలలోని స్థిత ప్రజ్ఞత్వం.

''పని చెయ్యి. ఫలితాన్ని ఈశ్వరార్పణ చెయ్యి. బ్రహ్మార్పణం అంటూ నీవు ఏపనినైనా చేయవచ్చు.'' ఇదీ గీతా బోధ సారాంశం.

'వట్టినే కబుర్లు చెప్పకు. పని చెయ్యి' అంటున్నది గీత.

ముద్రణ విషయం

ఒక రోజున ఏవో మాటల సందర్భంలో మిత్రుడు ఎమ్.ఎన్.భూషి అన్నాడు. – ''మీరు భగవద్గీతకు భాష్యం వ్రాయకూడదా? నేను ప్రింటు చేస్తాను'' అని.

నేను అప్పటికే గీతలోని ఒక పది శ్లోకాలను ఎంచుకొని వాటికి నా పద్ధతిలో వ్యాఖ్యానం వ్రాసి వున్నాను. అప్పటికదే చాలనుకొంటుండగా; భూషి ఈ ప్రతిపాదన చేయడం జరిగింది. ఆలోచించగా మొత్తం భగవద్గీతకు భాష్యం వ్రాయడమే మంచిదనిపించింది.

తీరా వ్రాసిన తరువాత ముద్రణ ఒక సమస్య అయింది. గీతలోని 175 శ్లోకాలను ఎంచుకొని మొత్తం భగవద్గీతను సర్వసమగ్రంగా వ్యాఖ్యానించా. ''ఇదిగో, ఇదీ భగవద్గీత'' అంటూ ప్రజలకు అందించదలచాను. మరి, ముద్రణ జరిగేది ఎలా?

కొంతమంది మిత్రులు ఒక ముద్రణ కమిటీ వెయ్యమన్నారు. సరే. కమిటీకి ఛైర్మన్ ఎవరు? సభ్యులు ఎవరు? భగవద్గీత పట్ల సుముఖులై వుండాలి. సహాయపడే వారుగా వుండాలి. మిత్రులై వుండాలి. వీటన్నిటినీ ఆలోచించి పదకొండు మందితో కూడిన ఒక కమిటీని వెయ్యడం జరిగింది. దానికి ఛైర్మన్‌గా వుండడానికి జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు సంతోషంగా అంగీకరించారు. మా ఆవిడ హైమవతి సెక్రటరీ.

అడ్వర్టయిజ్‌మెంట్లు సంపాదించి ఒక సావనీర్ వెయ్యాలనుకొన్నారు. ముద్రణకు ఖర్చు చాలా అవుతుంది. అడ్వర్టయిజ్‌మెంట్లు మాత్రమే చాలవు. దాతలెవరైనా ఇవ్వగలిగితే విరాళాలు కూడా సేకరించాలనుకొన్నారు. అందుకు ఒక చీఫ్ పాట్రన్ కావలసి వచ్చాడు. తాను చీఫ్ పాట్రన్‌గా వుండడానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లు అనంతరాములు గారు ఒప్పుకొన్నారు.

మల్లు అనంతరాములు గారు నాకు చాలా సన్నిహితులు. ఆత్మీయులు. ఆయన ఆకస్మికంగా కీర్తిశేషులు కాకుండా వుండి వుంటే, ఈ ప్రచురణ కోసం నేను ఇంత అవస్థపడి వుండే వాడిని కాను. ఇప్పుడు నాకు ఆయన స్మృతే ఒక గీతా స్మృతి అయింది.

సమాజంలో దాతలు లేకపోలేదు. ఈనాడు కూడా సాహిత్య పోషకులున్నారు. వదా న్యులున్నారు. ఉదార చరిత్రులున్నారు. అయితే కుల మతాతీతమైన సార్వజనీనత తక్కువైంది. ప్రతిభా వ్యుత్పత్తులకు గుర్తింపు రావడం లేదు. పైరవీలకు తప్ప పనులు

జరిగే కాలం కాదిది. పలుకుబడిగానీ, ప్రచార సాధనాల అండగానీ లేనివాడిని నేను. అక్షరాలా ఒంటరి వాడ్ని.

అట్టి పరిస్థితులలో ఏం చెయ్యాలా? అని ఆలోచిస్తున్నప్పుడు కొంత మంది మిత్రులు నాకు ఆర్థికంగా తోడ్పడడం జరిగింది. అందులో ప్రధాన పోషకుడు డా. ఉండేల మాలకొండా రెడ్డిగారు. ఆయన గొప్ప కవి. వదాన్యుడు. ఈ ముద్రణకు అత్యధిక సహాయం ఆయనదే.

తర్వాత పేర్కొనదగిన వారు ఎస్.విశ్వనాథ్‌గారు, నిమ్మల అర్జునగౌడ్ గారు, కె.పార్థ సారధిగారు, వాసిరెడ్డి సీతాదేవి గారు, నీతిపూడి భాస్కరరావుగారు, జన్నకూటి నాగేశ్వర రావుగారు, డా. జె.బాపురెడ్డీ గారు, మా తమ్ముడు అర్జునుడు, మా చెల్లెలు ద్రౌపదమ్మ, మా వాడు డా. నాగవర్మ, జె.అమ్ములయ్యగారు, జె.బి.రాజుగారు, కె.నాగయ్యగారు, కోనాడ గారు, పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ వారు మున్నగు వారు.

నా పట్ల ఎంతో ప్రేమాభిమానాలు గల దరువూరి వీరయ్యగారి ఔదార్యాన్ని కూడా ఇక్కడ ప్రత్యేకంగా పేర్కొనవలసి వుంది.

–భీమన్న

గీతా హృదయం

1. ఈ సృష్టిలోని కర్త, కర్మ, క్రియలను ఏ దేవుడూ సృష్టించలేదు. సృష్టి దానంతట అదే అవతరిస్తున్నది. స్వభావరీత్యా ప్రవర్తిస్తున్నది. అంతరిస్తున్నది.

2. పరమాత్మలో ప్రకృతి పురుషతత్వం వుంది. ప్రకృతి పురుషుల నిరంతర సంయోగమే సృష్టి నిరంతరత్వం.

3. సృష్టిలోని సమస్త జీవరాసులకూ మూల హేతువైందొకటే – పరమాత్మ బీజం (''బీజం మాం'') స్వపర భేదాలూ, ఎక్కువ, తక్కువ తేడాలూ లేని సమతత్వం అది. ఆత్మ ఆది.

4. పరమాత్మలో సత్వ, రజస్, తమో గుణాలు మూడూ వున్నై.

5. పరమాత్మ యొక్క బీజాణువు జీవాత్మగా మొలకెత్తినప్పుడు దానిలోకి ఏదో ఒక గుణం ప్రబలంగా వస్తుంది. ఆ గుణమే ఆ జీవి స్వభావం. స్వభావాన్ని బట్టే ప్రవర్తన వుంటుంది. ప్రవర్తనే పని, కర్మ.

6. పనిలేకుండా ప్రకృతి వుండదు. ప్రతి జీవీ ఏదో ఒక పనిచేస్తూనే వుంటుంది. దాని స్వగుణమే దాని స్వభావం. దాని స్వభావమే దాని స్వధర్మం.

7. పని (కర్మ) చెయ్యడం మానవ కర్తవ్యం. మానవుడెప్పుడూ పని (కర్మ) చేస్తూనే వుండాలి. పని చెయ్యడం మానేసి సన్యాసి కాకూడదు. కర్మ సన్యాసం స్వభావ విరుద్ధం.

8. పని చెయ్యాలి. దాని ఫలితం గురించి ఆందోళనపడకూడదు. పని చెయ్యడం స్వధర్మం. ఫలితం అనేక అనుకూల ప్రతికూల శక్తులపై ఆధారపడి వుంటుంది. పనిచెయ్యడం తన అధీనంలో వుంది. దాని ఫలితం అలా కాదు.

9. పని (శ్రమ) విభజనలోని భాగాలు నాలుగు. అవి వర్గాలు. వాటినే వర్ణాలు అంటున్నది గీత. వర్ణాలు అంటే వృత్తులు. నాలుగు వర్ణాలు అంటే నాలుగు వృత్తులు.

10. ఒక వృత్తి కంటే మరొక వృత్తి ఎక్కువదీ కాదు, తక్కువదీ కాదు. ఏ వ్యక్తి స్వభావాన్ని బట్టి అతని వృత్తి వుంటుంది. అన్ని వృత్తులూ సమానమైనట్టివే. ఎవడి స్వభావాని కనుగుణమైన వృత్తిని వాడు ఎన్నుకొంటాడు.

11. ఏ పని చేసినా నిశ్చలమైన మనస్సుతో చెయ్యాలి. చంచలంగా వుండే మనస్సును ఏకాగ్రం చెయ్యడానికి యోగం ఉపయోగపడుతుంది. యోగం అంటే మనస్సును ఏకాగ్రం చెయ్యడమే.

12. యోగం ద్వారా మనో నిగ్రహాన్ని సాధించినవాడు స్థితప్రజ్ఞుడు. స్థితప్రజ్ఞుడైన వాడిని ప్రాపంచక సుఖ దుఃఖాలు బాధించవు'.

13. ఏ పనిచేసినా 'బ్రహ్మార్పణం' అంటూ చేయాలి. త్రికరణశుద్ధిగా చెయ్యాలి. తాను చేసే పనులను వాటి ఫలితాలను 'బ్రహ్మార్పణం' చెయ్యాలి. ('బ్రహ్మ' అంటే పరబ్రహ్మ, పరమాత్మ. తన ఇష్టదైవం ఎవరైనా సరే పరమాత్మకు ప్రతీకే. బ్రహ్మార్పణం, ఈశ్వరార్పణం, శివార్పణం, కృష్ణార్పణం వంటివన్నీ పరమాత్మను చేరేటటువంటివే.)

14. ప్రపంచంలో ఎక్కడైనా సరే మానవ సమాజంలో వ్యక్తి గుణాన్ని బట్టి పని, పనిని బట్టి వృత్తి వుంటై. వ్యక్తి గుణాన్ని గుర్తిస్తే అతడి శక్తి సామర్థ్యాలను గుర్తించవచ్చు. అభిరుచిని గుర్తించవచ్చు.

15. శిక్షణ ద్వారా స్వభావ గుణాలను మార్చవచ్చు అంటున్నది గీత. ఏ వ్యక్తినైనా సమాజం తనకు అనుగుణంగా మలుచుకోవచ్చు అంటున్నది కూడా.

16. తన పనిని, ఫలితాన్ని మాత్రమే కాకుండా తనను తానే ఈశ్వరార్పణం చేసుకొన్న వ్యక్తికి లోకంలో, పురోగమనంలో, పరిపూర్ణ వికాసంలో తిరుగే లేదంటున్నది. ఆనందమే ఐశ్వర్య మంటున్నది గీత.

17. ప్రతి మనిషీ ధర్మ, అర్థ, కామ, మోక్ష మార్గంలో జీవించాలి. దుష్ట శిక్షణను విధిగా చేయాలి. అందుకు తగిన ధైర్య సాహసాలను, బలోత్సేకాలనూ ఆర్జించుకోవాలి.

18. సమాజంలోని అక్రమాలను తొలగించడం కోసం ఏ దేవుడో అవతరిస్తాడని ఎదురు చూడకూడదు. ప్రతి వ్యక్తీ తానే ఒక పురుషోత్తమ అంశగా సంఘ వ్యతిరేక కర్మలాన్ని ఎప్పటికప్పుడు నిర్మూలించుకొంటూ వుండాలి.

19. పుట్టడానికి ముందు ఏమిటో తెలియదు. గిట్టిన తరువాత ఎవరేమవుతారో తెలియదు. మనకు తెలిసిందంతా ఈ మధ్యలోని జీవితం గురించే కదా! అందువల్ల మరొక ఆలోచన లేకుండా జీవితాన్ని విజయవంతంగా నడుపుకోవడానికే కృషి చెయ్యవలసి వుంది.

20. గుణాలు మూడూ పరమాత్మలోవే. వివిధ నిష్పత్తులలో వాటి కలయికలవల్ల అవి అసంఖ్యాకంగా పుడుతూ, పోతూ వుంటై. వాటి నుంచి పుట్టేవే వివిధ భావాలు (ఐచ్ఛికాలు). ఏ భావమైనా గుణ సంబంధమైనట్టిదే. ఏ గుణంగల వ్యక్తికి ఆ గుణ సంబంధమైన భావాలు పుడుతుంటై.

21. ఏ వ్యక్తి అయినా తాను చేసే పనుల ఫలితాలను బ్రహ్మార్పణం చేస్తూ తనను తానే సంపూర్ణంగా బ్రహ్మార్పణం చేసుకోవాలనేది కృష్ణ మతం. (''మామేకం శరణం వ్రజ''). బ్రహ్మ అంటే పరమాత్మ. పరమాత్మ అంటే తానే. తనను తాను సంపూర్ణంగా విశ్వసించి పని చేయాలనేది ఇక్కడ ఉపదేశం.

22. సహనం బలహీన లక్షణం. ఓర్పు వహించవలసింది స్వజనుల విషయంలో. శత్రువులపట్ల కాదు. రక్షించవలసింది శరణాగతుణ్ణి. దురాక్రమణ పరుణ్ణి కాదు. దయ చూపవలసింది ఆర్తుడిపట్ల. ఆతతాయిపట్ల కాదు. మనిషి బలంగా బ్రతకాలంటున్నది గీత.

23. 'యథారాజా తథా ప్రజా' అనే లోకోక్తి సర్వత్రా నిజం. నాయకులైనవాళ్ళు, ఉన్నత పదవులలో వున్న వాళ్ళు నీతి నియమాలకు లోబడి, ఆదర్శప్రాయులుగా ప్రవర్తించాలి. అలా కాని నాడు ప్రజాజీవనం పతనమై పోతుంది.

24. లోకంలో ఏ మతంగానీ, ఏ ఆధ్యాత్మిక చింతనగానీ, ఏ రాజకీయ విధానంగానీ చెప్పేవన్నీ నీతులూ, చేసేవన్నీ ఊహలూ, ఇచ్చేవన్నీ నినాదాలూ, వాగ్దానాలూ, గీత అలా కాదు. హేతు బద్ధమూ, ప్రకృతి సిద్ధమూ అయిన ఒక సమగ్ర జీవన వ్యవస్థను, అభ్యుదయ ప్రణాళికను ఇస్తున్నదది.

25. గీత ప్రధానంగా ప్రతిపాదిస్తున్న అంశాలు రెండు. వ్యక్తి స్వేచ్ఛ, సామూహిక శ్రేయస్సు. ఈ రెండు అంశాలకూ ప్రయోజనాలు జీవి యోగ క్షేమాలు. చక్కగా, నిర్దుష్టంగా, కౌశలంతో పని చెయ్యడమే యోగం అంటున్నది. పని విభజనలో ప్రతి పనికీ సమాన గౌరవ మర్యాదలనూ, ప్రతిపత్తినీ ఇస్తున్నది. సమబుద్ధిని ప్రతిపాదిస్తూ మానవుడి వాస్తవ జీవిత వికాసానికి మార్గదర్శక మవుతున్నది గీత ఒకటే.

★ ★ ★

అంబేడ్కర మతం

అం.పూ - అం.త

నేను పదేళ్ళ క్రితం వ్రాసిన ''అంబేడ్కరు సుప్రభాతం'' కావ్యం పీఠికలో అంబేడ్కరు శకం గురించి చెప్పివున్నాను. కుల మత వర్ణ వర్గ జాతి భేదాలు లేని సర్వ మానవ సమతా సమాజం అంబేడ్కరు మతంగా పరిగణించబడాలని ఇప్పుడంటున్నాను. ఈ విధమైన సామాజిక వ్యవస్థను నెలకొల్పడానికి ఎప్పటి నుంచి ప్రయత్నం ప్రారంభమైందో అప్పటి నుంచి ఒక నూతన శకం ప్రారంభమైనట్టు లెక్క. అట్టి నూతన శకమే అంబేడ్కరు శకం.

హిందూ సమాజాన్ని సంస్కరించి, దాని నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ పారద్రోలడానికి అంబేడ్కరు ఉద్యమించిన 1924 నుంచి ఈ శకం ప్రారంభమైందనుకోవచ్చు. ఆ సంవత్సరం మార్చి నెలలో ఆయన అధ్యక్షత క్రింద బహిష్కృత హితకారిణీ సభ ఏర్పడింది. 1925 ఏప్రిలులో ఆయన అధ్యక్షత క్రింద అస్పృశ్యుల మొదటి సమావేశం జరిగింది. 1927లో మహద్ చెరువు నీటి కోసం జరిగిన పోరాటానికి ఆయన నాయకత్వం వహించాడు. బహిష్కృత భారత్ అనే పేరుతో ఒక పత్రికను కూడా ప్రారంభించాడు. అదే సంవత్సరం బంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా కూడా నామినేటు చెయ్యబడ్డాడు.

కాగా, 1924 నుంచే అంబేడ్కరు శకం ప్రారంభమైనట్లు పరిగణించవచ్చు.

అంబేడ్కరు ఉద్యమానికి మూల సూత్రాలు మూడు. 1. అస్పృశ్యతా నివారణ, 2. కుల నిర్మూలన, 3. సాంఘిక న్యాయ సంస్థాపన.

ఈ ఉద్యమానికి ఒక రూపం ఇచ్చిన వాడు, ప్రాణం పోసిన వాడు, ఒక పోరాట స్థాయి కల్పించిన వాడు అంబేడ్కర్ అయినప్పటికీ, ఆయనకు ముందు కూడా ఈ రంగంలో కృషిచేసిన మనీషులు చాలా మందే వున్నారు.

ఆయన తర్వాత ఇప్పుడు ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న మహాత్ములు అసంఖ్యాకంగా వున్నారు. అందుకే అంబేడ్కర మతంగా నేను ఇక్కడ పేర్కొంటున్న

ఉద్యమాన్ని గురించి చర్చించినప్పుడు, దానిని రెండు భాగాలుగా విభజించి, అంబేడ్కరు పూర్వం (అం.పూ) ఏమి జరిగిందో, అంబేడ్కరు తరువాత (అం.త) ఏమి జరుగుతున్నదో సమగ్రంగా పరిశీలించి అర్థం చేసుకోవలసి వుంది.

అస్పృశ్యు లెవరు? అస్పృశ్యతకు కారణమేమిటి? వాళ్ళు ఊరి వెలుపల ఎందుకున్నారు? వాళ్ళు అన్ని విధాల హిందువులే అయినప్పటికీ, సవర్ణ హిందువుల చేత పరాయివాళ్ళుగా ఎందుకు చూడబడుతున్నారు? సవర్ణ, అవర్ణ అనే తేడా ఎందుకు? ఎప్పటి నుంచి వచ్చింది? నాలుగు వర్ణాలు మాత్రమే వుండవలసిన హిందూ సమాజంలో వీళ్ళు పంచమ వర్ణం ఎలా అయ్యారు? పౌరాణికంగానూ, చారిత్రకంగానూ వీళ్ళ పుట్టు పూర్వోత్తరాలు [Origin మరియు Roots] ఎటువంటివి?

ఈ విధమైన ప్రశ్నలన్నింటికీ అంబేడ్కరు రచనలలోనూ, నా రచనలలోనూ కూడా జవాబులు చెప్పడం జరిగింది. జిజ్ఞాసువులు వాటిని తర్కించగలరు.

అస్పృశ్య కులాల వాళ్ళను అంబేడ్కరు బ్రోకెన్ పీపుల్ అన్నాడు. దేశ భాషలలో ఇప్పుడు ఆ మాటను దళిత జనులు, దళితులు అంటున్నారు.

ఈ దళిత జనాభ్యుదయ ఉద్యమం అంబేడ్కరు పూర్వం అనేక వందల సంవత్సరాలుగా ఆయా కాలాల్లోని ఆత్మాభిమానులచే నిర్వహించబడుతూనే వచ్చింది. అట్టి వారు వేల కొలదీ సాహిత్యం నిండా వున్నారు. అంబేడ్కరు జీవిత కాలంలోనే లక్షల మంది ఆయన ననుసరించి పోరాటం సాగించిన వారు కలరు.

ఈనాడు దళితులంటున్న వాళ్ళను అంబేడ్కరు పూర్వం రకరకాల పేర్లతో పిలిచే వాళ్ళు. ఆయా భాషలలో పేర్లు ఎలా వున్నా, చండాలురు, పంచములు, నిమ్న జాతులు, హరిజనులు అనేవి సాధారణ నామాలుగా వుండేవి.

తెలుగులో చాలా పేర్లు వున్నా, ఆది ఆంధ్రులు అనేది కొంతవరకూ నాజూకు నామంగా వుండేది. ఆ తరువాత హరిజన అనేది నాగరిక నామం అయింది. ఆ కాలంలో ఆత్మగౌరవమూ, స్వయం వ్యక్తిత్వమూ చూపే వ్యక్తులపై తప్ప, ఆది ఆంధ్ర పేటలపై సవర్ణ కులాల సామూహిక దాడులు, హత్యలు వుండేవి కావు. సవర్ణ గ్రామాల వీధులలో

వూరేగింపులు జరిపే హక్కుల కోసం, గొడుగులు, చెప్పులు వేసుకొని నడిచే హక్కుల కోసం, వివాహాల సందర్భంలో గుర్రాలపై వూరేగే హక్కుల కోసం ఆది ఆంధ్ర సంఘాలు, హరిజన సంఘాలు పోరాటాలు జరిపేవాళ్ళు. నా చిన్నప్పుడు నేను పాల్గన్న అటువంటి పోరాటాలు అనేకం నాకిప్పటికీ జ్ఞాపకం వున్నై. ఆనాటి నాయకులూ జ్ఞాపకం వున్నారు. అందరూ నాకు సన్నిహితంగా తెలిసినవాళ్లే.

ఈ కాలంలో కంటే ఆ కాలంలో నిమ్నజాతుల ఉద్ధరణ కోసం ఉద్యమించట మంటే కొట్లాటలతో కూడుకొన్న వ్యవహారంగా వుండేది. కత్తిసాము, కర్ర సాము, వ్యాయామ క్రీడలు నేర్చిన సాహసికులైన మాష్టీడీవస్తాదుల సహాయ సహకారాలు స్వీకరించ బడుతూ వుండేవి. మూఢాచార దౌర్జన్యాలను ఎదుర్కొని ముందుకు సాగాలంటే నిమ్న కులాలు బల ప్రదర్శన చేయక తప్పేది కాదు.

అంబేడ్కరు తరువాతి కాలంలో ఈ దళిత జనోద్ధరణ కృషి జాతీయ, అంతర్జాతీయ శ్రేణిలో, సర్వ మానవ సంక్షేమ స్థాయిలో పురోగమించవలసి వుంది. అందుకు ఈ ఉద్యమం తన నిమ్న, బడుగు, బలహీన, దళిత స్వభావాన్ని వదిలిపెట్టి, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సును తొలగించుకొని, అతిశయాన్ని, ఆధిక్యతనూ, అగ్రేసరత్వాన్నీ సంతరించుకోవలసి వుంది. అది భవిష్యత్ కార్యక్రమం. అందుకే ముందుగా నిబద్ధత కోసం ఈ ఉద్యమం అంబేడ్కరు మతంగా రూపొందవలసి వున్నదన్నాను.

అంబేడ్కరు జీవిత కాలంలో ఆయనతో కలిసిగాని, సమాంతర స్థాయిలోగాని హరిజనాభ్యుదయం కోసం పోరాడిన నాయకులెందరో వున్నారు. అంబేడ్కరు షెడ్యూల్డు కులాల ఫెడరేషన్, భారత రిపబ్లికన్ పార్టీలకు చెందినవారున్నారు. కాంగ్రెసు, కమ్యూనిస్టు, భారతీయ జనతా, జనతాదళ్, తెలుగుదేశం, బహుజన సమాజ్ వగైరా పార్టీలకు చెందిన వారున్నారు. శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులూ వున్నారు. అనేక సంఘాలూ వున్నై.

అంబేడ్కర మతం అనే ఈ చిన్ని పుస్తకాన్ని ఎవరికైనా అంకితం ఇవ్వాలను కొన్నప్పుడు, అంబేడ్కరు ఉద్యమం కోసమే తన జీవిత సర్వస్వాన్నీ ధారపోసి కృషిచేసిన

ఈశ్వరీబాయి పేరే నాకు శిఖరాయమానంగా భాసించింది. ఆవిడకే ఈ రచనను అంకితం చేస్తున్నాను.

ఈశ్వరీబాయి అంటే నిమ్నకులాల అభ్యుదయం కోసం అంబేడ్కరు జీవిత కాలంలోనే తన కృషిని ప్రారంభించి, అంబేడ్కరు తరువాత సర్వతో ముఖంగా కొనసాగించి, జీవితాంతం వరకూ నిరంతరంగా నిబద్ధతతో శ్రమించిన స్థిత ప్రజ్ఞురాలు. నాకు తెలిసినంత వరకూ అంబేడ్కరు తరువాత ఒక ముప్పై సంవత్సరాల కాలాన్ని ఈశ్వరీబాయి తరం అనవచ్చు. రాష్ట్ర స్థాయిలోనే కాక జాతీయ శ్రేణిలో కూడా షెడ్యూల్డు కులాల బాగోగుల కోసం జీవితాన్ని సమర్పించిన నాయకురాలామె. సైనిక పరంగా ఝాన్సీ లక్ష్మీబాయి ఎంతటిదో, సాంఘిక న్యాయపరంగా జె.ఈశ్వరీబాయి అంతటిది. భారతీయ వీర నారీమణులను స్మరించినప్పుడు, అందులో ఈ ఆధునికాంధ్ర వీర నారీమణి అగ్రగణ్య అవుతుంది.

ఇతరులవలె కాక ఈశ్వరీబాయిలో ఒక ప్రత్యేకత వుంది. తన దేశ సేవా తత్పరతకు, ప్రజ్ఞా పాటవానికి వారసురాలు కుమార్తె గీతారెడ్డిని ప్రజాసేవకు అందచేసిందామె. అందుకు దేశమంతా ఈశ్వరీబాయికి సదా కృతజ్ఞమై వుంటుంది. గీతారెడ్డిగారు ఇప్పుడు మంత్రి.

అంబేడ్కరు పూర్వమూ, అంబేడ్కరు తరువాతా కూడా ఈ దళిత జనాభ్యుదయోద్యమంలో దీక్షా నిబద్ధతతో పనిచేసిన సంస్కర్తలు, కార్యకర్తలు వేలకొలది మంది వున్నారు. అందులో నాకు తెలిసిన, నాకు సన్నిహితులైన వారందరి పేర్లనూ ఇక్కడ వ్రాయాలని మొదట్లో అనుకున్నాను. కొన్నివేల పేర్లను ఇక్కడ ఎలా వ్రాయగలను? పైగా, వట్టి పేర్లను వ్రాసి ఏం లాభం? వాళ్లు నడిపిన ఉద్యమాలను గురించి, చేసిన పోరాటాలను గురించి కొన్ని వాక్యాలైనా వ్రాయవలసి వుంటుంది. అట్టి పని పరిశోధకులు ట్ర్రట్ట్రుటఫిజి టఫిజొజ్ఝాటట్టుచేయవలసినట్టిది.

అందుకే, జిల్లాల వారీగా అట్టి త్యాగధనులను గురించి హూ ఈజ్ హూ [who is who] పరిశోధక గ్రంథాలను రూపొందించవలసిందిగా పరిశోధకులను కోరుతున్నాను. ఎమ్.ఫిల్; పిహెచ్.డి. డాక్టరేటు డిగ్రీలకు ఈ కార్యక్రమాన్ని విద్యావంతులు చేపట్టవచ్చు. అంబేడ్కరు జీవిత చరిత్రనే తిరగేసి మరగేసి వ్యాపారాలు చెయ్యడం కంటే, ఈ విధమైన

రీసెర్చిని చేపట్టడంవల్ల జాతికి బహువిధాలా ప్రయోజనకరంగా వుంటుంది. రచయితలు తమ ప్రతిభా పాటవాలకు పదును పెట్టుకొన్న వాళ్ళూ అవుతారు.

మరొక విషయమేమిటంటే – హిందూ సమాజంలోని మూఢాచారాల కారణంగా కావచ్చు, హిందూ మత సిద్ధాంతాలూ వేదాంతమూ అర్థం కాక కావచ్చు, హిందువులలోని అధిక సంఖ్యాకులు హిందూ మతాన్ని ద్వేషిస్తారు. అయినా హిందువులుగానే బ్రతుకుతుంటారు. మరొక మతంలో చేరే ధైర్యమూ వాళ్ళకుండదు, ఆయా మతాలలోని తాత్వికతా వాళ్ళకు తెలియదు. అట్టి వాళ్ళకు జిజ్ఞాస కలిగించి, సత్యాన్వేషణకు పులిగొల్పి, వాస్తవ జ్ఞాన తత్పరుల్ని చెయ్యటం కూడా ఈ గ్రంథంలోని నా ఉద్దేశం. చీకట్లో దిక్కుతోచని వాళ్ళందరికీ ఈ గ్రంథం ధ్రువతారగా, వేగుచుక్కగా ఉపయోగపడితే నా కృషి ఫలించినట్టే.

అంబేడ్కరార్పణం.

సెప్టెంబరు, 1993

–భీమన్న

అంకితం

అంబేడ్కర అభిమతాన్ని
దళిత జనోద్ధరణ ఉద్యమాన్ని
అత్యంత శక్తివంతంగా
ముందుకు నడిపించిన
ధర్మవీర నారీ మణి
తన అఖండ జీవన ధర్మానికి
ప్రజ్ఞాన జ్యోతిగా కుమార్తె గీత ను
కళా సంస్కృతుల శ్రేయో వికాసానికి
ప్రసాదించి పోయిన వాగీశ్వరవాణి
శ్రీమతి జె. ఈశ్వరీబాయి గారి పవిత్ర స్మృతికి

-భీమన్న

జన సామాన్య సమత్వ నిష్ఠము ప్రజా
స్వామ్యమ్ము, తద్భిన్న ల
క్షణ రోగిష్ఠము హైందవమ్ము; కనుకన్
జాగ్రత్త సూచించి - త
ర్జని చూపించుచు, హెచ్చరించుచు ప్రతీ
గ్రామమ్మునన్ నీవు ని
ల్చని, మమ్మోము సమగ్ర విగ్రహా! నమ
స్సుల్, డాక్టరంబేడ్కరా!

('అంబేడ్కర సుప్రభాతం' నుంచి)

ఎంత చీకటి

ఎన్ని దీపాలు!!

ముందు మాట

ఆకాశం (అవకాశం) లోని చంద్రుడు, సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు అన్నీ ఒక్కసారిగా ఆరిపోతే ఎలా వుంటుంది?

అదే పరమాత్మ, పరబ్రహ్మ.

దానిని హైందవ సమాజంలోని అంటరానితనంతో పోలిస్తే, అందులో పుట్టాను నేను. అతీ గతీ లేని అయోమయ అనాధస్థితి అది. అట్టి దుస్థితి నుంచి నేను ఇంతదూరం సాగివచ్చా నంటే, ఈ పురోగమనం ఎలా సాధ్యమయింది?

ఏదో ఒక దీపపు వెలు

గేదో ఒక మూల మిణుకకే మానవుడున్

నీ దారి తెలియనేరడు–

అంటూ నేను దీప సభ కావ్యంలో పేర్కొన్నాను. ఇలాంటి పరిస్థితినే పోతన్నగారు తన భాగవతంలో–

లోకమ్ములు లోకస్థులు

లోకేశులు తెగిన తుదినలోకంబగు పెం

జీకటి–

అంటూ వర్ణించారు. అయితే ఆయన ఆ చీకటికి అవతల ఏకాకృతితో వెలిగే భగవంతుణ్ణి గురించి చెప్పగా, నేను నా పురోగమనంలో అడుగడుగునా దారి చూపించిన అనేకానేక దీపాలను గురించి పేర్కొన్నాను. అందులో కొన్ని ముఖ్య దీపాలను గురించి మాత్రమే ఈ గ్రంథంలో చెప్పాను. నాకు మార్గదర్శకులైన ఎందరో ఇప్పుడు లేరు. ఎందరినో మరిచి పోయాను. ఎందరికో కృతజ్ఞతలు కూడా చెప్పుకోలేకపోయాను.

ఒకొక్క దీపమూ దారిచూపి వెనక్కి పోతూవుంటే, బదులుగా మరొక క్రొత్త దీపం వచ్చి ముందుకు నడిపిస్తూ వచ్చింది. బాధించే చీకటి మాత్రమే తప్ప, దారి చూపే దీపాలు జ్ఞాపకం వుండవు. చీకటి ఒక్కటే. దీపాలు అనేకం కదా!

ఎంత పేదరికం అనుభవించినా, సాహిత్య సృష్టికి పేదరికం అడ్డురాదు. కాబట్టి, నేను సహస్రాధికంగా కవితలు వ్రాయగలిగాను. పాతికేసి కవితలు (ఖండకావ్యాలు) ఒక్కొక్క పుస్తకంగా ప్రకటించివుంటే ఇంతవరకూ నేను ప్రకటించిన సుమారు యాభై గ్రంథాలూ అయిదు వందల గ్రంథాలైనా అయి వుండేవి. నా సమకాలీనులు చాల మంది అలాగే చేసి, శతాధిక గ్రంథకర్తలనిపించుకున్నారు కూడ.

నేను నా గ్రంథాలన్నిటినీ నేనే స్వయంగా ముద్రించుకొన్నాను. ఇతర కులాల వాళ్ళ కయితే ప్రచురణ కర్తలుంటారు. అభిమానించే పత్రికలుంటాయి. ప్రచారం చేసిపెట్టే అభిమాన రచయితలుంటారు. రేడియోలలో, టీవీలలో మిత్రులుంటారు. నాకెవరున్నారని?

అయితే ప్రతిభను గుర్తించే ఉదార హృదయులుంటారు. కులాతీతంగా తోడ్పడుతూ వుంటారు. అట్టి వారినే దీపాలన్నాను.

ముట్నూరి కృష్ణారావు గారిని నేనెప్పుడూ చూడలేదు. కాశీనాథుని నాగేశ్వరరావు గారితో పరిచయం లేదు. నా విద్యార్థి దశలో కృష్ణపత్రిక ద్వారానూ, భారతి ద్వారానూ ఆ ఇద్దరు నాకిచ్చిన ప్రోత్సాహం సూర్యచంద్రుల కాంతి వంటిది. తాపీ ధర్మారావుగారు (జనవాణి), నార్ల వెంకటేశ్వరరావుగారు (ఆంధ్రప్రభ), ఆండ్ర శేషగిరి రావు గారు (ప్రజామిత్ర) ఈనాటికీ అఖండ దీపాలే. కళా వెంకటరావుగారు రాజకీయ జ్యోతి అయితే, బెజవాడ గోపాలరెడ్డిగారు, నిడదవోలు వెంకటరావుగారు సాహిత్య జ్యోతులు.

తెలుగులో తమ గ్రంథాలను తామే ప్రకటించుకొన్న వాళ్ళు ఎంతమంది? చాల తక్కువ మంది. ప్రకటించుకోలేక కాదు. అయితే నా గ్రంథాలను స్వయంగా ప్రకటించుకోలేని పేదవాణ్ణి నేను. అయినా తప్పనిసరిగా ప్రకటించుకోవలసి వచ్చింది! మరి గ్రంథాలన్నిటినీ ఎలా ముద్రించుకోగలిగాను? అంటరానితనానికీ, కులాహం

కారాలకూ అతీతులైన అనేక మంది సవర్ణ మిత్రుల వదాన్యతతో అనన్య సామాన్యమైన అట్టి పనిని చేయగలిగాను. వారంతా దీపాలే. లెక్కలేనన్ని దీపాలు. వారందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

నాకు తరచు కలుగుతూ వుండే భావాలలో కొన్నిటిని మాత్రం ఈ గ్రంథంలో వ్యక్తం చేశాను. నా ఊహల శిఖరాలను రాసుకుపోయే విశ్వ చైతన్య తరంగాలను పట్టుకుని, వాటిని సహృదయుల ముందు వుంచాను. నా మనస్సు ఒక విశ్వభావ చర్చా వేదిక. దాని తుది నిర్ణయాలే ఈ గ్రంథంలో ప్రస్ఫుటమైనై. వేల కొలదీ భావ ఫల పుష్పాలలో ఇవి కొన్ని మాత్రమే.

నా జీవిత యాత్ర పొడుగునా నాకు లభించిన గౌరవ సన్మానాలలో నాకు జ్ఞాపకమున్న వాటిని మాత్రమే ఈ గ్రంథంలో బయోడేటాగా ఇచ్చాను. వేల కొలదీ సంఘటనలున్నై. చీకటి వెలుగులున్నై. ఎత్తు పల్లాలున్నై. కష్ట సుఖాలున్నై. ఎన్నిటిని చెప్పగలను? అందుకే వదిలేశాను.

నా గౌరవ సన్మానాలన్నీ సరస్వత్యర్పణం

నా కష్టనష్టాలన్నీ శివార్పణం

నా జీవితంలో నన్నభిమానించిన వాళ్ళలో, తోడ్పడిన వాళ్ళలో, ప్రేరణ కలిగించిన వాళ్ళలో, దీపాలై నడిపించిన వాళ్ళలో పురుషులెంతమంది ఉన్నారో స్త్రీలూ అంతమందే వున్నారు. అయితే అట్టి సందర్భాలేవీ ఈ గ్రంథంలో పేర్కొనబడలేదు.

సత్యం, శివం, సుందరం అయిన జీవిత సన్నివేశాలు ఎక్కువగా నా ఇతర రచనలలో కనిపిస్తై. నే నెక్కువగా శృంగార రసాన్ని ఆశ్రయించినవాణ్ణి. సమకాలీన, సాంఘిక సమస్యలను కవితా వస్తువులుగా స్వీకరించినా, కవిత్వాన్ని మాత్రం కాంతా సమ్మితంగానే చెప్పాను. రసధ్వనినే చేబట్టాను. కులతత్వ ప్రభావంవల్ల భారతీయ మనీష ఇంతవరకూ నన్ను ఉపేక్షిస్తూ వచ్చినా, ఇకముందు నన్నుకాదని తప్పుకుపోవడం సాధ్యం కాదనే నేననుకొంటున్నాను. నా సరస్వతి అంత బలమైంది. నా నిజాయితీ అంత స్థిరమైంది.

నేను నా సాహిత్యం ద్వారా సామాజిక స్పృహకు చేస్తూ వస్తున్న సేవ అపార మైనట్టిది. అది బహుముఖం. ప్రధానంగా ఒకటి సవర్ణ హిందువులలో మన గత వైభవ

వాస్తవాలను స్మరింపజేయడం. రెండు హరిజనులలో మన వారసత్వ హక్కులను స్ఫురింపచేయడం. అందుకు తగిన రచనా విధానాన్నే అనుసరించాను.

నా రచనలలో చాల భాగం అర్థం కావడం లేదని కొందరు హరిజన విద్యావంతులు బాధపడుతున్నట్టు వినికిడి. కాలం గడిచే కొలదీ అదే అర్థమవుతుంది. విరుద్ధ భిప్రాయాలతో, పక్షపాత దృష్టితో మాత్రం చదవకూడదు. జిజ్ఞాసతో, నిజమేదో తెలుసుకోవాలన్న ఆసక్తితో చదవాలి.

నాకు సన్మానాలు జరుగుతున్నాయంటే, నన్ను ఎంతో మంది గురుభావంతో గౌరవిస్తున్నారంటే – అట్టి వారిలో అధిక సంఖ్యాకులు సవర్ణ హిందువులే. సాంస్కృతిక రంగంలో హరిజన యువకులకు ఆసక్తిని కలిగించి, ఇతర కులాల విద్యావంతులతో సమానమైన స్థాయిని వారిలో కలిగించడానికే నిజానికి నేనెక్కువగా ఈ సన్మాన గౌరవాలకు అంగీకరిస్తున్నాను.

ఈ దేశంలో మెజారిటీ జాతి హరిజనులే. జాతి యొక్క వైదిక, పౌరాణిక, తాత్విక, సాంస్కృతిక నాయకత్వమంతా హరిజనులదే (వ్యాస వాల్మీకుల ద్వారా) అన్న గాఢ విశ్వాసం నాది. అక్షర సిద్ధాంతం నాది. ఈ నా సిద్ధాంతాన్ని కాదన్న వారెవరూ సవర్ణ హిందూ పండితులలో లేరు. అందుకే నా ఉద్బోధ ఇంత గాఢంగా, దృఢంగా వుంటున్నది.

ఈ సహస్ర చంద్ర దర్శనోత్సవానికి కూడా నేను అంగీకరించింది అందుకే. నా కులం వాళ్ళైన హరిజనులలో, సమైక్య జాతి ప్రవక్త అయిన డా. అంబేడ్కర్ గారి పుణ్యమా అని, ఇప్పుడు విద్యావంతులూ, ఉన్నతాధికారులూ, రాజకీయ ప్రముఖులూ, వ్యాపార వేత్తలూ కూడ పైకి కనిపిస్తున్నారు. అందుకు తగిన స్థాయిలో సాంస్కృతిక వికాసం ఎందుకు కలగడం లేదు? ఇదీనన్ను బాధిస్తున్న ప్రశ్న.

జాతి వికాసానికీ, అభ్యున్నతికీ ధనమూ, అధికారమూ మాత్రమే చాలవు. తగిన సంస్కృతీ సంస్కారాలుండాలి. అట్టి పరమజ్ఞతను (Higher Awareness) కలిగించాలనేదే ఈ ఉత్సవాన్ని నిర్వహించడంలో నిర్వాహకుల ఉద్దేశమూ, నా లక్ష్యమూను.

ఈ ఉద్దేశాన్ని వెలిబుచ్చి కార్యాచరణకు పూనుకొన్న డా. జస్టిస్ పున్నయ్యగారు ఇప్పుడున్న హరిజన మేధావులలో ఉన్నతోన్నతుడు. ఉత్తమోత్తముడు. కొందరు కొందరు ఇంకా స్వార్థ సంకుచిత మనస్తత్వంలో పడి వున్నప్పటికీ, పున్నయ్యగారి సాంస్కృతిక మార్గ దర్శకత్వాన్ని మొత్తం మీద హరిజన మేధావులందరూ గుర్తించారనే అనుకోవచ్చు. అందుకు తగు నిదర్శనలు ఈ ఉత్సవ సందర్భంలో కనిపిస్తున్నాయి. అట్టి వారందరికీ నా శుభాభికాంక్షలు. డా. జస్టిస్ పున్నయ్యగారికి నా కృతజ్ఞతాభివందనాలు.

నిజానికి ఈ వెయ్యి పూర్ణిమల పండగనాటికి ఒక పుస్తకం ప్రకటించాలనే ఆలోచన నాకు చాల ఆలస్యంగా కలిగింది. కొంచెం ముందు కలిగివుంటే ఇంకొంచెం సమగ్రంగా వ్రాసివుండే వాణ్ని. తొందర తొందరగా వ్రాయడంవల్ల ఇది ఒక క్రమంలో కాక ఒక భావ స్రవంతి (Stream of Conscience)గా తయారయింది. సహృదయులు గుర్తించగలరు.

ఈ దేశంలో మైనారిటీలంటే మత మైనారిటీలే. జాతి మైనారిటీలు కాదు. పైగా అన్ని మత మైనారిటీలు మైనారిటీలుగా పేర్కొనబడడం లేదు. క్రైస్తవులు ముస్లింలు మాత్రమే అలా పేర్కొనబడుతున్నారు. అంబేడ్కరుగారు స్పష్టంగానే ఈ విషయం చెప్పారు. ఈ రెండూ విదేశీ మతాలు కనుక వీటిని తాను స్వీకరించడం లేదన్నారు. ఆయన ఉద్దేశం నిజమే అయినా, ఈ రెండు మతాలూ విదేశీ మతాలే అయినా, వాటిని అనుసరించి, ఈ దేశం పొరులుగా స్థిర నివాసాలేర్పరుచుకొని వున్న క్రైస్తవులూ, ముస్లింలూ భారత పొరులే గదా! మౌలికంగా ఈ దేశ ప్రజలే కదా? వైష్ణవులను, శైవులను, జైనులను మనం మైనారిటీ లనడం లేదు కదా!

ఇలా అనిపిస్తుంది నాకు – క్రైస్తవులను, ముస్లింలను చూసినప్పుడు. మతాలు వేరైనా వీళ్ళంతా నా వాళ్ళే అనిపిస్తుంది. నా బంధువులే అనిపిస్తుంది. ఎంతకాలం వీళ్ళు ఈ నా దేశంలో మైనారిటీలుగా వుంటారు అనిపిస్తుంది.

క్రైస్తవుల విషయంలో బాధలేదు. ఒక్క మత విశ్వాసంలో తప్ప తక్కిన వేష భాషాది సమస్త విషయాలలోను తమ సహ భారతీయులకంటే భిన్నంగా లేరు. వాళ్ళు

విషయంలో సాంఘిక సమస్యలేవీ లేవు. ఒక్క ముస్లింల విషయంలోనే సాంఘికంగా సెగ్రిగేషన్ వుంది. వేష, భాష, ఆచారాదులలో విజాతీయతా, విదేశీయతా వుంది. అందుకే ఇన్ని సమస్యలు.

ఈ సమస్యలు తీరాలంటే మెజారిటీ జాతికి వీలయినంత దగ్గరగా రావడానికి వాళ్ళు కూడా ప్రయత్నం చెయ్యాలి. ఈశ్వర్ అల్లా తేరేనాం అంటూ హిందువులు సర్దుకుపోతూనే వున్నారు కదా!

"My alliance with the Musalmans Presupposes their perfect tolerance for my idols and my temples" అన్నాడు గాంధీజీ, 1924లో 'నవజీవన్ ముఖీజ్ఞీ' పత్రికలో వ్రాస్తూ. అదే లక్ష్యం కోసం చివరవరకు కృషిచేశాడు. ఆయన కృషి ఫలించకపోవడానికి కారణం దేశకాల పరిస్థితుల కనుగుణంగా మైనారిటీలు మారలేకపోవడంవల్లే కదా?

అన్ని వర్గాలూ చైతన్యవంతులై తమ తమ అస్థిత్వాల కోసం నడుం కట్టి పోరాడే పరిస్థితి ఏర్పడివున్న ఈ ఆధునిక కాలంలో తాతల నాటి మిణుగురులనే నమ్ముకొని బ్రతకడం క్షేమమేనా అనేది నా ప్రశ్న. ఆలోచించవలసిందిగా యువతరానికి నా విజ్ఞప్తి.

అందుకే క్రైస్తవులకు, ముస్లింలకు, దళితులమని చెప్పుకొంటున్న వారికి నేను నమస్సులతో విజ్ఞప్తి చేశాను. ఈ దేశపు సంపూర్ణ పౌరులుగా వికసించండని, పురోగమించండని.

★ ★ ★

పురాణాలలో హరి-గిరి

జన మనీషులు

ఆదిమూలం

అంబేడ్కరు గారి ఊహ ప్రకారం హరిజను లెవరంటే, మానవులు ట్రైబులుగా సంచరిస్తున్న పూర్వకాలంలో ప్రధాన ట్రైబు నుంచి వెనకబడిపోయి విడిపోయిన వాళ్ళు.

ట్రైబు అంటే చిన్న సముదాయం. ఒక ముఠా. ఒక వర్గం. చిన్న జాతి. ఒక గ్రూపు అన్నమాట.

ఆ కాలంలో ఒకే జాతి మానవులైనా అనేక గ్రూపులుగా విడిపోయి ఆహారాన్ని వెతుక్కుంటూ తలక దారినా సంచరిస్తూ వుండేవాళ్ళు. ఏ గ్రూపుకు ఆ గ్రూపే సమగ్రంగా, సర్వ స్వతంత్రంగా వుండేది. అట్టి గ్రూపులనే అంబేడ్కరు గారు (Tribes) ట్రైబులు అన్నారు. అట్టి ట్రైబ్సు నుంచి విడిపోయిన వాళ్ళనే 'బ్రోకెన్ పీపుల్' (Broken People) అన్నారు.

ఈ బ్రోకెన్ పీపుల్‌ని విడిపోయిన వాళ్ళు, వేరుపడిన వాళ్ళు అనవచ్చు. దళితులు అని మాత్రం అనగూడదు. ఎందుకంటే, దళిత శబ్దానికి పతిత అనే రూఢి అర్థం వుంది. దళితులు అనడం కంటే నిమ్నులు అనడమే మేలుగా వుంటుంది. ఒక ప్రధాన జాతి నుంచి విడిపోయిన వాళ్ళు దళితులూ, పతితులూ కాబోరు. వాళ్ళు ప్రధాన జాతికే చెందిన వాళ్ళు కదా? ప్రధాన జాతి నుంచి విడిపోయారే తప్ప జాతి సంబంధంగా వాళ్ళూ, వీళ్ళూ ఒకటే.

అస్పృశ్యులుగా పరిగణించబడే హరిజనులను గురించి అంబేడ్కరుగారు చేసిన ఒక ఊహ ఇది. ఈ విషయంలో ఇంకా పరిశోధన జరగవలసి వున్నదని ఆయనే తన ''అస్పృశ్యులెవరు?'' అనే గ్రంథంలో పేర్కొని వున్నారు.

అయితే, నేటి హరిజన విద్యావంతులందరూ ఆయన చెప్పిన చోటనే ఆగిపోయారు తప్ప, ముందుకు పోవడం లేదు. పరిశోధనలు చెయ్యడం లేదు. ఇదొక దురదృష్టకర విషయం.

హరిజనులెవరు? వాళ్ళ ఆదిమూలం ఏమిటి? వాళ్ళకు అంటరానితనం ఎలా వచ్చింది? అనే విషయంలో నేను మరొక దృక్కోణం నుంచి పరిశీలించడం సాగించాను. హైందవ సాహిత్యంలో ఏమి చెప్పబడింది? నేను మొదటి నుంచీ ఆ మార్గంలో పయనించాను.

ఇప్పుడు హరిజనులనబడుతున్న వారినే హైందవ వాఙ్మయంలో 'చండాలురు' అన్నారు. చండాల, శ్వపచ, పుల్కస, మాతంగ, పంచమ, మాల, మాదిగ, గోసంగి మొదలైన పేర్లన్నీ అస్పృశ్యులైన చండాలురకు పర్యాయపదాలుగానే వాడబడ్డాయి. పూర్వ సాహిత్యం దృష్టిలో ఈ అందరూ ఒకటే కులం. అస్పృశ్యకులం. ఈ పేర్లలో తరచుగా వాడబడిన పేరు చండాల.

చండాల శబ్దానికి పూర్వ నిఘంటువులు, ముఖ్యంగా అమరకోశం ఇచ్చిన అర్థం – ''చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేనయ'' అని. అంటే శూద్ర పురుషుని వలన బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన సంతానం చండాలురు అనబడుదురు అని.

వృత్తులను బట్టి నాలుగు వర్ణాలుగా పని విభజన చెయ్యబడిన వైదిక సమాజం క్రమంగా జన్మనుబట్టి కులాలుగా విడిపోయి హైందవ సమాజంగా మారినప్పుడు కులాంతర స్త్రీ పురుష సంబంధాలవల్ల ఎన్నో కొత్త కులాలు పుట్టుకొచ్చినై.

ఈ కొత్త కులాల వాళ్ళనే 'సంకరులు' అన్నారు. ఇతర కులాల సంకరులు తేలిక శిక్షలతో వదలివేయబడగా శూద్ర బ్రాహ్మణ సంకరులకు మాత్రం కఠినాతి కఠినమైన ''వెలి – అంటరానితనం'' శిక్ష విధించబడింది. అందుకు కారణం – చివరి కులమైన శూద్రులతో అతి అగ్రకులమైన బ్రాహ్మణుల సంబంధాన్ని ప్రోత్సహించకూడదనేదే.

ఆ విధంగా వెలివేయబడిన తొలి చండాలుడు మతంగుడు. ఇందుకు సంబంధించిన వివరాలు నా రచనల్లో చాలచోట్ల పేర్కొని వున్నాను.

ఈ మతంగుడు తొలి సాంఘిక విప్లవకారుడు. ఆయనతో గిరిజన ప్రముఖుడైన ధర్మవ్యాధుడు వియ్యమందడంవల్ల, హరిజన, గిరిజన తెగలు రెండూ ఏకమై దేశమంతా విస్తరించాయి.

కుల వ్యవస్థను ఏర్పరచుకొన్న ప్రధాన హైందవ సమాజం ''సవర్ణులనీ'', అట్టి వ్యవస్థ లేని హరిజనులు ''అవర్ణులనీ'' పిలువబడ్డారు. ఈ అవర్ణులలో రెండు తెగలున్నారు. ఒక తెగ ప్రధాన గ్రామాన్ని (సవర్ణులను) అంటిపెట్టుకుని వున్న హరిజనులు, రెండవ తెగ అరణ్యాలలో వుండిపోయి స్వేచ్ఛగా బ్రతుకుతున్న గిరిజనులు.

అందులోనూ హరిజనుల నుంచి అడవులకు పారిపోయేవాళ్ళు, గిరిజనుల నుంచి గ్రామాలకు వచ్చి చేరే వాళ్ళు ఎక్కువగానే వుంటూ వుండే వాళ్ళు.

అందుకే నేను హరిజనులనూ, గిరిజనులనూ కలిపేశాను. ఒకే జాతిగా నిర్వచించాను. ధర్మవ్యాధ, మతంగ బాంధవ్యం కూడ నా విధానానికి తోడ్పడింది.

ఇప్పుడు అంబేడ్కరు చెప్పిన మార్గంలో పరిశోధన జరగడం లేదు. ఎవరైనా జాతి అభ్యుదయం కోరే యువకులు అక్కడక్కడ పరిశోధనలు చేస్తున్నా, అట్టి పరిశోధనలు అంబేడ్కరు చుట్టూ మాత్రమే తిరుగుతున్నై. ముందుకు సాగడం లేదు.

ఇక నా మార్గంలో–

నేను నాకు సాధ్యమైనంత వరకూ దేవ, దానవ, మానవ వర్గాల పుట్టు పూర్వోత్తరాలను గురించీ, ఆర్యుల వర్ణ వ్యవస్థను గురించీ, హిందువుల కుల విభజన గురించీ, హరిజన గిరిజన వర్గాల ఆవిర్భావం గురించీ సమగ్రంగా పరిశోధించి ఎంతో సాహిత్యాన్ని సృష్టించి వున్నాను. చాల వరకు మంగిపూడివెంకటశర్మగారి ''నిరుద్ధ భారతం'' గ్రంథాన్ని అనుసరించి, ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించి, యథార్థాలను బయటపెట్టి వున్నాను. నా సాహిత్య సృష్టికి అలాంటి పూర్వగాథలే కొంతవరకు వస్తు సామగ్రి అయ్యాయి.

అయితే నా సాహిత్యాన్ని చదివి మూల సత్యాన్ని గ్రహిస్తున్న హరిజనులు చాల తక్కువ. వీళ్ళకు తాత్కాలికమైన హక్కులు, ఉద్యోగాలు మాత్రమే ముఖ్యం.

ఇక, సవర్ణ హిందువులలో రజోగుణం, తమోగుణం మాత్రమే ప్రాధాన్యం వహిస్తున్నై. సాత్వికంగా ఆలోచించి, ఆర్ష, వైదిక సంప్రదాయాలను గుర్తించి, నన్ను అర్థం చేసుకుని నా సాహిత్యాన్ని అవగాహన చేసుకొంటున్న వాళ్ళు బహుతక్కువ.

జాతీయ సమైక్యమో అంటూ అరిచేవాళ్ళలో కూడ జాతి అంటే ఏమిటో, సమైక్యం ఎవరి మధ్యనో తెలిసిన వాళ్ళు లేరు. పత్రికల వాళ్ళూ అంతే. పండితులూ అంతే. ప్రభుత్వ నాయకులూ అంతే. ఎవళ్ళ స్వప్రయోజనాలు వాళ్ళవి.

అయినా, నేను నిరుత్సాహపడడం లేదు. చెబుతూనే వున్నాను. వ్రాస్తూనే వున్నాను. పేద వాణ్ణయినా పుస్తకాలు ప్రకటిస్తూనే వున్నాను. అమ్మేవాళ్ళూ కొనేవాళ్ళూ లేకపోయినా, ఉచితంగా పంచి పెడుతూనే వున్నాను.

వేదాలు పట్టిన కాలంలో కుల వ్యవస్థ లేదు. ఇజ్రాయెలీ సమాజంలో వుండే కిబుట్జి (Kibbutz) అనబడే సోషలిస్టు వ్యవస్థే ప్రాచీన కాలంలో వైదిక సమాజంలోనూ వుండేది. దీనినే నేను నా సాహిత్యంలో 'ఉమ్మడిపాయ్యి' అన్నాను. 'శివ సోషలిజం' అని కూడా అన్నాను. సర్వోదయం అని సైతం అన్నాను.

వేద ఋషులందరూ ఎక్కడెక్కడో, ఎవరెవరికో పుట్టి, బ్రహ్మజ్ఞానం ద్వారా అగ్రగణ్య లైనవాళ్ళే. కుల వ్యవస్థ ఏర్పడుతూ వచ్చిన పురాణ కాలంలో కులాంతర స్త్రీ పురుష సంబంధాలవల్ల సంకర జాతులేర్పడి, వృత్తి వ్యత్యాసాలవల్ల హెచ్చు తగ్గులేర్పడి, వైదిక సోషలిస్టు సమాజం శిథిలమవుతూ వచ్చిన నాటి కాలంలోని నాకు తెలిసిన కొందరు హరిజన గిరిజన మహా మనీషులను గురించి క్లుప్తంగా ఇక్కడ చెప్పాను.

వీరిలో ఒక్కొక్కరి గురించీ ఒక్కొక్క పరిశోధక గ్రంథమే వ్రాయవచ్చు. వీరి గురించే కాక, మంగిపూడి వెంకటశర్మ గారి నిరుద్ధ భారతంలోని అనేక మంది హరిజన, గిరిజన మేధావుల గురించీ, ఋషుల గురించీ, యోధుల గురించీ, రాజుల గురించీ, కవి పండితుల గురించీ వేలకొలది పేజీల థీసీస్సులు వెలువరించవచ్చు. డాక్టరేటులు పొందవచ్చు.

ఈ నాటికి కూడా నన్నయ్యగారి బండిరాలు. నన్నయ్యగారి అరసున్నలు, నన్నయ గారి యతులు, నన్నయ్యగారి క్రియలు అంటూ వృధా పరిశోధనలు చేస్తున్నారే తప్ప, ఇటువంటి పురాణ పురుషుల పుట్టు పూర్వోత్తరాలను గురించి పరిశోధన చేయడానికి ఎవరూ పూనుకోవడం లేదు. హరిజన యువకులైనా అందుకు పూనుకొంటారంటే

వాళ్ళకు ప్రాచీన సాహిత్యంపట్ల ఆసక్తి కలగడం లేదు. ఈ హరిజన గిరిజన పుట్టుపూర్వోత్తరాలేమిటో, తమ ప్రాచీనత ఎప్పటిదో తెలుసుకొందామన్న జిజ్ఞాసే లేదు.

అందుకే నేనీ గ్రంథం వ్రాశాను. భవిష్యత్తు మీద అపారమైన ఆశతో వ్రాశాను. హరిజన, గిరిజన యువకులనే కాక, జాతిశ్రేయస్సే, జాతి సమైక్యమే, జాతి అగ్రేసరత్వమే ప్రధానంగా భావించే దేశభక్తులైన సవర్ణ విద్యావంతులను కూడ మేల్కొల్పడానికి వ్రాశాను.

ప్రపంచ జాతుల స్థాయికి మన జాతి పెరగాలంటే, పురోగమనం సాధించాలంటే ముందు మన గతం తెలియాలి. మన జవసత్వాలేమిటో తెలియాలి. మన గతంలోని జీవశక్తిని పునరుద్ధరించుకోవాలి. పునరుజ్జీవింప (Resurrect) చేసుకోవాలి.

జాతీయ సమైక్యం అంటే పులికీ, గోవుకూ స్నేహం సాధించడం కాదు. పులిని గోవు స్థాయికో, గోవును పులి స్థాయికో దించి సమానం చేయడానికి ప్రయత్నించడమూ వ్యర్థం. అట్టి ప్రయత్నం చేయడం తప్పకపోతే ముందుగా మన జాతి అంతర్విభేదాలను తొలగించుకోవాలి. ఏకజాతిగా సంఘటితం కావాలి. అందుకు గతం గురించిన పరిశోధన జరగాలి. నేను కవిని కనుక పరిశోధనపై దృష్టిని కేంద్రీకరించలేదు. పరిశోధకులకు మార్గం చూపుతున్నానంతే.

ఇందులో అరుంధతి, వాల్మీకి, ధర్మవ్యాధుడు, వేద వ్యాసుడు గురించి నేను నాటకాలు కూడా వ్రాసి వున్నాను. మొదటి రెండూ ముద్రించబడి, జనాదరణ పొంది వున్నై.

అందరితోపాటు హరిజన సాహితీ కళాకారులను ప్రోత్సహించడం కోసం నేను ఎన్నో సాంస్కృతిక సంస్థలను కూడా నెలకొల్పడం, ప్రోత్సహించడం జరిగింది. అందులో జగ్జీవన్ కళా పరిషత్తు, సంస్కృతీ సంవర్ధక సమితి, సుఖేలా నికేతన్, విశ్వ సాహితి, ధర్మజ్యోతి వగైరా వున్నై. ఇందులో ధర్మజ్యోతి సాంస్కృతిక సంఘం సాహసోపేతమైన కార్యక్రమాలను నిర్వహించడం ప్రారంభించింది. ఈ సంస్థ స్థాపక కార్యదర్శి శ్రీ దాకే శివాజీ యువకుడు, ఉత్సాహవంతుడు, జీవితంలో ఏదో సాధించాలనే దీక్ష, ఆసక్తి కలవాడు.

ఈ సంస్థ తొలి సమావేశంలోనే మంత్రులు కుతూహలమ్మ, పాటి రాజంగార్ల వంటి వారిని, నారాయణరావు ఐ.పి.ఎస్., ఎమ్.ఎన్.భూషిగార్ల వంటి ప్రముఖులను పాల్గనేటట్టు చేసి సభను ఎంతో జయప్రదంగా నిర్వహించాడు.

1992లో నా 82వ జన్మ దినోత్సవాన్ని రవీంద్రభారతిలో నిర్వహించింది కూడా ధర్మజ్యోతే. శ్రీ శివాజీ ఆర్గనైజింగ్ నైపుణ్యం ఈ సందర్భంలో బాగా నిరూపితమైంది.

ఆచార్య సి.నారాయణరెడ్డిగారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రులు పి.రామచంద్రా రెడ్డి, పాటి రాజంగార్లు; ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు బి.దానం, కె.మాధవరావు, టి.గోపాలరావు గార్లు; బజ్జా తారకం, జస్టిస్ కె.పున్నయ్యగార్లు పాల్గన్న విశిష్ట సభ అది. స్వర్గీయ బజ్జా కృష్ణశాస్త్రికి అంకితమియ్యబడిన 'పాటలలో అంబేడ్కరు' అనే నా గ్రంథం ఆవిష్కరించబడిన సభ అది. ఉన్నతాధికారులు కులేశ్వరరావు ఐ.ఎ.ఎస్., వేదయ్యగారు, సైదులు గారు మున్నగు ఎంతో మంది ప్రముఖులు తమ సహాయ ప్రోత్సాహాలను అందించిన సభ అది.

అట్టి వారందరికీ కృతజ్ఞతలు తెలపడంతోపాటు ఇప్పుడీ గ్రంథాన్ని ధర్మజ్యోతి సంస్థకూ, దాని వ్యవస్థాపక కార్యదర్శికీ, పోషక ప్రోత్సాహకులకు అంకితమిస్తున్నాను. ఇదొక కొత్త తరహా అంకితం. విద్యా, సాహితీ మనీషులైన సహృదయులు ఈ రంగంలో కృషిచేసి జాతి సమైక్యానికి తోడ్పడగలిగితే నేనెంతో ఆనందించగలను.

-భీమన్న

అంకితం

ధర్మజ్యోతి సాంస్కృతిక సంఘానికి

ఆ సంఘపు వ్యవస్థాపక కార్యదర్శి

యువకరత్న దాకే శివాజీ

ఆ సంఘం తరపున అనేకానేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న వందల కొలదీ కార్యకర్తలకూ, పోషకులకూ, ప్రోత్సాహకులకూ, మార్గదర్శకులకూ–

ముఖ్యంగా

శ్రీయుతులు జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య, టి.గోపాలరావు ఐ.ఎ.ఎస్., బి.దానం ఐ.ఎ.ఎస్., కత్తి చంద్రయ్య ఐ.ఎ.ఎస్., ఎమ్.వి.నారాయణరావు ఐ.పి.ఎస్., కె.నరసింహం, కందికట్ల ప్రభుదాస్, కె.డి.జి.రాజశేఖరరావు, డా. బి.నాగవర్మ, ఎ.విద్యాసాగర్ ఐ.ఎ.ఎస్. గార్లకు.

★ ★ ★

నాకు తెలిసిన జాషువా

స్మృతి

సృష్టిలోని ప్రతిజీవిలోనూ, ముఖ్యంగా ప్రతి మానవుడిలోనూ త్రిగుణాలు వలెనే, ఆరు ఉద్రేకాలు వలెనే, నవరసాలు కూడా ఉంటై.

ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క గుణం, ఒక్కొక్క ఉద్రేకం, ఒక్కొక్క రసం సమయ సందర్భాలను బట్టి అతిశయిస్తూ ఉంటుంది. అవనతిస్తూ ఉంటుంది.

కవిలోని భావం ఆవేశం పొందేకొలదీ, పదునెక్కే కొలదీ వచనం నుంచి గేయంగా, పద్యంగా రూపొందుతూ ఉంటుంది. ఆ విధంగా తన ప్రతి భావమూ ఉప్పొంగి, ఊపందుకొని పద్యంగా రూపుదిద్దుకున్న పరమ కవితా శిల్పం జాషువా గారిది.

నిజానికి జాషువాగారి గురించి ఇలాంటి రచన చేస్తానని నేనెప్పుడూ అనుకోలేదు. ఆయన సన్నిధిలో ఏదో సంతృప్తిని అనుభవించడం, ఆయన పద్యాలు వింటూ, చదువుతూ ఆనందించడం మాత్రమే ఆయన బ్రతికి ఉండగా నేను చేసిన పని.

ఒక్క జాషువా గారి గురించే కాదు, ఏ ఒక్కరి గురించీ ప్రత్యేకంగా నేనేమీ వ్రాయలేదు. సాహిత్యోపన్యాసాలు సైతం ఇవ్వలేదు.

కాలేజీల నుంచి, యూనివర్సిటీల నుంచి సాహిత్యోపన్యాసాల కోసం వచ్చిన ఎన్నో ఆహ్వానాలను నేను ఉపేక్షించడం జరిగింది కూడ.

సాహిత్యాన్ని సృష్టించాలే కాని, కవి అయినవాడు సాహిత్యం గురించి ఉపన్యాసా లివ్వగూడదనేది నా సిద్ధాంతం. అట్టి ఉపన్యాసాలు ఇవ్వవలసింది పండితులు. అట్టివారిలో ఆనాడు ఆచార్య దివాకర్ల వేంకటవధాని, ఈనాడు ఆచార్య సి.నా.రె. ప్రధానులు. విషయ వివరణ వైదుష్యంలో ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగార్నీ, ఆచార్య గోపీగార్నీ చెప్పుకోవచ్చు.

నేను కవినే గాని పండితుణ్ణి కాదు.

అయితే – ఇప్పుడీ రచన ఎందుకు చేశాను?

రెండు సంవత్సరాల క్రితం, 1994 మార్చి ప్రాంతంలో ఒక రోజున, కవితా

వాహినిలో ఏదో కవితను రికార్డు చేయడం కోసం నేను రేడియో స్టేషనుకు వెళ్ళినప్పుడు, రికార్డింగ్ అయిపోయిన తర్వాత, ఏవో కబుర్ల సందర్భంగా, సాహిత్య కార్యక్రమాల ప్రొడ్యూసరు చేవెండ్ర చలపతిరావుగారు అడిగారు ''గుర్రం జాషువా గారిని గురించి ఒక నాలుగు నిమిషాలపాటు ఏమైనా చెప్పగలరా?'' అని.

''నాలుగు నిముషాలే కాదు, ఆయన గురించి నాలుగు రోజులపాటు మాట్లాడమన్నా ఏకధాటిగా మాట్లాడగలను'' అన్నాను నేను.

''మరేమీ లేదు. జాషువాను గురించిన ప్రోగ్రాం ఒకటి రేపు ప్రసారం అవుతున్నది. అందులో పాల్గంటున్న వారి పేర్లలో మీ పేరు లేదని నాకిప్పుడే తెలిసింది. మీరు లేకుండా జాషువాపై ప్రోగ్రామా అనిపించి అడిగాను. ఇప్పుడైనా, మీరు నాలుగు మాటలు చెపుతానంటే, రికార్డు చేసుకుంటాను'' అన్నారు ఆయన – తనకు సహజమైన చిరునవ్వును కొంచెం పెంచుతూ.

చలపతిరావుగారి ముఖం మీద ఒక రకమైన చిరునవ్వు ఎప్పుడూ మెరుస్తూనే ఉంటుంది. అలాంటి చిరునవ్వంటే చాలా ఇష్టం నాకు. కవితా గానం చేసేటప్పటి జాషువాగారి ముఖం జ్ఞాపకం వచ్చిందా క్షణంలో.

'నాకు తెలిసిన జాషువా' అనే శీర్షికతో, ఆయనతో నాకు గల పరిచయాన్ని క్లుప్తంగా నేను చెబితే, చలపతిరావుగారు రికార్డు చేసుకున్నారు.

నాపట్ల చలపతిరావుగారు కనబరచిన అవ్యాజాభిమానం, సహృదయతా, విషయంపట్ల ఔచిత్యం, అభిజ్ఞత ఆవిధంగా ఈ రచనకు మూల కారణాలయినై.

ప్రతిధ్వనే తప్ప ధ్వని వినిపించే అవకాశంలేని కులపర్వతారణ్యంలో, నూరేళ్ళ క్రితం పుట్టి, అక్కడి నుంచి నిరంతర కృషి ద్వారా నెత్తుటితో, చెమ్మటతో, కన్నీటితో ఈ అభారతీయ కుల వ్యవస్థా యెడారిని భారతీయం చేయడానికి ముప్పాతిక యేండ్లపాటు సాగుచేసుకుంటూ వచ్చిన మానవతా మహాకర్షకుడు జాషువా.

ఒక నలభై ఏళ్ళపాటు ఆయన పరిచయాన్ని పంచుకున్న సహ కర్షకుణ్ణి నేను. అప్పటి పరిచయ సమైశ్వర్యాన్ని స్మృతిక్షేతం త్రవ్వకం ద్వారా ఇప్పుడు మళ్ళీ

అనుభవించే మహదవకాశం కలిగిందంటే, అందుకు చలపతి రావుగారికి కృతజ్ఞతాభివందనాలు చెప్పక తప్పదు కదా!

నా కెవరైనా అపకారం చేస్తే, అది శివార్పణమైపోతుంది. నాకు జ్ఞాపకం ఉండే అవకాశం లేదు. నాకు ఎవరైనా చిన్న ఉపకారమో, సహాయమో చేసినా అది సారస్వతమై, చిరస్థాయిగా జ్ఞాపకం ఉంటుంది. ఇది నా స్వభావం.

దేశంలో అనేక ఆకాశవాణి కేంద్రాలలో పనిచేస్తూ, విజయవాడమీదుగా ఈ మధ్యనే హైదరాబాద్ కేంద్రానికి వచ్చారు చలపతిరావుగారు. అంతవరకు ఆయనెవరో నాకు తెలియదు. జాషువాను గురించి నేను రమారమి అరవై సంవత్సరాలు వెనక్కి వెళ్ళి మరపు పాదల్ని చీల్చుకొంటూ, జ్ఞాపకాల వెలుగు నీడలలో తడబడుతూ, ఈ రచనను ఆవిష్కరించా నంటే అందుకు కారణం చలపతిరావుగారి సహృదయ సూచనే.

ఆ తర్వాత చాలా కాలానికి నరసాపురంలోని ''మహాకవి జాషువా శతజయంతి ఉత్సవ సమితి'' వారి నుంచి ఏదైనా ఒక వ్యాసం పంపించవలసిందిగా ఒక లేఖ అందింది. ఉత్సవ ప్రత్యేక సంచిక సంపాదకులు డా. అరిపిరాల నారాయణ రావుగారు వ్రాసిన లేఖ అది. అందుకోసం ఆనాటి రేడియో ప్రసంగం జ్ఞాపకం తెచ్చుకోవడం తప్పలేదు.

జాషువా శత జయంతి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయనీ, ఆ సందర్భంలో జాషువా గురించి మీరేదైనా వ్రాయవచ్చు కదా అనీ, మిత్రుడు గనుమల జ్ఞానేశ్వర్ ఒక సూచన చేసినప్పుడు, అంత శ్రమపడే శక్తి నాకిప్పుడు లేదని చెప్పాను.

నాకు ఒక పాతికేళ్ళుగా ఆత్మీయుడిగా ఉన్న యువమిత్రుడు జ్ఞానేశ్వర్. బాలాపురం వీరాంబేడ్కరీయుడీయన. సమయజ్ఞత కలవాడు. సంస్కారవంతుడు. చక్కని సలహాలిస్తుంటాడు. బాగా చదువుకున్న విద్యాధికుడు, జర్నలిస్టు, సాంతలాభం కొంతకాదు, మొత్తము మానుకొని, పారుగు వాళ్ళకు తోడ్పడుతున్న త్యాగి. సంఘారామ సార్థక బిరుదాంకితుడు.

అయితే, ఆ తర్వాత జాషువా గురించిన సభలను, సాహిత్య వ్యాసాలను చూస్తూ ఉంటే, జాషువా కవితా మహా సముద్రాన్ని లోతుకి వెళ్ళి సమగ్ర పరిశీలన జరిపే ప్రయత్నం

ఎవరూ చేయడంలేదనే అసంతృప్తి నాలో నెలకొనసాగింది. అందుకే వణుకుతున్న చేతులలోకి మళ్ళీ కలాన్ని అందుకున్నాను.

వణికే చేతులతో లోకాన్ని వణికిస్తున్న విశిష్ట కవినంటూ నన్ను తరచూ నారాయణ రెడ్డిగారు పేర్కొంటూ వుండడంతో, నా చేతుల వణుకు సాహితీ లోకంలో ఒక క్లాసిక్కు (పురాణం) అయి కూర్చుంది కూడా.

అప్పటికి ఒక సంవత్సరంగా నాకు సయాటికాతో ఎడమకాలు, డయాబెటీస్‌తో కుడికన్ను సమ్మెకు దిగి ఉన్నై. అయినా, తిరుగుతూనే ఉన్నాను. సభల్లో పాల్గంటూనే ఉన్నాను. నేనంటే ఇష్టం ఉన్నవాళ్ళూ లేనివాళ్ళూ కూడా ఈ నా జీవలక్షణ వైరుధ్యాన్ని యథేచ్ఛగా వాడుకొంటూనూ ఉన్నారు.

కొందరైతే, నా పేరును నాకు చెప్పకుండానే తమ ప్రోగ్రాంలలో వేసుకొని, ఆ తర్వాత కూడా చెప్పకుండా ప్రోగ్రాంలు జరుపుకొని, ఎవరైనా అడిగినపుడు ''ఆయన మంచంపట్టి లేవడంలే''దనే ప్రచారం చేస్తున్నారు కూడ!

''ఆత్మాత్వం, గిరిజా మతిః, పరిజనా ప్రాణాః, శరీరం గృహం, పూజాతే విషయోపభోగ రచనా –'' అనే ఆదిశంకరుల వారి శ్లోకం పురాసారాయంలా తలకెక్కిన నేను, ఏదీ పట్టించుకోలేదు.

ఈ కారణంగానే, నేనంటే ఎంతో శ్రద్ధ తీసుకునే డాక్టర్ల సలహాలను కూడా పట్టించుకోక పోవడంవల్ల – వాళ్ళలో చాలా మంది నాకు ఇతర మిత్రుల వలెనే దూరమైపోవడం జరిగింది. ఇప్పుడు, నా మాట కాదనలేక రాజవైద్యం చేసే మా అబ్బాయి డాక్టర్ వర్మ ఒక్కడే నాకు ఏకైక డాక్టరుగా మిగిలాడు. అతడ్ని కూడా నా దగ్గర లేకుండా కర్నూలుకు ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. అదీ నా ప్రస్తుత పరపతీ, పలుకుబడీ, పరిస్థితీ.

ఎడమకాలి సయాటికా నుంచి, కుడికన్ను నిర్వ్యాపారత నుంచి విముక్తి కలుగుతున్న సమయంలో, పూర్తి విశ్రాంతి తీసుకొమ్మని బంధుమిత్ర డాక్టర్లంతా సలహాలిస్తున్న తరుణంలో, ఏదో ఆవేశించిన ఉద్రేకంతో ఈ రచన మొదలుపెట్టాను. పగలనక రాత్రనక స్వహస్తంతో రచన ప్రారంభించాను.

జ్ఞాపకాలు, పురావస్తు త్రవ్వకాలలోవలె, తవ్వే కొలదీ ఊరసాగినై. ఎంతో శిథిల సంపద బయటపడసాగింది. ఒక నెల రోజులపాటు వ్రాసి ముగించేటప్పటికి చేయి ఇక వ్రాయలేనని మొండికేసింది. బుర్ర వేడెక్కిపోయింది. అది తలనిండా పొక్కులుగా తేలి సర్పిగా పడగెత్తింది.

అలా బాధపడుతూనే ఈ రచనను పూర్తిచేసి, మిత్రులు జస్టిస్ పున్నయ్య గారికి చదివి విన్పించాను. ఆయన ఎంతో శ్రద్ధగా విని, వెంటనే ముద్రించమన్నారు. ఆయనకు ఎన్ని వేల కృతజ్ఞతలు చెప్పినా తక్కువే అవుతాయి.

అలాగే, బిట్లు, బిట్లుగా వ్రాసినా ఈ మొత్తం రచనను కొంత ఎడిట్ చేసుకుంటూ శుద్ధ ప్రతిని డిక్టేటు చేశాను. తన సొంత పనులు కూడా మానుకొని, ఈ డిక్టేషను తీసుకున్న ఇంగువ శ్రీకరుణకు కూడా ఋణపడి ఉన్నాను. అలాగే మా ఆవిడ హైమవతికీ, మా అమ్మాయిలు విజయపల్లవీ, విజయేందిరలకూ కూడ.

నేను ఈ రచనను చేస్తున్న సమయంలో నా దగ్గర జాషువాగారి రచనలేవీ లేవు, ఈ విషయం తెలుసుకొన్న జస్టిస్ పున్నయ్యగారు తనవద్దగల గ్రంథాలను తీసుకువస్తానన్నారు గాని, నేను వద్దన్నాను. అందుకు కారణం నా స్మృతి క్షేతపు ప్రత్యేకతనూ, స్వచ్ఛతనూ నిలుపుకోవాలనేది.

అయితే, సంగారెడ్డిలో ఉద్యోగం చేసుకుంటున్న ఒక యువకవి మిత్రుడు, నక్కా అమ్మయ్యగారు ఒకసారి నా వద్దకు వచ్చినపుడు, నాకు అస్పష్టంగా జ్ఞాపకం ఉన్న కొన్ని పద్యాల గురించి చెబితే, ఆయన వాటిని స్పష్టంగా వ్రాసి ఇచ్చాడు. అందుకు అమ్మయ్యగారికి కూడా నేను కృతజ్ఞతలు చెప్పవలసి ఉంది.

ఈ రచనను ముద్రణకు ఇచ్చేముందు, వ్రాత ప్రతి దశలో జస్టిస్ పున్నయ్యగారు విన్నట్టే తాము కూడా వినడానికి సహృదయ మిత్రులు, సాహితీవేత్తలు అయిన బజ్జా తారకం, పి.వి.రావు, బిళ్ళ వేదయ్య, జన్నకూటి నాగేశ్వరరావు వంటి వారు సుముఖత వెల్లడించాడు. అయితే, వారెవరికీ అందుకు తగు సమయం దొరికినట్టు లేదు. వారి సహృదయతను కూడా నేను ఇక్కడ అభినందించక తప్పదు.

నేను ఎన్ని రచనలు చేసినా, ఎన్ని గౌరవాలు, సన్మానాలు, పురస్కారాలు, అవార్డులు అందుకున్నా నాకు ఆర్థికంగా తోడ్పడిన ఉదార చరిత్రులు చాల కొద్దిమందే. అట్టివారిలో అగ్రగణ్యుడు జస్టీస్ కొత్తపల్లి పున్నయ్యగారు.

భోజరాజో, శ్రీకృష్ణదేవరాయలో అన్నట్టుగా పున్నయ్యగారు నా సాహిత్యానికి నిత్య రాజపోషకుడిగా ప్రసిద్ధి కెక్కిన వారు. ఈ రచనను ఆలకించి, ఆస్వాదించి, ఆనందించిన వారు. కాగా, ఈ కృతిని ఆయనకే అంకితం ఇస్తున్నాను.

చాల సంవత్సరాల క్రితం ''అంబేడ్కరిజం'' అనే నా గ్రంథాన్ని పున్నయ్యగారికి అంకితం యిచ్చి ఉన్నాను. నేటి భారత ప్రెసిడెంటు శంకరదయాళు శర్మగారు ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా ఉన్నప్పుడు, ఆయన ముఖ్య అతిథిగా రవీంద్రభారతిలో ఏర్పాటైన ఒక మహాసభలో ఆ గ్రంథాన్ని పున్నయ్యగారికి అంకితం ఇవ్వడం జరిగింది.

నేను ఎన్నో గ్రంథాలను ఎందరికో అంకితం యిచ్చాను గాని, రెండేసి గ్రంథాలను అంకితం ఇచ్చినవారు ఇద్దరే. ఆనాడు దామోదరం సంజీవయ్యగారికి ''మధుబాల'' కావ్యాన్ని, ''పైరుపాట'' సంగీత నృత్యరూపకాన్నీ ఇచ్చాను. ఈనాడు జస్టీస్ పున్నయ్యగారికి రెండో అంకితంగా ఈ ''నాకు తెలిసిన జాషువా'' రచనను ఇస్తున్నాను. స్వీకరిస్తున్నందుకు ఆయనకు ఎన్నో కృతజ్ఞతాభివందనాలు చెల్లిస్తున్నాను.

జస్టిసు పున్నయ్యగారి గురించి క్లుప్తంగా అయినా చెప్పాలంటే కొన్ని వందల పేజీలైనా అవుతుంది. ''అంబేడ్కరిజం'' గ్రంథం అంకితంలో ఆయన గురించి కొన్ని వివరాలు ఇచ్చాను. ఆయన జీవితంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని గురించిన, అస్పృశ్యతా నివారణ గురించిన పోరాట సన్నివేశాలూ, ఆసక్తికర సంఘటనలూ ఎన్నో ఉన్నై.

విద్యార్థిగా, కాంగ్రెసు యువజన నాయకుడిగా, యూనివర్సిటీ సెనేట్ సభ్యుడిగా, అసెంబ్లీ మెంబరుగా, మంత్రివర్గపు అభ్యర్థిగా, జిల్లా జడ్జిగా, హైకోర్టు న్యాయమూర్తిగా పున్నయ్యగారి అనుభవాలు ఇన్నీ అన్నీ కావు. వాటిని గురించి ఆయన మిత్రగోష్ఠులలో చెబుతుంటే, ఎన్ని గంటలైనా అలా కూర్చుని వింటూనే ఉండాలనిపిస్తుంది.

ఆంధ్ర యూనివర్సిటీ ఈయనకు గౌరవ డాక్టరేటును ఇచ్చి తనను తను గౌరవించు కొంది.

ఆయనకు గల మిత్రకోటి గురించి, సన్నిహిత వర్గాల గురించి, చెప్పాలంటే అదొక ప్రత్యేక గ్రంథమే అవుతుంది. బహుశా ఈ విషయాలన్నిటినీ ఆయన తన ''అనుభవాలు, జ్ఞాపకాలు'' గ్రంథంగా వ్రాస్తున్నారనుకుంటా. అది బయటికి వస్తే తెలుగు సారస్వతానికి ఒక అమూల్య రత్నాభరణం లభించినట్లవుతుంది.

ఈ నా రచనను పున్నయ్యగారికి అంకిత మివ్వడంలో మరొక విశేషం ఉంది. జాషువా తన జీవితంలో పొందిన నిస్పృహల వంటివి కొన్ని పున్నయ్యగారి జీవితంలో కూడా కనిపిస్తాయి. అందులో–

బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పున్నయ్యగారిని మంత్రి వర్గంలోకి తీసుకోవలసి ఉంది. అది ఆలస్యం అవుతున్నప్పుడు, వెంటనే తీసుకోవాలంటూ గోవాడ నిరీక్షణరావుగారు ధర్నా చేశారు కూడ. అయితే, అప్పుడది మరొకరికి చిక్కింది. అప్పుడే పున్నయ్యగారు జిల్లా జడ్జి అయ్యారు.

ఆయన హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఏర్పడింది. సుప్రీంకోర్టు జడ్జీగా నియామకం కూడా జరిగి రద్దయింది. న్యాయం జరగలేదు. ఇలాంటివెన్నో ఉదంతాలు జాషువాతో పోల్చదగినవి వున్నై.

ఏది ఏమైనా ఒక వ్యక్తిగా పున్నయ్యగారు విశ్వమానవుడు, ఆదర్శ పురుషుడు. కులవ్యవస్థా సమాజంలో ఆయన హరిజన కులంలో పుట్టడం హరిజనులకే కాదు, మొత్తం హైందవానికే, భారత జాతీయతకే గర్వకారణం.

పున్నయ్యగారు ప్రతిభా భారతికి జనకుడు. పౌరాణిక జనకుడి కంటే ఈ జనకుడు గొప్పవాడంటాను నేను. ఎందుకంటే, ప్రతిభా భారతి తెలుగు దేశపు వీరమహిళ. శ్రీకాకుళం జిల్లా నుంచి ఓటమిలేని శాసన సభ్యురాలు. కార్యదక్షత, దేశ సేవా దీక్ష గల మంత్రి. అంతటి సుప్రసిద్ధ తనయకు జనకుడు పున్నయ్యగారు.

ఇంతవరకు నేను నా రచనలను ఎంతో మంది ఆత్మీయులకు అంకితాలిచ్చి వున్నాను.

ఇంతవరకూ ఇవ్వలేకపోయిన ఆత్మీయులు చాలామందే ఉన్నారు. అందులో

కళా వెంకట్రావుగారు, నార్ల వెంకటేశ్వరరావుగారు, ఆలపాటి సూర్యనారాయణగారు, మంగళగిరి పరవస్తు దాసుగారు, నయనాల గణేశ్వరరావుగారు, మల్లు అనంతరాములు గారు, కొండవీటి వెంకట కవిగారు కొందరు.

ఇప్పటి నా శ్రేయోభిలాషులలో ఆచార్య నారాయణరెడ్డిగారు, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు, ఎమ్.ఎస్.రెడ్డిగారు, ఊట్ల కొండయ్యగారు, నెల్లూరి శ్రీరామమూర్తి గారు, పోతుకూచి సాంబశివరావుగారు, ఆచార్య సింహాద్రి, డా. అచ్యుత రామరాజు, కొత్తూరి లలితా సోమయాజులు దంపతులు, దరువూరి వీరయ్యగారు, వాసిరెడ్డి సీతాదేవిగారు, బిళ్ళ వేదయ్యగారు, ఆచార్య ఆపదరావుగారు, తిరుమల రామచంద్రగారు – ఇలా చాల మందే ఉన్నారు. ఇంకా కొందరు రాజకీయ, ఉన్నతాధికార ప్రముఖులు కూడా నా మానసాకాశంలో ప్రకాశిస్తూ ఉన్నారు.

ఈ అందరికీ చాలినన్ని అముద్రిత గ్రంథాలు నా బీరువాలలో ఉన్నై, వాటికి వెలుగు చూపి ఆత్మీయులకు అంకితాలివ్వాలనే నా ఆకాంక్ష ఎప్పటికి నెరవేరుతుందో మరి.

నేను ఇలా చెప్పడం కొంచెం విపరీతంగా కనిపించవచ్చు. అయితే, ఈ 85 వత్సరాల పరిపక్వ దశలో, ఇంతదూరం నేను పురోగమించడానికి చేదోడుగానో వాదోడుగానో తోడ్పడిన, ఇంకా తోడ్పడుతున్న ఆత్మీయులకు కనీసం కృతజ్ఞతలైనా చెప్పుకోడానికి నాకింత కంటె మరో మార్గం ఏముంది? సత్సంకల్పానికి శక్తి వుండడం నిజమైతే, అదెప్పటికైనా ఫలించక తప్పదు కదా?

ప్రకృతి పురుష నిత్యరమణమ్ము ఈ సృష్టి,
రసమయమ్ము, రాగరంజితమ్ము!
సృష్టి లక్ష్య మెపుడు జీవితానందమే,
విశ్వభోగధామ వినుర భీమ!

ఇక్కడ మరొకసారి చెపుతున్నాను. అస్పృశ్యత, కుల వ్యవస్థ, ఆర్థిక దోపిడి, సాంఘిక అసమానత వంటివి సామాజిక సమస్యలు. మతానికీ, దేవుడికీ సంబంధించినట్టివి

కావు. ఎటువంటి అన్యాయాలనైనా ప్రతిఘటించి, పోరాడి వాటిని పరిష్కరించుకోవాలే తప్ప, వాటి నుంచి పారిపోకూడదు. పారిపోతే వెంటపడి పీడిస్తూనే వుంటాయని.

జీవితంపట్ల నా వైఖరి వంటిదే జాషువాగారి వైఖరి కూడా. ఈ సందర్భంలో నా భీమన శతకం నుంచి ఒక మూడు పద్యాలిక్కడ ఇస్తున్నాను:

హైందవమున గర్వ్య మస్పృశ్యతయు, కుల
కావరమును; సాంఘికమ్ము లవ్వి,
మతము లందు రాజ మకుటమ్ము బుగ్వేద
వీర మానుషమ్ము, వినుర భీమ!

శక్తి కలుగు వాడె శాసించు జగమును,
కలము హలములకును కత్తె రక్ష;
ప్రకృతి నైజ మొకటె ప్రత్యక్ష దైవము,
విశ్వ యోగ ధామ వినుర భీమ!

జన సమాజ మందు సర్పాలు తల లెత్త
తలలు పగుల గొట్ట దగును నరుడు,
మతము లేమి చేయు మగటిమి లేకున్న?
విశ్వ భోగధామ వినుర భీమ!

– బోయి భీమన్న

జస్టిసు కొత్తపల్లి పున్నయ్యగారికి

ప్రియతమ మిత్రు, డాత్మబల
విష్ణుడు, జస్టిసు కొత్తపల్లి పు
న్నయ; నయశీల ధార్మిక మ
నస్కు, డుదార పరోపకార ధీ
మయుడు; మదీయమైన కృతి
మాలను దీని ధరించి, వాగ్ధుం
డయి వెలుగొందు గావుత శ
తాబ్దము లక్షల జాషువా మధు
ప్రియ ప్రియ శారదా హృదయ
హృద్య వసంత రసాంకిత ప్రభన్.

స్వాదు చిత్తుడు, స్వాతంత్ర్య సమర యోధు,
డు త్తమాదర్శ ఘనుడు, సమున్నతుండు,
భారతికి తండ్రి, ప్రతిభకు పరమశిల్పి,
భోజుడే నాకు సాహితీ పోషణమున!

యుగమున కొక్కరో, ఇరువు
రో జనియింతురు జాతి సంస్కృతీ

ప్రగతిని పెంచు శ్రీచరణ
పద్మజ మూర్తులు; అట్టి మూర్తులన్
అగణిత పుణ్యవారధి, ద
యానిధి జస్టిసు పున్నయార్యు; డి
జ్జగము సుతింప నొందు సుఖ
శాంతు, లితోధిక భాగ్య భోగ్యముల్.

నిరు పేదలు, నిరుపాయులు,
నిరాధారులైన దళిత నిద్రాణులకీ
శ్వర తేజ మొసగు హరిజన
గురుదేవుడ వీవు, అందుకో నా రచనన్!

ఎపుడొ ఇచ్చితి అంబేడ్కరిజము, దాని
ప్రతులు లే విప్పు; ఇపుడు నా స్వగత బాష్ప
వా ప్రహేళిక నీ కిచ్చువాడ నయ్య!
అందుకొను మయ్య! పున్నయ్య! అమృతమయ్య!

– భీమన్న

PARAMAATMA

The Super Soul

Prelude

The purpose of this Prelude is to create interest in what I say in this book. A word in the beginning may be worth a thousand in the end.

I compare God to a Drug. I declare that God is a drug. And appeal to include Him in the list of poisonous drugs like Heroin and Brown sugar, and ban the list.

This is a revolutionary proposition that requires a deep thought and stern action to salvage humans from indulgence and decay.

I, therefore, write this word as a request to the intellectual world to read this work with open mind, think over my idea and ponder over my proposition.

The Beginning

"Tell me whether there is a God," I asked my father when I was a boy. I wanted from him a definite answer, yes or no.

My father, Palliah, was a small agriculturist, who is those days was being respected for his integrity of character and advocacy of Advaita philosophy. Persons with reflective minds, mostly from the depressed social stratum, often came to our place and my father went to their places for spiritual discourses. Whenever possible I accompanied him for mere playful pleasure. That is how I got involved in God and philosophy from my boyhood itself. I wanted to know definitely from the Advaita guru himself whether there was a God.

"If you believe there is a God, there is a God. If you consider there

is no God, there is no God. It depends upon your mental set-up and awareness", he said.

Thus in my boyhood itself I built up my own proposition that there is no God as an individual. There is Cosmic Life Energy, the Paramaatma or the Super Soul. And the human mind is its super most manifestation.

I accepted Advaita with an amendment that for attaining Moksha, realization and experiencing communion with the Super Soul is not needed. Moksha in my view is automatic for every being that is born.

I am not a monotheist, neither a theist nor an atheist. These three beliefs are not substantive and not scientific. I am a pantheist. I see the Super Soul in every particle of matter – animate or inanimate.

The Vedic Thought

There are four stages in the development of human thought. They are

- The concept of God
- Organizing religion around God
- Scientific search for Super Power
- Philosophic Vision.

The first two are outdated beliefs and the remaining two are the motivating forces of life's onward march.

As I understand the supernal thinking process of the Vedic Rishis, it is like this:

The birth, the death and the unpredictable life career in between are the three factors in the Creation that bewildered men and processed their

thinking. They keenly observed Nature, its living beings, their mutual contacts, their food habits, quarrels and killings and so on. The five elements and the seasons created awe in their minds.

The contradictory behavior and the hostile attitude of nature at large towards the humans made the first generation Rishis think that the different forces of Nature were independent of each other and were born and moved independently. Accordingly they formed some definite ideas about Nature and its forces.

The Super Trio

The Rishis deified the forces and perceived three Chief Powers for the three main Phenomena of Birth, Life and Death. These Powers are named as Brahma, Vishnu and Maheswara (Siva).

Brahma creates and decides individual careers. He does not take any responsibility there after.

From birth to death the whole life career is managed by Vishnu. Law and order, food and shelter, peace and happiness, safety and security of the entire creation come under the overall control of Vishnu.

Siva tunes the soul, after its turbulent life tenure, to its native rhythm again so that it merges easily in the Super Soul. That is why he is called the Lord of Rhythm (Laya).

Of these three, Brahma and Siva are not taken to be of much importance as they are merely the doer and undoer, evolver and dissolver. What matters most is life and he, who is in full charge of its welfare, is Vishnu. As such, Vishnu is much thought of, prayed and worshipped with due devotion, humility and mute submission.

Vishnu is therefore considered to be the Paramaatma, the Super Soul personified and the Universal Life Energy at work.

The Three Concepts

The Vedic philosophic thought has many branches of which three are most popular. They are

Dvaita, Advaita and Visishta Advaita.

Dvaita is dualism. It says Soul and Super Soul are two different and independent forces with mutual understanding, cooperation and co-existence. The super soul is identical to Vishnu.

The opposite of Dvaita is Advaita. It declares that the Soul and Super Soul are one and the same. When the Soul realizes that it is not different from the Super Soul and experiences the same through Yoga, it immediately merges in the Super Soul, which is Moksha. Paramaatma alone is said to be real and the rest Imaginary or a mere Illusory, Maya.

Visishta Advaita, while accepting Advaita in principle, asserts that the said Paramaatma is Vishnu. The souls after death instead of merging in the cosmic energy take the form of Vishnu himself and live along with Him as long as their individual good deeds are remembered in the world.

This system advocates implicit surrender to Vishnu and proposes pure devotion to attain the Vaishnative Heaven. As a matter of fact, prophets of most of the religions in the world have visualized this type of Heaven only. This proposition is akin to the mystic love of Sufism and the tender self-surrender of Madhura Bhakti.

All of them are mere guessing of various thinkers of varied experiences. The purpose of mentioning these facts here is to introduce my point of view clearly to those interested to know the truth about life and living

with dignity.

Brahmanism is not a religion. It is a name based on Brahman, the Super Soul. The person who has got the knowledge of Brahman is a Brahmana. But today Brahmanism is only an out-dated bundle of beliefs, sentiments and rituals that separate the Brahmins socially from the non-Brahmin majority.

Hinduism is a religion in the real sense, which goes along with the other religions of the world. Here, I like to exhort that the religion of Hindus is Hinduism, not Brahmanism. Hinduism is the religion of the people in general who worship Shakti, the Super Soul, deified in many forms and names with local traits and regional patterns.

Every religion is God-centered with its theories of sins and virtues, hells and heavens. Every God is a distinct personality with the total nativity of his tribe.

Whichever religion you pursue, you find God benefiting his most obedient servants and punishing the plain and frank. Read through the religious codes and Scriptures of the Yehovites, Allahites or Iswarites and you find that God always takes the side of his own followers destroying others.

Existence and non-existence of God are only points of argument. They do not require your approval. No living being except the humans is ever bothered about the existence of God or any other super natural power.

There are about ten thousand names for God in as many languages in the world. It is as natural as in the case of any other objects. Then why the people of one language insist that the name in their own language should be adopted by the people of other languages also? This attitude leads to challenges and conflicts.

Moral code of social behaviour and conduct is the same for every person belonging to any religion. It is a common code preached by different prophets in different languages.

Certain directive principles are codified by the prophets. Nobody created them. They came into existence as and when social living required them.

God is an abstract belief. Philosophy is a fact established through concrete reasoning.

Sanskrit terms

In this book I used the Sanskrit terms like Paramaatma, Aatma and Moksha often. Aatma is the Soul and Paramaatma is the Super Soul. Words like Supreme Energy, Cosmic Life force, All pervading, Almighty Soul are used only to mean the Super Soul.

Life is the soul's tenure in the physical body. Moksha is the Surcease, the soul ceasing finally its limited identity by dissolving itself in to the limitless Oneness. By God, I mean an irritable male person who lives somewhere above, playing with the destinies of his own creation by favors and punishments.

This book, PARAMAATMA – THE SUPER SOUL, contains six cantos and 169 well founded ideas of mine, expressed in poetic verse. Each idea is an independent poem that is complete in it. In fact I am repeating myself here for the sake of emphasis.

Since my boyhood when I began writing poetry, I gave vent to such ideas hundreds of times in different words through out my writings in my mother tongue, Telugu, which have become popular and are rated high in the literary world. Now I place them before the English reading humanity

for a better evaluation, a wider circulation and a buoy up action.

Though I am not accustomed to writing in English, I would be highly satisfied if a few thinkers are pleased to spare a few seconds to turn over a few pages of this book, the fruit of my life's meditation.

No power, no position, no property
No dependence on any God, you need!
Be always a couple-at spring,
A Couplet of joy you always sing!

Truth naked is philosophy,
Clother is Poetry!
The one is the cosmic crude
The other is its illumination!

Those who are still at the crossroads would ask me why, while rejecting God, I accept Idol worship?

My answer is-

Idol worship is the only scientific way of satisfying one's own individual self that always hopes for happier life, better status and newer pleasures. Idols are the outer symbols for inmost aspirations and ideals.

God is a scarecrow, which has nothing to do with the crop or the field. It may scare away the ignorant, but not the wise.

For What Benefit...?

Finally one may ask what the benefit for the people are by realization this Universal Energy or Paramaatma. I say it removes all the defects naturally entered in the recent day democracy by raising man to a higher standard. That standard is equality between man and man, Country and

Country, Nation and Nation Planned Urbanization, compulsory military training for every citizen, no capital punishment, jails converted into factories and productive farms, strict equality before law civil or criminal, two party system in a presidential form of Govt. without any minority obligations, one Federal Govt. comprising all the countries of the world each country being a socialist state free to develop itself on its own native heritage.

The ultimate purpose of this exhortation is to reform man's behavior so that he conducts himself according to his natural capacity for the overall social development.

The present tendency in the human world is to Organise humans into vote banks and ruling people in the name of democracy. For this purpose the people in position encourage Godly instant in them.

What I say that the very thought of God never helped the man and the Human progress. It only helped the igoists to keep the people in ignorance. I assert that by retaining godly instinct in the minds of the people, betterment to higher standard would not be possible.

Whether it is a Monarchy, a Dictatorship
Or a Democracy, no matter!
Ruling a Country or guiding a Nation
Are always the skills of vigor and valor!

Bhimanna

The Seventh Season

The Dawn

In his introduction, the dawn, to the first print of the Seventh Season, Kala Prapoora Professor N. Venkat Rao has expressed, among other things, some kind sentiments as the following.

Both by nature and nurture Bhimanna-the author of the present collection of poems – is a poet in the true sense of the term, whose poems bear the three essential qualities of poetry - Suggestivity, Universality and permanency-based on the ancient Hindu Philosophical ideals – *Sathyam, Sivam, Sundaram*. All his poetry in *Telugu* is but an expression of this immortal and illuminating Philosophy of life and thought which animated and invigorated the whole of Eastern Literature. Bhimanna's poems represent the Modern Indian Renaissance both in body and soul in all its aspects – Political, Social, Economic, Intellectual and Cultural.

As a poet born in India where atoms were analized, elements evaluated, seasons seasoned and creations evolutionized-all with an ever living consciousness- Bhimanna's works in *Telugu* represent truly the inner urge and the outer surge of Life of the present day world. He feels the thrill of life, moves in it, enjoys it and experiences its whole panorama of existence. He understands life as a little gleam between two eternities; but does not agree with the most romantic of English Poets when they say "Life like a many coloured dome of glass stains the white radiance of Eternity," Bhimanna says that "life is but a current from the power House Ominiscient"; 'life and light are twins in power abounding'; and declares that it is a part and parcel of the white Radiance itself.

It is due to this conception of Life that Bhimanna became the Living Poet of the Age; and as such, every word employed by him represents a

subtlety of expression, a mode of sentiment, a sense of intonation and a spark of emotion.

He is very profound in *Madhu Vidya* Cult (*Brahma Vidya* in Indian Philosophy), and expounds it through his many poems, songs, plays, and musical ballets like *Madhubala, Ragodayam. Madhugeeta* and the most brilliant original poem in Telugu, *Deepa Sabha* (the Assembly of Lights) – works most philosophically conceived and poetically executed.

In the present publication, Bhimanna sought to give in English rendering some of his poems culled at random from his own Telugu works.

Bhimanna is now a poet in English – again another rare phenomenon in the Telugu Literary world! It is the main intention of the author to focus on the scientifically saturated Western mind the Hindu philosophic light and the genius of the Telugu poetical art based on rich spiritual heritage. He wishes to bring home the mythological as well as the aesthetic aspects of our ancient Literature.

One find in this work references to *Himalayas, Kailas, Ganges, Brindavan* and the like, and to *Godavari* – the cradle of the poet. Not only these but some of the lines like "Serpent within is Godly, and that without is deadly" reveals the author's knowledge of Yoga. Serpent is *Kundalini Sakti* – the crowning yoga – about which late Sir, John Woodroffe has dealt at length in his work – *The Serpent Power.*

The exquisite poem on Lord Siva is a superb salutation to the Hindu deitification of the ideal married life and wedded Love – to God Arthanariswara – two opposite halves – so close yet so distant, apparent and assumed aloofness but really eternal unity and complete identity, without embraces but jointly in one form, the supreme oneness of Gods and Goddesses.

In this small volume, one finds a plethora of material, poets and philosophers to dilate upon; and food for thinkers who are spiritually hungry, as these are emotional thoughts collected in tranquility. The language in which Bhimanna wrote in original is *Telugu* – the most musical of all the languages of India. As such, one may apt to think that it pleases only the *Ear*. But, as regards Bhimanna's poems it may be noted that *more is meant than meets the ear.*

Madras
1964

Vidyaratna
Nidudavolu Venkata Rao

Just a Word

In my foreword just a word to the first print of "The Seventh Season" I expressed myself as follows-

Rasa, Bhava and Soundarya are the trinity of my poetic creation in Telugu language. Rasa is the aesthetic thawing of the heart, Bhava is the intutive suggestivity of thought, and Soundarya is the beauty sumblime. Poetry that aspires for a glowing place in the galaxy of literature should possess these three qualities in the required ration.

Of this trio, only Bhava is amiable for translation up to a certain degree. The other two, more important and precious of the harem, are very much adamant to cross their native borders. This is the reason why Poety of the first order that originates in one language looks dry at the people of other languages.

These few flowers of Poetry which I am now offering at the altar of the reading world have their roots in my original Telugu works. As I myself embarked on this project of rendering my own Poems into English, I gave full reins to my Telugu thoughts so that they could cross the limitations of translation and enter the English territory with their native flavour.

In order to facilitate easy access to the Poetic thought contained in these pieces, I would like to present my views on life on which my literary edifice is chiselled. It is my firm belief that nothing whatsoever services which is not based on some kind of universal truth.

Love, beauty and joy – form the trio of my Philosophy. Beauty through love. Joy through beauty. Communion with God through Joy. This is the underlying process through which the Current of life should pass right from its advent to its culmination in the Ominiscient Energy, Brahman!

God, in the yogic sense, is not the finality; but only a symbol or an object enshrined by the soul for a sustained forward march. That is why every soul has its own God! This symbol too has to be melted away before the soul merges in the finality of the Supreme Joy, the Brahmananda! The foam melts away along with the foamy form into the water. The foam remains as long as the current sustains!

The soul loses its identity in the Brahman as the river loses itself in the Ocean. I, for one, do not believe in the eternal Salvation or moksha as the process of creation is continuous from the same source and with the same material!

That is why! advocate joy through beauty and beauty through love for the fulfilment of life. Supreme joy that is Ananda is Brahma. Brahman is the source as well as the culmination of life and everything created. After all, creation is the out-come of speed at which the Omniscient Energy relates. The variation in speed accounts for the variety in the creation.

In the Hindu Philosophy, there are three aspects of soul's fulfilment in the Supreme. Dwita says that man is different from God. Visitaadwita says man becomes God through service and devotion. Adwita says man is God provided he (the man) realises it. I almost agree with Adwita with an amendment. I say man is God whether he realises it or not. After all, God is a symbol! A symbol can never be all-powerful. Nothing in form or within human concept is all-powerful. Soul is but a spilled wave in that Omniscent Energy!

The love's eye everything appears to be beautiful! Beauty begets joy! Brood it over, it becomes the Supreme Bliss, the Brahman!

Living up to ones's own utmost satisfaction is the purpose of life. Satisfaction is utmost only when it comes out of the Supreme joy. Art,

Music and Poetry are the three gateways to that great joy which is the harem of the trinity. This is the reason why I insist that Poetry atleast should spared. I cannot tolerate its adulteration with any influence political, religious or ethical. Pure love and beauty that generate sublime joy is Poetry. Even if it is one life or for one moment, it does not matter. One drop of nectar – one ray from the eternal glow – is enough for man to raise himself and aim himself.

God is partial while Brahman is neutral. It is the Almighty, Allpervading, Ominiscient energy of the eternal flow that creates life and light. Love, beauty and joy are threfore the subtlest of the comprehensible manifestations of Brahman. They are very near to, almost in communion with, that supreme Energy. This Energy which is in unity with love, beauty and joy – I adore as my sweet heart or fiancee with all the finest attributes of the Trinity. I believe – unless one adores his or her other half as divinity incarnate with all the virtues and vices pregnant in human nature – the one can never attain fulfilment of life. And life's purpose would be thus wasted.

Man attains that which he aspires and wills for with every atom of his life. Love begets love. On the other hand, dirt begets dirt. There is no dearth of dirt on the other walks of life. Why should the face of Poetry also be made dirty with the offluences of other trades of livelihood? Poetry is the lotus flower, and it should not be soiled with the filth underneath.

With this philosophy of life and poetry that is innate and intutive to me, I animate whatever I write. I don't know how I fared in this venture. These few renderings into English I picked up at random from my many works in Telugu. Telugu, that is Andhra is a most melodious language, amazingly suited for music and poetry. It is known in the West as the Italian of the East. A knowledge of this language would be a fortune by itself to any foreign aesthetician. One such can enjoy real pleasure and

Andhra direct from the original. Yet I place these before the friendly reader and hope they give him atleat a glimpse of that joy which I intended to give him. Truth has as many angles as there are eves to see it or souls to feel it.

"I call this Poetic Philosophy of mine as Rasaadvita."

The first print of the book has been dedicated to Sri Indrasen Mittal, a famous industrialist.

Boyi Bhimanna

God The Drug

A Word in the beginning

The purpose of this word is to create interest in what I say in this book. A word in the beginning may be worth a thousand in the end.

I compare God to a Drug. I declare that God is a drug. And appeal to include Him in the list of poisonous drugs like Heroin and Brown Sugar, and ban the list.

This is a revolutionary proposition which requires a deep thought and stern action to salvage humans from indulgence and decay.

I, therefore, write this word as a request to the intellectual world to read this work with open mind, think over my idea and ponder over my proposition.

The Beginning:

"Tell me whether there is a God," I asked my father when I was a boy. I wanted from him a definite answer, yes or no.

My father, Palliah, was a small agriculturist, who in those days was being respected for his advocacy of Advaita philosophy. Persons with moody minds, mostly from the depressed social stratum, used to come to our place and my father also used to go to their places often, for spiritual discourses. Whenever possible I too used to accompany him for mere playful pleasure. That is how I got involved in God and philosophy from my boyhood it self. I wanted to know definitely from the Advaita guru himself whether there is a God.

"If you believe there is a God, there is a God. If you consider there is no God, there is no God. It depends upon your mental set-up and awareness", he said.

Thus in my boyhood itself I built up my own proposition that there is no God as an individual. There is Cosmic Life Energy, the Paramaatma

or the Super Soul. And the human mind is its super most manifestation.

I accepted Advaita with an amendment that for attaining Moksha, realization and experiencing communion with the Super Soul is not needed. Moksha in my view is automatic for every being that is born.

I am not a monotheist, neither a theist nor an atheist. These three beliefs are not substantive and not scientific. I am a pantheist. I see the Super Soul in every particle of matter – animate or inanimate.

The Vedic Thought

There are four stages in the development of human thought. They are

- The concept of God
- Organizing religion around God
- Scientific search for Super Power
- Philosophic Vision.

The first two are outdated beliefs and the remaining two are the motivating forces of life's onward march.

As I understand the supernal thinking process of the Vedic Rishis, it is like this:

The birth, the death and the unpredictable life career in between are the three factors in the Creation that bewildered men and processed their thinking. They keenly observed Nature, its living beings, their mutual contacts, their food habits, quarrels and killings and so on. The five elements and the seasons created awe in their minds.

The contradictory behavior and the hostile attitude of nature at large towards the humans made the first generation Rishis think that the different forces of Nature were independent of each other and were born and

moved independently. Accordingly they formed some definite ideas about Nature and its forces.

The Super Trio

The Rishis deified the forces and perceived three Chief Powers for the three main Phenomena of Birth, Life and Death. These Powers are named as Brahma, Vishnu and Maheswara (Siva).

Brahma creates and decides individual careers. He does not take any responsibility there after.

From birth to death the whole life career is managed by Vishnu. Law and order, food and shelter, peace and happiness, safety and security of the entire creation come under the overall control of Vishnu.

Siva tunes the soul, after its turbulent life tenure, to its native rhythm again so that it merges easily in the Super Soul. That is why he is called the Lord of Rhythm (Laya).

Of these three, Brahma and Siva are not taken to be of much importance as they are merely the doer and undoer, evolver and dissolver. What matters most is life and he, who is in full charge of its welfare, is Vishnu. As such, Vishnu is much thought of, prayed and worshipped with due devotion, humility and mute submission.

Vishnu is therefore considered to be the Paramaatma, the Super Soul personified and the Universal Life Energy at work.

The Three Concepts

The Vedic philosophic thought has many branches of which three are most popular. They are

Dvaita, Advaita and Visishta Advaita.

Dvaita is dualism. It says Soul and Super Soul are two different and independent forces with mutual understanding, cooperation and co-existence. The super soul is identical to Vishnu.

The opposite of Dvaita is Advaita. It declares that the Soul and Super Soul are one and the same. When the Soul realizes that it is not different from the Super Soul and experiences the same through Yoga, it immediately merges in the Super Soul, which is Moksha. Paramaatma alone is said to be real and the rest Imaginary or a mere Illusory, Maya.

Visishta Advaita, while accepting Advaita in principle, asserts that the said Paramaatma is Vishnu. The souls after death instead of merging in the comic energy take the form of Vishnu himself and live along with Him as long as their individual good deeds are remembered in the world.

This system advocates implicit surrender to Vishnu and proposes pure devotion to attain the Vaishnative Heaven. As a matter of fact, prophets of most of the religions in the world have visualized this type of Heaven only. This proposition is akin to the mystic love of Sufism and the tender self-surrender of Madhura Bhakti.

All of them are mere guessing of various thinkers of varied experiences. The purpose of mentioning these facts here is to introduce my point of view clearly to those interested to know the truth about life and living with dignity.

Brahmanism is not a religion. It is a name based on Brahman, the Super Soul. The person who has got the knowledge of Brahman is a Brahmana. But today Brahmanism is only an out-dated bundle of beliefs, sentiments and rituals that separate the Brahmins socially from the non-Brahmin majority.

Hinduism is a religion in the real sense, which goes along with the other religions of the world. Here, I like to exhort that the religion of Hindus is Hinduism, not Brahmanism. Hinduism is the religion of the people

in general who worship Shakti, the Super Soul, deified in many forms and names with local traits and regional patterns.

Every religion is God-centered with its theories of sins and virtues, hells and heavens. Every God is a distinct personality with the total nativity of his tribe.

Whichever religion you pursue, you find God benefiting his most obedient servants and punishing the plain and frank. Read through the religious codes and Scriptures of the Yehovites, Allahites or Iswarites and you find that God always takes the side of his own followers destroying others.

Existence and non-existence of God are only points of argument. They do not require your approval. No living being except the humans is ever bothered about the existence of God or any other super natural power.

There are about ten thousand names for God in as many languages in the world. It is as natural as in the case of any other objects. Then why the people of one language insist that the name in their own language should be adopted by the people of other languages also? This attitude leads to challenges and conflicts.

Moral code of social behaviour and conduct is the same for every person belonging to any religion. It is a common code preached by different prophets in different languages.

Certain directive principles are codified by the prophets. Nobody created them. They came into existence as and when social living required them.

God is an abstract belief. Philosophy is a fact established through concrete reasoning.

Sanskrit terms

In this book I used the Sanskrit terms like Paramaatma, Aatma and Moksha often. Aatma is the Soul and Paramaatma is the Super Soul. Words like Supreme Energy, Cosmic Life force, All pervading, Almighty Soul are used only to mean the Super Soul.

Life is the soul's tenure in the physical body. Moksha is the Surcease, the soul ceasing finally its limited identity by dissolving itself in to the limitless Oneness. By God, I mean an irritable male person who lives somewhere above, playing with the destinies of his own creation by favors and punishments.

This book, PARAMAATMA – THE SUPER SOUL, contains six cantos and 169 well founded ideas of mine, expressed in poetic verse. Each idea is an independent poem that is complete in it. In fact I am repeating myself here for the sake of emphasis.

Since my boyhood when I began writing poetry, I gave vent to such ideas hundreds of times in different words through out my writings in my mother tongue, Telugu, which have become popular and are rated high in the literary world. Now I place them before the English reading humanity for a better evaluation, a wider circulation and a buoy up action.

Though I am not accustomed to writing in English, I would be highly satisfied if a few thinkers are pleased to spare a few seconds to turn over a few pages of this book, the fruit of my life's meditation.

No power, no position, no property
No dependence on any God, you need!
Be always a couple-at spring,
A Couplet of joy you always sing!

Truth naked is philosophy,
Clother is Poetry!
The one is the cosmic crude
The other is its illumination!

Finally, those who are still at the crossroads would ask me why, while rejecting God, I accept Idol worship?

My answer is-

Idol worship is the only scientific way of satisfying one's own individual self that always hopes for happier life, better status and newer pleasures. Idols are the outer symbols for inmost aspirations and ideals.

God is a scarecrow, which has nothing to do with the crop or the field. It may scare away the ignorant, but not the wise.

Whether it is a Monarchy, a Dictatorship
Or a Democracy, no matter!
Ruling a Country or guiding a Nation
Are always the skills of vigor and valor!

Bhimanna

124122

బోయి భీమన్న పీఠికలు

భాగం - 2

డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు